సాహిత్యశాస్త్రమాలిక : ౨
సంపాదకుడు : ఆచార్య రాయప్రోలు సుబ్బారావు

ఆంధ్రప్రతాపరుద్రీయము

శ్రీ విద్యానాథుని కృతికి అనువాదము

ప్రథమ భాగము

సాహిత్యాచార్య, సాంఖ్యశిరోమణి
జమ్మలమడక మాధవరామశర్మ
పండితుడు
ఆంధ్ర క్రైస్తవ కళాశాల, గుంటూరు.


నవ్యసాహిత్యపరిషత్తు
గుంటూరు

23507

సాహిత్యశాస్త్రమాలిక ౨

సంపాదకుడు : ఆచార్య రాయప్రోలు సుబ్బారావు

ఆంధ్ర ప్రతాప రుద్రీయము



ఆంధ్ర ప్రతాపరుద్రీయము

శ్రీ విద్యానాథుని కృతికి తెలుగు

ప్రథమ భాగము

సాహిత్యాచార్య, శాస్త్ర విశారద,
సాహిత్య విద్యా ప్రవీణ, లాక్షణిక శిరోమణి

శ్రీ జమ్ములమడక మాధవరామ శర్మ

నవ్యసాహిత్య పరిషత్తు
గుంటూరు

ప్రథమ ముద్రణము ౧౯౪౬

· కల్యాణీ · ప్రెస్ · తెనాలి ·

ఉపాయనము

శ్రీ విద్యానాథుడు శ్రీ ప్రతాపరుద్ర నామాంకముగా
యశోభూషణముగా బహూపకారకముగా వెలయించిన
అలంకారశాస్త్ర సర్వస్వ సంగ్రహమును భావించగా
స్వరూప లాభమును పొందిన

ఆంధ్ర ప్రతాపరుద్రీయము

శ్రీ దీప్తులు కలిగి ధీనీతుల శోభించి గీఃప్రీతుల రాణించు
సహృదయులు సారస్వతపోషకులు
సాహిత్యాభిమానులు వదాన్యులు సంప్రదాయవిదులు
శ్రీ శ్రీ శ్రీ జుబ్దాతుల్ అక్రాన్ శ్రీమంతు రాజా

శ్రీ యార్లగడ్డ శ్రీ శివరామ ప్రసాద్

బహదూర్ చల్లపల్లి జమీందారు వారికి
ఉపాయనముగా సమర్పిస్తున్నాను

★

ప్రస్తావిక

ఈశ్వరుడు సృష్టించిన యావచ్చరాచర సంతానము లోపల మానవుడు విలక్షణుడూ దక్షుడూ అయినాడు. ఇక మానవ సృష్టమయిన యంత్రతంత్రమంత్ర ప్రపంచములో, భాష, తత్పద పదార్థ సంధానము, ఏతదుపసర్జనీకృతమయిన విభావానుభావ సంచారి సంయోగ రసపర్యవసానము, ఏతదనుభూతి, విశిష్టములుగా భాసిస్తున్నవి. అంతే కాదు. ఈశ్వర సృష్టిలో ఉన్న నిత్యనశ్వరత్వాన్నీ, నిమిత్త వికారాన్ని పరిహరించీ, దిద్దీ, సముద్దీపిస్తున్నది మానవనిర్మాణమయిన వాఙ్మయ ప్రపంచము. ఈశ్వరేచ్ఛచే జన్మించిన కాళిదాసు మృతుడయినాడు. కాని ఆ మహాకవి కామితముగా అవతరించిన కావ్యభాగధేయము అమృతమై నిత్యాభినవముగా నిలిచి ఉన్నది. ముందు ఉంటుంది కూడా. అందువల్లనే కవి ఋషి అయితేనేగాని కావ్యసృజన జరగలేదు. ఆర్షమై అవతరించినది కబట్టే అమృతనిధానముగా అక్షరరమ్యమయింది కవిసృష్టకావ్యము. "కవి రకవిషు అమృతమ్ నిధాయి" అనే వాక్యాన్ని మనము ఇలా విచక్షించుకొందాము ఎందువల్లనంటే అమృతమయిన పదార్థము కాబట్టే అమృత ప్రసాదమగు ఆనందాన్ని పిదికే రసము నకు సమర్థమయింది.

శుద్ధమయిన చైతన్యము బిందు ప్రాతిపదికగా అండాకృతిలో పర్యాప్తము. సిద్ధమయిన ప్రవృత్తి మాత్రము ఋజురేఖా సమపరిమాణముగా త్రిభుజాకారములో నిబద్ధము. ఇదే త్రివర్గనిరూపణ. ఈసాధారణ లక్షణాన్ని కేవలమానవ ప్రవృత్తికి నిపతిస్తే అందు నిగర్భముగా ఉన్న ధర్మకామార్థ స్వభావత్రికను తేలింది. సమ్మిళితముగా సమపరిమాణముగా

ఈ త్రిభుజాప్రవృత్తి అనుగమిస్తూ ఉంటే బ్రహ్మాండములో వైషమ్యమేమీ కలగదు. భుజాప్రమాణములో న్యూనాధిక్యములు నూల్కొంటే వికారవైపరీత్యాలు సంధిల్లుతవి అయితే పరిమితములయినవి ఈ సిద్ధత్రిభుజలు. అపరిమితమయినదీ ఆద్యమయినదీ ఆ చైతన్య బ్రహ్మాండమండలము. త్రిభుజలు స్వరూపపార్థక్యాన్ని లయముచేసికొని ఆసమస్తవలయములో లీనమై పోవడమే మోక్షము. దీన్ని కలిపితే పురుషార్థములు నాలుగయినవి.

త్రివర్గములో ప్రాణికి అవిభాజ్యము ఆత్యంతికమూ అయినది కామము. కామపూర్తికోసము అర్థము. ఈ ద్వంద్వానికి తులాధారణముగా వినియోగమయ్యేది ధర్మము. శిశువు స్తన్యకామితముతోనే పుట్టుతున్నది. తల్లికి సమృద్ధాన్న పరిపుష్టి కావాలె. ఈ శిశుకామితము తీరడానికి ఇదంతా అర్థసాధ్యము. అందుకోసమై అర్థసంపాదనము అనివార్యము. ఇందు ఒక సూక్ష్మభేదము గమనింప తగ్గది ఉన్నది. కామము ఆంతరమయిన చిద్గుణము. అర్థము బాహ్యమయిన సంచయము. జీవసాఫల్యమునకై నియతములయిన సాధనలన్నీ ఆంతర సముపాధికములు కావడమున్నూ, జీవనసంపత్తికి ఉపకరించే ఉపాయములన్నీ బాహిరక్రియాలంబనములు కావడమున్నూ గుర్తింపదగినది.

అనంతమయిన మానవ మేధాప్రభావము వల్ల ఈ రెంటికీ సాధనలు ఏర్పడినవి. వాణిజ్యపరిశ్రమలూ ఉద్యోగవ్యావహారములూ లౌకికసంపత్తి కోసము కుదిరితే, క్రతుకర్మతపోబ్రహ్మజిజ్ఞాసాదులు అలౌకిక సమాప్యాయము కోసము భాసిం

చినవి. వీనిలో శబ్దముఖసాధనము విశ్వవిశిష్టముగా అనశ్వరైశ్వర్యముగా వెలిగింది. వెలుగుతున్నది. వెలుగుతుంది.

మొట్టమొదట మానవుని చోద్యచోదక క్రియావర్తనమంతా అంగాంగక చేష్టాసహకారముగా జరిగి ఉంటుంది. తరువాత కంఠస్వరవ్యాపారము సాహాయ్యక మయింది. స్వరము అర్థనిరూపణకు చాలలేదు. కాని భావసూచకముగా ఉపకరించింది. ఈ స్వరమే ఒకరూపములో క్రియాసాధకము కావడమూ, మరొక రూపములో ఆహ్లాదకరము కావడమూ అనుభవములో ద్యోతమయింది. ఒకటి శబ్దముగా పరిణమించింది. రెండవది నాదముగానే నిలిచిపోయింది. శబ్దవ్యవసాయమె సాహిత్యము. నాదవ్యాకోచనమె సంగీతము. దృగ్దర్శనీయమయిన చేష్టానిరూపణము మొదట రేఖాసంకేతముగా ప్రారంభమై, రూపలేఖనముగా పరిణమించి, చిత్రకళగా సౌష్ఠవము పొందింది. ఇవన్నీ మానవబుద్ధి విశేషమునూ కరకౌశల సౌకుమార్యమునూ చూపేసహజ చేతన చిహ్నములు.

అయితే వీనిలో అతి ప్రాచీన కాలము నుండీ తెగకుండా ఉత్తరోత్తరవిస్తరముగా ప్రవహించి మనకు ఉపలబ్ధమయినది శబ్దవ్యవసాయఫలమె కావడము గమనింప తగ్గది. వైయాకరణులు శారీరకముగా శబ్దానుశాసనము చేసిరి. దానికి ధర్మనియతి ప్రయోజనమని చెప్పిరి. కాగా మిగిలినదాని అభిగమ్యమానవ్యాపారము దీనిని గవేషించిన వారే సాహితీదార్శనికులు. వీరు శబ్దఘటనా స్ఫోరకమయినదీ, సద్యస్సమాస్వాద్యమైనదీ, అయిన ఒక మధురానుభూతిని అందుగుర్తించిరి. దాని మీమాంసా విశేషమునే వివరిస్తుంది సాహిత్యశాస్త్రము.

నాట్యశాస్త్రము ప్రధానముగా అభినయ యుక్తమయిన రూపకరచనా ప్రయోగలక్షణాలను ఉపదేశిస్తున్నది. విశిష్టముగా రసోత్పత్తి విధానమును ప్రతిపాదించింది. ప్రసక్తముగా కావ్యస్వరూపమును, ఏతద్వస్త్వలంకార గుణాది నిరూపణమును వివరించింది. ఎటయినా కావ్యనిర్వచనము ప్రథమముగా జరిగింది. తరువాత ఏదయినా కావ్యచర్చ జరిగినా అది అంతగా ప్రాముఖ్యమును వహించలే దనవచ్చును. దండి భామహులు ఇద్దరూ ఆలంకారికులలో ఆచార్యస్థానము వహించారు. అనంతర లాక్షణికులు అందరూ వీరిని చిరంతనాచార్యులుగా పేర్కొనుటయే గాక వీరి నిర్వచనాలనూ హేతువాదాలనూ సవినయముగా ఉదాహరిస్తారు. వీరిరువురిలో భామహుడు కావ్యానికి అలంకార ధర్మశబ్ద వైశిష్ట్యము ప్రతిపాదిస్తాడు. ఆచార్య దండి ఇష్టార్థవ్యవచ్ఛిన్నత్వమును జీవభూతముగా అంగీకరిస్తాడు. రసప్రస్థానము నిరూపించిన భరతుని తర్వాత భామహుడు అలంకారవాదమును లేవనెత్తగా దండి ఇష్టార్థసౌభాగ్యమును సూచించాడు. తరువాత ఉద్భటుని కావ్యాలంకార సారసంగ్రహమూ వామనుని కావ్యాలంకారసూత్ర వృత్తి, రుద్రటుని కావ్యాలంకారమూ, సుప్రసిద్ధములుగా వెలసినవి. వీరంతా ౮౫౦–౯౦౦ మధ్య ఉన్నవారు, ఉదాహృత గ్రంథాలన్నిటికీ అలంకార సంకేతము నామకరణములోనే ఉన్నది. వీనినిబట్టి భామహుని అలంకారవాదమె ప్రసిద్ధముగా వ్యాపించిన దనడము సమంజసము. అయితే దండ్యాచార్యులు ఇష్టార్థసౌభాగ్యాలను సూచించినట్లే తరువాత వామనుడు రీతి అనే ఒక క్రొత్త వ్యపదేశము పైకితెచ్చాడు. "రీతి రాత్మా కావ్యస్య" అని ఖండితమయిన

నిర్వచనముకూడా చేశాడు. దీన్నిబట్టి శబ్దార్థవ్యతిరిక్తమయిన విశిష్టాంశను అతడు గుర్తించెననుట స్పష్టము. నిర్వచనములోని ఆత్మశబ్దాన్నిబట్టి శరీరము కూడా ఉండాలని ధ్వనిస్తుంది. ఇది బహుశః మానవునికి శరీరమూ ఆత్మా ఉన్నట్లే, కావ్యానికికూడా తను జీవములు ఉన్నవనీ, అందులో రీతి ఆత్మ అయితే శబ్దార్థములు శరీరము కావాలెననీ కూడా అభివ్యంగ్య మవుతుంది. ఇంతచర్చ జరిగిన తరువాతనే ఆనందవర్ధనుడు ధ్వన్యాలోకమును రచించి ధ్వని వాదమును సమగ్రముగా ఉత్పాదించి గొప్ప మహత్తరమయిన మార్పును అలంకార శాస్త్రదృష్టిలో కల్పించెను. ధ్వని వాదము వచ్చిన తరువాత కావ్య స్వరూప స్వభావములూ దాని మహత్తర వైశిష్ట్య వికాసములూ సాధారణ శ్రేణిని అతిక్రమించి ఉదాత్త శాస్త్ర విభూతి నందగల్గినవి.

విషయవిశదీకరణము జరిగేటప్పుడల్లా స్వానుభవ విజ్ఞానములనూ, లోక వార్తా వృత్తములనూ ఊతజేసికొనడము సహజము నిరాకారుడయిన ఈశ్వరునికి నామరూపాలు కల్పించిన బుద్ధిమంతులు ఈ మార్గాన్నే అవలంబించి ఉంటారు. ఉపదేశానికిగానీ సంస్కారానికి గానీ ఈ పద్ధతి అవలంబించక పోతే ఈప్సితము నెరవేరదు, అలాగే కావ్యానికికూడా దాని మహత్వ మధురత్వ రసవత్వ రమణీయత్వాలు నిరూపించి నివేదించడానికిమానుషవ్యక్తిస్థానము నేఉపాదాన కారణముగా గ్రహించి ఉంటారు. మానవునికి శరీరమూ ఆత్మ ఉన్నట్లే కావ్యానికి కూడా శరీరాత్మలను భావించారు. చక్కని అంగ సౌష్ఠవము కలరూపము ఆకర్షవంతమయినట్లే, అందమయిన శబ్దార్థములు గల వాక్యావతారమును కమనీయమయిన

కావ్యముగా పాటించారు. ఈ అంగాంగ సౌష్ఠవమునకు కంఠహారములు కరకంకణములు పాదాభరణములు సముల్లసనహేతువులయినట్లే శబ్దార్థములకు సౌందర్యదాయకములగు వాటిని అలంకారములుగా పాటించారు. అయితే ఎంత రూపవిన్యాసమున్నా ఆభరణ పరికరము ఎంత సమృద్ధముగా ఉన్నా వికాసము లేకపోవచ్చు. అనిర్వచనీయమయిన మనోహారిత్వము ఉండకపోవచ్చు. ఈ లోపము దోషము కూడా కాకపోవచ్చు. అపకర్షక హేతువుగా కూడా ఉండకపోవచ్చు. కాని ఏదో ప్రియప్రాయమైనదీ లావణ్యమైనదీ రూపాలంకార సౌష్ఠవమును సముద్దీపింప చేసేదీ ఒక జీవత్కళ కొరవడినట్లు మాత్రము ద్యోతమవుతున్నది. సౌరభము లేని స[illegible]ల్ల పుష్పము లాగా, పాలు లేని కుండపొదుగులాగా, నీరు లేని ముత్యములాగా, ఈ రూపవిన్యాసములో ఏదో ఒక లుప్త ద్యుతి ఉన్నమాట వాస్తవము. కావ్య మీమాంసకులకు కులపతి అయిన భరతుడే దీనిని చక్కగా నిదానించి దర్శించి అది రసమని అనడము మనభాగ్యము. ద్రష్టలు వేరు. శాస్త్రకారులు వేరు. విపర్యయగ్రహణము పట్టినా విమోక్షణము కూడా త్వరగా దొరకడము మనభాగ్యమే.

ఆనందవర్ధనుడు ఉత్కర్ష హేతువులయిన అలంకారాదులను వద్దనలేదు. కాని ఏతత్ప్రాప్తినుంచితము ధ్వన్యభినీతముగా ఉంటేనే కావ్యమాంగల్యానికి శ్లాఘకరామణీయకము అబ్బుతుందని అత్యంతమూ ముగ్ధ ముఖమయినే మనోహా[illegible] వాదమును అనుగ్రహించాడు. అయితే ఆ కాలములో [illegible] వాదము పుట్టడానికి వలసినంత అవకాశము ఉన్నట్లు కనిపిస్తుంది. ఆనాటి సామాజిక చరిత్రకు శిష్టులే నాయకులు.

సామాన్య ప్రజలు కారు. విజ్ఞాన బలానికి చోదనాధికారులు పుష్కలముగా ఉండిరి. ఇక భారతీయ నాగరికతా, దాని విశిష్ట రేఖలయిన శాస్త్ర శిల్పాదులూ ఎలా ఉన్నవో చూతము. ఆరణ్యకమయిన శ్రౌత స్మార్త ప్రసక్తి ప్రాతగిల్లింది. బౌద్ధుల అహింసాధర్మావబోధమూ సన్యాసినీ సన్యాసానుష్ఠాన విధానమూ చైత్యారామ విహారాలూ, వానిలో భావాభిరామములయిన అద్భుతకుడ్య చిత్రలేఖనాలూ వెలసి సంఘాన్ని ఒక విప్లవములో ముంచి తేల్చినవి. గుప్త సామ్రాజ్యమూ, దానితోపాటు ఒక్కమాటుగా పిక్కటిల్లిన సంపత్సౌఖ్యసమృద్ధి, తదనుగతముగా వర్తిల్లిన సుకుమార సుందర సుహృజ్జీవన సాహిత్య కళాలాలసతా, ఇవన్నీ శతితకు ధ్యేయములయినవి. ఆచార్య శంకరుడు ధర్మ దిగ్విజయము చేశాడు. పునః దానితో శ్రౌతస్మార్తశిష్టాచారము ఒకవంక విడంబిస్తూ ఉంటే అద్వైతమతవ్యాప్తి, తద విభాజ్యమయిన నివృత్తి రూప సన్యాస ప్రసక్తి మరొక పక్షమున నిరాక్షేపముగా అతిశయింపసాగెను. సాహిత్య కలాపక్షములో జరిగిన వ్యవసాయ విశేషములు కూడా గమనింప తగినవిగానే ఉన్నవి. ఒక ప్రక్క బౌద్ధులిచ్చిన ఉత్తేజన అభిమానములతో ప్రాకృతాది వాఙ్మయము ప్రకాశించింది. దానిలో ఈశ్వర పుణ్యపాపాది విశిష్ట గుణ సంపర్కము లేని మిథునానురాగ మాధుర్యమూ, అభిజన సాధారణ జీవితసౌందర్యమూ, అభివర్ణితమై సమాజ సముప లాలనము చేయగల్గింది. ఇటు సంస్కృతములో కూడా భాస కాళిదాసాదికవులు శాస్త్రధర్మ విజ్ఞాన భాష్యరచనలకు విని యుక్తమవుతూ ఉన్న భాషను సామాజికపరములయిన కావ్య

నాటకాదులలో రసవద్రచనలకు వినియుక్తము చేయడవ
పరిపాటి అయింది. పైగా రూపకాదులయందు సంస్కృ
భాషతో సరిసమానముగా ప్రాకృతము కూడా సంహితమై
సంకీర్ణస్థితిని తెచ్చి పెట్టింది. ఇట్టి స్థితిలో సంస్కృతాని
శబ్దాను శాసనము జరగడము కుమారిలభట్టు శ్రౌతధర్మకర్మ
శాస్త్రప్రయుక్తములయిన శబ్దార్థపరిభాషా ప్రమాణాలన
నిష్కృష్టము చేయడము జరిగింది.

రచనారంగములో సూత్రశైలీ భాష్యపద్ధతీ పూర్వ
పక్షసిద్ధాంత మర్యాదా, ఇత్యాదులు యథా సమృద్ధముగా
ప్రకాశిలోకి వచ్చెను. దర్శనముల ప్రభావము దృఢముగా
ప్రతిష్ఠితమయినది. సాహిత్యసృష్టిలో అశ్వఘోషాదుల రచ
నము బృహత్కథాదుల విశృంఖలవృత్తి లక్షింప దగినవి
ఇక కావ్యచర్చలో నాటకము మున్ముందు వ్యాపించె నడ
డము సుసంగతము. పూర్వకావ్య చర్చలో నాటకప్రసక్తి
అధికముగా ఉండడానికి ఇదే కారణము కావాలి. ఆనుషంగి
కముగా కావ్యపరామర్శ జరిగింది. అందులో రసవాదము
అలంకారవాదము రీతివాదము ముఖ్యము లనవని చెప్పవచ్చు.
శబ్దార్థసముత్పన్నమయిన కావ్యములోని వైలక్షణ్యమును
స్థూలాతిస్థూలమయిన అలంకారాలలో నిరూపించడము నిలి
చేది కాదు, అది నిలవనూ లేదు. రసవాదమె నానాట రమ
ణించింది.

ఆనందవర్ధనుడు ఈ వాదమును చిత్తసంస్కార రూప
మయిన ధ్వనిసూత్రముతో బంధించడానికి వేదాంతులు
బ్రహ్మైక్యప్రమాణమును సిద్ధీకరించడానికి చూపిన నానా
శాస్త్రవిజ్ఞానమును వినియోగించడమే కాక, తోడ్తో మానవ

చైతన్యరహస్య వేత్తృత్వమును కూడా ప్రదర్శించాడు. అలంకార శాస్త్రములో మొత్తముమీద వేదాంతములో ఆచార్య శంకరునివలె ఆనందవర్ధనుడు తీర్పరిగా నిలిచిపోయినాడు. ఆయన తీర్పు ఏమంటే; కావ్యానికి రసమే ఆత్మ. అయితే దాని ఉత్పత్తి అనుభూతులు ధ్వనిమూలముగా ఉపలబ్ధములు కావాలె. అప్పుడే శబ్దార్థములు అవ్యక్తాభిరమ్యమయిన కళాస్ఫూర్తిని ఉన్ముక్తము చేసి ప్రసన్నములవుతవి.

ధ్వనివాదము తీవ్రమయిన వాదప్రకోపాన్ని కల్పించక పోలేదు. ఇందుకు హేతువులు కూడా మనము ఊహించవచ్చు. ఈ వాదవైఖరి మొట్టమొదట శబ్దార్థవివక్ష చేసిన ఇతరధార్మికులను కుట్టింది. వారు తాత్పర్యార్థములోనే ధ్వని లీనీభూతము అన్నారు. ఇక ఉత్తరమీమాంసకుల ఖండనకు కారణాలు వెతుకుదము. ఆనందవర్ధనుడు ధ్వనివాదమును ప్రతిపాదించేటప్పుడూ శాస్త్రచర్చ చేసేటప్పుడూ, పూర్వపక్ష సిద్ధాంతాలు చేసేటప్పుడూ సాగినవైఖరి చాలా నిగూఢముగానూ నిరవకాశముగానూ స్ఫురిస్తుంది. ఆయన రసానందమె బ్రహ్మానందమని నిష్కర్షించకపోయినా, రసానుభూతివలన కలిగే ఆనందము ఆత్మానుభూతి పర్యవసానమయిన ఆనందము కంటె భిన్నమయినదని స్పష్టీకరించక రసానంద ప్రతిపత్తిని ఆత్మనఃకలా సన్నిహితముగా సూక్ష్మీకరించి వదిలెను. ఇది సహజముగా బ్రహ్మవాదులకు తగిలిన గొప్ప సంకటము పైగా ధ్వనివాదము స్ఫోటజన్యము. దాన్ని ఆచార్యశంకరుడు అంతకు ముందే త్రోసిరాజన్నాడు. బహుశః ధ్వనిప్రతిష్ఠాపనము తిరిగీ స్ఫోటసముద్ధరణమే అని శంకించి ఉండవచ్చు. ఇంకా గార్హస్థ్య ధర్మముకూడా బంధరూపముగా నిశ్చయించిన వారి దృష్టికి నాయికానాయక సంబంధ వ్యాపారమును రసఫల

ప్రాప్తికముగా ఆనందసూత్రము చేయడము వేదాంత మూలచ్ఛేదమె అవుతుందని భావించడము అభావ్యము కాదు. అందువలన వారుకూడా ధ్వనివాదాన్ని ప్రతిరోధించి ఉంటారు. అయితే ఆనందవర్ధనుని సిద్ధాంతములో ఇవన్నీ ఐచ్ఛికములో అనిచ్ఛా ప్రతిఫలితములో మనము చెప్పలేము. కాని మనము ఇప్పుడు ఇలా ఎందుకు భావించగూడదు ?

“ఆరణ్యక కాలమును వదిలివేతాం. బ్రహ్మజిజ్ఞాస పరివ్యాప్తమయిన తర్వాత శిష్టులకు ఆత్మావలోకనమే ఆత్యాంతిక ధర్మమయింది. దానితో బాటు వారి లోకసంగ్రహవ్యాసంగము క్షీణింపక తప్పింది. కాదు అంతమట్టుకు సంఘము శిష్టచోదన బలమును కోలుపోయినదే అయింది. అనంతరము ధర్మనాయకులయిన బౌద్ధులు స్త్రీపుంససహజబంధమును తెంచివేశారు. మరీ తరువాత జ్ఞానబోధలయిన వేదాంతులు మిథ్యాబుద్ధిని సమృద్ధముగా ప్రవృద్ధి చేశారు. ఇక ప్రజాసంఘము ఏమి చేయాలి ?

ఇలాంటి క్లిష్టకాలములో అమృత నిధాయకు డయిన కవి కావ్యసృజనాభిరతిని పరిత్యజించి లాక్షణికుడై సర్వప్రాణిసులభమయిన ప్రవృత్తిలోనే ఆనందస్థానమును గుర్తించి, తత్ప్రాప్తివిధానానికి నాటకసందర్శనమునూ కావ్యాలాపమునూ మధురోపాధులుగా ప్రదర్శించి లోకానందవర్ధనుడే అయినాడు. కవి ఉపదేశకుడు కాడు. అతనిమార్గము ఉపచారికము. ప్రత్యక్షఖండనకూ దానితో అనుసంగమించే కలహవ్యాకులమునకు అతని భావము ఓపదు. అతని కంఠము కాంతాసమ్మితముగానే కలరవించుతుంది. ఉపలాలనమే అతని ఉద్బోధ వికారమునుండి వివర్తింప దలచినా సౌకుమార్యానికి సుముఖుణ్ణి చేయదలచినా, అతనికి చేతనైనది ఈ ప్రసన్న

సాధనము [illegible] "ప్రాణాధిత్యైషా [illegible] సాధ్యము మన్యే" అంటాడు మహాకవి [illegible] జీవిత ప్రవాహ జీవమును శుష్కింపచేసే [illegible] ధర్మశాస్త్రములను [illegible]ంచ డానికి అన్యమతీయులవలె ధర్మశాస్త్ర శాస్త్రిత్వమును పట్టలేదు. యావజ్జీవనాను రంజనీయమగు సలక్షణ సాహిత్య స్నేహాభిషేకమును చేయ సమకట్టెను. సాహిత్య ప్రభావమును గుర్తించిన మహాకవి కాళిదాసు పలికిన "కాంతం క్రతుం చాక్షుషం" అనే సూక్తిపరమార్థమును ఆయనఎరుగును. ఆత్రేయీ ముఖముగా భవభూతి నూతనచ్ఛందస్సమావిష్కారములో శబ్దబ్రహ్మవివర్త వాల్లభ్యమును సూచించెను. భరతుని నాటక ప్రకరణము ఆనందవర్ధనునికి చక్కగా అవగాహమయ్యే ఉండాలి. తనకునూ వారికినీ నడుమ సంఘటిల్లిన వాగర్థ కళ్యాణనిరాస ప్రయత్నాలు ఆయనను వికలము చేయడము సహజము. ఏతత్సముద్ధరణకు పూనుకొనడము ఆశ్చర్యము కాదు."

ఆనందవర్ధనుడు ఆవిష్కరింప చేసిన ధ్వనివాదానికి అభినవగుప్తుడు వ్యాఖ్యానము రచించి దానికి సాలోచనంగా లోచన అని పేరు పెట్టెను. అభినవగుప్తుడు మహావిద్వాంసుడు. నానాశాస్త్ర సాగర సముత్తీర్ణుడు. పరమ శైవుడు. సాధన ఎరిగిన యోగి. శైవధర్మాగమ మహాగ్రంధములను పెక్కింటిని రచించి, బహుళ వాఙ్మయ భాగ్య విధాతయై, సశరీరముగా గుహా ప్రవేశము చేసిన మహాసిద్ధుడు. ఇటువంటి ఉదాత్త విజ్ఞాని లౌకికము లనుకొనుచున్న నాట్యవేదాన్ని ధ్వన్యాలోకమును ఆసక్తితో ఆదరముతో విచక్షించి, అందలి మహత్తర మాధుర్య నిక్షేపాన్ని పైకెత్తి, దాని అలౌకిక విభూతిని నిరూపించి, సహృదయ సాధన ప్రవృత్తికి నిరూఢి

నిచ్చి కవి పాడిన గానమునకు ఉపశ్రుతి నివేదనము చేశాడు. తెలిసినంతవరకు ఈమహానుభావుడు ४० గ్రంథాలను రచించి నట్లు తేలింది. ఇందులో నాట్యశాస్త్రానికి అభినవ భారతీ వ్యాఖ్య, ధ్వన్యాలోకమునకులోచనవ్యాఖ్య, అలంకారశాస్త్ర భాండారములోనివి. కావ్య కౌతుక వివరణమూ, కథా ముఖ తిలకమూ, నాట్యాలోచనా అనేవి కూడా సాహిత్య మీమాంసకు చెందినవే అని తోస్తుంది. సాహిత్యానికి సంబంధించిన ఈ మహావేత్త గ్రంథరచన ౯౯౦—౧౦౨౦ మధ్య జరిగినట్లు చరిత్రకారుల నిశ్చయము. అంటే మన నన్నయ భట్టారకుడు మహాభారతము వ్రాయడానికి దాదాపు వంద యేళ్ళలోపు ఉన్నాడని, ప్రతాపరుద్రీయము రావడానికి ముందు మూడువందల ఏళ్ల క్రిందట ఉండెననీ మాత్రము చెప్పి ఈతని ప్రసక్తి ఇంతటితో ముగిస్తాను.

ఆనందవర్ధనుని తర్వాత కావ్యమీమాంస నడిపిన లాక్షణికులలో కొంచెమో గొప్పోస్వాతంత్ర్యమును చూపిన వారు కొలదిగానే ఉన్నారు. భట్టనాయకుని హృదయదర్పణమూ, కుంతకుని వక్రోక్తి జీవితమూ, మహిమభట్టు వ్యక్తి వివేకమూ, క్షేమేంద్రుని ఔచిత్య విచారచర్చా, ఈ శ్రేణి లోకి తెచ్చి గణింప తగినవి భట్టనాయకుని గ్రంథము ఉపలబ్ధము కాలేదు. అయినా నాయకుడు రసవాదములో భోక్తృ వ్యాపారమును నిదానించినట్లు తేలుతూ ఉన్నది. కుంతకుడు కావ్యమునందు అనుసంధాన మధ్యే వర్ణపద, పూర్వార్ధ, ప్రత్యయ, వాక్యప్రకరణ, ప్రబంధవక్రతలలో, ఉన్న వైచిత్రియే కావ్యజీవిత మని ఒక క్రొత్తదృష్టిని చూపాడు. కుంతకుని వక్రతకు వంకర అని అర్థము చేసికోకూడదు. ఎందుకంటే అంగాంగకములలో ఏమాత్రము వంకర ఉన్నా అది విరూప

ముగా కనబడడమూ, ఏవగింపు కలిగించడమూ లోకన్యాయము కాబట్టి, కావ్యానికి రూపజీవాదులు అంగీకరించిన లాక్షణికులూ ఈ వక్రతను వంకర అని భావించరు. కావ్య వాక్యఘటనము అత్యంత పరిచయ పరిపాటిచే సామాన్యములై పోయిన పదాలతో సూటిగా కాక వైచిత్రీస్ఫురితముగా ఉటుందని ఉండాలనీ ఈ లాక్షణికుని భావమని తోస్తుంది. నర్మగర్భితములయిన వగలాట ముచ్చట్లలో స్పృహణీయమయిన చమత్కారము ఉండడము మనకు అనుభవము. తెనుగువారిలో తియ్యని రహఃకలాపములు జరిగేటప్పుడు ఇష్టానిష్టస్ఫోరకముగా "ఇలాంటి వంకర మాటలాడకు" అనడము మన మెరుగుదుము. ఈలాటి ముదితఫణితికే వక్రోక్తి వ్యపదేశము చెల్లుతుంది. కుంతకుని ఉక్తిలోని వక్రత కుంతలములలోని కుటిలతవలె సౌందర్య సముత్కర్షకముగా తేలుతుంది. ఇతడు ఉజ్జీవింపచేసిన నవీన పక్షము ఇదమిత్థముగా నిరూపితము కాదుగాని సహృదయ సహృదయంగమ వ్యాపారమును లక్షించి నివేదించడములో చకని నేర్పునూ సుకుమార బుద్ధినీ ప్రదర్శిస్తుంది. వ్యక్తి వివేకము ప్రధానముగా ధ్వనివాద విధ్వంసనముకోసరమే వచ్చింది. శబ్దానికి వ్యంజన అనే తృతీయవృత్తి లేదనీ, అది అనుమితిలోనే అంతర్గర్భితముగా ఉన్నదనీ వాదసారాంశము. పూర్వపక్షానికి కానీ సిద్ధాంతకోటికి కానీ రెండు పంథాలున్నవి. విషయనిరూపణ చేయడములో చిత్తానికి నచ్చిన అభిమతాన్ని తిప్పి ఒప్పించే సరణి ఒకటి. దీన్ని భావపథము అంటాము. ఇది వదలి ప్రతిపక్షపంక్తిలో దోషాలు వెదికి రంధ్రాలు తోడి తద్ద్వారా కలిగే సంకుల వైకల్యములో ప్రతిపక్షవాద విచ్ఛిత్తిని పైకెత్తడము రెండవది. దీనిని అభావపథము అందాము. మహిమభట్టు ఈ రెండవ మార్గములో తన

మహిమ చూపిస్తాడు. అయితే ఈయన గొప్ప వైయాకరణిగా యుక్తిపాటవముగా వాదకౌశలిగా కనిపిస్తాడు. చేసే విమర్శనము శాస్త్రీయముగా హేతుబద్ధముగా నడిపే నేర్పు నిర్భరముగా ఉంది. దోషప్రకరణముమీద ఇతను చూపిన అధికారములో లోతైన చూపు వ్యక్తమవుతుంది. క్షేమేంద్రుడు కావ్యానికి ఔచిత్యమే జీవ మంటాడు. విశితంగా దూరాతిదూరముగా ఔచిత్యచ్ఛాయలను ప్రసరింపచేస్తాడు. నిజముగా ఔచిత్యము లేని కావ్యము వస్త్రవిహీన మయిన వ్యక్తి రూపమువలె దాని యావద్విశిష్ట రూపలావణ్యా చేష్టా భూషణాదులనూ నిరసన వైముఖ్యాస్పదము చేయడము నిజము. అంతేకాక ఔచిత్యా సౌభాగ్యా చ్ఛాదనములో అల్పాల్పము లయిన వంకరలు కానబడక తదనుభూతిని భగ్నము చేయకపోవడముకూడా సత్యమె. ఔచిత్యములేని కావ్యము భిన్నభాండముమీద చిత్రలేఖనమువలె, కపాలములోని కమ్మతేనియవలె, చర్మభస్త్రికలోని విమల విభూతివలె నేత్రోత్సవమునుగాని, జిహ్వాప్యాయమునుగాని, పూజాభావమునుగాని, పొందింపలేదు. ఔచిత్యము సర్వోత్కర్ష హేతువుగానూ అనౌచిత్యము యావద్వైశిష్ట్య విఘాతముగానూ ఉద్బోధించిన క్షేమేంద్రుడు ఒకవిధముగా సహృదయలోకానికి మహోపకారి అని చెప్పవచ్చును.

పూర్వోక్త లక్షణపర్యాప్తినిబట్టి భరతుడాదిగా తిరిగిన వేయి వత్సరములలో సాహిత్యవృక్షము బహుముఖముగా అనేక శాఖావిస్తారముగా, అనంతపల్లవ పత్ర పుష్ప ఫల రసాధివాసముగా ఎంత శోభించిందో తేటతెల్ల మవుతుంది. ఈ కాలములోనే నన్నయభట్టారకుడు సంస్కృత మహాభారతమును తెనుగున రచించెను. 'అతడు మహాభారత

కతిథేహాసమును నేర్చిన విధంబున "కావ్యంబుగా" నొనర్తు' నని పలికెను. ఈ కావ్యశబ్దానికి ఎంత మహనీయమయిన అర్థము పట్టగలదో మనము ఇప్పుడు ఊహింపగలుగుదుము. నన్నయభట్టారకుడు రసవాది. తన భారతానికి పర్యాను క్రమణికను అన్వర్థముగా లగించి "ఇక్షుఖండస్థానీయం హి కావ్యమ్ కల్పనీయమ్. తత్ర రసవిష్యంద స్థానీయమ్ వ్యంగ్యమ్" అనే లాక్షణికాదర్శమును పాలించిన మహాకవి. ఈప త్పూర్వోత్తర వ్యవధానముగా కుంతకుడు, ధనంజయుడు మహిమభట్టు, మమ్మటుడు, భోజుడు, మున్నగు సాహిత్య లాక్షణికులు భట్టారకుని సమకాలికులు. ఆంధ్రదేశములో కాకతీయ సామ్రాజ్యము విజృంభించు చుండగా, శైవ వాఙ్మయము జాను తెనుగులో తేనెలు తేలుతూ ఉండగా అలంకారసర్వస్వము కావ్యానుశాసనము సంస్కృత ములో సముత్పన్నము లయినవి. రంగనాథుడు ద్విపదలో రామాయణము తీర్చిదిద్దిన రోజులలోనే జయదేవుని చంద్రా లోకము ప్రకాశించింది తిక్కనసోమయాజి రచనా ప్రవా హము వరదపోయే రోజులలో కేతన దశకుమారచరిత్రమును తెనిగించిన రోజులలో సంస్కృతములో సాహిత్య చర్చ అంతగా కానరాదు. భానుదత్తుని రసతరంగిణీ రసమంజరీ కృతులు మాత్రమె "సురసరిత్కల్లోల కిమ్మీరిత" దేశములో ఉదయించినవి. ఇక పదునాల్గవ శతాబ్దములోపల ప్రకాశిం చిన ఏకావళీ యశోభూషణములు రెండూ ఇంచుమించుగా విద్యానాథుడే ప్రగడే, భాస్కరుడు, నాచనసోముడు మొదలయిన మహాకవులు ఆంధ్రప్రబంధ రచనా శిల్పానికి వన్నెలు చిన్నెలు పెట్టుతున్న కాలములోనివి. ఏకావళి ఓఢ్రదేశములోనూ యశోభూషణములు తెలంగాణములోనూ దీపించడము

అక్కడ విద్యాధరుడు కాకతీయ నృపాలుడయిన నరసింహ
పర్యాయముగానూ, ఇక్కడ విద్యానాథుడు కాకతీయనృపాలుడయిన ప్రతాపరుద్ర పర్యాయముగానూ, అలంకారశాస్త్ర
కృషిసాగించడము నాటిరాజుల సాహిత్యాభిమానాభి రుచి
లకు సూచనగా ఉన్నదన వచ్చును. ఇలాంటివి మఱికొన్ని
కన్పించుతున్నవి,

విద్యానాథుని ప్రతాపరుద్రీయము దక్షిణాపథమంతటా
అనుదిన పఠన పాఠనములలో విశేషవ్యాప్తి చెందిన మంచి
గ్రంథము. దీనిలో నాటకాలంకార కావ్యలక్షణములు సలక్ష్యములుగా సరళశ్రుతిసుఖమయిన శైలిలో సంగ్రహముగా
ఉండడము, ముందునడచిన లాక్షణికుల భిన్నభిన్నమత
సారాంశములకు అవిరుద్ధముగా ఉపాదేయవిషయ వివరణ
వాద సారాంశమును వ్యక్తీకరించి కూర్చడము ఇందుకు కారణము కావచ్చు. దీనికితోడు కుమారస్వామి వ్రాసిన టీకా
వివరణము సర్వతోముఖ సాహిత్య విషయైక చర్చతో మరింత
ఉపకరించిందనడానికి సందేహము లేదు. ప్రతాపరుద్రీయ
ప్రాశస్త్యమునుగూర్చి ఇంక విస్తరించడము తినబోతున్న
వారికి రుచిచూపడ మవుతుంది.

ఆంధ్రసారస్వత శతపత్రములో తొంభై రేకులు
సాహిత్య పత్రాలంటే అత్యుక్తికాదేమో! ఇవికూడా మూల
దళాలే అంటే న్యాయదూరము కాదు. కానిఇందులో లక్షణ
పత్రాలు మూడునాలుగు కన్న లేవు. అవికూడా సంఫుల్ల వికాస
ముతో విస్తరించినవి కావు. ఇది శోచనీయమె కదా! అం
కాక సాహిత్యశాస్త్రానికి లక్ష్యప్రాయ మయిన కావ్య
వాఙ్మయము మనకు ఉన్నంత సాంగముగా, సాలంకృతముగా
సావకాశముగా మరే దేశభాషలోనూ లేదు. అంబారవ

ఉన్నా అది విలువకట్టే సాధనసామగ్రి లేనట్లయింది ఈపరిస్థితి. అదీ కాక అలంకారశాస్త్రములో ఆంధ్రులు ఒకానొక విలక్షణసిద్ధాంతమును సశాస్త్రీయముగా నిరూపించి కృతకృత్యులయినారు. సహృదయుడు యోగివలె పూర్ణుడనీ కావ్యానుశీలన ప్రాప్యమయిన రసానందము, బ్రహ్మజిజ్ఞాసా లభ్యమయిన చిదానందము ఏకమెఅనీ మీమాంసించి నిరూపించిన సాహిత్య వల్లభులు తెనుగువారె. లక్షణాటోపము తీవ్రాలయి పూర్వాదృశులకు కలిగిన అభిలాషకు కారణములు అనేకములు కలవు. కాని అందులో బలవత్తరమైనది ఇది. దేశములో కావ్యపారము హ్లాదైక రమణీయ శ్రేణి నుండి జారిపోయింది. స్త్రీ పుంలింగ కారక గ్రసితముగానూ సమాసాకాంక్షాధిష్ఠితము గానూ శుష్కీభవింప సాగింది ఒక ప్రక్క. వేరొక ప్రక్క, సాహితీపరుల విజ్ఞానము అధికాధికముగా దోషాధికరణ దష్టమయింది. ఏతత్ప్రతి ఫలముగా సహృదయావరణము జీర్ణ దివ్య దేశములాగా విస్మృతి చెందే దుర్దశ పట్టుతుందేమోఅన్న భయము కలిగింది. కావ్య పరిశీలనము వల్ల స్థూలమైన పాండిత్య ప్రాగల్భ్యములు కలిగిన కలుగవచ్చును. కాని ఆత్మప్రసన్నతా ప్రజ్ఞానములు సాధించాలంటే కావ్యానుశీలనము కావాలె. ఈ అంతరములను విచక్షించుకోవడానికి సాహిత్య శాస్త్రములో పూర్వము జరిగిన రస మీమాంసావిజ్ఞానము అవశ్య సహకారము అవుతుంది. ఈ "సాహిత్య శాస్త్ర మాలిక" యదాభవ్యముగా సారస్వత జీవితమునకు కమనీయ కల్యాణములు కైసేయునని ఆశించి ప్రారంభించితిమి. నవ్య సాహితీ పరులు చేపట్టినదని ఉపేక్షింపక స్నిగ్ధవాత్సల్యముతో, సాహిత్య పక్షపాతముతో, మా ఉద్యమాన్ని ప్రోత్సహించి దీవించి అమృతాలంబప్రాయ

అయిన పూజ్యపాదులు, వైయాకరణ వల్లభులు, కళా ప్రపూర్ణులు, మహామహోపాధ్యాయులు, సర్వతంత్ర స్వతంత్రులు,

శ్రీ తాతా సుబ్బారాయ శాస్త్రి

వరేణ్యులు మాకు అక్షయస్మరణీయులు. వారి విద్యాకుటుంబము రెండేండ్లలో రాణించింది. ఒక ఇంట వ్యాకరణ పుత్రుడుంటే రెండవయింట సాహితీకుమారి పచ్చగా కాపురము చేసింది. ఈ ఇంటి దౌహిత్రుడు సరసోపనిషద్వ్యాఖ్యాన మాధవుడే మన మాధవుడు. శ్రీమాధవరామ శర్మగారి నిష్కృష్ట సాహిత్య శాస్త్రవైదుష్యమును గూర్చి మహామహోపాధ్యాయులే స్వయం విజయపత్రము ఇచ్చి పోయినారు. ఇంక ఇతరుల ప్రశంసవారికి అనవసరము. మనకు చర్వితచర్వణము. మా శర్మగారు శిరోమణి, విద్యాప్రవీణ, విద్వాన్ మొదలగు పరీక్షార్థులకు విజ్ఞానార్థులకు ప్రతాపరుద్రీయమును ముప్పది మార్లు పైగా పాఠము చెప్పిరి. మా శర్మ స్వయముగా కావ్యానుశీలనము చేసే నిత్యాగ్ని తపస్వి. వీరు నవ్యసాహిత్య పారిషదుల అభ్యర్థనము అంగీకరించి ఉద్గ్రంథమును తెనిగించుటకు వారి రసోపాసనా సాహిత్య దర్శన ప్రతిష్ఠాపన నిష్ఠలే మూలకారణములు కాని ఆర్థికలాభము కాదు. కువ్యాఖ్యా విషమూర్ఛితములయిన కుసుమకోమల కావ్యకన్యకలు మల్లినాథసూరి సంజీవినితో సకలమంగల మాధురీ మూర్తులై లేచిరని పరంపరసూక్తి ఉన్నది. శ్రీ మాధవుని వసంతమాధురీ దోహదముతో నవ్యాంధ్రసాహితీ సుక్షేత్రము పూర్ణ రసవతియై భవిష్యత్కావ్య సంతానమునకు ఆనంద సూత్రధాత్రి అగునని విశ్వసించుచున్నాము.

రాయప్రోలు సుబ్బారావు

విజ్ఞప్తి

శ్రీవిద్యానాథుని అలంకార శాస్త్ర సర్వస్వసంగ్రహ మయిన ప్రతాపరుద్రీయ కృతికి ప్రచుర ప్రచారము ఉన్నది. మహావ్యాఖ్యాత మల్లినాథుడు దీనిని ఉల్లేఖించుట హేతువు. సాహిత్యశాస్త్ర వ్యాసంగము చేయదలచిన వారికి ఇది ఉప కరించక పోదని సంస్కృత ముఖులందరూ అంగీకరించుతు న్నారు. కుమారస్వామి సోమపీథి వ్యాఖ్యానము మూలము నకు శోభ. రెండిటిని కలుపుకొని వ్యాసంగము చేస్తే సాహిత్యా లయములో ప్రవేశించడానికి తగిన అర్హత కలుగుతుంది. సాహిత్యార్చనము చేయాలని ఉత్సాహపడుతూ ఉన్న నేటి సారస్వతేయులకు ఇటువంటి విధానము అవసరము. అవసరా పేక్షితమును అందించడానికి ఆంధ్రప్రతాపరుద్రీయము సమ ర్థము కావాలని అభిలాష. సాహిత్యగతులు నానా విధము లుగా ఉన్న ఈ దినాలలో భారతీయ సాహిత్య విలాసము ఏవిధముగా ఉన్నదో ముందుగా తెలియవలసిఉన్నది. అసంకీర్ణ మైన విజ్ఞానము మంచి సామరస్యానికి అవకాశ మిస్తుందికదా!

ప్రాతఃస్మరణీయులు అస్మత్పితృపాదులు శ్రీ సుబ్రహ్మ ణ్యశాస్త్రి చరణులు ప్రకృతము తురీయాశ్రమ నిష్ఠులు (శ్రీవైరాగ్యానంద భారతీస్వామి) ప్రతాపరుద్రీయ పాఠస ములో నాకు ప్రథమోపదేశకులు. చిరస్మరణీయులు గురువ ర్యులు శ్రీ రాయుడుశాస్త్రి దేవులు సాహితీ రూప నిరూపకులు తెనాలి సంస్కృత కళాశాలలో, నెల్లూరు వేదసంస్కృత కళాశాలలో అంతేవాసులకు, అభిజ్ఞులకు అధ్యాపనము చేసి ఆంధ్రప్రతాపరుద్రీయమునకు ఈ సంపన్నాకృతి సముచితః మని నిశ్చయించుకొన్నాను. దీనిలో భావప్రకటనమే ప్రధానా

శయము. వ్యాఖ్యానములోని మూల భావమును విస్పష్టః చేసే అంశాలను అందించడానికి యత్నించాను. అక్కడక్క అవసరములని తోచిన వానిని గ్రంథాంతర విజ్ఞానముతో నిరూపించాను. మూలోక్త లక్ష్యలక్షణములు ఆధారం7 ఆంధ్ర ప్రతాపరుద్రీయము ప్రసరించింది. సౌలభ్యమునకి ప్రాకృతానువాదము సంస్కృతచ్ఛాయను స్వీకరించాను నాటకలక్ష్యమునకు ఇక్కడ అవకాశము అవసరము కా దన కొన్నాను. ఈ విధానమునే అస్మద్గురుపాదులు అమోదిం చారు. విద్యానాథ కృతికి కల ప్రామాణికతను నేను దీనిలో మీమాంసించ దలచలేదు.

సాహిత్య శాస్త్ర మాలికలో ఈ గ్రంథమును రెండ వదిగా ప్రకటించడానికి ఆమోదము చూపి స్వస్పంద మనో హర ప్రస్తావికను అనుగ్రహించిన ఆచార్య శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారి సాహిత్యాత్మకు నమోవాకము లర్పించు తున్నాను. ఈ గ్రంథమునకు ఈ విధముగా ప్రకాశనము కల గడములో హేతుభూతులు మురపురాని సాహార్ద్రశోభితులు సర్వవిధసామరస్య సంధానకుశలులు నవ్యసాహిత్య పరిషత్సూ త్రధారులు సహృదయ మిత్రులు శ్రీ శైలికిచర్ల వెంకట రత్నముగారికి అభివాదనములు. ఆంధ్ర ప్రతాపరుద్రీయమునకు అచిరకాలములో అనురూప రూపసంపదనిచ్చిన శ్రీ కల్యాణీ ప్రెస్ వారికి సానంద ధన్యవాదములు

శ్రీ మాధవ రామ శర్మ

పార్థివ సంక్రాంతి
శాలి. ౧౮౭౬

విషయసూచిక

౧. నాయక ప్రకరణము

కావ్య ప్రకరణము

శబ్దశక్తిమూలక వ్యంజన - అర్థశక్తిమూలకము - ఉభయశక్తి
కైశిక్యాది, వృత్తులు-కైశికి-ఆరభటి-భారతి-సాత్వతి - మధ్యమా
భటి-మధ్యమకైశికి- రీతి సామాన్యలక్షణము - వైదర్భీరీతి - గౌడీ
రీతి - పాంచాలరీతి-శయ్య- పాకములు - ద్రాక్షాపాకము - నారికే
పాకము- కావ్యవిశేషములు -ధ్వని-గుణీభూతవ్యంగ్యము-చిత్రము
శబ్దచిత్రము - అర్థచిత్రము - ఉభయచిత్రము - ధ్వనివిశేషములు
అవివక్షిత వాచ్యధ్వని - వివక్షితాన్య పరవాచ్యధ్వని - అసంలక్ష్య
క్రమము-సంలక్ష్యక్రమము - శబ్దశక్తిమూలకము - అర్థశక్తిమూల
కము-ఉభయశక్తిమూలకము-అసంలక్ష్యక్రమ భేదములు - శుద్ధభేద
ములు-మిశ్రభేదములు- ప్రాచీనుల మిశ్రగణనము - విద్యానాథుని
గణనోపపత్తి - సంసృష్టిసంకరాయాతభేదములు - అర్థాంతరసంక్ర
మితా వక్షితవాచ్యధ్వని - అత్యంతతిరస్కృతా వివక్షితవాచ్యధ్వని -
వివక్షితాన్య పరవాచ్యములో అర్థశక్తిమూలవస్తువుచే వస్తుధ్వని -
వస్తువుచే అలంకారధ్వని-వ్యంగ్యమునకు అలంకార వ్యపదేశము-
అలంకారముచే వస్తువు - అలంకారముచే అలంకారము - క. ప్రౌ.
వస్తువుచే వస్తుధ్వని-క. ప్రౌ. వస్తువుచే అలంకారము - క. ప్రౌ.
అలంకారముచే వస్తువు-క. ప్రౌ. అలంకారముచే అలంకారము -
క. ని. ప్రౌ. వస్తువుచే అలంకారము-క. ని. ప్రౌ. అలంకారముచే
వస్తువు-క. ని. ప్రౌ. అలంకారముచే అలంకారము-శబ్దశక్తిమూల
ధ్వని - శబ్దశక్తి మూలాలంకారధ్వని - శబ్దశక్తి మూలవస్తుధ్వని -
ఉభయశక్తిమూలధ్వని-అసంలక్ష్యక్రమధ్వని-గుణీభూతవ్యంగ్యము-
అగూఢము-అపరాంగము-వాచ్యసిద్ధ్యంగము - అస్ఫుటము - సంది
గ్ధము-తుల్యప్రాధాన్యము-అసుందరము-కాక్వాక్షిప్తము-చిత్రము -
మహాకావ్యము-ఉపకావ్యము-చంపువు - ఆఖ్యాయిక - క్షుద్రప్రబంధ
ములు-ఉదాహరణము-చక్రవాళము-భోగావళి-బిరుదావళి - తారావళి.

౭౨-౧౬౮

౩. నాటక ప్రకరణము

నాట్యస్వరూపము - నృత్యము, నృత్తము - దశరూపకములు -
రూపకభేదకధర్మములు-సంధిపంచకము-సంధి-అవస్థానిరూపణము
-ఆరంభము-ప్రయత్నము-ప్రాప్త్యాశ - నియతాప్తి- ఫలాగమము -

శ్రీ ర్జయతు

ఆంధ్ర ప్రతాపరుద్రీయము

నాయక ప్రకరణము

దేవీ స్తుతి

విద్యాకైరవకౌముదీం శ్రుతిశిరఃసీమన్తముక్తామణిం
దారాన్ పద్మభువ స్త్రిలోకజననీం వందే గిరాం దేవతాం,
యత్పాదాబ్జనమస్క్రియా స్సుకృతినాం సారస్వతప్రక్రియా
బీజన్యాసభువో భవంతి కవితానాట్యైకజీవాతవః,

శ్రీదేవీ పరమా మాతా స్వోన్నేషార్థప్రదాయినీ,
వాచాం సర్వప్రకారాణాం మూలం లక్ష్యం చ భాసతాం.

* * *

పూర్వేభ్యో భామహాదిభ్య స్సాదరం విహితాంజలిః,
వక్ష్యే సమ్య గలంకారశాస్త్రసర్వస్వసంగ్రహమ్,

భామహాదులు చిరంతనాలంకారికులు. వారలకు సాదరముగా అంజలిని ఘటించుతాను. పిమ్మట సమ్యగ్రీతిలో అలంకారశాస్త్రసర్వస్వ సంగ్రహమును చెప్పెదను. ఇది సామాన్యముగా భావము.

ఇది అలంకారశాస్త్రగ్రంథము. అలంకారశాస్త్రకారులకు ముందుగా నమోవాకమును చెప్పుట సముచితము.

సాహిత్య ప్రాచీనత

అలంకారశాస్త్రము బాగా చిరంతనమే. వేదపురాణేతిహాసాలలో దీనిస్వరూపవిశేషములు గోచరము లవుతూనే

ఉన్నవి. అగ్నిపురాణములో కొన్నిఅధ్యాయాలు సాహిత్య పద్ధతులను విశదముచేస్తూ ఉన్నవి. భరతుని నాట్యశాస్త్రములో నాట్యము ప్రధానము. అయినా అది ప్రసంగవశాన సాహిత్యాంగాలను చర్చిస్తూ ఉన్నది. కేవలాలంకార గ్రంథములుగా చెప్పదగినవానిలో భామహుని కావ్యాలంకారము మొదటిది. అంతకు ప్రాచీనములు ఉండవచ్చునేమో కాని అవి ప్రస్తుతము దొరకడము లేదు. మొత్తముపై తరువాతి ఆలంకారికులకు భామహుడే సాహిత్యభిక్షను పెట్టినట్లు ఊహించాలి కాబట్టి భామహుడు మొదటగా ప్రణమ్యుడు.

ప్రస్థాన భేదము

ఈ కారికలో "భామహాదిభ్యః" అనే బహువచనము స్వారసికము. సాహిత్యశాస్త్రములో భిన్నభిన్నము లయిన ప్రస్థానములు ఉన్నవి. వాటిలో అలంకారప్రస్థానము మొదటిది. దానిలో ఆదిపురుషుడు భామహుడు. దండి గుణ ప్రస్థానవ్యవస్థాపకుడు. వామనుడు రీతిప్రస్థానవాది. శ్రీమదానందవర్ధనాభిగుప్తులు ధ్వనిప్రస్థాన వ్యవస్థాపనాచార్యులు. కుంతకుడు వక్రోక్తివాది. క్షేమేంద్రుడు ఔచిత్యాభిమాని. మహిముడు అనుమాననిర్ణేత. ఆయాప్రస్థానాలకు ఆదిపురుషు లయిన వీరంతా నమస్కార్యులు.

అలంకారశాస్త్ర మని అనడములో ఉపపత్తి

"అలంకారశాస్త్రసర్వస్వసంగ్రహం" రసము, గుణము, అలంకారము, రీతి, వృత్తి అనేవి సాహిత్యప్రమేయములు. అయినా ఛత్రిన్యాయానుసారంగా దీనిని 'అలంకార శాస్త్రము' అని అనడము యుక్తమే. అలంకారపదము చేతనే మిగిలిన వన్నీ సంగృహీతము లవుతవి. మొదటివా

డుగా చెప్పదగిన భామహుడు ఆతనిఅనుయాయులూ అలంకారాలనే ప్రధానంగా తలచడంమూలాన ఈపేరు ప్రసిద్ధమయింది. ఇతరులు రసాదులను ముఖ్యముగా తలచినా 'సౌందర్యము అలంకారము' అని భావించడముచేత ఈపేరు అనుపపన్నం కాదు. సాహిత్యప్రమేయాలను అనుశాసించి చెప్పేది అలంకారశాస్త్రము. అలంకారశాస్త్రగ్రంథాలు అనేకములు ఉన్నవి. ఒక్కొక్కగ్రంథంలో ఒక్కొక్కవిషయమే గ్రథిత మయింది. కాని అన్నివిషయాలూ ఉపపాదితములు కావడము లేదు. సాహిత్యదర్పణమువంటి గ్రంథంలో సకల విషయాలు ఉన్నా సంగ్రహంగా ఉండకపోవడమువలన సకల విషయాలనూ సంగ్రహంగా విశదంగా ఉపపాదించడానికై ఈగ్రంథము ప్రారబ్ధిత మయినది.

చరితార్థత

చిరేణ చరితార్థోఽభూ త్కావ్యాలంకారసంగ్రహః,
ప్రతాపరుద్రదేవస్య కీర్తి ర్యేన ప్రకాశ్యతే.

కావ్యాలంకారసంగ్రహము చిరకాలానికి చరితార్థమయింది. శ్రీ ప్రతాపరుద్రదేవునికీర్తి ఈగ్రంథంలో ప్రకాశితము కావడమే హేతువు. లోకోత్తరమయిన ప్రతిపాద్యము లభించినందువలన అలంకారశాస్త్రము ఈనాటికి ధన్యమయింది. ఇతర గ్రంథాలలో ఇటువంటి వర్ణ్యపురుషుడు లేడు. ఈగ్రంథములో ఉన్నాడు. కాబట్టి ఈగ్రంథానికి ఉత్కర్ష ఉన్నది.

ఈశాస్త్రప్రమేయము

రసప్రధానా శ్శబ్దార్థా గుణాలంకారవృత్తయః,
రీతయ శ్చేయతీ శాస్త్రప్రమేయం కావ్యపద్ధతిః.

"అలంకారశాస్త్రసర్వస్వసంగ్రహం" అనగా ఏమో ఈ కారికలో విభజింపబడుతున్నది. రసమే జీవితముగా కలిగిన శబ్దార్థములు, గుణములు, అలంకారములు, వృత్తులు, రీతులు, అను ఈ కావ్యపద్ధతిని సాహిత్యశాస్త్రప్రమేయముగా గ్రహించాలి. "రీతయశ్చ" అనేచోట 'చ' కారమువలన ఇచట చెప్పబడని కావ్యప్రకరణములో వక్ష్యమాణములగు శయ్యాపాకాలను కూడా గ్రహించాలి. కాగా కావ్యమార్గములో రసభావాదులు, శబ్దార్థములు, గుణములు, అలంకారాలు, వృత్తులు, రీతులు, శయ్య, పాకము అనేవి ఉండాలనిభావము.

రసప్రధానత

వీని అన్నిటిలోనూ రసము ప్రధానము కావాలి అనేది ముఖ్యవివక్షితము. అనగా కేవలము శబ్దచమత్కారము కాని, కేవలమూ అర్థచమత్కారము కాని, కేవల గుణాదిచమత్కారము కాని ఉన్నకావ్యపద్ధతి కావ్యపద్ధతి కాదు, అని తాత్పర్యము. వాని వాని చమత్కారము ఉన్నా అక్కడ పర్యవసానంలో రసచమత్కారమే ప్రధానము కావాలన్నమాట. రసపర్యవసానము పొందని చమత్కారము కావ్యపద్ధతిలో ఉండదగదు. రసము జీవితముగా ఉంటేనే వానికి స్వరూపలాభము కలుగుతుంది. ఇచ్చట రసము కేవల ముపలక్షకము. కాగా రసము, భావము, రసాభాస, భావాభాస, భావోదయము, భావసంధి, భావశాంతి, భావశబలతలు కూడా సంగృహీతములు కావాలి. ఈవిషయము ముమ్ముందు విశదమవుతుంది.

ప్రధానము రసమా? వ్యంగ్యమా?

ఇక్కడ ఒకటి శంకించవలసి ఉన్నది. రాబోయే కావ్యప్రకరణంలో "జీవితం వ్యంగ్యవైభవం" అని నిరూపితము

కానున్నది. వ్యంగము వస్తు వని, అలంకార మని, రస మని మూడు విధాలు. ఈవిధముగా త్రివిధమయిన వ్యంగ్యమే కావ్యజీవిత మని అచటి భావము. ఇక్కడఉన్న "రసప్రధానాః" అనే పదమువలన రసమే జీవిత మని తెలుతున్నది. ఈవాదద్వయములో దేనిని ప్రమాణంగా గ్రహించాలి? రసమే జీవితము అనే వాదమునే ప్రమాణముగా గ్రహించితే వస్త్వలంకారములు జీవితము కాజాలవు. "జీవితం వ్యంగ్యవైభవం" అనే వాదమే ప్రమాణమయితే రసజీవితత్వకథనము వ్యాహత మవుతుంది. ఒకే గ్రంథములో ఈవిధంగా పూర్వాపరవిరుద్ధ వచనాలు ఉండడము ఉచితము కాదుగదా! ఈవైరుద్ధ్యమును ఏవిధంగాపరిహరించాలి? అని.

రసమే జీవితము అని అనడము సముచితపక్షము. రసము ముఖ్యజీవితము. వస్త్వలంకారములు జీవిత మని అనుట ఔపచారికము. రసము స్వస్వరూపములోనే విశ్రాంత మవుతుంది. అది వేరొకదానిలో పర్యవసానము పొంద నక్కర లేదు. వస్త్వలంకారములు అట్లా కాదు. వస్తువు వ్యంగ్యమయినా దానియంతట అది చమత్కారకము కాదు. అది రసాంగ మయినప్పుడె చమత్కారి. రసాంగము కాకుండా స్వరూపవిశ్రాంత మయ్యే వస్తువు నీరసము. నీరసము కావ్యములో ఉపాదేయము కాదు. అలంకారముకూడా అంతే. వస్త్వలంకారాలు రసవిశ్రాంతము లయితేనే సుందరములు అవుతవి. అదీకాక అవి అవశ్యంగా రసవిశ్రాంతిని పొంది తీరుతవి. కాబట్టి అవి అప్రధానాలు. అప్రధానము జీవిత మవుతుందా? వానిలోని జీవితత్వవ్యవహారము ముఖ్యము కాదు. కాగా "జీవితం వ్యంగ్యవైభవం" అనేచోట కూడా

రసమె జీవితము అని తాత్పర్యమును గ్రహించాలి. వ్యంగ్య ములుగా ఉండే వస్త్వలంకారములు వాచ్యము లవుతూ ఉండే వస్త్వలంకారములకంటె రమణీయములు. కాబట్టి వస్త్వలంకారములు (వ్యంగ్యము అవుతున్నప్పుడు) జీవిత మనుట యుక్తమె. కాని అది ఆపాతకథనము. స్థలద్వయంలో కూడా రసప్రధానతకు ఏమాత్రమూ హానిలేదు. అందువల నవే పూర్వాపర వైరుధ్యము ఏమీలేదు. ఇది పై శంకకు సమాధానము.

యద్య ప్యసౌ ప్రబంధేషు ప్రాచాం సాధు నిరూపితా,
తథా ప్యస్యా స్సమం నేతు ర్నోదాహరణ మాదృతం.

ప్రాచీనులప్రబంధాలలో ఈ కావ్యపద్ధతి బాగానె నిరూ పితమయింది. అయినా ఈ కావ్యపద్ధతికి తగిన నాయకుని ఉదాహరణమును ప్రాచీనులు ఆదరించలేదు. ప్రాచీనులు కావ్యస్వరూపమును ఎంతగా నిరూపించినా ఉదాహరణార్హు డయిన నాయకుని వారు నిరూపించకపోవడము వారిగ్రంథా లకు అపకర్షగా ఉన్నది. ఉదాహరణార్హ యోగ్యనాయక నిబంధనము లేనప్పుడు ఎంతగా కావ్యపద్ధతి నిరూపితమైనా సహృదయులకు రుచిరమయిన ప్రవృత్తి ఉదయించదు.

పుణ్యశ్లోకస్య చరిత ముదాహరణ మర్హతి,
న కశ్చి త్తాదృశః పూర్వైః ప్రబంధాభరణీకృతః.

పవిత్రయశస్సు కలవాని చరిత్ర ఉదాహరణార్హ మవు తుంది. పూర్వకవులు ఎవరూ కూడా అటువంటి పుణ్యశ్లోకుని ఎవనినీ ప్రబంధాభరణముగా చేయలేదు. కర్తవ్యమును ఆచ రించని వారికృతి ఎట్లా శ్లాఘ్యము కాగలదు? యోగ్యనాయక నిబంధనము చేయక పోవుట కవులకు అపకర్షాపాదకము.

ప్రబంధానాం ప్రబంధౄణా మపి కీర్తిప్రతిష్ఠయోః,
మూలం విషయభూతస్య నేతు ర్గుణనిరూపణం.

విషయముగా ఉండే ఉత్తమనాయకుని గుణనిరూపణము ప్రబంధాలకు ప్రబంధకర్తలకూ కూడా కీర్తిప్రతిష్ఠా మూలము. నేతృగుణనిరూపణమువలన గ్రంథాలకు కీర్తి కలుగుతుంది. గ్రంథకర్తలకు ప్రతిష్ఠ సంపాదితమవుతుంది. నాయకగుణగణ గణనము ప్రబంధాలకు యశఃప్రతిష్ఠాసంపాదకమైనట్లు ప్రబంధ కర్తలకుకూడా యశః ప్రతిష్ఠాసంపాదక మనికూడ భావము. కేవలమూ తత్తద్వస్తువులలో ఉండే విశేషముఫలన కలిగేది యశస్సు. ఆయావిశేషాలను సహృదయులు అనుసంధానము చేసి స్వరూపసంవాదమును సంపాదించుతారు. అట్టి సహృదయ స్వాత్మసంవాదమువలన ప్రతిష్ఠ కలుగుతుం దని ఊహించాలి. ప్రబంధౄ ప్రబంధముల ఉత్కర్ష నేతృనిబంధ నాధీనము అని పిండితార్థము.

శ్రీరాముడు ఉదాత్తచరితుడు. శ్రీమద్రామాయణములో ఆదికవి వాల్మీకి రామునిగుణవర్ణన మొనర్చినాడు. ఆవర్ణనము రామాయణానికీ వాల్మీకిమహామునికీ మహాప్రతిష్ఠా హేతువు అయింది. ఉత్తమగుణవర్ణనమును అనుసరించి ప్రబంధములను నిర్మాణించుట వలన అనేక శ్రేయస్సులు కలుగుతవి. మహాపురుషగుణవర్ణనము ఉంటేనే ప్రబంధస్థితి శ్రేయస్కర మవుతుంది. కాబట్టి ఉత్తమ గుణగణవర్ణనము అవశ్యకర్తవ్యము.

కావ్యపై లక్షణ్యము

ఈ అలంకారశాస్త్రములో కావ్యము ప్రతిపాదిత మవుతుంది. కావ్యము వేదాదుల మాదిరిగా పురుషార్థ పర్యవ

సాయి. వేదము "ఈవిధముగా చేయుడు" అని హితప్రాప్తిని కలుగజేస్తుంది. "ఈవిధముగా చేయకుడు" అని అహిత నివృత్తిని సంపాదించుతుంది. ఇట్లాగే శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలూ, హితాహితప్రవృత్తినివృత్తిసంపాదకములు. ఉత్తమనాయకవర్ణనము ఉన్న కావ్యమువలనకూడా హిత ప్రాప్తి అహితనివృత్తి ఉన్నది. హితాహితకర్తవ్యాకర్తవ్య మతిని కలుగజేయడములో కావ్యము వేదశాస్త్రపురాణేతి హాససదృశమే. అయినా కావ్యములో విశేషము ఉన్నది. ఆవిశేషము కావ్యాభ్యుచ్ఛ్రయసంపాదకము. వేదాదులవలన కర్తవ్యతాబుద్ధి కలుగుగావుత. కాని అది కటువుగా ఉంటుంది. కావ్యమువలన కలిగే కర్తవ్యతాబుద్ధి సరసము. ఈసరసత్వము వేదాదులలో కానరాదు. చూడుడు—

> యద్వేదాత్ ప్రభుసమ్మితా దధిగతం శబ్దప్రధానా చ్చిరం
> య చ్చార్థప్రవణా త్పురాణవచనా దిష్టం సుహృత్సమ్మితాత్,
> కాంతాసమ్మితయా యయా సరసతా మాపాద్య కావ్యశ్రియా
> కర్తవ్యే కుతుకీ బుధోఽపి రచిత స్తస్యై స్పృహాం కుర్మహే.

ప్రభుసమ్మితమూ శబ్దప్రధానమూ అయిన వేదమువలన కర్తవ్యాకర్తవ్యరూప మగు ఏఅంశము ప్రమాణ సమ్మతమై కష్టమున చాలా కాలానికి తెలియబడుతున్నదో, సుహృత్సమ్మి తమూ అర్థప్రధానకమూ అయిన పురాణవచనమువలన ఏహితాహితబోధ చిరకాలానికి అభిరుచిత మయిందో, అటు వంటి కర్తవ్యాకర్తవ్యాంశములో కాంతాసమ్మిత మయిన కావ్యశ్రీ సరసత్వమును ఆపాదించి, భావకునికర్తవ్యములో కౌతుకము కలవానినిగ, అకర్తవ్యములో కౌతుకము లేనివా నినిగా చేస్తున్నది. అట్టి కావ్యశ్రీ ప్రాప్తికై మేము స్పృహ

యాచకులము అవుతాము, అని సామాన్యాత్మక మయిన అర్థము.

వేదము ప్రభుసమ్మిత మనుట

దీనిలోని నిగూఢవిషయమును ఈవిధంగా గ్రహించాలి. లోకములో వేద పురాణ కావ్యాలు హితాహితాలను సూచించుతున్నవి, అని ప్రక్రాంతము. అందులోనూ కావ్యము సరసమనికూడా ఉద్దిష్టము. ప్రత్యక్షప్రమాణము వలన కాని అనుమానప్రమాణమువలన కాని గోచరము కాని ఉపాయ వేదనము వేదమువలననే కలుగుతుంది కాబట్టి వేదము వేద మవుతున్నది. జ్యోతిష్టోమాదియాగములు ఇష్ట ప్రాప్తిలో ఉపాయాలు. అవి ప్రత్యక్షాదిప్రమాణాలకు గోచరములు కావు. కలంజభక్షణ సురాపాన పరస్త్రీగమనాది వర్జనము అనిష్టపరిహారములో ఉపాయము. ఇదికూడా ప్రత్యక్షాదివిషయము కాదు. ఈ ఇష్టానిష్టప్రాప్తి పరిహారోపాయాలను వేదమువలననే తెలియాలి. ఇటువంటి ఈ వేదము రాజతుల్యము. రాజువలె వేదము శబ్దప్రధానము. "ఇట్లు చేయుము" అనే విధిబలాన ప్రభువు మానవులకు ప్రవర్తకుడు అవుతున్నాడు. "ఇట్లు చేయకుము" అనే నిషేధ బలాన ప్రభువు నివర్తకు డవుతున్నాడు. వేదముకూడా "సత్యం వద, ధర్మం చర, అహరహః సంధ్యా ముపాసీత, జ్యోతిష్టోమేన స్వర్గకామో యజేత" మొదలయిన విధి వాక్యబలాన మానవులకు ప్రవర్తక మవుతున్నది. "స్వాధ్యాయా న్మా ప్రమదః, న కలంజం భక్షయేత్, న సురాం పిబేత్, న పరదారాన్ గచ్ఛేత్, బ్రాహ్మణో న హన్తవ్యః" మొదలయిన నిషేధవచనబలాన నివర్తక మవు

తున్నది. తన ఆజ్ఞను పరిపాలించనివానిని ప్రభువు దండించు తాడు. విధుల నిర్వర్తించని వానిని వేదము ప్రత్యవాయ (ఇబ్బంది) జననద్వారా శిక్షించుతుంది. వేదమును అహ రహమూ ద్విజులు అధ్యయనం చేయాలి. వేదములో స్వరవర్ణ ముల అన్యథోచ్చారణము అనర్థ సూచకము. వేదవిహితకర్మ లను అవశ్యము యథావిధిగా ఆచరించాలి. అదే ఫలప్ర దము. కాక ఆకర్మల అన్యథానుష్ఠానము కాని అననుష్ఠానము కాని అనర్థజనకము. వేదము ఈవిధంగా ప్రత్యవాయజనక మని ఊహించాలి. మీమాంస చదివితేనేగాని వేదార్థము తెలియదు. వేదార్థము సుగృహీతము అయితేనే గాని కర్తవ్యా కర్తవ్యబోధ కలుగదు. వేదార్థగ్రహణంలో మీమాంసా పేక్ష ఉన్నది కాబట్టి వేదమువలన కలిగే ఇష్టానిష్టబోధ చిర కాలానికి కాని కలుగదు. ఈ చెప్పినదంతా వేదవిషయంలో విజ్ఞేయాంశము.

పురాణము సుహృత్సమ్మిత మనుట

ఇక పురాణము అర్థప్రధానము. పురాణములలోని కథ లన్నీ అర్థవాదాత్మకములు. అచటి కథలలో స్వార్థతాత్ప ర్యము లేదు. ఒక్కొకచోట ప్రతిపాద్యప్రశంసా సూచక ములుగా కథలు నిరూపితము లవుతవి. వేరొకచోట నిందార్థనిందా పరముగా కథలు ఉపాత్తము లవుతవి. పౌరాణికగాథలను చారిత్రకప్రసిద్ధి ఉన్నప్పటికీ ప్రతిపాద్యవిష యతత్పరతయే ప్రధానము కాబట్టి పురాణములు అర్థవాద బహుళములు అవుతున్నవి. పురాణికము "ఇట్లు చేయ వలయును" అనే విధిబలాన ప్రవర్తకము కావడము లేదు. "ఇట్లా ఆచరింపరాదు" అని నిషేధబలాన నివర్తకమూ

కావడము లేదు. పురాణాలలో దిక్పాలకేశ్వరాలు న్యక్కృతములే (తిరస్కృతములు) అవుతున్నవి. వాటిలో ఒక్కొక్క స్థలాన పూర్వపురుష చరిత్ర [illegible] స్థలాన పూర్వపురుష చరితనింద ఉన్నది. [illegible] స్తుతినిందా ముఖముగా అవి పతితలకు రాగద్వేషములను కలుగజేస్తున్నవి. మిశ్రముగ ఏదో దృష్టాంతవిషయమును ఉపన్యసించి వారియందు రాగద్వేషాదులను కలుగజేసి ప్రవృత్తి నివృత్తులను ఉదయింపజేస్తున్నాడు. మనము రామాయణమును వింటే శ్రీరామునిపై అనురాగము ఉదయించుతుంది. రావణునిపై ద్వేషము కలుగుతుంది. అనంతరము రామునివలె ప్రవర్తించాలనీ, రావణాదులవలె ఆచరింపరాదని మనకు ప్రవృత్తి నివృత్తులు కలుగుతవి ఇట్లా మొత్తంమీద పురాణాలు విషయాంతర నిబంధన ద్వారముగా మన ప్రవృత్తి నివృత్తులలో హేతుభూతము లవుతున్నవి. కాబట్టి పురాణాలు అర్థప్రధానము లని అనడము సుసంగతము. పురాణమువలనకలిగే కర్తవ్యాకర్తవ్య ప్రవృత్తినివృత్తులు కథాద్వారముగా కలుగుతున్నవి. కాబట్టి అక్కడ [illegible] చిరకాలానికి కాని కలగడము లేదు.

కావ్యము కాంతాసమ్మిత మనుట

కావ్యము వేదపురాణవిలక్షణము. కాంతాసమ్మితము. "కవయతే వర్ణయతీతి కవిః [illegible]" వర్ణించేవాడు కవి అని అర్థం. [illegible] కవికర్మ కావ్యము. కావ్యమనేది [illegible] కవికి సంబంధించిన సర్వకర్మాలూ [illegible] కావ్యము కాదు. ఇక్కడ కవికర్మ అనే పదానికి రసోల్లసితశబ్దార్థసంఘటనాత్మక

మగు కర్మనే గ్రహించాలి. అదే కావ్యము. అట్టి కావ్యమీనా సము సరసతను ఆపాదించుతుంది. అది పఠితలకు ఉత్కంఠను కలగజేసి వారలను స్వాభిముఖులనుగా చేసికొంటుంది. ఒక కమనీయకామిని మృదుగమన కటాక్షవీక్షణ దరహసితాది విలాసాలతో కాంతుని ఆవర్జించుకొనగలదు. కాని "నాకు ఇది ఇష్టము, దీనిని చేయవలసినది' అని కాని "నాకు ఇది ఇష్టము కాదు. దీనిని చేయవద్దు" అని కాని కంఠోక్తిగా చెప్పదు. కటాక్షాదికముచేత సమావర్జితు డయిన కాంతుడు తనంతట తాను కాంతాభిలషితమును సర్వమూ సంపాదించు తాడు. కామిని ఈవిధముగా సర్వమును కాంతునిచేత సంపా దింపచేసికొంటున్నది. కావ్యశ్రీకూడా ఇట్లాగే అని గ్రహించాలి కావ్యవిలాస మంతా వ్యంజనావ్యాపారమాత్ర పరము. కావ్యములోని శబ్దార్థములు అప్రధానాలు. కాబట్టే శబ్దప్రధానకము ప్రభుసమ్మితమూ అయిన వేదముకన్నా, అర్థ ప్రధానకము సుహృత్సమ్మితమూ అయిన పురాణముకన్నా కావ్యమువిలక్షణము. సహృదయ హృదయాహ్లాదమును కలుగ జేసే వ్యంజనావ్యాపార ద్వారముగానే కావ్యము మానవుని కర్తవ్యములో ప్రవర్తింపచేస్తుంది అకర్తవ్యమునుండి నివర్తింప చేస్తుంది. కావ్యము కాంతాసమ్మితమై సరసతాపాదనముతో ప్రవర్తకము అవుతున్నది. కాబట్టి, భయపురస్సరముగా ప్రవ ర్తక మవుతూ ఉన్న వేదముకంటె, అనునయపురస్సరముగా ప్రవర్తక మవుతూ ఉన్న పురాణముకంటె విజాతీయమై విశిష్ట విశేషము కలిగి ఉన్నదని తెలుసుకోవాలి. ఇటువంటి ఈ కావ్యశ్రీసంసేవనము సహృదయులకు కర్తవ్యము.

అనుబంధ చతుష్టయము

పురుషార్థోపదేశము కావ్యప్రయోజనము. అటువంటి ప్రయోజనవిశిష్ట మయిన కావ్యము విషయము. పురుషార్థము సాధ్యము. కావ్యము సాధనము. అందువలన ఈరెండిటికీ సాధ్యసాధనభావము సంబంధము. ఈ విషయజిజ్ఞాస కలిగిన సహృదయుడు అధికారి. ఈవిధముగా ఇక్కడ ప్రయోజన విషయ సంబంధాధికారులు అనే అనుబంధచతుష్టయమును గ్రహించాలి. గ్రంథములో ఇవి అవసరములు.

కావ్యప్రయోజనము

కావ్యఫలము కేవలమూ పురుషార్థోపదేశమే కాదు. కీర్తి మొదలయిన ప్రయోజనాలు అనేకములు ఉన్నవి. కావ్యము దృష్టఫలములను ఆపాదించుతుంది. అదృష్టఫలములనూ సంపాదించుతుంది. ఇట్లా కావ్యము బహుఫలజనకము కావడమువలన బహూపయుక్తము. కేవలము పురుషార్థకాంక్షులకే కాక ఇతరప్రయోజనకాముకులకుకూడా కావ్యము ఉపకరించుతుంది. కాబట్టి ఇది ఉపాదేయము. కావ్యప్రకాశ గ్రంథములో కావ్యప్రయోజనాలు ఈ విధముగా నిర్దిష్టములయినవి.

> కావ్యం యశసేఽర్థకృతే, వ్యవహారవిదే శివేతరక్షతయే,
> సద్యః పరనిర్వృతయే కాంతాసమ్మితతయోపదేశయుజే.

కావ్యము యశస్సునకు ద్రవ్యసంపాదనానికి వ్యవహారవిజ్ఞానమునకు అమంగళనాశనానికీ పఠనసమనంతరములోనే పరినిర్వృతికి కాంతాసమ్మిత మాటవలన ఉపదేశయోజనమునకూ ఉపకరించేది అవుతున్నది.

కాళిదాసాదులు ఎచట పుట్టినారో ఎచట వృద్ధిపొంది నారో సరిగా తెలియదు. కాని వారి కావ్యాలు దేశదేశాంతర ఖండఖండాంతర ప్రసిద్ధములై అపారమూ చిరస్థాయీ అయిన యశస్సును వారికి సంపాదించినవి. ధావకుడు నిర్ధనుడు, దరిద్రకవి. అతనికావ్యాలను అభినందించి శ్రీహర్షవర్ధనుడు అనే మహారాజు అమితద్రవ్యమును ధావకునకు బహూకరించినట్లు లోకవిదితమే. లోకవృత్తము లోకవ్యవహార మనబడుతుంది. తత్పరిజ్ఞానముకూడా కావ్యమువలన కలుగుతుంది. రాజకీయవిషయాలలో ఆసక్తి లేక సాహితీజిజ్ఞాసువులై ఉన్న రాజకుమారులకు విష్ణుశర్మఅనే పండితుడు పంచతంత్రమనే గ్రంథద్వారముగా నీతిని ఉపదేశించినట్లు ఆభాణకము ఉన్నది. మయూరకవి కుష్ఠవ్యాధిపీడితుడై సూర్యస్తవము చేసి ఆరోగ్యమును పొందడమూ ప్రసిద్ధమే. అతని కావ్యము సూర్యశతకముగా ప్రసిద్ధి పొందినది. జయదేవమహాకవి చనిపోయిన తనభార్యను గీతగోవిందకావ్యమువలన జీవింపచేసికొన్నాడు. ఇట్లా కావ్యమువలన శివేతరక్షతిని పొందినవారు అనేకులున్నారు. కావ్యపఠనసమనంతరములో విగళితవేద్యాంతరము బ్రహ్మానందసబ్రహ్మచారి అయిన రసానందము కలుగుతున్నది అదే పరనిర్వృతి. కావ్యము కాంతాసమ్మిత మగుటవలన శబ్దార్థాలను గుణీకరించుకొని ధ్వననవ్యాపారపరమై సరస విధానముతో ఉపదేశించేదికూడా అవుతుంది అని నిరూపితమె.

ఈ చెప్పిన ప్రయోజనాలు కవిసహృదయులకు సంబంధించేవి అవుతవి. వీనిలో యశోఽర్థానర్థప్రతీకారములు ఇద్దరకూ సంబంధించేవి అవుతవి. వ్యవహారోపదేశములు కేవలమూ సహృదయునివే. కవిసహృదయులు ఇద్దరూ పరనిర్వృతి

భాజనులు కాని నిర్వృతికాలములో కవికూడా సహృదయుడే. ఇట్లా ఈప్రయోజనాలు యథాసంభవముగా కవిభావకులకు సంబంధించేవి అవుతవని గ్రహించక.

కావ్యము ఈవిధముగా అనేకప్రయోజనసంపాదకము కావడము మహాప్రబంధాలలోకూడా ప్రసిద్ధమై ఉన్నది.

పరివర్ధతే విజ్ఞానం సంభావ్యతే యశో విసర్పన్తి గుణాః
శ్రూయతే సుపురుషచరితం కింతద్యేన నహరన్తి కావ్యాలాపాః?

కావ్యమువలన విజ్ఞానము అభివృద్ధి పొందుతుంది. యశస్సు సంభావిత మవుతుంది. గుణాలు బాగా వ్యాపించుతవి. యోగ్యపురుషులచరితము శ్రుత మవుతుంది. కావ్యాలాపము సకలసంపాదకము. మనోహారి. కావ్యాలాపము మనోహారము కాకపోవుటలో హేతు వేదీ లేదు. ఏకారణము వలన కావ్యాలాపాలు మనస్సును హరింపచేయలేవో అటువంటి కారణము ఏమి ఉన్నది? సర్వథా కావ్యము మనోహార మని భావము.

ఇంత దేనికి? ధర్మార్థకామమోక్షాలలోనూ సకలకళల లోనూ కావ్యము వైచక్షణ్యమును సంపాదించుతుంది. సాధు కావ్యనిషేవణము కీర్తిప్రీతికరము. ఇన్ని ప్రయోజనా లున్నప్పటికీ పరనిర్వృతియె ప్రధానప్రయోజనము. అదె ముఖ్య ఫల మని రహస్యము. కావ్యము కాంతాసమ్మిత మనే విశేషము ఈఅర్థమును విశదము చేస్తున్నది. కావ్యమువలన చతుర్వర్గవ్యుత్పత్తి ఉన్నప్పటికీ పురుషార్థము లన్నీ ఆనందము లోనే పర్యవసానము పొందుతవి కాబట్టి పరనిర్వృతియె పరమప్రయోజన మని గ్రహించాలి. ఆనందమె పార్యంతిక

ముఖ్యఫల మని శ్రీయుతులు అభినవ సప్తసాములు నిర్వచించుచున్నారు.

"కావ్యాలాపాంశ్చ వర్జయేత్" అని ఒకని పేధము ఉన్నది. దానిని అనుసరించి చూచినట్లయితే కావ్యసంలాపములను విడువవలసిందే అని తేలుతుంది. కాగా ఈ కావ్యశ్రీప్రయాస మంతా విఫలమె కాదా? అని శంక కలుగవచ్చును. కాని తదభిప్రాయమును ఈవిధముగా గ్రహించాలి. ఉత్తమపురుష చరితవర్ణనము లేసి కావ్యమును త్యజింపవలయును, అని తదర్థము. ఉత్తమపురుష చరితనిబంధనము ఉన్నట్లయితే అటువంటి కావ్యమును అవశ్యము స్వీకరింపవలయును, అని భావము. కాకపోతే రామయణాద్యుత్తమ కావ్యాలనుకూడా త్యజింపవలసివస్తుంది. కాగా 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్' అనే స్మృతి పుణ్యశ్లోకచరితసిబంధనము లేని కావ్యమూలకము అని గ్రహించడము సముచితముగా ఉంటుంది.

ఉత్తమపురుషగుణవర్ణనావశ్యకత అనే ఈపక్షము కేవలమూ కావ్యానికే కాదు. శాస్త్రజాతానికికూడా ఇది ఆవశ్యకము. శాస్త్రిలు సదాశ్రయములై ఉంటేనే లోకములో బాగా ఆదరింపబడగలవు. ఇప్పటికి శాస్త్రజాతానికి కలిగిన లోకాదరము సదాశ్రయతామూలక మని విస్పష్టముగా గోచరమవుతున్నది. శాస్త్రిలలో అన్నిటా సదాశ్రయము భాసించుతూనే ఉన్నది. చూడుడు

కణాదమునిప్రోక్త మయిన వైశేషికశాస్త్రము ఈశ్వర ప్రతిష్ఠాపకము. అందువలననె అది జగత్పూజ్యముగా ఉన్నది. వైశేషికదర్శనములో ఈశ్వరుడు అనుమానప్రమాణముచేత సాధింపబడినాడు. ఈజగములో కనపడుతూ ఉన్న అంకురాది

కము సకర్తృకమై ఉన్నది. కర్త లేకుండా ఏదీ కలుగదు. కార్యముగా ఉండేది సకర్తృకమె అనడము యుక్తిసిద్ధము. లోకములో ఘటము శరావము మొదలయిన వన్నీ కార్యములు. వానికి కులాలుడు కర్త ఉన్నాడు. అట్లాగే ఈ జగత్తుకూడా సకర్తృకమె. అదికూడా కార్యమెకదా! సకర్తృక మయిన జగత్తుయొక్క కర్తృత్వము అస్మదాదులకు సిద్ధము కాదు. భ్రమ ప్రమాదాది దోషబహుళ మానవాదులు జగత్కర్తలు కాజాలరు. సర్వదోషరహితుడు సర్వశక్తియుతుడూ సర్వజ్ఞుడూ అయిన ఆతడె జగత్కర్త. ఈవిశేషములు మనలో ఉండవు. ఇవన్నీ కలవాడు అచింత్యామేయ ప్రభావయుతు డయిన పరమేశ్వరుడే. కాబట్టి ఈశ్వరుడే జగత్కర్త. ఇట్లా వైశేషికము ఈశ్వరుని ప్రతిష్ఠాపించుతున్నది. ఇట్లాగే ఇతరశాస్త్రాలలోకూడా సమన్వయించి చూచుకోవాలి.

శాసించేది శాస్త్రము. మహాభారతము లోకవృత్తము నంతనూ శాసించుతున్నది. సకలవిషయాలనూ అది శాసించి నిర్దేశించుతున్నది. కాబట్టి మహాభారతముకూడా శాస్త్రము. మహాభారతాదిగ్రంథాలు మహాపురుషగుణవర్ణనపరములై ఉన్నవి. కాబట్టి అవికూడా విశ్వాతిశయుతములే. ఇంత దేనికి? వేదాంతములు బ్రహ్మప్రతిపాదకములు కావడమువలననే పరమోత్కర్ష కలిగి ఉన్నవి. వేదాంతములలో చిదేకరసము నిర్ధర్మకమూ అయిన బ్రహ్మ ప్రతిపాదితము కావడము స్పష్టమె. అకల్పిత గుణవత్పురుషవర్ణనము లేకపోవుట దోషము కాదు. బ్రహ్మయందు ఆనందాదిగుణములు ఔపాధికములై ఉన్న వని పద్మపాదాదులు నిరూపించియే ఉన్నారు.

అదీ కాక, బ్రహ్మ నిర్గుణము నిర్దోషమూను. నిర్దోషతయే ఒకగుణము. "అపదోషతైవ విగుణస్య గుణః" అని మాఘు కవి పలుకుతున్నాడు. ఇట్లా ఏదోవిధాన వేదాంతాలలో గుణవత్పురుషనిబంధనము లేకపోలేదు. కాబట్టే అవి సర్వాతిశయితములై ఉన్నవి.

మీమాంసకులు నిరీశ్వరవాదులు. ఆయా కర్మలవలననే సకలమూ జరుగుతుం దని వా రంటారు. కాని ఈశ్వరుడు ఉన్నాడు అనడమును వారు అంగీకరింపరు. అయినా గుణధారేయ మగు ధర్మమును మీమాంసకులు ప్రతిపాదించుతున్నారు. ఆప్రతిపాదనమే గుణవత్పురుషవర్ణనపర్యవసాయిత్వమును పొందుతున్నది. జైమిని మహర్షి ప్రోక్త మయిన మీమాంసాదర్శనములో "అథాఽతో ధర్మజిజ్ఞాసా" అనేది మొదటి సూత్రము. అథ = సకలసాంగవేదాధ్యయనానంతరము, అతః = సకలవేదమూ, వివక్షిత ప్రయోజన సంపాదక మగుటవలన,ధర్మ = ధర్మముయొక్క జిజ్ఞాసా = తెలియవలెనని కోరిక కలుగుతుంది (జిజ్ఞాస చేయవలయును) అని సంక్షేపముగా సూత్రార్థము. ఇట్లా ఉపక్రమించుతూ ఉన్న సూత్రకర్త యగు జైమినిమహర్షికూడా "పురుషాశ్రితగుణ మయిన ధర్మముయొక్క జిజ్ఞాసనే" నిరూపించుతున్నాడు. కాబట్టి తద్ద్వారా మహాపురుషగుణవర్ణనమే శాస్త్రానికి ప్రాణ మని అంగీకరించిన ట్లయినది.

ఇచటి ధర్మస్వరూపనిరూపణములో మతభేదము ఉన్నది. శ్రేయస్సాధన మయిన యాగాదికమునకే ధర్మ మని పేరు. అంతేకాని ఆత్మనిష్ఠమయిన అపూర్వము ధర్మము కాదు. అపూర్వమంటె యాగాదుల అవాంతరవ్యాపారశక్తి. ఈనాడు

చేసే యాగక్రియ ఈనాడే నశించిపోతున్నది. అయినా అది కాలాంతరములో కలిగే ఫలమును సంపాదించుతున్నది. కాలాంతరము వరకూ యాగము ఉండకపోయినా అవాంతర వ్యాపారశక్తితో ఫలజనక మవుతున్నది. ఈశక్తికే అపూర్వ మని పేరు. ఇట్లాగే భాట్టాదులు అంగీకరించుతున్నారు. ఈ మతమును అనుసరించి చూడగా అపూర్వమే పురుషాశ్రితము కాని ధర్మము పురుషాశ్రితము కాదని తేలుతున్నది. అయినా అపూర్వముద్వారముగా ధర్మము పురుషాశ్రితగుణ మవుతున్న దని గ్రహించాలి. అపూర్వద్వారముగా ధర్మానికి పురుషాశ్రితగుణత్వమును చెప్పడము ఔపచారికము. ప్రాభాకరులు యాగాదివ్యతిరిక్త మగు అపూర్వమే ధర్మము అని అంటారు. తన్మతానుసారముగా అది ఆత్మనిష్ఠగుణ మగుట సంప్రతిపన్నమే. ఇది ఔపచారికము కాదు.

మీమాంసాశాస్త్రము మాయూన్యాయనిరూపణపరము కాని పురుషగుణవర్ణనపరము కాదు. అయినా మీమాంస పురుష గుణ మయిన ధర్మనిరూపణపరమే. కాబట్టి సకలశాస్త్రానికీ దానిలోనే పర్యవసానమును అంగీకరించాలి. కాకపోతే అది విఫలము కావలసి వస్తుంది. మీమాంసాప్రబంధరాశి తత్త్ న్యాయనిరూపణపరమే అప్రగాత. అయినా మహాపురుష గుణ మగు ధర్మనిరూపణము ఉన్నది. కాబట్టే బంగారానికి పరిమళము అబ్బినట్లున్నది. అందువలన

> ప్రతాపరుద్రదేవస్య గుణా నాశ్రిత్య నిర్మితః,
> అలంకారప్రబంధోఽయం సన్తః ! కర్ణోత్సవోఽస్తు వః,

ఈ అలంకారప్రబంధము ప్రతాపరుద్రదేవుని గుణాలను ఆశ్రయించి నిర్మిత మయినది. ఓ సహృదయులారా! మీ

కిది కర్ణోత్సవము అన్నగావృత. విద్వాంసులగు మీ రందరూ దీనిని పరిగ్రహించడము సముచితము. ఇగి మీకు శ్రోత్రానందమును సంపాదింపగలదు.

కాకతీయనరేంద్రస్య యశో భూషయితుం కృతా,
విద్యానాధకృతి శ్చేయం స్వయం తేన విభూష్యతే.

కాకతీయనరేంద్రుని యశస్సును భూషించడానికై ఈ కృతి రచితమయినది. స్వయముగా ఈ విద్యానాధునికృతి కూడా ఆ కాకతీయ వీరప్రతాపరుద్రునివలన విభూషిత మవుతున్నది. వర్ణ్యము ఉత్కృష్టము. ప్రబంధము ఉత్కృష్టము. దానిచే ఇది, దీనిచే అది, ఉపస్కృత మవుతుంది. వీనికి అన్యోన్యమూ ఉపస్కార్యోపస్కారక భావము ఉన్నది.

ప్రబంధమహిమవలన వర్ణ్యము అలంకృత మవుతుం దని అనడము నూతనము కాదు. కావ్యాదర్శ మనే అలంకార గ్రంథమును రచించిన ఆచార్య దండి ఈ విధముగా చెప్పినాడు.

ఆదిరాజయశోబింబ మాదర్శం ప్రాప్య వాఙ్మయం,
తేషా మసన్నిధానేఽపి న స్వయం పశ్య ! నశ్యతి.

వాఙ్మయ మనే దర్పణము ఆదిరాజుల యశోబింబమును పొంది, ఆ మొదటిరాజు లయిన నల నహుషాదుల అసన్నిధానములోకూడా తాను నశించడము లేదు. చూడుడు! వస్తువూ దర్పణమూ రెండూ అభిముఖములుగా ఉన్నపుడు బింబప్రతిబింబాలకు నాశము కలుగదు. వస్తువు సన్నిహితము కాకపోయినట్లయితే నాశము కలుగుతుంది. ఇది లోకమర్యాద. ఆయా రాజులు నశించినా వారివారి యశస్సు వాఙ్మయములో స్థిరముగా ఉంటుంది. నల నహుషాదులు లేకపో

యినా తద్యశోబింబప్రతిష్ఠ వాఙ్మయాదర్శాధీన మవుతున్నది. కాబట్టి ప్రబంధమహిమ ప్రతిపాద్యానికి ఉత్కర్షను సంపాదించుతుం దని భావము.

ప్రతిపాదింపబడేవాని మహిమచే ప్రబంధానికి మహత్త్వము సిద్ధించుటనుకూడా పెద్దలు చక్కగా నిరూపించారు. కావ్యాలంకారసంగ్రహాకర్త ప్రాచీనుడూ అయిన భామహుడు ఈ విధముగా అంటున్నాడు

"ఉపశ్లోక్యస్య మాహాత్మ్యా దుజ్జ్వలాః కావ్యసంపదః"

కావ్యములో ఉపశ్లోకింపబడు, అనగా కీర్తింపబడువాని మాహాత్మ్యమువలన కావ్యసంపదలు ఉజ్జ్వలములు అవుతవి అని. ఉద్భటుడుకూడా ఇదే అర్థమును ప్రతిపాదించుతున్నాడు. ఉద్భటుడు భామహగ్రంథానికి వ్యాఖ్యాత. కావ్యాలంకారసారసంగ్రహ మనే సాహిత్యగ్రంథానికి కర్త.

> గుణాలంకారచారుత్వయుక్త మ ప్యధికోజ్జ్వలం,
> కావ్య మాశ్రయసంపత్త్యా మేరుణేవామరద్రుమః.

గుణ చారుత్వాలంకార సౌందర్యములతో కూడుకొన్నప్పటికీ, మేరువుచే కల్పవృక్షముమాదిరిగా ఆశ్రయసంపదచే కావ్యము అధికోజ్జ్వల మవుతుంది. కేవల గుణాలంకార చారుత్వ నిబంధనమువలన కావ్యము ఉజ్జ్వలము కాదు. తగిన ప్రతిపాద్యుని వర్ణనము ఉన్నప్పుడే కావ్యము సుందరము కాగలుగుతుంది. కల్పవృక్షము కేవల కుసుమాలతో ఉన్నంతమాత్రాన మనోహరము కాదు. అది మేరువును ఆశ్రయించి ఉంటేనే మనోహరము. కాబట్టి ఆశ్రయసంపన్నిబంధనము ఆవశ్యకము.

రుద్రభట్టుకూడా ఇట్లాగే చెప్పాడు. ఆతడు శృంగారతిలక మనే గ్రంథానికి రచయిత. "ప్రబంధానికి కలిగే ప్రతిష్ఠ ఉదారునిచరితమును ఆధారము చేసికొని ఉంటుంది" అని ఆతనిభావము. ఉదాత్తునిచరితనిబంధనము లేకపోతే ప్రబంధానికి ప్రతిష్ఠ కలుగదు. సాహిత్యమీమాంసాగ్రంథములో కూడా ఈవిషయము ప్రపంచిత మయినది. రాజానకరుయ్యకుడు సాహిత్యమీమాంసాకర్త. "రామాదినాయకుల శౌర్యాదిగుణగ్రథనము పొందిన సుకృతుల సూక్తులు కల్పాంతమువఱకూ శోభావంతములై ఉండగలవు. నాయకమణిసూత్రాన గుంభితము లయిన యోగ్యసూలాకారుల మాలికలు చిరకాలము ఉండేవి అవుతవి" అని తద్భావము.

భోజరాజు సరస్వతీకంఠాభరణ శృంగారప్రకాశాది కర్త. ఉదాత్తచరితుడు. ఆతడుకూడా ఇట్లే నిరూపించినాడు.

కవే రల్పాపి వాగ్వృత్తిః విద్వత్కర్ణావతంసతి,
నాయకో యది వర్ణ్యేత లోకోత్తరగుణోత్తరః.

కవివాగ్వ్యాపారము అల్పమయినా లోకోత్తరగుణోత్తరుడయిన నాయకుడు వర్ణింపబడినట్లయితే విద్వాంసులకు కర్ణావతంసము అవుతుంది. లోకాతిశయితగుణాలు కలిగి ఉండడముచేత ఉదాత్తు డయిన నాయకునివర్ణనము ఉంటేనే విద్వాంసులు ఆదరించుతారు. అప్పుడు కవిరచనాప్రపంచములో చతురత లేకపోవడమునుకూడా వారు పరిశీలించరు. ఇట్లా అన్నందువలన అచతురవచనరచనను కవి స్వీకరించవచ్చు నని తలంచరాదు. ఇది కేవలమూ అర్థవాదము. నాయకుడు అవశ్యముగా వర్ణింపబడవలసినదే, అని దీని భావము.

నాయకగుణములు

కావ్యములో లోకోత్తరగుణోత్తర నాయకుని అవశ్యము వర్ణించాలి. ఆ నాయకగుణాలు ఈవిధముగా ఉన్నవి.

> మహాకులీన తౌజ్జ్వల్యం మహాభాగ్య ముదారతా,
> తేజస్వితా విదగ్ధత్వం ధార్మికత్వాదయో గుణాః,

మహాకులీనత్వము, ఉజ్వలత, మహాభాగ్యము, ఔదార్యము, తేజస్విత్వము, వైదగ్ధ్యము, ధార్మికత్వము మొదలయినవి నాయకగుణములు. పూర్వతనుల శాస్త్రానుసారముగా ఈ కొన్ని గుణాలు మాత్రము ఇట్లా నిర్దిష్టములయినవి. ప్రతాపరుద్రదేవుని గుణములు వాచామగోచరములు కదా! వీని ఉద్దేశక్రమానుసారముగా ఇక స్వరూపోదాహరణములను ప్రదర్శింతుము.

౧ మహాకులీనత

> మహాకులీనతా నామ కులే మహతి సంభవః,

వంశగౌరవము కలిగిన గొప్పకులములో జన్మించుట మహాకులీనత అనబడును. ఉదాహరణము

> తాదృఙ్మర్త్యమలోకభాగ్యవిభవా దింద్రాదిబృందారకైః
> క్షోణ్యాం క్రీడితు మిచ్ఛుభి శ్చిరతరం సంప్రార్థితః పద్మభూః,
> అత్యర్కేందుకులప్రశస్తి మసృజ ద్యం కాకతీయాన్వయం
> తస్మిం స్సంప్రతి వీరరుద్రవపుషా జాగర్తి లక్ష్మీపతిః,

భూలోకభాగ్యవిభవము ధన్యము. ఇంద్రాది దేవతలు భూమిపై విహరింప దలచి చాలాకాలము బ్రహ్మదేవుని సంప్రార్థనము చేసినారు. ఆ ప్రార్థనావశంవదు డయిన బ్రహ్మ కాకతీయాన్వయమును సృజించినాడు. ఆకాకతీయవంశము సూర్య

చంద్ర వంశప్రశస్తిని అతిక్రమించి ఉన్నది. అట్టి వంశములో ఇప్పుడు శ్రీలక్ష్మీపతి వీరరుద్రరూపాన ఉన్నాడు. భూలోకము సర్వాతిశాయి వైభవము కలిగి ఉన్నదనీ, కాకతీయ నరేంద్రులు దేవేంద్రాది సదృశులనీ, దీనిలో గోచరమవుతున్నది. చంద్రసూర్యవంశాధికమయిన కాకతీయ వంశములో వీరరుద్రుడు జన్మించినట్లు దీనిలో ప్రతిపాదింపబడినందువలన మహాత్కులప్రసూతి ఉన్నది. కాబట్టి ప్రతాపరుద్రునిలో మహాకులీనత ఉన్నదని భావము.

౨ ఔజ్జ్వల్యము

రూపసంపన్నదేహత్వ మౌజ్జ్వల్యం పరికీర్త్యతే.

రూపసంపద కల దేహ ముండుట ఔజ్వల్య మని కీర్తింపబడుచున్నది. భూషణములు లేకపోయినా భూషితమువలె ఉండే ఆకారవిశేషానికి రూపమని వ్యవహారము. భూషణములు నాలుగు విధాలు. ఆవేధ్యములు, ఆరోప్యములు, నిక్షేప్యములు, బంధనీయములూ అని. కుండలములు ఆవేధ్యములు. హారములు ఆరోప్యములు. నూపురములు నిక్షేప్యములు, అంగదాదులు బంధనీయములు, అని గ్రహించాలి.

ఉదా:-

మురారే ర్యః పూర్వం జలనిధిసుతాయా ముదభవ
న్మహాదేవా జ్జాతః స పున రవనీభృద్దుహితరి,
వపుష్మాన్ కామోఽయం జయతి జగతీభాగ్యవిభవైః
ప్రతాప శ్రీరుద్రః స్వయమితి మనీషా మృగదృశాం.

జలనిధిసుత అయిన శ్రీలక్ష్మియందు మురారి అయిన శ్రీవిష్ణువువలన పూర్వము ఉత్పన్నమయినవాడే ప్రకృతము రాజకుమారికయందు మహాదేవుడను పేరు గల

మహారాజువలన జన్మించినాడు. మహాదేవుడు శివుడు. అవనీ భృద్దుహిత పార్వతి. పార్వతీదేవియందు శివునివలన పుట్టినవాడు అని వ్యంగ్యముగా భాసించుచున్న అర్థము. ఈ దేహధారి అయిన మన్మథుడు భూమీభాగ్యవిభవములచే స్వయముగా ప్రతాపరుద్రుడై సర్వోత్కర్షగా ఉన్నాడని మృగనయనల అభిప్రాయము. పూర్వపు మన్మథుడే ఇపుడు ప్రతాపరుద్రుడయినాడని దీనిలో ఉత్ప్రేక్షితము. మన్మథుడు రూపసంపద కలవాడు. అతడే ఈతడగుటవలన ప్రతాపరుద్రుడు కూడా రూపసంపన్నదేహుడు. ఈవిధముగా ఔజ్జ్వల్యసమన్వయమును గ్రహించాలి.

౩ మహాభాగ్యము

విశ్వంభరాధిపత్యం యత్ త న్మహాభాగ్య ముచ్యతే.

సార్వభౌమత్వము ఉండుట మహాభాగ్య మనబడును.

ఉదా:—

సేవానమ్ర నరేంద్ర మౌళివిలస ద్రత్నాంశు నీరాజితం
రాజ్యశ్రీ ప్రథమావతారపదవీ మారుహ్య సింహాసనం,
క్షోణీం రక్షతి విక్రమై రనుపమైః ప్రత్యర్థిపృథ్వీపతి
శ్లాఘాలంఘన జాంఘికై ర్గుణనిధిః శ్రీవీరరుద్రో నృపః.

గుణనిధి అయిన వీరరుద్రభూపతి సింహాసనమును అధిష్ఠించి అనుపమవిక్రమములచే భూమిని రక్షించుచున్నాడు. ఆసింహాసనము ప్రతాపరుద్రుని సేవలో వినమ్రులయిన రాజులశిరోభాగాల విలసించుచున్న రత్నకిరణాలచే నీరాజితమవుతున్నది. రాజ్యలక్ష్మి ప్రథమముగా అవతరించడానికి మార్గమై ఉన్నది. సింహాసనము రాజ్యలక్ష్మి ప్రథమచిహ్నము కదా! ప్రతాపరుద్రునిపరాక్రమము శత్రురాజుల శ్లాఘా-

ల్లంఘనము చేయడములో జాంఘికము, జాంఘికము అంటే పిక్కబలము కలది అని అర్థము. ఉల్లంఘించేవారలకు పిక్కబలము కావాలి. ఇక్కడ ఆపదమువలన శీఘ్రగామి అనే అర్థాన్ని గ్రహించాలి. వీరరుద్రునివిక్రమసన్నిధానములో ఇతరులశ్లాఘలు లెక్కకు రావని భావము. ఈపద్యములో వీరరుద్రునకు శిష్టపరిపాలనము దుష్టనిగ్రహముల ద్వారా నిఖిలక్షోణీరక్షణము కల దని చెప్పబడినది. కాబట్టి మహా భాగ్యము.

౪. ఔదార్యము

యద్విశ్రాణనతాచ్ఛీల్యం ఔదార్యం త న్నిగద్యతే,

దాన మిచ్చునట్టి స్వభావము కలిగి ఉండుట ఔదార్య మగును. ఉదారుడు దాత అతనిధర్మము ఔదార్యము.

ఉదా:—

వదాన్యో నాన్యోఽస్తి త్రిజగతి సమో రుద్రనృపతేః
గుణశ్రేణీశ్లాఘా పిహిత హరిదీశాన యశసః,
సమంతా దుద్భూతై ర్ద్విరదమదగంధై స్సురభయః
క్రియంతే యద్విద్వజ్జన మణిగృహ ప్రాంగణభువః.

మూడు లోకాలలోనూ రుద్రనృపతితో సమానుడయిన వదాన్యుడు లేడు. ఆతడు దిక్పాలకుల యశస్సును తన గుణ గణోత్కర్షచేత తిరస్కరించినాడు. మణిగృహాలను విద్వజ్జనులకు ఆవాసభూములనుగా చేసినాడు. ఆవిద్వాంసులకు మదమత్తమతంగజాలను దానము చేసినాడు. అంతటా అతిశయించిన ఆ ద్విరదమదగంధములచేత మణిమయ భవనప్రాంగణ భూములు సురభితము లవుతున్నవి. ఈపద్యములో సమృద్ధ వస్తువర్ణనము ఉన్నందువలన ఉదాత్తాలంకారము. ప్రతాప

రుద్రుని దానవైభవము దీనిలో వర్ణిత మయినది. కాబట్టి ఉదారతను సమన్వయించుకొనవచ్చును.

౫. తేజస్విత

జగత్ప్రకాశకత్వం యత్ తేజస్విత్వం త దుచ్యతే.

జగమునంతనూ ప్రకాశింపచేయుట తేజస్విత్వ మగును. తేజము—పరాక్రమము. తేజము కలవాడు తేజస్వి. వానిధర్మము తేజస్విత. ఉదా:—

సదా తేజోభానౌ స్ఫురతి జయినః కాకతివిభో
రరిక్ష్మాభృత్కాంతాచికురతిమిరాహంకృతిముషి,
ప్రకాశవ్యుత్పత్తి ర్భవతి జరదుద్దామతమసా
మసూర్యంపశ్యానా మవధిగిరిపాశ్చాత్యదృషదాం,

జయశీలుడూ కాకతిదేవతోపాసకుడూ అయిన కాకతి విభుని ప్రతాపభానుడు పగ లనకా రాత్రి అనకా నిత్యమూ ప్రకాశించుతూ ఉండగా, ఎన్నడూ సూర్యుని చూడని అవధి గిరికిపటమటివైపున ఉన్న పాషాణములకు కూడా ప్రకాశ జ్ఞానము కలుగుతున్నది. అక్కడ ఇదివరలో అంధకారము అతిశయించి ఉన్నది. ఎన్నడూ ప్రకాశము లేనందువలన అచటి తమస్సు ఘనీభూతమై ఉన్నది. ఇప్పుడీ ప్రతాపభాను ప్రసారమువలన ఆచీకటి అంతా చిన్నభిన్న మయినది. కాకతి రుద్రుని తేజోభానుడు శత్రురాజకాంతల చికురతిమిరాహంకార మును హరించు నని విశేషణార్థము. శత్రుభూపతులు భీకరవీర సంగ్రామమ్ములో ప్రతాపరుద్రునిచే హతు లయినారు. తత్కాంతలకు ప్రియవియోగము కలిగినది. కాగా వారలకు కేశసంస్కారము లేదు. చికురములు వెలవెలబారినవి. వాని గర్వము నిర్వాపిత మయిన దని భావము. దీనిలో ప్రతాప

రుద్రుని ప్రతాపసూర్యుడు అతివేలప్రకాశము కలుగజేయు వాడు కావడమువలన లోకోత్తర మగు తేజస్వితను భావించాలి.

౬. వైదగ్ధ్యము

కృత్యవస్తుషు చాతుర్యం వైదగ్ధ్యం పరికీర్త్యతే.

కర్తవ్యార్థములలోని ప్రయోగకౌశలము వైదగ్ధ్య మగును· విదగ్ధుడు — చతురుడు. అఘటమానములను ఘటించువాడు. వానిధర్మము వైదగ్ధ్యము. చేయదగినకార్యములలోని చతురత్వమే వైదగ్ధ్యము. ఉదా:—

చాతుర్యం కిము వర్ణ్యతే గుణనిధేః శ్రీవీరరుద్రప్రభోః?
యత్రాన్యోన్యవిరుద్ధయో రపి మహద్వాణీశ్రియో రార్జవం,
కించాభ్యాం సదృశోపచారలలితాం తత్తాదృశై రుత్సవైః
నిస్సాపత్న్య మిమాం భువం స నృపతి ర్ధత్తే దిశాం జిత్వరః.

గుణనిధి అయిన శ్రీవీరరుద్రప్రభువుచాతుర్యము వర్ణించడానికి శక్యము కాదు. పరస్పరవిరుద్ధస్వభావములు కలిగిన లక్ష్మీసరస్వతులను ప్రతాపరుద్రుడు సముపార్జనముచేసినాడు. ఇంకా సర్వదిశాజయనస్వభావము కలిగిన ఈనృపతి ఈలక్ష్మీసరస్వతులతో సమానముగా ఆయా స్వభావసముచితములయిన సత్కారవిశేషాలవలన సంతసించిన భూమినికూడా ధరించుతున్నాడు. వాణీలక్ష్మీభూములలో ఏమాత్రమూ సవతిపోరు లేకుండునట్లుగా ఆయా విశేషాలతో కూడుకొనిన ఉత్సవములను ఆచరించుతున్నాడు. పరస్పరవిరుద్ధస్వభావము కలిగిన వీరలకు అన్యోన్యానురాగమును కలుగజేసే చాతుర్యము వీరరుద్రునకు ఉన్నది. కాబట్టి వైదగ్ధ్యమును ఊహించాలి,

౭. ధార్మికత్వము

దర్మైకాయత్తచిత్తత్వం ధార్మికత్వ ముదీర్యతే.

ముఖ్యముగా ధర్మములోనే ఆయత్త మయిన చిత్తము కలిగిఉండుట ధార్మికత్వ మగును. ధర్మమును ఆచరించే వాడు ధార్మికుడు. ఆతనిభావము ధార్మికత్వము. ఉదా:—

పరిహాసేఽప్యనౌచిత్యం స్వప్నేఽప్యన్యవధూకథాం,
శత్రావప్యగుణారోపం కాకతీంద్రో న మృష్యతి.

కాకతీంద్రుడు పరిహాసములో నయినా అనౌచిత్యమును సహించడు. స్వప్నములోనయినా పరవధూకథను సహింప జాలడు. శత్రువుపై అయినా దోషారోపమును మన్నించ లేడు. పరిహాసాదులలో కూడా అనౌచిత్యాదికమును సహింపని కాకతివీరప్రతాపరుద్రుని ధార్మికత్వము ప్రశంసనీయము. ఈ చెప్పినవి నాయకగుణములు.

ఇప్పటికి మొదటగా ఉద్దిష్టము లయిన గుణములను నిరూపించడ మయినది. అక్కడ "ధార్మికత్వాదయో గుణాః" అని ఉన్నది. అందులోని 'ఆది' పదమువలన మహామహిమత్వము పాండిత్యము మొదలయినవానిని గ్రహించాలి.

౮. మహామహిమత్వము

తన్మహామహిమత్వం స్యాద్యా పున ర్దేవతాత్మతా,

దేవతాత్మత కలిగి ఉండుటను మహామహిమత్వమునుగా గ్రహించాలి. గొప్పసామర్థ్యము కలవాడు మహామహిముడు. ఆతనిధర్మము మహామహిమత్వము. ఉదా:—

కౌసల్యాఽస్త్వవిధమజననీ దేవకీ చ ద్వితీయా
విష్ణో ర్మాతా తదను మహితా ముమ్మడంబా తృతీయా,

య స్త్రేతాయాం రఘుపతి రభూ ద్ద్వాపరే శౌరి రాసీత్
త్రాతుం క్షోణీం స జయతి కలౌ వీరరుద్రావతారః.

శ్రీవిష్ణువునకు కౌసల్యాదేవి ప్రథమ జనని అయినది. పిమ్మట దేవకీదేవి రెండవ తల్లి అయినది. తరువాత కొనియాడదగిన ముమ్మడంబాదేవి మూడవ మాత అయినది. ఏవిష్ణుదేవుడు త్రేతాయుగములో రఘుపతి అయినాడో ద్వాపరయుగములో శ్రీకృష్ణు డయినాడో ఆతడే కలియుగములో భూమిని రక్షించడానికి వీరరుద్రావతారుడై సర్వోత్కర్షగా ఉన్నాడు. దీనిలో ప్రతాపరుద్రుడు విష్ణ్వవతారమగుటవలన దేవతాత్మత ఉన్నది. అందువలన మహామహిమత్వలక్షణము సమన్వితమవుతున్నది.

౯. పాండిత్యము

సర్వవిద్యాధికత్వం యత్ పాండిత్యం త దుదాహృతం.

సర్వవిద్యలలో ఆధిక్యము కలిగిఉండుట పాండిత్య మని అనబడుతున్నది. వేదశాస్త్రాదిజన్యజ్ఞానమునకు 'పండా' అని పేరు. పండాకలవాడు పండితుడు. పండితుని ధర్మము పాండిత్యము. ఆత్మసాక్షాత్కారము కలవాడు పండితుడని వేదాంతమర్యాద. అది ఇక్కడ గ్రహింపబడదు. వేదాంతపండితుడు ప్రపంచవిముఖుడు. ఉదా:—

గోష్ఠీభిః పరితోషయ న్బుధగణా న్షడ్దర్శనీసీమభిః
సత్సారస్వతమార్గదర్శనపరైః సూక్తైః కవీ న్ప్రీణయన్,
సంగీతోపనిషద్రహస్యపిశునై రాతోద్యయోగ్యక్రమైః
ధన్వ్యా న్సంపది వైణికా న్విహరతే శ్రీకాకతీంద్రో నృపః.

శ్రీకాకతీంద్రప్రభువుమహాసభలో పండితులు కవులు వైణికులూ మొదలయినవా రనేకు లున్నారు. వారల నంద

రిసీ ప్రతాపరుద్రుడు స్వయముగా ఆయా విద్యావిశేషములచే సంతసింపచేస్తున్నాడు. న్యాయము, వైశేషికము - సాంఖ్యము యోగము - పూర్వమీమాంస ఉత్తరమీమాంస అనేవి షడ్దర్శనాలు. ఈ ఆరుదర్శనాలనూ విషయముగా చేసి కొంటున్న శాస్త్రవ్యాసంగాలచేత పండితమండలిని ప్రతాప రుద్రుడు సంతోషపెట్టుతాడు. సత్సారస్వతమార్గమును ప్రదర్శించడములో సమర్థము లయిన సూక్తములచే కవులను సంతసింపచేస్తాడు. సంగీతోపనిషద్రహస్యములను సూచించు నటువంటి చతుర్విధవాద్యోచితపరిపాటీవిధానములచే వైణి కులను ప్రీణింపచేస్తాడు. ఇట్లా శ్రీ వీరరుద్రుడు తన సభలో విహరించుతున్నాడు. దీనిలో వీరరుద్రునకు సర్వ విద్యాధిక్యము వర్ణింపబడినందువలన పాండిత్య మున్నది. "ధార్మికత్వాదయో గుణాః" అనేచోట 'ఆది' పదముచేత మహామహిమత్వము పాండిత్యము మొదలయిన వానిని గ్రహించా లని నిర్దిష్టము. అక్కడకూడా మొదలయినవి అని ఉండడమువలన దశరూపకాదిగ్రంథాలలో ప్రతిపాదింపబడిన గుణాలనుకూడా పరిగ్రహించాలి. వినీతత్వము, మధురత్వము త్యాగము, దక్షత, ప్రియంవదత, రక్తలోకత, శౌచము, వాగ్మిత, రూఢవంశత, స్థిరత, యువత్వము, బుద్ధ్యుత్సాహ స్మృతి ప్రజ్ఞా కలా మాన యుతిత్వము, శౌర్యము, దార్ఢ్యము, తేజస్విత, శాస్త్రదృష్టి, ధార్మికత, అనేవి దశరూపకోక్తములు. వీనివీని స్వరూపాదికమును ఇతరస్థలాన చూడాలి. ఈచెప్పి నవి స్త్రీలలోనూ పురుషులలోనూ ఉండవచ్చును. ఎవరెవరిలో ఏయేగుణాలకు అవకాశము ఉంటుందో యథాసంభవముగా గ్రహించాలి. శోభ, విలాసము, మాధుర్యము, గాంభీర్యము,

ధైర్యము, స్థైర్యము, తేజస్విత, లాలిత్యము, ఔదార్యము, అనే ఈగుణాలు కేవలమూ పురుషమాత్రనియతములు. అని ఇతరగ్రంథాలలో ఉన్నవి, వీనిలో కొన్ని అయినా స్త్రీలలో ఉండకపోవు అని ఊహ కలుగుతున్నది. విస్తరభీతివలన ఆ యావిశేషాలను ఇక్కడ ఉపపాదించలేను.

నాయక స్వరూపనిరూపణము

ఇట్లా నాయగుణాలు నిరూపితము లయినవి. ఇక నాయక స్వరూపము.

యశఃప్రతాపసుభగో ధర్మకామార్థతత్పరః,
ధురంధరో గుణాఢ్యశ్చ నాయకః పరికీర్తితః,

యశఃప్రతాపములచే మనోహరుడు, ధర్మకామార్థతత్పరుడు, గుణాఢ్యుడూ అగువాడు నాయకు డని చెప్పబడుచున్నాడు. యోగ్యమయిన ప్రఖ్యాతికి యశస్సు అని పేరు. ద్రవ్యకోశసంపాదనమున యోగ్యదండధారణమువలనా కలిగే తేజస్సునకు ప్రఖ్యాతి అని పేరు. గుణములు సాధారణములు అసాధారణములూ అని రెండు రకాలు. పూర్వము చెప్పిన మహాకులీనత్వాదులు సాధారణగుణాలు. శోభావిలాసాది పౌరుషగుణములు అసాధారణాలు. ఈ సాధారణాసాధారణగుణాలతో పరిపూర్ణు డయినవాడు గుణాఢ్యు డనబడును. ఈగుణాఢ్యత్వమే నాయక సామాన్యలక్షణము. "నయతి ప్రాప్నోతీతి నాయకః" అని నాయకపదవ్యుత్పత్తి. ప్రబంధములో తనవృత్తమును వ్యాపింపచేయువాడు అని భావము. ప్రబంధమునంతనూ వ్యాపించి ఉండేవాడు నాయకుడు అని తాత్పర్యము. ఇంకా ప్రబంధములోని ఫలానికి నాయకుడు

అధికారి. ప్రధానఫలస్వామ్యము నాయకునకే ఉంటుంది. కాగా గుణాఢ్యత్వము ప్రబంధవ్యాపిత్వము ఫలస్వామిత్వమూ కలవాడు నాయకుడు అని పర్యవసితార్థము. "గుణాఢ్యశ్చ" అనే స్థలాన ఉన్న 'చ' కారమువలన ఈ అర్థమును గ్రహించవచ్చును. నాయకుడు ఉత్తముడు మధ్యముడు అధముడూ అని మూడు విధాలు. ఈ చెప్పిన సకలగుణసంపన్నుడూ, ప్రబంధవ్యాపి ఫలశిరస్కవ్యాపారుడూ అగువాడు ఉత్తమనాయకుడు. కొన్ని గుణాలు లేకపోతే మధ్యమనాయకుడు. బహుగుణహీనుడు అధమనాయకుడు.

నాయకగుణాలు చెప్పే కారికలో యశఃప్రతాపసుభగత్వము ధర్మకామార్థతత్పరత్వము ధురంధరత్వము అనేవి గుణాఢ్యపదముచేత సంగృహీతము లవుతూనే ఉన్నవి. అయినా మళ్లా వేరుగా చెప్పడము వ్యర్థమే అని తోచవచ్చును కాని ఉత్తమ మధ్యమాధమ నాయకు లందరిలోనూ ఈ చెప్పిన గుణాలు అవశ్యముగా ఉండాలని పునరుపాదాన తాత్పర్యము. ఈ యశఃప్రతాపసుభగత్వాదులు ఉన్నట్లయితే నాయకత్వానికి హాని లేదు. గుణాఢ్యపదమువలన సామాన్యగుణాలు ఉండితీరా లని నిర్దిష్ట మవుతున్నది. అందులోనూ ఈ చెప్పిన యశఃప్రతాపసుభగత్వాది విశేషగుణాలు అవశ్యముగా ఉండాలి అని బోధించడానికై పైకారిక అంతా ఆవశ్యక మవుతున్నది.

నాయకుడు యశఃప్రతాపసుభగుడగుటకు ఉదా:—

ధర్మాలంబనముచ్ఛ్రితాం త్రిభువనచ్ఛత్రైకాతపత్రశ్రియం
ధత్తే కాకతివీరరుద్రనృపతేః స్ఫారం యశోమండలం,
ధామైవాస్య నభస్థలీ త్రిభువనవ్యాపేయమారోక్ష్యతే
తన్మన్యే నియతం ప్రతాపతపనస్తస్యోపరి ద్యోతతే.

కాకతివీరరుద్రుని సమతిశయితమయిన యశోమండలము ధర్మాలంబనమువలన చక్కగా పైకి ఎత్తబడిన స్వర్గమర్త్య పాతాళలోకముల ఏకాతపత్రశోభను ధరించుచున్నది. నల్ల కలువలవలె నల్లగా ఉన్న ఈ నభస్థలము ఆ ఆతపత్రచ్ఛాయ మాదిరిగా కన్పడుతున్నది. కాబట్టి ఈ ఆతపత్రముమీద ప్రతాపతపనుడు ప్రకాశించుచున్నాడని నేను నిశ్చయముగా తలుస్తున్నాను. ప్రతాపరుద్రునికీర్తి త్రిభువనాలనూ ఉల్లంఘించి ఉన్నది. అటుపైనకూడా ప్రతాపము ప్రకాశించుచున్నది. సూర్యాదులు ఛత్రాధఃఖచిత మణిగణాలవలె ఉన్నారు. ఈతని కీర్తి ప్రతాపములు చంద్ర సూర్యాధికములు. అని వ్యంగ్యము, సమన్వయము సులభము.

ధర్మకామార్థతత్పరత్వమునకు ఉదా:—

ధర్మోऽర్థ ఇవ పూర్ణశ్రీ రర్థో ధర్మ ఇవ స్థితః
కామ స్తా వివ తౌ కామ ఇవ రుద్రనరేశ్వరే.

రుద్రనరేశ్వరునియందు ధర్మము అర్థమువలె పూర్ణ శ్రీకమై ఉన్నది. అర్థము ధర్మమువలె పూర్ణశోభతో ఉన్నది. కామము ధర్మార్థములవలె ఉన్నది. ధర్మార్థ ములు కామమువలె ఉన్నవి. దీనిలో ధర్మార్థకామములు మూడూ పరస్పరమూ సదృశములై ఉన్నవి. వానిలో ఏమాత్రమూ తారతమ్యము లేదు. అని గోచరమవుతున్నది. ప్రతాపరుద్రుడు మూడింటిలోనూ సమభావము కలిగి ఉన్నా డని భావము.

ధురంధరత్వమునకు ఉదా:—

గాయంతీ రనుమోదతే నిజవధూ శ్శేషః శిరఃకంపనైః
లక్ష్మీం ప్రీణయతేద్య కచ్ఛపపతి ర్వక్షఃస్థలీదర్శనాత్,

దిఙ్నాగాశ్చ కరేణుకాశ్చ ముపాకుర్వం త్యనుప్రజ్యయా
దోష్ణా కాకతివీరరుద్రనృపతౌ విశ్వంభరాం బిభ్రతి.

వీరరుద్రనృపతి బాహువుచే విశ్వంభరను రక్షించువాడు కాగా ఆదిశేషునకు, ఆదికూర్మమునకూ, దిగ్గజాలకూ భూభరణభారము తగ్గినది. శేషుడు గానముచేస్తూ ఉన్నతన భార్యలను శిరఃకంపనాలతో అభినందించుతున్నాడు. శేషాంగనలు తమ భర్తృ భారావతరణ సంతోషభరాన వీరరుద్రుని కీర్తిని గానించుతున్నారు. శేషుడు ఇదివరలో శిరస్సుపై భారము ఉండడమువలన కంపనము చేయడానికి వీలు కలుగలేదు. ఇప్పుడా భారము లేదు. కచ్ఛపపతి (ఆదికూర్మము) ఆలింగనానికై వక్షఃస్థలీదర్శనమున లక్ష్మీదేవిని ప్రీణింపచేస్తున్నాడు. ఇదివరలో భారాతిశయమువలన ఉరమును చూపడానికి అవకాశము లేదు. లక్ష్మికూడా ఆలింగన విధురగా ఉండేది. దిగ్గజాలు అనుప్రజనముతో తమ కరేణుకా దుఃఖమును పోగొట్టుతున్నవి. ఇదివరలో నిత్యమూ భూభరణవ్యగ్రములై ఉండడమువలన రమణానికై వెళ్ళడానికి అవకాశము లేదు. ఇప్పుడు రతిమనస్కములై విప్రలంభవ్యథా ఖిన్నత కలిగిన ఆడఏనుగులను అనుసరించుతున్నవి. శేషాదులు భూమిని వహించుతారు. కచ్ఛపపతి శేషాదులను వహించుతాడు. శేషాదిభరణీయ విశ్వంభరను వీరరుద్రుడు భుజాన భరించుతున్నందువలన ధురంధరత్వమును ఊహించాలి.

గుణాఢ్యత్వమునకు ఉదా:—

ముఖై స్సహస్రేణ ఫణీ వదేచ్ఛేత్ కరై స్సహస్రేణ లిఖే ద్వివస్వాన్,
నేత్రై స్సహస్రేణ హరిశ్చ పశ్యేత్ స్థానే గుణా న్కాకతివీరభర్తుః.

కాకతివీరప్రభుగుణాలను ఆదిశేషుడు ముఖసహస్రాన పలికేటట్లయితే, సూర్యుడు కరసహస్రముతో లిఖించేటట్లయితే, దేవేంద్రుడు నేత్రసహస్రముతో చూచేటట్లయితే, సమంజసముగా ఉంటుంది. ఒకడు పలుకుట, వేరొకడు వ్రాయుట, ఇంకొకడు చూచుట, అనే సరసత దీనిలో ఉన్నది. శేషాదులే ఆయాకర్మలలో సమర్థులు. వీరరుద్రుని గుణాలు అసంఖ్యేయముగా ఉన్నవికదా! సమన్వయము స్పష్టము.

నాయకవిశేషములు

ధీరోదాత్తాది నాయకులు నలుగురు. వీరు సర్వరససాధారణులు. వీరే శృంగారాశ్రయముగా ఉన్నప్పుడు అనుకూలాదిభేదమున నాలుగు నాలుగు భేదములు కలవారవుతారు. కాగా షోడశభేదములు సిద్ధించును. వీరికి ఉత్తమ మధ్యమాధమ భేదము ఉన్నది. అప్పుడు ౪౮ భేదాలు. ఇంకా ఈ విషయములో భేదప్రభేదాలను ఇతరగ్రంథాలలో గ్రహించాలి.

> ఉదాత్త ఉద్ధతశ్చైవ లలితశ్శాన్త ఇత్యపి,
> ధీరపూర్వా ఇమే పూర్వైః శ్చత్వారో నాయకాః స్మృతాః,

ధీరశబ్దము పూర్వమందున్న ఉదాత్తోద్ధత లలిత శాంతులనే నాయకులు నలుగురు అని పూర్వులు స్మరించుచున్నారు. కాగా ధీరోదాత్తుడు ధీరోద్ధతుడు ధీరలలితుడు ధీరశాంతుడూ అని నాయకులు నలుగురు. అని భావము. వీరు నలుగురూ సర్వరససాధారణులు.

ఈ నాయకులలోని ఉదాత్తత్వము ఉద్ధతత్వము లలితత్వము శాంతత్వమూ అనేవి జాతివాచకాలు కావు. ఒకేగోవులో ఉండే వత్సత్వ వృషభత్వ మహోక్షత్వాల మాదిరిగా

అవస్థావాచకములె. మహావీరచరితాదిగ్రంథాలలో భవభూతి మొదలయిన మహాకవులు ఒకే నాయకునకు ఈ నాలుగు భేదాలనూ నిరూపించారు. ఉదాత్తత్వాదులు జాతివాచకములె అయితే ఆవిధముగా భేదచతుష్టయమును చెప్పడము అసంగత మవుతుంది. జాతి అనపాయి. అది ఒకప్పుడు ఉండి వేరొకప్పుడు పోయేది కాదు. గోవులోని గోత్వము జాతి. అది గోవ్యక్తి ఉన్నంతవరకూ గోవులో ఉంటుంది. మరణాంతమూ ఉంటుం దన్నమాట. మధ్యలో మారదు. అట్లాగే ఉదాత్తత్వాదులూనూ కావాలి కదా! ఒక ప్రబంధములో ఒకనికి మొదట ఉదాత్తత్వమును చెప్పేటట్లయితే ఆ ప్రబంధాంతమూ ఆతనికి ఉదాత్తత్వమునే చెప్పాలి. కాని అట్లా లేదు. పరశురాముడు ఉదాత్తుడుగా ఉద్ధతుడుగా శాంతుడుగా కూడా నిరూపితు డయినాడు. అది అసంగతమే కావలసి వస్తుంది. కాబట్టి అవి వత్సత్వాదులవలె అవస్థావాచకములని గ్రహించాలి. ఈవిషయము దశరూపకములో నిరూపిత మయింది. ఇది తగిన ప్రసంగము కాబట్టి ఇక్కడ కూడా అనూదితము. ఈ ధీరోదాత్తాదుల స్వరూపోదాహరణము లను ఈవిధముగా గ్రహించాలి.

ధీరోదాత్తుడు

మహాసత్త్వోఽతిగంభీరః కృపావా నవికత్థనః
ప్రతాపరుద్రవ ద్ధీరో ధీరోదాత్త స్స సమ్మతః.

మహాసత్త్వుడు అతిగంభీరుడు దయాసహితుడు ఆత్మశ్లాఘాపరత్వము లేనివాడూ ప్రతాపరుద్రునివలె ధీరు డయినవాడూ ధీరోదాత్తు డగును. క్రోధాదులు ఎంతగా కలిగినా అంతఃకరణము అవశము కాకుండా ఉండడమును మహాసత్త్వత

అంటారు. మహాసత్త్వుడే ధీరుడని కొందరి భావము. ఇక్కడ ధీరమహాసత్త్వపదాలకు పునరుక్తి లేకుండా ఉండడానికై ధీరుడంటే తన ప్రయత్నమునుండి చలింపనివాడు స్థిరుడు శాస్త్రైక చక్షువు అనే అర్థాన్ని గ్రహించాలి. ఎంతగా చిత్తవికారము కలుగుతున్నప్పటికి నిభాళించుకొని సావష్టంభముగా ఉండేవాడు గంభీరుడు. ఇతరులదుఃఖాలను పోగొట్టాలని తలచేవాడు దయాసహితుడు. ఇతరపదార్థాలు స్పష్టమే. సర్వోత్కర్షగా ఉండడము ఔదాత్త్య మని ఫలితార్థము. ఈలక్షణములో కొన్ని సామాన్యగుణాలు ఉన్నవి. విశేషలక్షణములో సామాన్యగుణాలను చెప్ప నవసరము లేదు. అయినా అవి ఆవశ్యకములు, అని సూచించడానికై ఉపాదానము ఆవశ్యకమే ఉదా:—

సందిగ్ధే కృపయా మృదుః క్షణ మరీన్ హన్తుం ధృతాసిః పురః
శౌర్యశ్రీప్రణయప్రశంసిషు నమద్భ్రూర్లజ్జతే వందిషు,
ఆకారాన్ సుఖరోషహర్షపిశునా న్వక్త్రేన ధత్తే మనాక్
త్రైలోక్యాతిశయాళుకీర్తిసుభగ శ్శ్రీవీర రుద్రో నృపః.

మూడు లోకాలనూ అతిశయించే స్వభావము కలిగిన కీర్తిచే మనోహరుడైన వీరరుద్రభూపతి యుద్ధభూమిలో ఎదుట శత్రువులను తునుమాడడానికి ఖడ్గమును ధరించి కూడా కృపామృదులహృదయుడై క్షణకాలము సందేహించుతాడు. స్తోత్రపాఠకులు తన శౌర్యశ్రీప్రణయమును ప్రశంసించేటప్పుడు నతభ్రూవిలాసుడై లజ్జపడుతాడు. సుఖరోషహర్షాలను సూచించే ఆకారములను కొంచెముగా నయినా ముఖాన ధరించడు. దీనిలో ఉదాత్తలక్షణ సమన్వయము స్పష్టము. ఇక్కడ నాయకునకు స్థైర్యము ధార్మికత్వము కీర్తి సుభగ

త్వమూ అనే సాధారణగుణాలు కృపాదివిశేషగుణాలూ నిర్దిష్టము లయినవి.

ధీరోద్ధతుడు

దర్పమాత్సర్యభూయిష్ఠః చండవృత్తి ర్వికత్థనః
మాయావీ సులభక్రోధః స ధీరోద్ధత ఉచ్యతే.

దర్పమాత్సర్యములు అధికముగా కలవాడూ రౌద్రుడూ ఆత్మశ్లాఘాపరుడూ మంత్రాదిబలముచేత లేనివస్తువులను చూపించే మాయావీ వంచకుడూ సులభకోపుడూ అయిన వాడు ధీరోద్ధతుడవుతాడు. ఉదా:—

రే! రే! ఘూర్జర! జర్జరోఽసి సమరే, లంపాక! కిం కంపసే?
వంగ! త్వంగసి కిం? ముధా బలరజః కాణోఽసి కిం కోంకణ?
బాణ! ప్రాణపరాయణో భవ మహారాష్ట్ర! పరాష్ట్రోఽస్యమీ
యోద్ధారో వయ మిత్యరీ నధిభవం త్యంధ్రక్షమాభృద్భటాః

ఆంధ్రభూమీ పతిభటులు మేమె యోద్ధలము అని శత్రువులను నానావిధాల అభిభవించుతున్నారు. వారితిరస్కార వాక్యములు ఈవిధాన ఉన్నవి. ఓరోరీ! ఘూర్జరా! జర్ఝరుడ వయినావు. ఓరీ! లంపాకా! యుద్ధములో కంపించుతావేమి? ఓరీ! వంగదేశీయా! కంపించుతున్నావె! ఓరోరీ! కోంకణా! వ్యర్థముగా బలపరాగాంధుడ వయినావు. ఓరీ! బాణా! ప్రాణరక్షణ పరాయణుడవు కమ్ము. ఓరీ! మహారాష్ట్రా! నీరాష్ట్రము నీకు కాకుండా పోయినదిలె! దీనిలో భటుల ఆత్మశ్లాఘ దర్పమాత్సర్యాదులూ స్పష్టములు.

ధీరలలితుడు

నిశ్చింతో ధీరలలితః కలాసక్తః సుఖీ కభూః

చింతావిరహితుడూ నృత్యగీతానేకకళలయం దాసక్తుడు నిత్యమూ భోగప్రవణుడూ అగువాడు ధీరలలితుడు. ఈతని ఆకారము సుకుమారము. ఉదా:—

శౌర్యోష్మా నిరవగ్రహః ప్రతినృపాః సర్వేఽపి నమ్రీకృతాః
పాతివ్రత్యముపైతి భూ రియ మయం నాథ స్స్వయంభూ శ్శివః
ధీరోఽయం యువరాజ ఏవ వహతి శ్రీవీరరుద్రో ధురం
సర్వా మి త్యను మోదతే ప్రతికలం శ్రీకాకతీంద్రో నృపః.

వీరరుద్రకుల జ్యేష్ఠుడయిన శ్రీ కాకతీంద్రనృపుడు నిరతమూ ఆమోదమును అనుభవించుతున్నాడు. ఆతని అభిప్రాయము ఈవిధముగా ఉన్నది. ప్రతాపరుద్రుని శౌర్యాతిశయము అడ్డు లేనిదై ఉన్నది. శత్రునృపతు లందరూ నమ్రీకృతు లయినారు. ఈభూమి పాతివ్రత్యమును పొందుతున్నది. ఈ స్వయంభూశివుడు లోకాధినాథుడై ఉన్నాడు. యువరాజయిన శ్రీవీరరుద్రుడు ధీరుడు. ఆతడే ఈ భారము నంతనూ వహించుతున్నాడు. ఇంకా కావలసినది ఏమి? ఈవిధముగా వీరరుద్రకుల జ్యేష్ఠుని లాలిత్యమును ఊహించాలి.

ధీరశాంతుడు

ధీర శ్శాన్తః ప్రసన్నాత్మా ధీరశాంతో ద్విజాదికః

ధీరుడు శాంతుడు ప్రసన్నమనస్కుడూ అయినవాడు ధీరశాంతు డనే నాయకుడు. చక్కని వివేచనాపటిమ కలిగి క్లేశములను సహించేవాడై శమప్రధానుడై హృష్టాంతః కరణుడై ఉండేవాడే ధీరశాంతుడు. ధీరశాంతు డయ్యేవాడు బ్రాహ్మణుడుకాని వైశ్యుడుకాని కావాలి. తదితరులు ధీర శాంతులు కాదగరు, అనే నిషేధమును ఇక్కడ గ్రహించాలి. ధీరత్వ శాంతత్వాదులు ఉన్నప్పటికీ క్షత్రియులకు ధీరలలి

తత్వమె. సామాన్యగుణయుక్తులయిన ద్విజాదులు ధీరశాంతులవుతా రని కొందరిభావము. ఉదా;—

వీరం రుద్రనృపాలరత్న మభితః ప్రాప్తోదయం మోదతే
సంఖ్యావద్గణ ఏష పూషణ మివ ప్రత్యగ్ర మబ్జాకరః
ఉన్మీలత్కమలావిహారవసతి ర్భూత్వా వికాసై ర్నిజైః
విశ్వామోద ముదంచయ న్నవిరతం దోషావసానోత్సుకః

ఈ పద్యానికి రెం డర్థా లున్నవి. వానిలో మొదటిఅర్థము ఈ పండితమండలి అంతటా అభ్యుదయము పొందిన నూతనుడగు వీరరుద్రనృపాలరత్నమును చూచి తామరకొలను సూర్యుని చూచి అనుమోదించినట్లుగా అనుమోదించుచున్నది. సముల్లసించుచున్న శ్రీలక్ష్మీదేవికి విహారవసతి అయినది. తమ ఉత్సవాదివికాసములచే నిత్యమూ ప్రపంచామోదమును అతిశయింపజేస్తున్నది. తమయందు దోషాలు లేనందువలన ఉత్సుకమై ఉన్నది. ఇటువంటి ఈ అర్థములోనే బ్రాహ్మణుల ధీరశాంతత్వమును ఊహించాలి.

“పూషణ మివ అబ్జాకరః” తామరకొలను సూర్యునివలె అని ఉపమాలంకారము. అక్కడ సరః సూర్యపక్షములో భావమును ఈవిధముగా గ్రహించాలి. సూర్యుడు అంతటా ఉదయము పొంది ఉన్నాడు. నూతనుడు. సూర్యోదయములో అబ్జాకరము (సరస్సు) వికసించుకమలాలకు విహారవసతి అయినది. స్వీయవికాసములచే నిత్యమూ ప్రపంచానికి పరిమళభాగ్యమును అతిశయితము చేస్తున్నది. రాత్రి గడిచి పోవడముచేత ఉత్సుకమై ఉన్నది, అని,

శృంగారనాయకులు

ధీరోదాత్తాదులు సర్వరససాధారణులు. కేవలమూ శృంగారరసానికి అసాధారణు లయిన నాయకులు ఇక్కడ నిరూపింపబడుతున్నారు. ధీరోదాత్తాద్యుదాహరణములను చూచినట్లయితే వారు ఒక్కొక్క రసానికె అసాధారణులుగా కన్పడుతున్నారు. ధీరోదాత్తుడు వీరానికి ధీరోద్ధతుడు రౌద్రానికీ, ధీరలలితుడు శృంగారరసానికీ, ధీరశాంతుడు శాంతరసానికీ, సంబంధించినట్లుగా ఉన్నది. వారు సర్వరససాధారణులె అయినా వారివారి విశేషలక్షణానుసారముగా ఉదాహరణములు ఆవిధముగా ప్రదర్శింపబడిన వని గ్రహించాలి. శృంగారరసము విషయముగా కల నాయకులు నలుగు రున్నారు. అనుకూలుడు దక్షిణుడు ధృష్టుడు శఠుడూ అని వారి పేర్లు. వీరిస్వరూపోదాహరణములను ఈ విధముగా తెలియవచ్చును.

> ఏకాయత్తోఽనుకూలః స్యాత్తుల్యోఽనేకత్ర దక్షిణః
> వ్యక్తాగా గతభీ ర్ధృష్టః గూఢవిప్రియకృ చ్ఛఠః.

ఒకే నాయికయందు అనురక్తుడై ఉండేవాడు అనుకూలుడు. అనేకనాయికలందు సమానముగా ఉండేవాడు దక్షిణుడు. అపరాధము వ్యక్త మయినా భయము లేనివాడు ధృష్టుడు. గూఢముగా అపరాధము చేసేవాడు శఠుడు.

అనుకూలుడు

అనేక నాయికలున్నప్పటికీ గుణోత్తర అయిన ఒకే నాయికయందు విశేషముగా అనురక్తుడగువాడు అనుకూలనాయకుడు. విద్యానాథుడు ఈ అభిప్రాయానుసారముగానే ఉదాహరణ మిస్తున్నాడు. శ్రీరామాదులవలె ఏకజాని అయినవాడె అనుకూలు డని కొందరిభావము. ఉదా:—

కిం నామాచరితం తపః సఖి! భువా యస్యాః పతి ర్గీయతే
వీరో రుద్రనృపః క్వ తత్సుచరితం ? తస్య ప్రియా స్యాం యతః,
జానే మానిని ! మా విషీద పురతః ప్రఖ్యాప్య నామ స్థిరాం,
త్వాం రత్నాకరమేఖలాం త్వయి సదా సక్తం విధాస్యే నృపం.

ఈ శ్లోకములో పూర్వార్ధము నాయికావాక్యము. ఉత్తరార్ధము సఖీవాక్యము. సఖీ ! భూమి అనునామె ఏమి తపస్సు చేసినదో కదా ? ఆమెపతిని అందరూ "వీరుడు రుద్రనృపతి" అని గానము చేస్తున్నారు. ఆభూమిసుచరితము ఎక్కడిదో! నేను ఆవీరరుద్రనృపతికి ఎట్లా ప్రియురాలను కాగలుగుతానో కదా ! ఏ సుచరిత్రమును ఆచరించితే అతడు ప్రియుడవుతాడో ! (ఇటుపైన సఖి చెప్పుతున్నది) చెలీ ! నాయకఘటనోపాయమును నేను ఎరుగుదునులే. ఓమానినీ ! విషాదపడవద్దు. నిన్ను ఆతనిఎదుట ప్రఖ్యాపించుతాను. ఈమె స్థిర రత్నాకరమేఖల. అని చెప్పుతాను. నీపైన నృపుడు సదా ఆసక్తుడు అయ్యేటట్లు చేస్తాను. నీయందు ఆతనికి అనురాగము కలగడానికై [సపత్నీనామసామ్యముతో నిన్ను ప్రకటము చేస్తాను. ఆతడు నీమీద అనురాగి అవుతాడు. ఈపద్యములో ప్రతాపరుద్రునకు భూమిపైన విశేషానురాగము ఉన్నదని వ్యక్తమవుతున్నది. వధువు స్థిర రత్నాకరమేఖల అని భూమినామగ్రహణమున స్నేహము ప్రఖ్యాపిత మవుతున్నది. స్థిరముగా ఉండేది స్థిర. భూమి స్థిరముగా ఉండేది కాబట్టి స్థిర. స్థిరానురాగము కలవ్యక్తినికూడా స్థిర అనవచ్చు. అందువలన నాయికకూడా స్థిర. రత్నాకరములు - సముద్రములు మేఖల - మొలనూలు. సముద్రములు మొలనూలుగా కలది భూమి. రత్నములకు ఆకర మయిన మేఖల కల్గి

యువతి రత్నాకరమేఖల. దీనిలో నాయిక రత్నాకరమేఖల. పై లక్షణానుసారముగా అనేకనాయిక లున్నప్పటికీ నాయకుడు భూమిపై విశేషానురాగము కలవాడుగా వర్ణింపబడినందువలన అనుకూలత ఉన్నది.

దక్షిణుడు

అనేకనాయికలందు వైషమ్యము లేకుండా స్నేహముతో అనువర్తనము చేసే నాయకుడు దక్షిణు డవుతాడు. ఇక్కడ ఈవిషయమును తెలియవలసిఉన్నది. ఒకయువతి అనేకపురుషులందు ఆసక్తురాలై ఉన్నట్లయితే రసాభాస అవుతుం దని రసప్రకరణములో చెప్పబడనున్నది. బహుసక్తి ఉన్నప్పుడు సమానానురాగఫలము కలుగదు. విభావాదుల పరిపూర్తి ఉండదు. అప్పుడు రసీభావము సిద్ధము కాదు. యువతికి బహుసక్తి ఉంటే రసాభాస అయినట్లు పురుషునకు అనేకానురాగము ఉన్నట్లయితే రసాభాసమే ఉండాలికాదా ? ఈవిధముగానే కొందరు అంగీకరించుతున్నారు. అప్పుడు దక్షిణనాయకానురాగములో రసత్వము ఉండదు. అదికూడా ఆభాసమే అవుతుంది. కాగా రసనాయకులలో దక్షిణనాయకుని చెప్పడము అసంగతమె అవుతుంచె! ఆతనిని రసాభాసనాయకునిగనె పరిగణించాలికదా ? రసనాయకునిగా చెప్పడము ఎట్లా ఉపపన్న మవుతుంది ? అని శంక.

సమాధానము— దక్షిణనాయకునకు ఒకేనాయికయందు గాఢానురాగము ఉంటుంది. ఇతరనాయికలలో అట్లా కాదు. ఒకనాయికపైన మధ్యమానురాగము. వేరొకనాయికపై మందానురాగము. ఇట్లాగే అనురాగము ఉండడములో తరతమభావము నిశ్చితము. "తుల్యోఽనేకత్ర దక్షిణః" అనే

దక్షిణలక్షణములో సమానానురాగవత్త్వము ప్రతిపాదింపబడడము లేదు. అక్కడ సమానానువర్తనము మాత్రమే వివక్షితము. "ఈతడు నాయందే అనురక్తుడు. నాయందే అనురక్తుడు" అని ఆయానాయికలు భావించేటట్లుగా స్నేహానువర్తి అయ్యేవాడే దక్షిణుడవుతాడు. ఈఅనువర్తనము కపటప్రధానమని శఠసామ్యమును ఊహించరాదు. ఈస్నేహానువర్తనములో విప్రియకారిత్వము ఏమీ లేదు. తత్తన్నాయికాసమక్షస్నేహానువర్తనములో అనురాగోద్రిక్తహృదయముతోనే ఆతడు ఉంటాడు. అందువలనని విభావాదులపరిపుష్టికి ఏమాత్రమూ హాని లేదు. రసత్వానికేమీ భంగము లేదు. రసాభాసతకు ప్రసక్తి లేదు. కాబట్టి దక్షిణుడు రసనాయకుడే.

యువతికూడా బహుపురుషులందు సమానానువర్తిని అయినట్లయితే రసాభాసతాప్రసక్తి ఉండదుకదా! అని శంకించవచ్చును. కాని అది ఉచితము కాదు. స్త్రీ పురుషుని తరతమభావాన పరీక్షించగలదు. అప్పుడు ఒకనియందె దృఢానుబద్ధ అవుతుంది. తదితరులలో నిష్ప్రేమ కపటప్రవృత్తిని మాత్రమే ప్రదర్శించుతుంది కాని అనురాగమయప్రవృత్తిని చూపలేదు. అందువలన విభావాదులపుష్కలత ఏర్పడదు. కాబట్టి రసాభాసమే అవుతుంది. దీనిలోని వివయవివేకమును కామశాస్త్రాదులలో విశదముగా గ్రహించవలసిందేకాని అప్రస్తుతమి నిక్కడే ఉపపాదింపము. ఉదా:—

నర్మోక్త్యైవ నిమంత్రితా స్మరకలాకేళిషు కాచి న్మయా
సాకూతేన విలోకనేన హృదయం కస్యైచి దావిష్కృతం

కస్యాశ్చి త్పరిహితః ప్రసాధనవిధిః దూతీకరేణ క్వ వా
గంతా స్మీ త్యనుచింతయైవ నృపతే రాసీ త్పరిభాతా నిశా,

స్మరకళాక్రీడలవిషయమై ఒకనాయికను సగోష్ఠీతో నిమంత్రించినాను. సాకూతవిలోకనముతో వేరొకనాయికకు నాహృదయాభిలాషమును ఆవిష్కరించినాను. దూతీహస్తముతో మరి ఒకనాయికకు స్రక్చందనాభరణాది ప్రసాధన విధిని పంపినాను. ఇప్పుడు ఎక్కడకు వెళ్ళవలెనో? అనే అను చింతనమువలన నృపాలకునకు రాత్రి తెల్లవారినది. దీనిలో నాయకునకు ముగ్గురునాయికలందూ అనురాగప్రవృత్తి సమముగా ఉన్నది కాబట్టి దక్షిణతను ఊహించాలి.

ఈ ఉదాహరణములో నాయకునకు సమానుభూతి లేదు. అందుకొరకై వేరొక ఉదా:—

వాణీం ముఖేన నేత్రాభ్యాం శ్రియం దోష్ణాచ మేదినీం,
మానయం స్తుల్యతాం ధత్తే తాసు రుద్రనరేశ్వరః.

ముఖమున వాణీదేవిని నేత్రముల శ్రీదేవిని, భుజమున భూదేవిని, సమ్మానించుచూ రుద్రనరేశ్వరుడు వాణీ శ్రీ భూములందు సామ్యమును వహించుచున్నాడు. సమన్వయము స్పష్టము.

పూర్వోదాహరణములోకూడా వ్యంగ్యముగా వాణీలక్ష్మీ వసుంధరలు సూచింపబడినారు. దీనిలో వాచ్యముగా చెప్ప బడినారు దానిలో అనువృత్తిసూచక సగోష్ఠ్యాదులు వాచ్యము లయినవి. దీనిలో ముఖాదిపదములచే వ్యంగ్యము లయినవి. ఉదాహరణద్వయములోని వాణీ శ్రీ వసుంధరలు వీరరుద్రునకు నాయికలు కాదుకదా! దాక్షిణ్యా మెట్లు? అని శంకింప నక్కర లేదు. వాణ్యాదిపదాలలోని స్త్రీలింగ

సరసతవలన ఆయానామములు కల నాయికలు గోచర మవు తున్నారు. తదభేదమును ప్రకృతములో గ్రహించినట్లయితే శృంగారనాయకత్వభంగ ప్రసంగము లేదు.

ధృష్టుడు

ప్రకృతనాయికను విడిచి నాయికాంతరసంబంధములో కలిగిన ఉపభోగచిహ్నాలవలన నాయకుని అపరాధము స్పష్ట మయి నప్పటికీ ప్రకృతనాయికాసన్నిధానములో భీతి ఏమా త్రమూ లేకుండా ఉండేవాడు ధృష్టనాయకుడు. ఉదా:—

రాజ్యశ్రీపరిభోగశంసి భవత స్సర్వాంగ మాలోక్యతే
కస్తత్రావినయోఽస్తి? సాహస మిదం తన్నామ మ య్యర్పితం
జానే త్వాం బహువల్లభం కి మపరం వక్తవ్య మల్పా వయం
తస్యాం ప్రేమ తవాధికం వసుమతీ యా నామ కిం జల్పితైః?

నీఅవయవాలన్నీ రాజ్యశ్రీపరిభోగమునుసూచించుతున్నవి ఇందులో అవినయము ఏమి ఉన్నది? ఆనాయికానామ మును నాయందు అర్పించినావు. ఇదే సాహసము. నీకు ప్రియురాండ్రు చాలామంది ఉన్నారు. నే నీ విషయమును ఎరుగుదును. ఇంకా చెప్పవలసినది ఏమి ఉన్నది? మేము అల్పులముకదా! వసుమతి అనే ఆమెపైననే నీకు ప్రేమ అధికము. మాటలవలన ప్రయోజనము ఏమున్నది లే! దీనిలో నాయకునిఅంగములు అన్యాంగనాసముపభోగమును శంస నము చేయడమువలన, వేరొకరిపేరుతో నాయికను పిలు చుట అనే గోత్రస్ఖలనము ఉండడమువలనా, నాయకుని అప రాధము నిర్భీకత్వమూ వ్యక్తములవుతున్నవి. అన్యాసంభోగ చిహ్నకుపిత అయిన ఇందలి నాయిక ఖండిత.

శ ఠు డు

ఇతరులకు తెలియకుండా ఉండేటట్లు గూఢముగా అన్య నాయికాసంగమరూపవిధానములో ఉంటూ స్వీయనాయి కను సానురాగముగా కలియకపోవుట అనే విప్రియమును ఆచరించేవాడు శఠనాయకుడు. ఈతని ఈ విప్రియము నాయి కకు మాత్రము తెలిసిఉంటుంది. ఆమెకు తెలిసినా ఇబ్బంది లేదులే! అనే ధీమాతో నాయకుడు ప్రవర్తించుతాడు. ఉదా:—

దృష్ట్యా పశ్యసి కేవలం న మనసా వాచా ప్రియం భాషసే
నో భావేన, భుజాంతరం ప్రకటయ స్యగ్రే న చాభ్యంతరం
జ్ఞాతం కాకతినాథ! భూ స్తవ పరం ప్రాణేశ్వరీ ధ్యాయతః
మాదృక్షేషు విడంబనైవ త దలం వ్యర్థై ర్బహిస్సంభ్రమైః.

కేవలమూ దృష్టితో చూస్తావు. మనసార చూడవు. కేవలము వాక్కుతో ప్రియము భాషించుతావు. అనురక్తితో మాట్లాడవు. బయటికి మాత్రము భుజాంతరమును ప్రక టించుతావు. అభ్యంతరమును వెలుపరచవుకదా! కాకతి నాథ! అంతా తెలిసిందిలే సంతతధ్యానము చేస్తూ ఉన్న నీకు భూమియె ప్రాణేశ్వరి మావంటిజనులందు కేవలమూ విడంబనమును ఆచరించుతున్నావు. చాలులె! ఈ వ్యర్థము లయిన బహిస్సంభ్రమము లేమిటె!! ఇవిమాత్రము ఎందుకు? వీనినికూడా మానివేయవచ్చు. దీనిలో నాయకుని భావ శూన్య దర్శనాదివిధానము నాయికకు మాత్రము తెలియును, నాయకుడు గూఢవిప్రియ కారి. సమన్వయము స్పష్టము

గ్రంథప్రారంభములో ప్రతాపరుద్రునే అంతటా తగుల వేస్తానని ప్రతిజ్ఞాతము: అక్కడక్కడ ఆయా నాయకవిష

యముగా కాకతీశ్వరులు ఉదాహరింపబడినారు. అయినా ఇది ప్రతిజ్ఞాభంగము కాదు. ఉదాహృతు లందరూ ప్రతాపరుద్రసంబద్ధులే కదా! అందువలన వారూ వారూ ఉదాహరింపబడినప్పటికీ వీరరుద్రునివర్ణనమె ఉన్న దని గ్రహించాలి.

స హా యు లు

శృంగార నాయకులకు నాయికాసంబంధము నియతము. నాయకులకు నాయికలను అనుకూలింపజేయడములో సహాయులు నలుగు రున్నారు. పీఠమర్దుడు, విటుడు, చేటుడు, విదూషకుడూ అని వారిపేర్లు. వీరిస్వరూపములను ఈవిధముగా తెలిసికోవాలి.

> కించిదూనః పీఠమర్ద ఏకవిద్యో విటః స్మృతః
> సంధానకుశల శ్చేటో హాస్యప్రాయో విదూషకః

ప్రధానకథానాయకునికన్న కొంత తక్కువగుణాలు కలవాడు పీఠమర్దుడు. ఈతడు ప్రాసంగికేతివృత్తములో నాయకుడుగా ఉంటాడు. ఈతనికే పతాకానాయకు డని పేరు. నాయకునకు ఉపయోగించే గీతాదివిద్యలలో ఏదో ఒక విద్యను మాత్రమె ఎరిగినయాతడు విటుడు. నాయికను సంధానింపచేయడములో కౌశలము కలవాడు చేటుడు. వేషభాషాచేష్టాదులచే హాస్యమును కలుగజేసేవాడు హాస్యమె ప్రచురముగా కలవాడు విదూషకు డవుతాడు. ఈ చెప్పినవారు నాయకునకు సంబంధించినకార్యాలలో ఏదో విధముగా ఉపయోగించేవా రవుతారు.

నా యి క

నాయిక నాయకసామాన్యగుణాలు కలిగి ఉంటుంది. ఇది నాయికాసామాన్యలక్షణము. ఇక నాయికావిశేషములను

తెలిసికోవాలి. వారిలక్షణోదాహరణములు నిరూపింపబడు తున్నవి. శృంగారనాయికలు ఎనిమిది విధములుగా ఉన్నారు. స్వాధీనపతిక, వాసకసజ్జిక, విరహోత్కంఠిత, విప్రలబ్ధ, ఖండిత, కలహాంతరిత, ప్రోషితభర్తృక, అభిసారిక, అని అష్ట విధ శృంగారనాయికల నామములు. యథాక్రమముగా వారి లక్షణములను నిరూపించుతాము.

౧ స్వా ధీ న ప తి క

ప్రియోపలాలితా నిత్యం స్వాధీనపతికా మతా

ప్రియునిచే నిత్యమూ ఉపలాలిత అయిన యువతి స్వాధీన పతిక అవుతుంది. అధీనుడు-ఆయత్తుడు తనయందు అధీనుడు స్వాధీనుడు. స్వాధీనుడగు పతి కలయామె స్వాధీనపతిక. ప్రియుడు నిత్యమూ సురతసుఖాస్వాదలుబ్ధుడై ఆసన్నుడయి నట్లయితే ఈ స్వరూపము లభించుతుంది. ఉదా:—

ప్రియాం సర్వంసహాం తైస్తై ర్విశేషై రుపలాలయన్
ప్రతాపరుద్రనృపతిః ప్రతిక్షణ మవేక్షతే.

సర్వంసహ అనే ప్రియురాలిని ప్రతాపరుద్రనృపతి వాసోంగరాగాదికము లయిన ఆయా విశేషాలచే ఉపలాల నము చేస్తూ ప్రతిక్షణమూ నిరీక్షిస్తున్నాడు. దీనిలో నాయిక ఆసన్నాయత్తరమణ కావడము వలన స్వాధీనపతిక.

౨ వాసకసజ్జిక

ప్రియాగమనవేలాయాం మండయంతీ ముహుర్ముహుః,
కేళీగృహం తథాత్మానం సా స్యా ద్వాసకసజ్జికా.

ప్రియుడు వచ్చేసమయములో కేళీగృహమునూ తననూ మాటిమాటికి మండనము చేసికొనే యువతి వాసకసజ్జిక.

నివాసభవనములో ఉపస్కరోపకరణాలతో సన్నద్ధురాలగునట్టిది అని భావము. "స్త్రీణాం వార స్తు వాసకః" అనే వచనాన్ని బట్టి వాసకపదానికి వారదిన మని కొందర ర్థము చెపుతారు. తన్మతానుసారముగా యువతి తనవంతుదివసము రాగా తననూ క్రీడామందిరమునూ హర్షముతో అలంకరించుకొనే టట్లయితే వాసకసజ్జిక అవుతుందని భావము. ఈపక్షమే విద్యానాథునకు అభిమతముగా కన్పడుతున్నది. ఉదా:—

స్వతేజసా పరిష్కృత్య ప్రధానాగార ముత్కయా,
శ్రియాఽభిషేకవేళాయాం వీరరుద్రః ప్రతీక్షితః,

వేడుకపడుతూ ఉన్న శ్రీదేవి తన తేజస్సుచే ప్రధానాగారమును అలంకరించి అభిషేకసమయములో వీరరుద్రుని నిరీక్షించుతున్నది. దీనిలో సమన్వయము విశదము.

౩ విరహోత్కంఠిత

చిరయ త్యధికం కాంతే విరహోత్కంఠితోన్మనాః

అనపరాధి అయిన కాంతుడు బాగా ఆలస్యము చేసినపుడు ఉన్మనస్క అయినయువతి విరహోత్కంఠిత. విరహమువలన ఉత్కంఠకలదిగా చేయబడిన స్త్రీఅని భావము. ఉ:-

న శంకాన్యా తాదృగ్గుణపరిమళే రుద్రనృపతౌ
కయా వా గోష్ఠ్యాసౌ చిరయతి? సఖీభి ర్న సులభః,
సమానేతుం, కాంతం వ్రజ! మదన! బద్ధోఽంజలి రయం
యతో విష్వద్రీచః కిరతి కిరణాన్ త్వత్ప్రియసఖః.

నానావిధగుణములచే పరిమళించుతున్న రుద్రనృపతి ఉత్తముడు. ఆతడు నాయికాంతరాసక్తుడై ఉంటాడు అనే శంక లేదు. ఏవిద్యాగోష్ఠితో విలంబనము చేస్తున్నాడో! చెలి

కత్తెలను పంపింతునా? వారలు ఆతని తీసుకొని రావడానికి సామర్థ్యముకలవారు కారు. ఆత డట్లు సులభుడు కాడు. ఓ మదనా! ఇదిగో! నీకు అంజలి ఘటించితిని. నానాయకుని తీసికొని రావడానికై వెడలుము. చూచితివికదా! నీప్రియ సఖుడు చంద్రుడు అంతటా ప్రసరించేటట్లు తనకిరణాలను వెదజల్లుతున్నాడు. దీనిలో నాయిక విరహాతుర అయి ఉత్కంఠిత అయినది. ప్రియుడు ఎపుడువస్తాడో? ఎట్లా వస్తాడో? అని వేదన పడుతున్నది.

౪ విప్రలబ్ధ

క్వచి త్సంకేత మావేద్య దయితేనాద వంచితా
స్మరార్తా విప్రలబ్ధేతి కళావిద్భిః ప్రకీర్త్యతే.

ఒకచోట సంకేతభూమిని ఏర్పాటుచేసి అనుకొన్నట్లుగా చెప్పినట్లుగా రాక ప్రియుడు వంచనచేయగా మన్మథపీడిత అయిన యువతి విప్రలబ్ధ అని కళావిదులు పలుకుతున్నారు. విప్రలంభము-వంచనము. వంచితయువతి విప్రలబ్ధ అని భావము. ఉదా:—

గచ్ఛాగ్రేసఖి! కా ప్రియాగమకథా? ప్రాప్తోనిశీథః పరం
సంకేతాలయ! మోక్ష్యసే మమ వృధా జాతోశ్రుభిః పంకిలః
యద్వా రుద్రనరేశ్వరే ప్రియతమే రాజ్య శ్రియో వల్లభే
భారత్యా, దయితే భువః కృతపదాః ప్రాయో వయం వంచితాః

సఖీ! ముందు నడువుము, దారితీయుము, ఇంకా ప్రియుడు వస్తా డన్న కథ ఏమి ఉన్నది? నిశీథమె-అర్ధరాత్రమే ప్రాప్తమయినది. కాని ప్రియుడురాలేదు, ఓసంకేతాలయమా! విడువలేక విడువలేక నిన్ను విడుచుచున్నాను. వ్యర్థము గా నాకన్నీటిచేపంకిలమయినావుకదా! మాయుభయులసమాగమ

శ్రమజలములచే పంకిలము కాకపోయితివికదా! ఉద్ర
న రేశ్వరుడు రాజ్యశ్రీప్రియతముడు. భారతీవల్లభుడు భూ
దయితుడు. బహువల్లభుని ప్రేమించుట తగదు. తెలియక మన
మట్లు చేసితిమి. వంచితల మైనాము. దీనిలో నాయిక దయిత
వంచితయై కామాతుర అగుటవలన విప్రలబ్ధ అని గ్రహింప
వలెను.

౫ ఖండిత

నీత్వాన్యత్ర నిశాం ప్రాత రాగతే ప్రాణవల్లభే,
అన్యాసంభోగచిహ్నై స్తు కుపితా ఖండితా మతా.

ప్రాణవల్లభుడు అన్యనాయికాసమీపములో నిశ నంతనూ గడిపి ప్రాతఃకాలమునరాగా ఆతనిశరీరముపైన అన్యాసంభోగ చిహ్నలను చూచి కుపిత అయిన నాయిక ఖండిత అవుతుంది. ఖండిత అనే పదము ఇటువంటి నాయికావిషయమై పారి భాషికము. ఉదా:—

రాత్రి ర్యామత్రయపరిమితా వల్లభా స్తే సహస్రం
మార్గాసక్త్యా మమ గృహ మపి ప్రాత రేవాగతోసి,
కిం కర్తవ్యం ? వద !నృపతిభిః వీక్షణీయాహి సర్వాః
కోవా దోష స్తవ ? పున రహం కామ మాయాసయిత్రీ.

మొదటి చివరి అరజాములకు రాత్రిగా పరిగణనము లేదు. కాబట్టి రాత్రి మూడు జాములు పరిమితి కలది. నీకు వల్ల భలు సహస్ర మున్నారు. మార్గాసక్తిచే నాగృహానికికూడా ప్రాతఃకాలముననె వచ్చినావు. ఇంకనూ చేయవలయునది ఏమి ఉన్నది ? చెప్పుము. ప్రభువులు అందరిని చూడవలసినదే కదా ! ఇందు నీదోష మేమున్నది ? పాపము నేనే నిన్ను మిక్కిలి ఆయాసపెట్టితిని. రాత్రినంతా ఇతరనాయికాభవన

ములో గడిపి ప్రాతస్సమయమున వచ్చినప్రియుని చూచి నాయిక ఈసడింపుతో ఈవిధముగా పలుకుతున్నది. సమన్వయము స్పష్టము. నాయకుడు ధృష్టుడు.

౬ కలహాంతరిత

కోపా త్ప్రియం పరాణుద్య పశ్చా త్తాపసమన్వితా,
కలహాన్తరితా నామ సూరిభిః పరికీర్తితా,

ప్రణామాదివిధానమున ప్రసన్నతను సంపాదించా లని తలచునాయకుని మొదట కోపాన తిరస్కరించి అనంతరము పశ్చాత్తాపమువలన ఖిన్నయగు నాయిక కలహాంతరిత అవుతుంది. కలహముతో కూడుకొన్నది కావడమువలన ఈ నామము సార్థకము. ఉదా:—

తథా తథా అనునయ ఞ్ప్రియ స్త్వయా హృదయ! రోషకలుషేణ,
అవధీరితో న జ్ఞాతో రాజేతి వియోగవేదనాం సహస్వ!

ఆయావిధముగా ప్రణామాదులచే అనునయము ఒనర్చుతూ ఉన్న ప్రియుని అవధీరణము (తిరస్కారము) చేసినావుకదా! ఆతడు రాజు అని అయినా తెలుసుకొనలేకపోయితివె! హృదయమా? ఇప్పు డిక ఏమి లాభము? వియోగవేదనను సహింపుము. అది తప్పదు. దీనిలో నాయకుడు క్రుద్ధానునయకోవిదుడు. కామతంత్రనిపుణుడు. నాయిక మొదట నాయకుని తిరస్కరించి ఈవిధముగా అంటున్నది. నాయికాను రాగము ప్రణయకలహముచే అంతరితమై ఉన్నది కాబట్టి నాయిక కలహాంతరిత.

౭ ప్రోషితభర్తృక

దేశాంతరగతే కాంతే ఖిన్నా ప్రోషితభర్తృకా.

కాంతుడు దేశాంతరగతు డయినప్పుడు ఖిన్నురా లయిన

నాయిక ప్రోషితభర్తృక అవుతుంది. ప్రోషితుడు—ప్రవాసము పొందినవాడు. అట్టిభర్త కలది ప్రోషితభర్తృక. ఉదా:—

త్రైలోక్యప్రథమానకీర్తిమహసః శ్రీవీరరుద్రప్రభోః
సేవార్థం చిరయత్సు కాకతిపురే భూపేషు తద్యోషితః
ద్వారాసక్తదృశో నయంతి దివసాన్ వ్యుష్ట్యాశయా చ క్షపాః
తద్ధ్యానప్రతిబద్ధసాంద్రపులకవ్యాకీర్ణకామేషవః.

మూడు లోకములలో ప్రఖ్యాత మయిన కీర్తి ప్రతాపములు కల శ్రీవీరరుద్రప్రభువు సేవకై సామంతరాజులు కాకతిపట్టణమున విలంబ మొనరించుచుండగా వారి కాంతలు ద్వారదేశములలో దృష్టు లుంచి పగటిసమయములను గడపుచున్నారు. ప్రభాత మవుతుంది అనే ఆశతో రాత్రులను గడపుతున్నారు. నిరతము ప్రియచింతనమువలన వారలకు దట్టముగా పులకలు ప్రరూఢము లవుతున్నవి. ఆ పులకలె కీలితకామబాణము లయినవి. దీనిలో నాయికలప్రియులు దూరదేశాన ఉన్నారు. నాయికలు విరహిణులై వ్యథపడుతున్నారు, ప్రజాగరాదికమున వారిఖేదము వ్యక్త మవుతున్నది. కాబట్టి నాయికలు ప్రోషితభర్తృక లనడము సముచితము.

౮ అభిసారిక

కాంతాభిసరణోద్యుక్తా స్మరార్తా సాభిసారికా

మన్మథార్తయై కాంతునిగురించి అభిసరించడములో ఉద్యుక్తురా లయిన యువతి అభిసారిక అవుతుంది. కాంతుడే అభిసరించేటట్లుగా చేసే నాయికకూడా అభిసారికయే. అభిసరించేది అభిసరింపచేసేదీ అభిసారికే అని అనేకులు అంగీకరిస్తున్నారు. దూతికలను పంపి కాంతుని అభిసరింపచేయు

వచ్చును. ఒకరిపైకె వేరొకరు అభిముఖముగా సరించుట-గమిం చుట అభిసరణము. అది కలది అభిసారిక. ఉదా:—

సంభ్రమైరల మల్పజ్ఞే! ప్రేయా నస్తు మహీపతిః
కరేణుస్థాం న పశ్యామి న శ్రుణో మ్యభిసారికాం.

నే నిప్పుడు కాంతుని అభిసరింపబోతున్నాను. కరేణుకను తీసికొని రమ్ము అని నాయిక పలుకగా ఇది దూతీసమాధాన వచనము. మహీపతి ప్రియుడవుగావుత. ఓసి అల్పజ్ఞా! సంభ్రమములు చాలులె! అభిసారిక గజముపై వెళ్ళడమును నేను చూడనూ లేదు. విననూ లేను. ఇది యేమిటి? ఎవరయినా ఏనుగుపైన ఎక్కి అభిసరించుతారా? ఈపద్యములో కాంతుని గురించి అభిసరించడమె ఉన్నది.

సహాయులు

ఈ చెప్పిననాయికలకు నాయకులను అనుకూలింపజేయడములో సహాయమొనర్చుస్త్రీలు వేరువేరుగా ఉన్నారు. దాసి, సఖి, చేటి, ధాత్రేయి, ప్రాతివేశిని, లింగిని, శిల్పిని, తాను, అనే వీరు నాయకానుకూల్యసంపాదనములో సహాయులు. తనభవనములో ఆయా కర్మలను చేసేది దాసి, స్నేహము కారణముగా సహాయపడుచెలికత్తె సఖి, చేటునిస్త్రీ చేటి. పాలిచ్చి పెంచిన ఉపమాతకూతురు ధాత్రేయి. సమీపగృహములో ఉండే యువతి ప్రాతివేశిని. సన్యాసము స్వీకరించినస్త్రీ లింగిని. చిత్రకారాదులయువతి శిల్పిని. తానే మారువేషముతో దౌత్యము చేయుటకూడా ఉన్నది. "లింగినీ శిల్పిని స్వా చ సహాయాః పరికీర్తితాః" అనె మూలములో ఉన్న స్వా పదమునకు బాంధవస్త్రీ అని అర్థము చెప్పడము ఉచితము. కాగా చెల్లెలు ఆడబిడ్డ మేనమామ

కూతురు ఈ మొదలయిన బాంధవస్త్రీలు ఇక్కడ గ్రహింప తగి ఉన్నారు. వీరిస్వరూపోదాహరణములు స్పష్టములె. కాబట్టి నిరూపించలేదు.

నాయికా భేదములు

పద్మిని, చిత్రిణి, శంఖిని, హస్తిని అను స్త్రీజాతివిశేషములు కామశాస్త్రములో ప్రసిద్ధములుగా ఉన్నవి. వానిని ఆస్థలములోనే గ్రహించాలి. ఈచెప్పినవిధముగా స్వాధీనపతికాద్యవస్థాష్టకము నిరూపితమయినది. అనేకనాయికలు ఈఅవస్థలను పొందుతారు. ఆ నాయికలలో మూడు భేదాలను ప్రస్తుతము నిరూపించుతాము. సంక్షేపముగా నాయిక త్రివిధ. ముగ్ధ, మధ్య, ప్రౌఢ అని. యథాక్రమముగా వీరిలక్షణములను ఈవిధముగా గ్రహించాలి.

ముగ్ధ

ఉదయద్యౌవనా ముగ్ధా లజ్జావిజితమన్మథా

ఉదయించుచున్న యౌవనము కలది ముగ్ధ అవుతుంది. ఆమె మాన్మథభావాలు లజ్జావిజితములు అవుతవి. ముగ్ధ-సుందరి. ఉదయద్యౌవన సౌందర్యము కలది ముగ్ధ అని భావము. ఉదా:—

ముగ్ధే య న్మనసోఽపి గోప్య మఖిలం త న్మహ్య మావేద్యతే
కిం యాచాచి దహం? తవ ప్రియసఖి ప్రచ్ఛాద్య కిం తామ్యసి?
ఆసక్తి స్తవ రుద్రదేవనృపతా వాశాస్యతే కిం భవేత్?
ఇత్యాళీభ్యాం ప్రణయైకవాచి సుఖసు ద్దత్తోత్తరా ప్రీతయా.

ఓముగ్ధా! మనస్సునకును గోప్యముగా ఉంచదగినవె అయినా సర్వమునూ నాకు చెప్పెడిదానవుకదా! నేను ఎవ

ఏనో అవుతానా ? నీకు ప్రియసఖినికదా ! మనోభావమును దాచి ఉంచి ఏల వ్యధపడుతావు ? నీకు రుద్రదేవనృపతి యందు ఆసక్తి ఉన్నదని అనుకొనుచున్నాము. రుద్రదేవుని యందు ఆసక్తి ఉండదగునులే ! నేను తలచినది సత్యమే యగునా ? అని ఈవిధముగా చెలికత్తె ప్రణయమును గురించి ప్రధానముగా పలుకగా సుతనువయిన ఆ ముగ్ధానాయిక సిగ్గుతో సమాధానమిచ్చినది. దీనిలో నాయికయొక్క ప్రథమ యౌవనము లజ్జావిజితమన్మథత్వమూ గోచరము లగుటవలన నాయిక ముగ్ధ. స్త్రీలకు ప్రథమయౌవనములో అంగములు అకఠినములై మృదువులై ఉండుట ప్రసిద్ధము. ముగ్ధ అధరాంగసంస్కార మొనర్చుకొనును. క్రీడాలాలస అగును.

మధ్య

లజ్జామన్మథమదధస్థా మధ్యమోదితయౌవనా.

సముత్పన్నయౌవన మధ్యానాయిక. ఆమె మాన్మథ భావాలు లజ్జాభావములూ సమముగా ఉంటవి. అటూ ఇటూ ఉండేది కావడమువలన మధ్యమ అనే నామము సముచితము. సముచితయౌవనసౌందర్యమున స్పృహణీయయై ఉండునది మధ్య అని భావము. ఉదా:—

లీలావిభ్రమపూర్వరంగ ముదితం తారుణ్య మేత్య త్రపా
నేపథ్యాంతరబింబితస్మరకళాలాస్యప్రపంచశ్రియః
సఖ్యః పశ్యత! కాకతీయనృపతౌ భావానుబంధోజ్జ్వలః
కోఽప్యస్యాస్తరళభ్రువో విజయతే శృంగారనాట్యక్రమః.

కాకతీయనృపతివిషయమై ఈమె శృంగారనాట్యక్రమము అనిర్వాచ్యమాధుర్యము కలదై సర్వోత్కర్షగా ఉన్నది. చెలియలారా ! చూడుడు ! ఈతరళభ్రూశృంగారనర్తనము

అనురాగభావానుబంధమువలన సముజ్జ్వలమై ఉన్నది. ఈమె మాన్మథకళలుఅను లాస్యప్రపంచశోభలు లీలావిలాసములకు పూర్వరంగముగా ఉన్న తారుణ్యమునుకూడి ఉన్నవి. లజ్జ యను యవనికాభ్యంతరమున బింబనము పొంది యున్నవి. నాట్య మొనరించునట్టి స్త్రీ పూర్వ రంగమును పొంది యవనికాభ్యంతరమున లాస్యశోభలను ప్రసరింపజేయును. భ్రూవిలాసముల ప్రకాశింపజేయును. నానావిధవ్యాపారవిశేష సంబంధమున ఉజ్వల మగు శృంగారరస నర్తనము చేయును. ఇటువంటి ఈభావముకూడా ఇక్కడ సమారోపసుందరమై భాసించుతున్నది. ఇందలి నాయికావిధానము కనుపడీ కనుపడక త్రపాస్మరకళామధ్యస్థమై ఉన్నందువలన మధ్యమాత్వమును గ్రహించవలయును.

ప్రౌఢ

స్మరమందీకృతవ్రీడా ప్రౌఢా సంపూర్ణయౌవనా.

సంపూర్ణయౌవనము కలది ప్రౌఢ యగును. ప్రౌఢావ్రీడ మాన్మథభావములచే మందీకృత మగును. లజ్జ అణగి పోయి రాగభావములు అతిశయించినప్పుడు ప్రౌఢ అని భావము.

ఉదా:—

సహేలం పశ్యంత్యాః ప్రకృతిసుభగం రుద్రనృపతిం
తదాత్వప్రత్యుద్యద్ద్వివిధలలితాటోపమధురం,
రసప్రాదుర్భావా ద్యుగపదుదయత్సాత్త్విక మహో!
మృగాక్ష్యా స్తారుణ్యే కుసుమశరశిల్పం విజయతే.

రుద్రనృపతి స్వభావసుభగుడు. ప్రియదర్శనుడు. ఒక మృగాక్షి ఆతనిని సమీపముగా చూస్తున్నది. ఆసమయములో ఆమెకు వివిధము లయిన కర్ణకండూయన కుచమర్ద

నాది కోమలాంగవిన్యాసములు సముత్పన్నము లయినవి. వానిఆటోపమున ఆమె మధురమధురముగా చూస్తున్నది. ఆమెయందు రసానుభూతి ఆవిర్భవించినది. అందువలన సాత్త్విక భావాలు యుగపత్కాలములో ఉత్పన్నము లయినవి. ఆమృగాక్షి తారుణ్యములో ఈవిధముగా కామకళాకౌశలము విజయవంత మవుతున్నది. దీనిలో నాయికాభావాతిశాయిత, మందీకృతవ్రీడావత్వమూ స్పష్టగోచరములు.

ఇతర భేదములు

ఇట్లు సంక్షేపముగా నాయికాభేదములు నిరూపితము లయినవి. గ్రంథాంతరములలో ఇంకా అనేక భేద ప్రభేదాలు వర్ణింపబడినవి. ఆయా భేదాంతరములను యథాసంభవముగా ఉదహరించి గ్రహించవచ్చు నని ఇక్కడ ప్రతిపాదించడము లేదు.

నాయికాసంగ్రహము

ఇచట ఈ నాయికాసంగ్రహమును ఈవిధముగా గ్రహింప వచ్చును. స్వీయ, పరకీయ సామాన్య అని నాయిక త్రివిధ. స్వీయనాయిక ముగ్ధ, మధ్య, ప్రగల్భ అని మూడు విధాలు. ముగ్ధకు అవాంతరభేదాలు లేవు. మధ్యాప్రగల్భలు ధీర, అధీర, ధీరాధీర, అని మూడు మూడు విధాల అవుతారు. వీరే మరల జ్యేష్ఠ, కనిష్ఠ అని ద్వైవిధ్యము పొందుతారు. పరకీయ కన్య అని వివాహిత అని రెండువిధాలు. వేశ్య (సామాన్య) కు ఒకటే భేదము. ఇట్లా స్వీయ ౧౩ విధాలు. పరకీయ ౨ విధాలు. వేశ్య ౧ విధము. మొత్తము వీరు ౧౬ భేదాలు కలవా రవుతున్నారు. వీరలకు ప్రత్యేక ప్రత్యేకముగా స్వాధీనపతికాది భేదాష్టకసంబంధమువలన ౧౨౮ భేద

ములు కలుగును. వీరలకు ఉత్తమ మధ్యమా ధమ భేదసంకలనమువలన ౩౮౪ భేదములు సిద్ధములగును, ఇంకా పద్మినీచిత్రిణ్యాది భేద యోజనమున ౧౧౫౨ భేదములు. దివ్యా దివ్య దివ్యాదివ్య భేదమున ౪౬౦౮, వాత, పిత్త, శ్లేష్మ తత్వభేదమున ౧౩౮౨౪. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర భేదమున ౫౫౨౯౬. సత్వ, రజ, స్తమో భేదమున ౧౬౫౮౮౮ భేదములు కలుగును. ఇట్లాగే భేదాంతరములను ఊహించాలి. వాని అన్నిటి యోజనమున అసంఖ్యేయ నాయికా భేదములు కలుగును. ఇటువంటిపద్ధతినే నాయకులలో కూడా యోజించి గ్రహించాలి. ఆయా భేదప్రపంచ ప్రదర్శనము ప్రస్తుతము అవసరము కాదు.

ప్రసక్తమూ అప్రసక్తమూ ఈవిధముగా నిరూపిత మయినది. పరమప్రకృతము పుణ్యశ్లోకగుణవర్ణనము. తదుపస్కారకముగా దీనిని తెలియవలయును.

గుణాలంకారాణాం రసమహతి కావ్యే విలసితం
స్ఫురచ్ఛబ్దార్థాభ్యాం త దపి హృదయానంది భవతి
తయో ర ప్యున్మేషః స్రవదమృత మాధుర్యసుభగః
పరం పుణ్యశ్లోకం చరిత మనుబధ్నన్ విజయతే.

రసమహత్కావ్యమున గుణాలంకారవిలసనము సుందరము ఆగుణాలంకారవిలసితము యోగ్యస్ఫురణముకల శబ్దార్థముల ద్వారా హృదయానందక మవుతుంది. స్రవదమృతమాధుర్యము కలిగిన మనోహరమగు శబ్దార్థముల ఉన్మేషము కూడా పుణ్యశ్లోకచరితమును నిబంధించేది అయినపుడు సర్వోత్కర్ష కలది కాగలదు, కాబట్టి గుణవన్నాయకనిబంధనము ఆవశ్యకము. సన్నాయకనిబంధనమువలన శబ్దార్థములు

చక్కగా సమున్మిషితము లవుతవి. ప్రసవదమృతమధురము లవుతవి. సుభగము లవుతవి. అటువంటి శబ్దార్థాలవలన గుణాలంకారములు విలసించును. గుణాలంకారముఖముగా కావ్యము రసమహత్తర మగును. ఈ నాయకప్రకరణ నిగూహిత సకలార్థమునకూ ఇది సంగ్రహావచనము.

★

"గుణాలంకారాణాం" అనే సంగ్రహ శ్లోకము తరువాత కొన్ని ప్రతులలో కొంత అధికంగా పాఠము కన్పించు తున్నది. ఆ భాగమునకు కుమారస్వామి సోమపీథి వ్యాఖ్యానము చేయలేదు. ఆతడు స్మరించనూ లేదు. రత్నశాణము అనే వేరొక వ్యాఖ్యానంలో కూడా ఈ భాగవ్యాఖ్య లేదు. అందువలన కొందరు ఈ భాగమును ప్రక్షిప్తముగా తలుస్తున్నారు. ఇప్పటికి, ముద్రితము లయిన ప్రతాప రుద్రీయ గంథాలలో ప్రక్షిప్తముగా తలచ బడుతున్నప్పటికీ ఇది ముద్రిత మయింది. దేశమంతటా పఠన పాఠనములలోనూ ఉంది. ఏతదీయాంశములను ప్రమాణంగా స్వీకరించుతూ ఉన్న వారున్నూ ఉన్నారు. అందువలన పాఠకుల భావనకు ఆ భాగమును కూడా అనువదించి ప్రదర్శించడము యుక్తముగా ఉంటుంది. ఇది "గుణాలంకారాణాం" అనే శ్లోకానికి ఉపపాదకమయిన టీకాప్రాయముగా ఉంటుంది. గురుశిష్య మర్యాదలో ఎవరో వ్యుత్పన్న శిష్యుడు ఈ భాగమును వ్రాసి కొని ఉండవచ్చు.

•

కావ్యములో గుణములు అలంకారములూ అనేవి ఉపస్కార హేతువులు. అనగా శోభా సంపాదకములు అన్న

మాట. వీనిని నిబంధించినప్పుడు కావ్యములో చక్కని శోభ ఉంటుంది. కాని తగిన అలంకార్యము అంటే; అలంకరింపబడేది, ఉపస్కరింపబడేది (ఉపస్కార్యము) ఉండాలి. అది ఉన్నప్పుడే వీనికి చరితార్థత ఉంటుంది. అట్లా అలంకార్యము లేకపోతే ఇవి దేనికి ఉపస్కారకములు ? దేనిని శోభింపచేస్తవి ? తనకు తానే ఏదిన్నీ ఉపస్కారకము కాదు కదా ! కాబట్టి అలంకార్యము అనేది ఉంటేనే అందము. ఏది అలంకారానికి ఆశ్రయంగా ఉంటుందో అదే అలంకార్యము. లోకన్యాయము కూడా ఇంతే కదా ! హారకేయూరాదులు అలంకారములు. వానికి ఆశ్రయంగా ఉండేది అలంకార్యము. గుణాలంకారములకు కావ్యము ఆశ్రయముగా ఉంది కాబట్టి కావ్యమే అలంకార్యము అవుతుంది. సామాన్యంగా రసభావాదులు అలంకార్యములు అని ప్రసిద్ధి ఉన్నది. అవి అలంకార్యములు అని అనడమున్నూ విరుద్ధము కాదు. రసభావాదులు అంతటా ప్రధానములు కదా ! ఆ ప్రాధాన్యమును బట్టి అవి అలంకార్యములు అని అంటూ ఉంటారు. చూడండి; లోకములో కూడా హార నూపురాద్యలంకారములు శరీరమును ఆశ్రయించి ఉంటవి. అక్కడ శరీరము అలంకరింపబడుతున్నది కాబట్టి అలంకార్యము అని అనాలి కదా ! అయినా ఆత్మయె అలంకార్యము అని అంటున్నాము. ఆత్మ అనేది ఉంటేనే కదా ! శరీరమున్నూ అలంకార్యము కాగలిగేది. ఆత్మ లేకపోతే శవ శరీరము అలంకార్య మవుతుందా ? ఆత్మ ఉంటేనే సకల శోభలున్నూ. అట్లాగే కావ్యములో రసము ఆత్మ. రసాదులు జీవితభూతములు కాబట్టి కావ్యాత్మతాకథనము యుక్తిసహము.

ఒకొక్క చోట కావ్యములో రసము ప్రధానముగా ఉంటుంది. వేరొకచోట అలంకారము ముఖ్యముగా ఉంటుంది. ఇంకొక చోట వస్తువు ప్రధానత్వము పొందుతుంది. వీనిని ఈ విధముగా ఉదాహరణములలో గ్రహించవచ్చు.

రస ప్రాధాన్యము

ఈషదంకురిత విభ్రమ చారౌ దేహ పల్లవిత కాంతిని తన్వ్యాః
యౌవనే ముకులిత స్తనమాత్రే పుష్పితశ్చ ఫలితశ్చ మనోభూః.

ఆ తన్వి యొక్క యౌవనము, కొంచెము కొంచెముగా అంకురించిన విభ్రమాల వలన మనోహరముగా ఉన్నది. దేహములో కాంతి చిగిర్చింది కనుక యౌవనము స్పృహ ణీయముగాఉంది. ఇంకా స్తనములు ముకుళితములుగా (మొగ్గల మాదిరిగా అన్నమాట) ఉన్నవి. ఆ యౌవనము ఇంత మాత్రముగానే ఉన్నప్పటికి అక్కడ మన్మథుడు పుష్పి తుడూ అయినాడు ఫలితుడూ అయినాడు. ఇది ఒక బాలను చూచి స్పృహ కలిగిన ప్రతాప రుద్రుడు పలికిన వచనము. దీనిలో శృంగార రసము వ్యక్తమవుతూ ఉన్నది. ఆ బాల విభావము, ఆమె విశిష్ట యౌవనము ఉద్దీపనము. మంద గమనాదులు ఔత్సుక్యాదులు అనుభావములు సంచారులూ అవుతవి. వీని వలన ప్రతాపరుద్ర రతి రసీకృత మవుతుంది. రసీభావ సంపత్తి యొక్క స్వరూపము రస ప్రకరణములో నిరూపితమవుతుంది. ఒక వృక్షము అంకురితమై పల్లవితమై పుష్పితమై ఫలితము కావడ మనేది లోక ప్రసిద్ధము. ఇక్కడ కూడా మదన విషయములో ఈ నాలుగు అవస్థల చాతుర్య మును గ్రహించాలి.

అలంకార ప్రాధాన్యము

కీర్తౌ ప్రతాపరుద్రస్య విహరంత్యాం దిగంతరే.
లోకాలోక తటాః శశ్వద్ద్రవచ్చంద్రోపలాంకితాః.

ప్రతాపరుద్రుని కీర్తి దిగంతరములలో విహరించుచూ ఉంటే లోకాలోక పర్వతతట ప్రదేశాలు కూడా మాటిమాటికి ద్రవించే చంద్రోపలములు కలవి అయినది. దీనిలో, లోకాలోక పర్వతము యొక్క తటముల చంద్రకాంతకుట్టిమ ప్రదేశాలకు రుద్రదేవకీర్తి యందు వెన్నెల అనే బుద్ధికలగడము చేత ద్రవీభావము కలిగింది అని ఉందికాబట్టి భ్రాంతిమదలంకారము వ్యంగ్య మవుతుంది. కీర్తిని చూడగానే వాటికి చంద్రికా భ్రాంతికలిగింది. అలంకారానికి కూడా వ్యంగ్యావస్థలో ప్రాధాన్యం ఉంటుంది. అది ప్రధానవ్యంగ్యము కాకుండా ఉన్నప్పుడు వేరొక దానిని ఉపస్కరించేది అవుతుంది కాబట్టి అపుడు అలంకార్యము కాదు. ప్రధాన వ్యంగ్య మయినపుడు తానే అలంకరింప బడేది అవుతుంది కాబట్టి అలంకార్యము అవుతుంది. ఇట్లా అలంకార్య మయినా అలంకార వ్యంగ్యము అని అనడము బ్రాహ్మణశ్రమణ న్యాయాను సారంగా సంగతమవుతుందని ఊహించాలి. శ్రమణుడంటే బౌద్ధసన్యాసి. ఈ అవస్థలో బ్రాహ్మణత్వాదులు ఉండవు. అయినా ఆతడు ఒకప్పుడు బ్రాహ్మణుడు అనే అంశమును బ్రాహ్మణశ్రమణ పదము సూచిస్తుంది అట్లాగే వ్యంగ్యావస్థలో అలంకారత్వము ఉండక పోయినా ఒకప్పుడు ఇది అలంకారముగా ఉన్నది అనే అంశమును అలంకారవ్యంగ్యము అనే పదము తెలియ జేస్తుంది.

వస్తు ప్రాధాన్యము

అవతరతి వీరరుద్రే కాకతివంశే త్రిలోక మహనీయే
త్యక్త్వా దుగ్ధపయోధిం తల్ప ఫణీశః స్వమందిరం ప్రాప్తః.

త్రిలోకములలో మహనీయుడయిన శ్రీవీరరుద్రుడు కాకతి వంశములో అవతరించగా తల్పముగా ఉన్న ఆదిశేషువు పాలసముద్రమును విడిచిపెట్టి తన మందిరమునకు పోయినాడు. దీనిలో తల్పఫణీశుడు దుగ్ధాబ్ధిని విడిచి స్వగృహము వెళ్ళినాడు అని వర్ణించడము చేత క్షీరసముద్రములో హరి లేడు, అని అభివ్యక్తమవుతున్నది. దీనిచేత పురుషోత్తముడు ప్రతాపరుద్ర రూపముగా కాకతీయ కులములో ఉంటున్నాడు. అనే వస్తువు వ్యజ్యమానమవుతున్నది. ఇట్లా వ్యంగ్యార్థ ప్రాధాన్యము మూడు విధాలుగా ఉంటుంది.

గుణములు అలంకారములున్నూ కావ్యమును ఆశ్రయించి ఉన్నప్పుడు విలసిల్లుతూ ఉంటవి. అట్లా గుణాలంకార విలసితమయిన కావ్యము శబ్దస్ఫురణము చేత అర్థస్ఫురణము చేత ఆ శబ్దార్థోభయ స్ఫురణము చేత సహృదయులకు హృదయానందకము అవుతుంది. వీని విశేషములను ఈ విధముగా ఉదాహరణములలో గ్రహించవచ్చును.

శబ్ద స్ఫురణము

ప్రౌఢమయిన బంధముయొక్క అతిశయము ఉంటే శబ్ద స్ఫురణము అని అంటారు. రచనాడంబరము బాగా ఉండాలన్న మాట. ఆరభటీ వృత్తిలో ప్రతిపాదించే బంధాడంబరము ఉంటే శబ్దస్ఫురణము అని గ్రహించవచ్చు. ఉదా—

క్షోణీ రక్షణ దక్షిణాః క్షతజగత్క్షోభా సమీక్ష్య క్రమాః
క్షుద్రక్షత్రియ పక్ష శిక్షణ విధౌ ప్రోత్క్షిప్త కౌక్షేయకాః

ఉద్దామోద్యమనస్య రుద్రనృపతే ర్దోర్దండయో శ్చండయో
ర్గర్జద్దుర్జన గర్వ పర్వత భిదా దంభోలయః కేలయః

పద్య భావము కావ్య ప్రకరణములో విశదమవుతుంది.

అర్థ స్ఫురణము

అచుంబితమయిన అర్థసంపదను అర్థస్ఫురణము అంటారు. ఆ అర్థమును ఇతర కవులు స్పృశించి ఉండరాదు. ఉదా:—

ఛాయ—ఖడ్గే యుద్ధ విజృంభితే రిపుమహీ నాథాంజలిం బింబితం
ప్రేక్షంతో జయలక్ష్మీవాస కమలం మన్యంతే విజ్ఞానినః
మన్యే వీర ప్రతాపరుద్రనృపతేః జన్యే గృహీతుం పునః
తత్సంశ్లిష్యే రిపుజీవితాని విధేః ప్రాప్తస్య పీఠాంబుజం.

ఈ పద్యభావము కూడా కావ్య ప్రకరణములో విశదమవుతుంది. దీనిలోని అర్థసంపత్తి ఇతరకవిజుష్టము కాదు. అందువలన అర్థ స్ఫురణము.

ఉభయ స్ఫురణము

అర్థ స్ఫురణము శబ్ద స్ఫురణమూ రెండూ మిశ్రితములై ఒక పద్యములో ఉంటే ఉభయ స్ఫురణము అవుతుంది. ఉదా:—

ఉద్యద్బృంహిత గర్జితైః ద్విప ఘటా కాదంబినీ డంబరైః
క్షోణీభృత్కటకోప రోధ పటుభిః సద్యః స్ఫురద్దిక్తటాః
ప్రావృట్సాంద్రభ్రమ శంసినో రిపువధూ బాష్పోప్లవం దుర్దినం
కుర్వంత శ్చలమర్తిగండ నృపతే జైత్ర ప్రయాణోద్యమాః,

"చలమర్తి గండ" అనే వీరబిరుదము కలిగిన ప్రతాపరుద్రమహారాజు యొక్క జైత్ర ప్రయాణ యత్నములు వర్షా సమయ సంభ్రమమును సూచించేవిగా ఉన్నవి. "చలమర్తి

గండ" అనే బిరుద పదము "ఛలమర్త్యగండ" పదమును అనుసరించి వచ్చింది. గండ అనేది కన్నడ పదము. దానికి మొగుడు అని అర్థము. కపటముగా ప్రవర్తించే మానవులకు మొగుడు. వారిని కపటము లేకుండా అదుపు ఆజ్ఞలలో పెట్టేవాడు అని భావము. సంస్కృత పదములు దేశీయ పదములు సమసించడము ఆంధ్రభాషకు మాత్రమె క్రొత్త. ఛలమర్త్యపదము చలమర్తి అయింది. కొన్ని పాఠాలలో 'చలమర్త్యగండ' అని కూడా ఉన్నది కాని ఆ బిరుదము 'చలమర్తిగండ' అనే వాడిక. ఇక ప్రకృతము. ఆ చలమర్తిగండని జైత్రప్రయాణోద్యమాలలో ఏనుగుల బృంహితములు అతిశయించుచున్నవి. అవి మేఘ గర్జితముల మాదిరిగా ఉన్నవి. ఏనుగుల సమూహాడంబరము బాగా ఉంది. ఆ గజసమూహము కాదంబిని మాదిరిగా అంటే మేఘపంక్తి మాదిరిగా ఉంది. ఇంకా ఆ ఉద్యమములు శత్రువుల సేనా శిబిరములను ఉపరోధించడములో సమర్థములుగా ఉన్నవి. వర్షాకాలము పర్వతాల చరియలను సమర్థంగా ఉపరోధిస్తుంది అనే అర్థమున్నూ ఇక్కడ శ్లిష్టముగా ఉన్నది. అప్పుడే దిక్తటములన్ని స్ఫురించి జ్వలించుచున్నవి. ఇంతగా ఇట్లా జరుగుతూ ఉంటే శత్రుస్త్రీలకు కన్నీరు ఉద్భవించింది. ఆ రిపువధూ బాష్పము వలన దుర్దినము కలిగింది. మేఘచ్ఛన్న దివసమును దుర్దినము అంటారు. ఇటువంటి దుర్దినమును కలుగ జేస్తూ ఆ జైత్రోద్యమాలు ప్రావృట్సంభ్రమ శాసనములుగా ఉన్నవి. అని భావము. దీనిలో శబ్దార్థ స్ఫురణమును యథాయోగముగా సమన్వయించుకోవాలి.

ఇటువంటి శబ్దార్థ స్ఫురణములచేత కావ్యానికి చారుత్వము కలుగుతుంది. అట్టి శబ్దార్థములకున్నూ సహృదయ హృదయానంద దాయకత్వము కలుగవలెనంటే పుణ్యశ్లోకానువర్ణనము ఉండి తీరాలి. కాబట్టి ఈ విధంగా కావ్యంలో నాయకునకే ప్రాధాన్యము ఉంది అని గ్రహించాలి. సత్కులము సదాచారము యశస్సు శౌర్యము పాండిత్యము శీలము మొదలయిన నాయక గుణముల వర్ణనము అవసరము. ఆ విధముగా చేయడమె చాలా సమ్మతము. ప్రబంధములో ప్రధాన నాయకుని కులాచారాదులనె వర్ణించితే ప్రబంధరచన పరితృప్తి నిస్తుంది. పోనీ; ప్రతిపక్ష నాయకుని నానాగుణాలను వర్ణించి ఆ ప్రతినాయకుని జయించినట్లుగా ప్రకృత నాయకుని వర్ణించడము కూడా బాగానే ఉంటుంది. ప్రతినాయకుని జయించి నందువలన నాయకోత్కర్షను నిరూపించడమున్నూ కొన్నిచోట్ల సమ్మతమె. ఈ విధానములకు ఈఉదాహరణలలో సమన్వయముల చూడవచ్చు.

> తత్త్వం యస్య పరః పుమాన్, అవతరో యస్యాన్వయః కాకతి
> క్ష్మాపానాం, చరితం చ యస్య భువన క్షేమంకర ప్రక్రమం,
> శ్లాఘా యస్య లఘూకృతామరతరు స్వర్ధేను చింతామణిః
> సోయం విశ్వధురంధరో విజయతే శ్రీవీరరుద్రో నృపః,

ఎవని తత్త్వము పరమ పూరుషుడేనో! ఎవని కాకతి భూపాలవంశము అవతారమో! ఎవని చరితము భువనాలకు క్షేమమున్నూ కలుగజేసే ప్రక్రియ కలదో! ఎవని శ్లాఘ కల్పవృక్షము కామధేనువు చింతామణి అనే కామప్రదములను కూడా లఘూకరించిందో! ఆతడు ఈ విశ్వధురంధరుడయిన శ్రీవీరరుద్ర మహారాజు సర్వోత్కర్షగా రాణించు తున్నాడు.

దీనిలో ప్రస్తుతనాయకుని కులవైభవాదులు వర్ణితములయినవి. ఇట్లా వర్ణించడమనేది ఒక విధము.

యత్తేజః ప్రతిపక్ష భూప విహరద్గర్వాంధకారాతపో
యద్దోరర్గల విక్రమః త్రిజగతీ శుద్ధాంత దౌవారికః
సోప్యాసీ ద్యుధి సేవణక్షితిపతిః సన్నాహ భేరీ ధ్వనిం
శ్రుత్వా రుద్రనరేశ్వరస్య మహతో భీతః పలాయ్యాకులః.

ఏ సేవణ ప్రభువు పరాక్రమము శత్రు రాజులలో ఉండే గర్వమనే అంధకారానికి ఆతపప్రాయమో! ఏ సేవణాధీశుని భుజార్గల పరాక్రమము ముల్లోకముల అంతఃపురాలకు దౌవారిక రీతితో ఉండేదో! ఆ సేవణ క్షితిపతి కూడా రుద్రనరేశ్వరుని సన్నాహ భేరీధ్వనిని విని గొప్ప భయము వలన ఎక్కడకో పరుగెత్తి వ్యాకుల పడినాడు. దీనిలో మొదట ప్రతినాయకుడయిన సేవణరాజు గుణవిశేషములు వర్ణితములయినవి. ఉత్తరార్థములో ఆతడు రుద్రనరేశ్వర ధాటికి ఆగలేక పోయినట్లు వర్ణించడం వలన రుద్రనరేశ్వరోత్కర్ష సిద్ధమవుతున్నది. ఇది రెండవ పద్ధతి.

ఇటువంటి వర్ణనము ఉత్పాద్య నాయకుని విషయమై పనికిరాదు. కల్పిత నాయకుని కవిస్వీకరించినపుడు ఆనాయకుడు సర్వలోక ప్రసిద్ధిని పొందడానికి ముందుగా కులాచారాది విశేషములను వర్ణించడమే ఉచితము. స్వతస్సిద్ధముగా ప్రసిద్ధుడయిన నాయకుడే అయితే ఈ రెండు విధానాలనూ కూర్చవచ్చును. అటువంటి ప్రసిద్ధ నాయకుని కులవ్యాప్తదేశాదులు లోకప్రసిద్ధములే కాబట్టి బలవంతుడయిన శత్రువును జయించినట్లుగా కవులు వర్ణించడము యుక్తము. ప్రబంధ నాయకుడు స్వతస్సిద్ధ నాయకుడు ఉత్పాద్య నాయకుడు అనే భేదముతో

రెండు విధాలుగా ఉండడము సంభవించుతూనే ఉంటుంది. ఈ విషయంలోనే ఇది కూడా పరిగ్రాహ్యము. ధీరోద్ధత నాయకునిలో బాహ్య సంభ్రమ బహుళంగా రౌద్రమును వర్ణించినట్లు ధీర లలిత నాయకునిలో బహు భావ కారి అయిన శృంగారమును వర్ణించినట్లున్నూ ధీరోదాత్తనాయకుని విషయములో ఆ విధముగా రౌద్ర శృంగారాలను వర్ణించ రాదు. ఆతని కార్య విశేషమును అనుసరించి ఆ యా రససంపూర్తి ఉన్నట్లుగా వర్ణించడమే సముచితక్రమము. ఇంకా ధీరోదాత్త నాయకునిలో హాస్యము మొదలయిన ఇతర రసాల వర్ణనము కూడా అధికంగా ఉండరాదు. మందోద్యమానుభావములు కలిగి ఉన్నట్లుగా వర్ణించాలి. ధీరోదాత్త నాయకుడు అంటే సర్వవిధనాయకులలోనూ అధికుడు. అటువంటి సర్వాతిశాయి అయిన ధీరోదాత్త నాయకుని విషయముగా చేసికొని ప్రబంధాలు ఉన్నప్పుడు బాగా శ్లాఘాస్పదములు అవుతూ ఉంటవి.

నాయక ప్రకరణము

కావ్య ప్రకరణము

గ్రంథములో నాయక ప్రసంగము ప్రాసంగికము. అది నిరూపిత మయినది. కావ్య స్వరూప నిరూపణము ప్రకృతము. ఈ ప్రకరణములో అది ప్రతిపాదింపబడును. ముందుగా కావ్య సామాన్య లక్షణమును ఈ విధముగా గ్రహించాలి.

కావ్య స్వరూపము

గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోష వర్జితౌ
గద్య పద్యోభయమయం కావ్యం కావ్య విదో విదుః.

కావ్యము గద్య కావ్యమని పద్య కావ్యమని ఉభయ కావ్యమని మూడు విధములు. ఈ కారికలో "గుణాలంకార సహితౌ శబ్దార్థౌ దోషవర్జితౌ" అనేది కావ్య లక్షణము. గుణాలంకార సహితములు దోష రహితములూ అయిన శబ్దార్థములు కావ్యము అని దాని భావము. పై కారికార్థమును వేరొక విధముగా పరిశీలించి నట్లయితే "అదోషౌ సగుణౌ సాలంకారౌ శబ్దార్థౌ కావ్యం" అని కావ్య సామాన్య లక్షణము పర్యవసన్న మవుతుంది. దోష రహితములూ గుణసహితములూ అలంకార సహితములూ అయిన శబ్దార్థములు కావ్యము అని అర్థము.

మొదటి కారికలో దోషవర్జనము ప్రథమోపాత్తము కాలేదు. వివరణ వాక్యములో అది ప్రథమోపాత్త మయి నది. దీని వలన ఈ భావము వ్యక్త మవుతున్నది. దోషము అల్పమయినా ప్రమాదవశమున సంప్రాప్త మయినా ఉపేక్ష

చేయరాదు. ఇట్లే ఆచార్య దండి అభిప్రాయపడు తున్నాడు. కావ్యములో అల్పదోషము నయినా ఉపేక్షించ రాదు. శరీరము సుందరమయినా ఒక శ్విత్రము (బొల్లిమచ్చ) వలన దుర్భగ మవుతుంది కదా! గుణ సమూహములో ఒక దోషము మునిగి పోతుంది కాని బయటికి కన్పించదు. అనే కాళిదాససూక్తి కావ్య విషయములో కాదని గ్రహించాలి. కాగా కావ్యములో దోషమును ఏ మాత్రమూ ఉపేక్షించ రాదని పర్యవసన్న మవుతున్నది. కావ్యమును ముందు దోషరహితముగా చేయాలి. పిమ్మట గుణసహితముగా చేయడము ఆవశ్యకము. కొందరు గుణము దోషాభావ రూపమె కాని స్వతంత్రము కాదు. అని అంటారు. అది యుక్తము కాదు. గుణానికి ప్రత్యేకస్వరూపము ఉన్నది. కావుననె గుణవత్త్వము వేరుగా ఉపాత్త మయినది.

గుణము కావ్యానికి శోభా సంపాదకము. గుణములు ఉన్నట్లయితే కావ్యము కావ్యము కాగలుగుతుంది. గుణ ఘటనములో సావధానుడయిన కవి అలంకార రచనలో శ్రద్ధను పూన వలసి ఉన్నది. అలంకారములు శోభా తిశయాధాయకములు. కావ్యానికి కలిగే ఉత్కర్షఅలంకారాధీనము. ఇట్లా నిర్దోషములు గుణ యుక్తములూ అలంకార యుతములూ అయిన శబ్దార్థములు కావ్యమని పర్యవసితము.

ఇక్కడ ఒకటి విచారణీయము. శబ్దము అర్థమును విడిచి ఉండదు. అర్థము శబ్దమును విడిచి ఉండదు. శబ్దము కావ్యము అని అన్నప్పటికీ "శబ్దార్థములు కావ్యము" అని అన్నట్లే అవుతుంది. అర్థము కావ్యమని అన్నా "శబ్దార్థములు కావ్యము" అని అన్నట్లె అవుతుంది. అయినా శబ్దార్థములు కావ్యమని

విశేషించి చెప్పడములో ఈ అర్థమున్నది. రెండు ఒకటి అనడము విచిత్రమే. అదీకాక శబ్దము అర్థమును విడిచి ఉండక పోదు. గీతాది శబ్దాలలో అర్థము లేదు కదా! అటువంటి శబ్దము కావ్య మెట్లా అవుతుంది? అర్థము శబ్దమును విడిచి ఉండడము కూడా ఉన్నది. చేష్టాదుల వలన గోచర మవుతూ ఉన్న అర్థమును శబ్ద బోధ్య మన రాదు. కావ్యములో శబ్ద బోధ్యార్థమె ఉండాలని అర్థమును చెప్పే శబ్దమె ఉండాలని కావ్య విదులకు సమ్మతము. శబ్దార్థములు కావ్యమని అనడము ఈ అర్థమును చెప్పుతుంది. ఇంకా శబ్దప్రధానములకూ అర్థ ప్రధానములకూ కూడా కావ్యత్వము ఇష్టము. శబ్దమె కావ్య మన్నట్లయితే శబ్ద ప్రధానకమె కావ్య మవుతుంది కాని అర్థ ప్రధానకము కావ్యము కాజాలదు. అర్థమె కావ్య మన్నట్లయితే అర్థ ప్రధానకమె కావ్యమవుతుంది కాని శబ్ద ప్రధానకము కావ్యము కాజాలదు. కాబట్టి యథోక్తమె సమ్మతము. ఇంకా ఇక్కడి విశేషార్థము ఇతర స్థలములలో విశేషముగా నిరూపితము.

కావ్య సామగ్రి లోక సామగ్రి

శబ్దార్థౌ మూర్తి రాఖ్యాతౌ జీవితం వ్యంగ్య వైభవం
హారాదివదలంకారా స్తత్రస్యు రుపమాదయః

శ్లేషాదయో గుణా స్తత్ర శౌర్యాదయ ఇవ స్థితాః
అత్మోత్కర్షా వహా స్తత్ర స్వభావా ఇవ రీతయః,
శోభా మాహార్యికీం ప్రాప్తా వృత్తయో వృత్తయో యథా,
పదానుగుణ్య విశ్రాంతిః శయ్యా శయ్యేవ సమ్మతా,
రసాస్వాద ప్రభేదాః స్యుః పాకాః పాకా ఇవ స్థితాః,
ప్రఖ్యాతా లోకవదియం సామగ్రీ కావ్య సంపదః.

లోకములో కమనీయ కామినీమణికి ఎటువంటి సామగ్రి ఉంటుందో అట్లాగే కావ్య సంపదకు కూడా సామగ్రి ప్రఖ్యాతమై ఉన్నది. లోక మందలి వ్యక్తికి స్వరూపము (మూర్తి శరీరము) జీవితము హారాద్యలంకారములూ శౌర్యాది గుణములూ స్వభావములూ అనుకరణాత్మకము లయిన నడవడులూ శయ్యాపాకమూ అనేవి ఉంటవి. ఇది సామాన్యముగా లోక సామగ్రి. శబ్దార్థములు,వ్యంగ్యవైభవము, అనుప్రాసోపమాదులూ, వైదర్భ్యాది రీతులూ, కైశిక్యాది వృత్తులూ, శయ్య, ద్రాక్షాదిపాకములూ అనేవి కావ్యసామగ్రి. కావ్య సామగ్రికీ లోక సామగ్రికీ స్వరూప సామ్యము ఉన్నది. శబ్దార్థములు కావ్యానికి శరీరము. వ్యంగ్యవైభవము జీవితము· అనుప్రాసోపమాదు లలంకారములు. వైదర్భ్యాదిరీతులు ఆత్మోత్కర్షసంపాదకము లయిన స్వభావములు. కైశిక్యాది వృత్తులు కృత్రిమ (తెచ్చి పెట్టుకొన్న) శోభను పొందిన వృత్తములు. శయ్యా పదానుగుణ్య విశ్రాంతి రూప మగు శయ్య. శయ్యపై పాదాలకు ఆనుగుణ్యము నిచ్చేవి శ్రాంతి ఉంటుంది. వర్ణసంఘట నాత్మక పదములకు ఆనుగుణ్యముని చ్చేవి శ్రాంతి ఈ శయ్యలో ఉంటుంది. ద్రాక్షాది పాకములు రసాస్వాద ప్రభేదముల యిన పాకములు. కావ్య పాకములు శృంగారాది రసాస్వాదప్రభేద స్వభావములై ఉండును. ఇటువంటి ఈ సామగ్రీ స్వరూప స్వభావములు వివేచితముల గును. కావ్యము కాంత. కాంతా సామగ్రి వలె కావ్య సామగ్రి కూడా కాంత కాంతము స్పృహణీయమూను. "రస ప్రధానా శ్శబ్దార్థాః, జీవితం వ్యంగ్య వైభవం" ఈ వచనాలకు పరస్పరమూ విరోధము లేదని నాయక ప్రకరణములో నిరూపితము.

శబ్దార్థములు

కావ్యములో ప్రయుక్తమగు శబ్దజాత మంతా త్రివిధముగా ఉంటుంది. వాచక శబ్దము లక్షకశబ్దమూ వ్యంజక శబ్దము అని. అర్థబోధకమయిన శబ్దమె ఇక్కడ వివక్షితము. శబ్దము అర్థమును బోధించడములో ఒక శక్తికలిగి ఉంటుంది. ఒక్కొక్క అర్థమును బోధించడానికి ఒక్కొక శక్తి కావాలి. ఆ శక్తులను ద్వారముగా చేసికొని శబ్దములు ఆయాఅర్థములను చెప్పునని సారాంశము. ఈ శబ్ద శక్తులకే శబ్ద వ్యాపారము లని పేర్లు. ఈ విషయము ముందు ముందు వివేచితమవుతుంది. అభిధ లక్షణ వ్యంజన అని ఈ వ్యాపారములకు పేర్లు. అభిధద్వారముగా ఒక అర్థమును ప్రతిపాదించే శబ్దము వాచకము. లక్షణద్వారముగా అర్థమును ప్రతిపాదించే శబ్దము లక్షకము. వ్యంజనద్వారా అర్థప్రతిపాదక శబ్దము వ్యంజకము. వీనివలన బోధింపబడే అర్థాలు మూడు విధములు. వాచ్యము లక్ష్యము. వ్యంగ్యమూ అని. కాబట్టి ఈ అర్థము పర్యవసన్న మవుతున్నది. వాచకశబ్దము వాచ్యార్థమును చెపుతుంది. లక్షక శబ్దము లక్ష్యార్థమును చెప్పుతుంది. వ్యంజకశబ్దము వ్యంగ్యార్థమును చెప్పుతుంది.

వాచకము

ఏ శబ్దమును వినిన వెంటనే ఏఅర్థము గోచరమవుతుందో ఆ అర్థమునకు ఆ శబ్దము వాచకము. ఘటశబ్దమును వినగానే కలశరూపార్థము గోచరమవుతున్నది. కాబట్టి కలశరూపార్థానికి ఘటపదము వాచకము. ఇట్లే ఇతర స్థలాలలోనూ.

లక్షకము

వెంటనే గోచరమయిన అర్థము కుదురు బాటును పొందక

పోగా ఆ కుదురు బాటును కలుగజేయు ద్వితీయార్థము-రెండవ అర్థమును స్వీకరించుటకు ప్రసిద్ధార్థమునకు బాధను కలుగజేసే అర్థమును చెప్పే శబ్దమునకు లక్షకమని పేరు. "గంగాయాం ఘోషః" అనే వాక్యం ఉన్నదనుకోండి. గంగలో ఘోష మున్నది. అని ఈవాక్యము వలన వెంటనే గోచరమవుతూఉన్న అర్థము. గంగాయాం అనే పదానికి గంగా ప్రవాహములో అనికదా అర్థము. ఘోషమనగా గొల్లపల్లె. అదిగంగాప్రవాహ ములో ఉండదు. కాబట్టి ఈ అర్థానికి కుదురు బాటు లేదు. దీని కుదురు బాటును సంపాదించ డానికై వేరొక అర్థమును ఇక్కడ గ్రహించాలి. మొదట గోచరమయిన ప్రవాహ ములో అనే అర్థమును త్యజించాలి, కాగా మనమిక్కడ గంగా తటమున ఘోషము" అనే అర్థమును గ్రహించు తున్నాము. ఈఅర్థము బాధితముకాదు. 'గంగాతటమున' అనే అర్థమును చెప్పే 'గంగాయాం' అనే పదము ఇక్కడ లక్షక పదమని గ్రహించాలి.

వ్యంజకము

మొదటి అర్థము కుదురు బాటు పొందినప్పటికీ అచటి స్వరూప రమణీయతను బట్టి అనేకార్థములు గోచరములగును. అటువంటి అర్థములను చెప్పు శబ్దము వ్యంజకము. "సూర్యుడు అస్తంగతు డయినాడు" అని వాక్యము భాస్కరుడు అస్త మించినాడు. అని మొదటి అర్థము కుదురు బాటును పొందక పోవడము లేదు. అయినా తద్వాక్య శ్రవణానంతరము బాలుని గురించి దూరము వెళ్ళవలదని, వటువుని గురించి సంధ్యా వందన సమయమయిన దని, నాయికనుగురించి నీ ప్రియుడు వచ్చినట్లె అని అనేకార్థములు తత్తదౌచిత్యానుసారముగా

గోచరములవు తున్నవి. ఈ అర్థప్రతిపాదక మగు ఆ శబ్దము వ్యంజకమని విభావనచేయాలి. ఈ నిరూపణము వలన వాచ్య లక్ష్య వ్యంగ్యార్థముల స్వరూపము కూడా చెప్పినట్లైె.

తాత్పర్యార్థము అతిరిక్తము కాదు.

వాచ్యలక్ష్యవ్యంగ్యరూపము యిన అర్థ త్రితయము ప్రసిద్ధ ముగా ఉన్నది. కొందరు తాత్పర్యార్థమను నాల్గవ అర్థ మును కూడా అంగీకరించుతారు. అదియుక్తము కాదు. తాత్పర్యార్థము కూడా వ్యంగ్యార్థమె కాని అంతకన్న అతి రిక్తము కాదు.

ఇచటి పూర్వోత్తర వాదములను ఈవిధముగా గ్రహిం చాలి. తాత్పర్యార్థము అతిరిక్తమని పలికేవారు ఈ విధ ముగా అంటారు. మీమాంసకులు అభిహితాన్వయ వాదు లని, అన్వితాభిధాన వాదులనీ, ద్వివిధముగా ఉన్నారు. వారిలో అభిహితాన్వయవాదులు తాత్పర్యమును అంగీకరించు తారు. అభిహితములగు పదములకు అన్వయము చెప్పువారు అభిహితాన్వయ వాదులని అర్థము. ఒకవాక్యములో ఉన్న పదములు తమతమ అర్థములను తెలియజేసి విరతము లవు తున్నవి. అనంతరము వాక్యము మొత్తముపైన ఒకఅర్థము గోచరమవుతున్నది. అది పదార్థము కాదు, వాక్యార్థము. పదార్థముల పరస్పర సంబంధాత్మకము. అందువలననే అది పదార్థముల సముదాయరూపము కాదు. పదములవలన గోచరమవుతూ ఉన్న అర్థముకంటె వాక్యమువలన గోచర మవుతూఉన్న అర్థము భిన్నము. ఈ అర్థమునె విశిష్టార్థమని అంటారు. ఇదె తాత్పర్యార్థమని అభిహితాన్వయ వాదుల భావము, అభిహితములయిన వాక్యములోని పదాలకు పర

స్వరమూ సమన్వయమును బోధించే అర్థము వేరుగా ఉన్నదని బోధించేవారు అగుటవలన వీరు సార్థక నాములు.

"ఘటమానయ" అనేవాక్యములో 'ఘటపదము' అమ్ అనే ద్వితీయావిభక్తి ప్రత్యయమూ, 'ఆఙ్' అనేఉపసర్గ 'నీఞ్' ధాతువు, అనంతరము 'ణిజ్' ప్రత్యయమూ, అనేవి ఉన్నవి. ఘటపదానికి ఘటమని అర్థము. ద్వితీయావిభక్తి ప్రత్యయమైన 'అమ్' అనే దానికి కర్మత్వము అర్థము. ఆఙ్ ఉపసర్గకు అభివ్యాప్తి అర్థము. నీఞ్ ధాతువునకు నయనము ప్రాపణము అర్థము. తదుత్తరవర్తి ప్రత్యయానికి ప్రేరణ అర్థము ఇట్లా వేరువేరుగా పదార్థములు గోచరములవుతున్నవి. ఆ యా పదాలలోని అభిధవలన ఆయా అర్థములు కలుగుతున్నవని భావము. ఈ అర్థములను బోధించి ఆపదాలలో ఉన్న అభిధ విరతమవుతున్నది. అనంతరార్థమును బోధించడములో అభిధకు సామర్థ్యము లేదు. ఇప్పటికి పదార్థములను కూడిక చేయగా 'ఘటము కర్మత్వము, అభివ్యాప్తి నయనము ప్రేరణ' అని తేలుతున్నది. ఇటువంటి అర్థము ప్రవర్తకమూ కాదు నివర్తకమూ కాదు. దీనివలన ప్రయోజనము లేదు.

'ఘటమానయ' మొదలగు వాక్యాలను విన్నవానికి ఇంతకన్న భిన్నమయిన అర్థము భాసించుతున్నది. అదే ప్రవర్తకము కాని నివర్తకము కాని అవుతున్నది. "ఘటకర్మకమగు ఆనయనమును ఒనరింపుము" అని అచటి విశిష్టార్థము. ఈ అర్థమును అభిధ బోధించలేదు. ఇది లక్షణా వేద్యమూ కాదు. ఇది వ్యంగ్యము కాదు, వాచ్యలక్ష్యవ్యంగ్యములకన్న అతిరిక్తము. ఇదె తాత్పర్యార్థము. తాత్పర్యము అనే వృత్తి

ఈ అర్థమును బోధించుతుంది. ఈ అర్థానికి తాత్పర్యార్థమని పేరు. అది సార్థకము కూడా "తస్మిన్ పరాః తత్పరాః తత్పరాణాం భావస్తాత్పర్యం" అని తాత్పర్య పదవ్యుత్పత్తి, విశిష్ట రూపమయిన వాక్యార్థము నందు ఆసక్తములయిన వాక్యములోని శబ్దముల ధర్మము తాత్పర్యమని తేలినది. ఇటువంటి నాల్గవ అర్థము కప్పిపుచ్చడానికి శక్యము కానిదై మీమాంసకులచే అంగీకరింపబడి ప్రసిద్ధమై అందరి అనుభవములలోనూ భాసించునదై ఉండగా "వాచ్యలక్ష్య వ్యంగ్య రూపమున అర్థజాతము త్రివిధము" అని అనడము ఏవిధముగా కుదురుతుంది ? అని పూర్వ పక్షము.

ఈ ఉపపాదనమంతా అప్రయోజకము. మీమాంసకులలో ఒక తెగకు చెందిన అభిహితాన్వయవాదులె ఈ విధముగా పలుకుతారు. మరియొక తెగకు చెందిన అన్వితాభిధానవాదులు ఈ విధముగా అనరు. సంసర్గరూపమయిన వాక్యార్థ ప్రతిపత్తికై తాత్పర్యమనె వ్యాపారాంతరమును అంగీకరింపవలసిన అవసరము లేదు. ఈ వాక్యార్థము వాక్యమహిమవలననె గోచరమవుతుంది ఆ కాంక్షా యోగ్యతా సత్తులు కలదివాక్యము. అటువంటి వాక్యము పదపదార్థముల సమన్వయశక్తి కలిగి ఉంటుంది. పదాంతరములతో అన్వయము పొందిన పదాలకు (అన్వితపదాలకు) అన్వయము వాదించువారు అన్వితాభిధానవాదులు. అన్వితాభిధానవాదులు వాక్యార్థము వాచ్యమె అవుతుందని అంటున్నారు. పెద్దల వ్యవహారము వలన పిల్లలకు అర్థబోధ కలుగుతుంది. ఉత్తమ వృద్ధుడు ఒకడు 'ఘటమానయ' అనే వాక్యమును ప్రయోగించితే తదర్థము తెలిసిన మధ్యమవృద్ధుడు ఒక

ర్యమును ఆచరించుచున్నాడు. దానిని చూస్తూ ఉన్న
ాలుడు "ఈ మొత్తము వాక్యానికి కలశమును తీసికొని
ావడము అర్థము" అని గ్రహించును. ఈ వాక్యమును
)న వెంటనే ఆ బాలునికి ఆ అర్థము గోచరించుచున్నది.
ాబట్టి ఆ అర్థము వాచ్యమె. అందువలన వాక్యార్థము
ాచ్యమె అని అన్వితాభిధానవాదుల వాదసారము. వాక్య
ములో ఉన్న అభిధ వాక్యార్థమును బోధించుతుంది. ఇట్లా
ాక్యార్థము ప్రతిపన్నమవుతూఉంటే తద్విజ్ఞానానికై వ్యాపా
ాంతరమును అంగీకరింపవలసిన అవసరము లేదని తెలిసికోవాలి

తాత్పర్యపదవృత్తిని వాక్యార్థములో సమన్వయించి
ాపడము కూడా అసముచితము. ఈ వృత్తిలో తచ్ఛ
ము చే సంసర్గరూపమయిన వాక్యార్థము చెప్పబడదు. ఆ
చ్ఛబ్దమువలన రసాదిరూపమయిన సర్వప్రధానార్థము నె
గ్రహించాలి. రసాద్యర్థములోనే కవిసంరంభ విశ్రాంతి
ంటుంది. కాని సంసర్గరూపార్థములో కవిసంరంభవిశ్రాంతి
ండదు. ఈ రసాద్యర్థమును విషయముగా చేసికొను శబ్ద
ములు తత్పరములు. వాని భావము తాత్పర్యము. రసాద్యర్థ
మును ప్రత్యాయితము చేయు పదార్థశక్తియె తాత్పర్యము.
ది అభిధ కాదు. లక్షణ కాదు వ్యంజనయె. ఈ తాత్పర్యా
ము కూడా వ్యంగ్యార్థమె కాని అతిరిక్తము కాదు.

తాత్పర్యార్థమని చెప్పదగిన అర్థము వ్యంగ్యమే. వాక్యార్థ
మును తాత్పర్యమనరాదు. వాక్యార్థము వాచ్యమే. ఈ
ధముగా అర్థత్రైవిధ్యమె ప్రసిద్ధము యుక్తిసిద్ధమూను.
ాబట్టి నాల్గవ అర్థము దీని కన్న వేరుగా లేదు. అని సమా
ానము.

శబ్ద వృత్తులు

శబ్దము వృత్తి ద్వారముగా అర్థమును ప్రతిపాదించుతుందని ఇదివరలో చెప్పబడినది. ఆవృత్తియె వ్యాపారమని శక్తి అని అనబడును. వాచకశబ్దము అభిధావృత్తిద్వారమున వాచ్యమును లక్షకశబ్దము లక్షణావృత్తిద్వారమున లక్ష్యార్థమును వ్యంజకశబ్దము వ్యంజనావృత్తిద్వారమున వ్యంగ్యార్థమునూ బోధించును. ఇట్లా అభిధ లక్షణవ్యంజన అనే మూడు శబ్ద వృత్తులు ప్రసిద్ధములై ఉన్నవి.

గౌణి - లక్షణ

గౌణవృత్తికూడా లక్షణా ప్రభేదమేకాని అన్యము కాదు. కొందరు గౌణవృత్తిని అతిరిక్తముగా అంగీకరించుతారు. వారి వాదము ఈవిధముగా ఉంటుంది.

గుణములను నిమిత్తముగా చేసికొని ప్రవర్తించే వృత్తికి గౌణవృత్తి అని పేరు. "అగ్నిర్మాణవకః ముఖం చంద్రః" ఇత్యాదులు ఉదాహరణములు. ఈ ఉదాహరణములలో మాణవకునియందు అగ్నిత్వము ముఖమందు చంద్రత్వమూ సమారోపితమవుతున్నది. మాణవకుడు అంటె వటువు. వటువునందు పింగళత్వ పవిత్రత్వాది గుణములు ఉన్నవి. ఈగుణములను ఆధారముగా చేసికొని అగ్నిత్వము ఆరోపితమయినది. కాగా అగ్నిపదము వలన మాణవక బోధకలుగు తున్నది. మాణవక రూపార్థమును చెప్పడములో అగ్నిపదానికి సామర్థ్యము లేకపోయినా గుణాలు ఆసామర్థ్యమును సంపాదించు తున్నవి. ఇట్లాగే ముఖం చంద్రః అనే మొదలయిన స్థలాలలో కూడా గ్రహించాలి. ఇటు వంటిస్థలాలలో అగ్న్యాదిపదాలు గుణవృత్తిని ఆధార

ముగా చేసికొని మాణవకాద్యర్థములలో ప్రవర్తించుతున్నవి కాబట్టి ఇవి గుణవృత్త్యుదాహరణములు. అభిధాలక్షణావ్యంజనోదాహరణములలో ఇటువంటి విశేషము కన్పడదు. కాబట్టి దీనిని వేరుగా అంగీకరించాలి అని.

ఇది యుక్తము కాదు. గుణవృత్తిని వేరుగా అంగీకరింపవలసిన అవసరము లేదు. గౌణవృత్తి కూడా లక్షణా ప్రభేదమె. లక్షణ సంబంధానుపపత్తి మూలకము. గౌణవృత్తి కూడా సంబంధానుపపత్తిమూలకమె. కాబట్టి అది లక్షణ కన్న భిన్నము కాదు.

"గంగాయాం ఘోషః" అనేది లక్షణోదాహరణముకదా! గంగాప్రవాహము నందు ఘోషాధికరణత్వము ఉపపన్నము కాదు. గంగలో ఘోషము ఉండడము కుదరదు. కాబట్టి ఘోషాధికరణత్వాత్మకమగు అనుపపత్తి ఉన్నది. "గంగా తటమున ఘోషము" అనే లక్ష్యార్థమును అక్కడ అంగీకరించుతున్నాము. వాచ్యార్థమయిన ప్రవాహానికి లక్ష్యార్థమయిన తటానికీ సామీప్యసంబంధము ఉన్నది. ఇట్లా లక్షణా స్థలములలో సంబంధానుపపత్తులున్నవని గ్రహించాలి.

అగ్నిర్మాణవకః అనే గౌణవృత్త్యుదాహరణములో, అగ్ని కానివానియందు అగ్నిపదప్రయోగము ఉపపన్నము కాదు. ఇటువంటి అనుపపత్తి ఉన్నది. అగ్నిగుణములు మాణవకునియందు ఉండడమును బట్టి అగ్నిసాదృశ్యమును అక్కడ గ్రహించాలి. అందువలన అక్కడ సాదృశ్య సంబంధము ఉన్నది. మొత్తముమీద ఈ రెండు ఉదాహరణములలోనూ సంబంధము అనుపపత్తి అనేవి ఉన్నవి. కాబట్టి గౌణిని వేరుగా పరిగణింప నక్కరలేదు. సంబంధము ఒకచోట సామీప్యరూ

పము వేరొకచోట సాదృశ్యాత్మకము. ఇది అత్యంతమూ భేదకముకాదు. ఈ కొంచెపు అవాంతరభేదము ఉండడము వలననే గౌణి లక్షణాప్రభేద మవుతున్నది.

ఈ విషయములో ఒక శంక. గౌణికి లక్షణకూ ఈ చెప్ప బోవు ఒకింత భేదము ఉన్నదని అనవచ్చును. "అగ్నిర్మాణవకః" అనే గౌణీఉదాహరణములో అగ్నిసాదృశ్యవిశిష్టమాణవకుడు అని అర్థము. అగ్నిసాదృశ్య విశిష్టత్వమనేది అగ్నిపద లక్ష్యార్థము. ఈ లక్ష్యార్థములో సంబంధమయిన సాదృశ్యము విశేషణముగా అన్వయము పొందుతున్నది. "గంగాయాం ఘోషః" అనేలక్షణోదాహరణములో లక్ష్యమయిన తటము నందు సామీప్యసంబంధము విశేషణముగా అన్వయము పొందడము లేదె! "గంగా తటమున ఘోషము" అనేకదా అక్కడి అన్వయము! కాగా ఈ రెండూ సంబంధమూలకముగా ఎట్లా సామ్యమును పొందగలుగు తవి ? అని.

ఇది యుక్తముకాదు. లక్షణలో కూడా సంబంధము విశేషణముగా అన్వయము పొందక పోవడము లేదు. గౌణి ఉదాహరణములో అగ్నిసాదృశ్యము మాణవకుని యందున్నది. కాబట్టి "అగ్నిర్మాణవకః" అనే చోట అగ్నిసాదృశ్యవిశిష్ట మాణవక ప్రతిపత్తి వివక్షితమవుతున్నది. అట్లాగే "గంగాయాం ఘోషః" అనే చోట గంగాసంబంధవిశిష్ట తీర ప్రతిపత్తియే వివక్షితము. గంగాసంబంధము అవశ్యముగా తీరములో భాసించితీరాలి. తటము గంగాశబ్దము వలననె బోధింపబడుతున్నది. ప్రవాహము గంగాపదబోధ్యము, అనడము ప్రసిద్ధమె. తట ప్రవాహములు రెండూ ఏకపదబోధ్యము లవుతున్నందువలన తటములో ప్రవాహాత్మకత ఉండితీరుతుంది.

ఇదే గంగా సంబంధ విశిష్టత్వము అని గ్రహించాలి. ఏక శబ్దము వలన తెలియబడు స్రోత స్తీరములకు తాదాత్మ్యము గోచరమవుతుంది. అందువలననె అత్యంత పావనత్వ శీతత్వాది ప్రవాహధర్మాలు తీరాన భాసించును. అప్పుడే ప్రయోజన సిద్ధి కలుగుతుంది. ఈ విధముగా అంగీకరించడమె సముచితము. ఈ విధముగా అంగీకరించక పోయినట్లయితె ప్రయోజనములు సిద్ధములు కావు. గంగాగతములయిన శీతత్వాది ప్రయోజనాలు ఘోషములో భాసించవలె అనే అభిప్రాయముతోనే "గంగాయాం ఘోషః" అని లాక్షణిక ప్రయోగము చేయబడినది. ఇటువంటి స్థలంలో కూడా గంగాపదమును ఉపలక్షణముగా తలచడము యుక్తము కాదు. ఉపలక్షణముగా తలచినప్పుడు 'ఇది సముద్రాది తీరము కాదు. గంగాతీరమె.' అని గంగాసంబంధము మాత్రమె గోచరమవుతుంది గాని తీరద్వారమున ఘోషగత పవిత్రత్వాదులు సిద్ధించవు. ప్రయోజన ప్రతిభానములేక కేవల గంగా సంబంధము మాత్రమె అభిలషితమయినప్పుడు "గంగాతీరే ఘోషః" అనే ముఖ్యశబ్దాభిధానముకంటె "గంగాయాం ఘోషః" అనే లాక్షణిక ప్రయోగములో భేదమేమీ లేకపోతుంది. ముఖ్యలాక్షణిక ప్రయోగాలకు భేదముండడము ఉచితము. భేదము అక్కరలేదనడము యుక్తము కాదు. అట్లాగే అయితె ముఖ్యశబ్దము ఉండగా లాక్షణికమును ఎందుకు ప్రయోగించాలి ? తత్ప్రయోగానికి అవకాశమె ఉండదె ? కాగా గౌణిలో మాదిరిగా లక్షణలో కూడా సంబంధము విశేషణముగా అన్వయము పొందడము సమానమె. అందువలన గౌణవృత్తి కూడా లక్షణాప్రభేదమె.

లక్షణా భేదములు

గౌణిలక్షణలలో ఇటువంటి నిమిత్తభేదము ఉన్నది. అయినా గౌణిలక్షణలో అంతర్భవించు తుంది, కాబట్టే లక్షణ సాదృశ్య నిబంధనమని సంబంధ నిబంధనమని రెండువిధాలు. సంబంధ నిబంధనకము ౹ఐన లక్షణకూడా జహద్వాచ్య అని అజహద్వాచ్య అని రెండువిధాలు. సాదృశ్యనిబంధనకమయిన లక్షణ సారోప అని సాధ్యవసాన అని ద్వివిధము. ఇట్లా లక్షణ చతుర్విధ మవుతున్నది. వీని నామములను ఈ విధముగా గ్రహించాలి.

౧ సంబంధ నిబంధన జహద్వాచ్య లక్షణ
౨ సంబంధ నిబంధన అజహద్వాచ్య లక్షణ
౩ సాదృశ్య నిబంధన సారోప లక్షణ
౪ సాదృశ్య నిబంధన సాధ్యవసాన లక్షణ

వీని స్వరూపములు ముమ్ముందు విశదములగును. ఈ లక్షణా గౌణీ విషయములోని చర్చ గ్రంథాంతరములలో వేరొక విధముగా ఉన్నది. వానిని అక్కడనే చూడాలి. వాని వలన ప్రకృతము అంతగా ఉపయోగము లేదు. అందువలన వానిని ఇక్కడ నిర్దేశించడము లేదు.

కైశిక్యాదులు శబ్దవృత్తులుకావు

కైశికీవృత్తి ఆరభటీవృత్తి సాత్వతీవృత్తి భారతీవృత్తి అని నాలుగు వృత్తులు ఉన్నవి, కాని అవి శబ్దవృత్తులు కావు. శబ్దసందర్భాశ్రితములు. అవి కేవలమూ రచనను ఆశ్రయించి ఉంటవి. రసావస్థితిని సూచించుతవి. వృత్తి పద సామ్యమున వానిని వీనిలో కలుపరాదు. రసాద్యను గుణములై సముచితార్థ వ్యాపారములుగా ఉండేవి కైశిక్యాది

వృత్తులని, రసాద్యనుగుణములై సముచిత శబ్ద వ్యాపారము లుగా ఉండేవి వైదర్భ్యాదిరీతులని ధ్వన్యాచార్యులు పలుకు తున్నారు వారి భావమును అనుసరించి కైశిక్యాదులు అర్థ ప్రధానము లయినా శబ్దములు అకూడకూడా నాంతరీయక ములుగా ఉంటవి కాబట్టి వైదర్భ్యాది రీతిసాపేక్షత ఉన్న దని ధనికాదులు ప్రతిపాదించినారు. వారి విధానమును బట్టి కైశిక్యాదులు రచనాశ్రితములు అని అనడమూ యుక్తమె.

రచనకూడా రసవ్యంజక మగుట ప్రసిద్ధముగా ఉన్నది. కైశిక్యాదుల రసవ్యంజకత్వము రచనాధీనముగా ఉన్నది. కాని విభావాదులె రసవ్యంజకములనడము సముచితార్థము. రచన మొదలయినవి విభావాదులకు సహకారులు. ఇటువంటి సహకారిత్వము ఉండడమును బట్టి రసవ్యంజకము లని అన డము కూడా అయుక్తము కాదు. రచన రసానుగుణము కాక పోతే దుష్టమవుతుంది. అనుగుణవర్ణరచన రసవ్యంజకము కావడమూ అననుగుణ వర్ణరచన రసవ్యంజకము కాకపోవ డమూ అనుభవసిద్ధము. దీనిని అనుసరించి పరిశీలించగా కైశిక్యాదుల రసవ్యంజకత రచనాధీనమని స్పష్టము. వైద ర్భ్యాదిరీతుల స్వరూప వివేచనము మున్ముందు విశదమవు తుంది. వైదర్భి గౌడి పాంచాలి అనేవి రీతి విశేషాలు కాని అవి వృత్తులలో అంతర్భవించవు అని గ్రహించాలి.

అభిధ

ఇప్పటికి శబ్దజాతము అర్థజాతమూ నిరూపితమయింది. ఇక శబ్దములలోని వ్యాపారములను ప్రతిపాదించవలసిఉన్నది. వరుసగా అభిధ లక్షణ వ్యంజన అనేవానిని ఉద్దేశ క్రమాను సారముగా నిరూపించుతాము.

సంకేతితార్థగోచరమగు శబ్దవ్యాపారము అభిధఅవుతుంది. సంకేతము కలది సంకేతితము. శబ్దము, అర్థము వీనికి కల సంబంధనిశ్చయము సంకేతమనబడును. సంకేతితమయిన అర్థము సంకేతితార్థము. సంకేతితార్థమును విషయముగా చేసికొనిన శబ్దమందలి వ్యాపారమునకు అభిధ అని పేరు. సంకేతితమయిన అర్థము జాతిగుణద్రవ్యక్రియాత్మకమై నాలుగు విధములుగానుండును. గోత్వాదికముజాతి శుక్లాదికముగుణము చైత్రమైత్రాదిసంజ్ఞ ద్రవ్యము పాకాదికము క్రియ.

లక్షణ కాని వ్యంజన కాని సంకేతితార్థగోచరములుకావు. అందువలననె అవి శబ్దవ్యాపారములె అయినా వానియందు ఈ అభిధాలక్షణమునకు అతివ్యాప్తి లేదు. చేష్టలు సంకేతితార్థగోచరములె అయినా అవి శబ్దవ్యాపారములు కావు, కాబట్టి ఈ అభిధా లక్షణానికి చేష్టలలో అతి వ్యాప్తికలుగదు. అన్వితాభిధానవాదులు లక్షణలో కూడా సంకేతము ఉన్నదంటారు. కాబట్టి అక్కడ కూడా సంకేతితార్థగోచరత్వము ఉన్నది. అంతమాత్రాన ఈ లక్షణానికి లక్షణలో అతివ్యాప్తిని ఊహింపరాదు. లక్షణ శబ్ద వ్యాపారము కాదు. అభిధ శబ్ద వ్యాపారము కదా! శబ్దవ్యాపారపదమువలన ఆ అతివ్యాప్తి నిరాసము కలుగుతుంది. ఇది అన్వితాభిధానవాదుల మతమును అనుసరించి చెప్పినమాట. లక్షణ శబ్దవ్యాపారమని ఇది వరలో చెప్పబడినది. ఇప్పుడు అది శబ్దవ్యాపారము కాదు అని అంటున్నాము. ఈ విషయము మున్ముందు విశదమవుతుంది.

ఇటు వంటి ఈ అభిధ రెండు విధాలు. రూఢిపూర్విక అని యోగపూర్విక అని. అవయవార్థ మని సముదాయార్థ మని

అర్థము రెండువిధాల ఉంటుంది. పదముల వ్యుత్పత్తి బలమున కలిగే అర్థానికి అవయవార్థమనిపేరు. వ్యుత్పత్త్యర్థము కానిది సముదాయార్థము. కుంభకారుడు అనేపదమువలన కులాలుడు అనే అర్థము కలుగుతున్నది. "కుంభం కరోతీతి కుంభకారః" అని కుంభ కార పదవ్యుత్పత్తి. తద్బలమున కలిగిన కులాల రూపార్థము అవయవార్థమనబడును. కుశలుడు అనే పదానికి నిపుణుడు అని అర్థము. 'కుశాన్ లాతీతి కుశలః' దర్భలను కోయువాడు అని కుశలపదవ్యుత్పత్తి. నిపుణుడు అనే దీని అర్థములో వ్యుత్పత్త్యర్థము కలియడము లేదు. కాబట్టి ఇది సముదాయార్థము. అనాదిలోకప్రసిద్ధిని అనుసరించి కొన్ని పదాలకు సముదాయార్థమె చెప్పబడుతున్నది. అటువంటి చోట రూఢిపూర్వక అయిన అభిధ ఉన్నదని గ్రహించాలి. అవయవార్థముఉన్న చోట శబ్దములలో యోగపూర్వకఅయిన అభిధ ఉంటుందని గ్రహించాలి.

రూఢిపూర్వక ఉదా:—

తపోవిశేషైః ప్రథితైః ప్రజానాం శుభైశ్చరిత్రైః క్ష్మగతీ మహిష్యాః
భాగ్యైః ప్రభూతైర్భువనస్య చాస్య బిభర్తి రాజ్యం పంపీరుద్రః

ప్రసిద్ధములయిన ప్రజల కృచ్ఛ్రచాంద్రాయణాది తపోవిశేషములచేతా భూకాంతయొక్క గౌరీవ్రతాది శుభచరితముల చేతా ఈ భువనముయొక్క ప్రభూత భాగ్యములచేతా వీరరుద్రుడు రాజ్యమును భరించుతున్నాడు. ఈ పద్యములో శబ్దములన్నీ రూఢములు, దీనిలో తప, ప్రభృతి శబ్దాలకు అవయవార్థము లేదు. అనాది కాలమునుండి అవి సముదాయార్థ బోధకములుగానె ఉన్నవి. "ప్రకృష్టేన జాయంత ఇతి ప్రజాః" అని ప్రజాది శబ్దాలకు అవయవార్థము ఉన్న

"రూఢి ర్యోగమపహరతి" రూఢ్యర్థము యోగార్థమును తిరో భావించుతుంది. అనే నియామాన్నిబట్టి రూఢ్యర్థము నే గ్రహించాలి. ప్రజాశబ్దము వ్యుత్పత్తిబలాన అర్థాంతరమును ఏ మాత్రమూ బోధించడము లేదు. పంకజాదిపదాలవలె ఇది రూఢమె.

యోగపూర్వక ఉదా:—

రాజ్ఞి రుద్రనరాధీశే రంజయత్యఖిలాః ప్రజాః
భూ రన్వర్థా వసుమతీ రత్నగర్భా స్థిరేతిచ.

రాజయిన రుద్రనరాధీశుడు నిఖిల ప్రజలను రంజనము చేస్తూ ఉండగా భూమి వసుమతి, రత్నగర్భ స్థిర అని అన్వర్థ నామములు కలది అయినది. "రంజయతీతి రాజా" రంజనము చేయువాడు రాజు. "వసు ధన మస్యామ స్తీతి వసుమతీ" వసు వనగా ధనము. అది దీనియందు ఉన్నది. కాబట్టి ఇది వసుమతి "రత్నాని గర్భేయస్యాస్సా రత్నగర్భా" రత్నాలు గర్భ మందు కలది రత్నగర్భ. "తిష్ఠతీతి స్థిరా" ఉండునది కావున స్థిర. ఈ అవయవార్థములు ఆ యా శబ్దములలో ఉన్నవి. కాబట్టి అవి యౌగికములు. ఇంకా ఇక్కడ యోగరూఢాది విశేషములను ఇతర స్థలములలో గ్రహించాలి.

లక్షణ

వాచ్యార్థము అనుపపన్న మయినపుడు వాచ్యార్థమునకు సంబంధించిన అర్థవిషయమై ఆరోపితశబ్ద వ్యాపారము లక్షణ అవుతుంది. "గంగాయాం ఘోషః" అనే ఉదాహరణములో వాచ్యార్థమయిన ప్రవాహము ఉపపత్తి సంపాదకము కాలేదు. ప్రవాహసంబంధము ఉన్న తటము విషయమై శబ్ద వ్యాపారము ఆరోపితమవుతున్నది. కాబట్టి అక్కడ లక్షణ

ఉన్నది. శబ్దము ఒక అర్థమును చెప్పగానె దాని వ్యాపారము ఉపరతమవుతున్నది. కాబట్టి ఆశబ్దము అర్థప్రతిపాదనములో. వ్యాపారాంతరమును పొందలేదు. గంగాశబ్దము ప్రవాహ రూపార్థమును చెప్పి ఉపరత మయింది. మళ్ళా గంగాశబ్దము తటరూపార్థమును చెప్పలేదు. దానియందు వేరొక వ్యాపార మును స్వీకరించుట యుక్తముకాదు. కాబట్టి అక్కడ అర్థమె లక్షకము. అందుచేత లక్షణ అర్థవ్యాపారమే కావాలి. కాని వాచ్యధర్మము వాచకమునందు ఉపచరిత మవుతుందని నియమ మున్నది. తదనుసారముగా ఇక్కడ అర్థధర్మమయిన లక్షణ వాచకమగు శబ్దమునందు ఉపచరిత మవుతున్నది. అందుచే లక్షణ శబ్దవ్యాపారము కావచ్చును.

లక్షణను అంగీకరించడములో హేతువులు మూడు ఉన్నవి. అవి లక్షణాబీజములు అనబడును. ముఖ్యార్థబాధ ముఖ్యార్థసంబంధము ప్రయోజనము అనేవి లక్షణా బీజములు. లక్షణాబీజములు లేనపోతే లక్షణను అంగీకరించరాదు. "గంగాయాం ఘోషః" అనే స్థలములో లక్షణా బీజత్ర యమూ ఉన్నది. అందుచేత అక్కడ లక్షణను అంగీకరించ డము సముచితమె. పై ఉదాహరణములో ప్రవాహరూప మయిన ముఖ్యార్థము బాధితమవుతున్నది. లక్ష్యముగా అంగీక రించే తటానికీ ముఖ్యార్థమయిన ప్రవాహానికీ సామీప్యసంబం ధము ఉన్నది. కాబట్టి ముఖ్యార్థసంబంధము ఉన్నట్లు భావిం చాలి. శీతత్వపావనత్వాది ప్రయోజనాలు అక్కడ భాసించు తున్నవి. ఇట్లా ప్రయోజనముకూడా ఉన్నది. ఈ విధముగానే ఇతరోదాహరణములలో కూడా గ్రహించాలి.

మొదట చెప్పిన విభాగక్రమమును అనుసరించి లక్షణా భేదములను ఉదాహరించుతాము. వానిలో మొదటి భేదము సంబంధ నిబంధన జహద్వాచ్యలక్షణ. వాచ్యార్థము ఎక్కడ సర్వథా విడిచి పెట్టబడుతుందో అది జహద్వాచ్య, దీనినే జహల్లక్షణ అంటారు. వాచ్యార్థము ఉపయుక్తము కానందు వలన ఇందు విడువబడును. ఉదా:—

జేతుః కాకతిభూభర్తు రాకర్ణ్య పటహధ్వనిం,
సామంతనగరాణ్యుచ్చై రాక్రోశంతి సమంతతః.

జయశీలుడయిన కాకతిభూపతి పటహధ్వనిని విని సామంత నగరములు అంతటా ఉచ్చైస్స్వరముతో ఆక్రోశిస్తున్నవి. దీనిలో ఆక్రోశనమనేది ప్రాణిక్రియ. అచేతనమయిన నగరానికి సంబంధించదు. సామంతనగరములు బాగా ఆక్రోశిస్తున్నవి. అనే వాచ్యము అనన్వితము. ఆక్రోశన సిద్ధికొరకై నగర శబ్దము స్వార్థమును త్యజించుచున్నది. స్వనివాసి ప్రాణులను లక్ష్యముగా చేస్తున్నది. నగరస్థితజనులు ఆక్రోశనము చేస్తున్నారు. అని లక్ష్యార్థము. ఈ అర్థములో, వాచ్యమయిన నగరరూపార్థము జహద్రూపము అయినందు వలన జహత్స్వార్థ అని గ్రహించాలి.

అజహల్లక్షణకు ఉదాహరణము—జహల్లక్షణలో మాదిరిగా దీనిలో వాచ్యార్థము కేవలమూ విడిచిపెట్టబడదు. లక్ష్యార్థములో వాచ్యార్థము మిళితమై ఉంటుంది.

పత్యుః కాకతినాథస్య పాదపీఠీ మనారతం
స్ఫురద్రత్న ప్రభాజాలై రలంకుర్వంతి మౌళయః.

ప్రభువయిన కాకతినాథుని పాదపీఠమును శిరములు స్ఫురించుచున్న రత్నప్రభల సమూహములతో అనవరతమూ అలంకరించు తున్నవి. ఇక్కడ మౌళయః అనేది లక్షకపదము. కేవలమూ శిరములు అలంకారమును సంపాదించలేవు. అలంకుర్వంతి అని ఇక్కడ అలంకారము చెప్పబడినది. ఆ అలంకార సిద్ధికై మౌళులు తమకు ఆశ్రయభూతులయిన నృపతులను లక్ష్యముగా చేస్తున్నవి. నృపతులు మౌళిసహితులు. లక్ష్యములో వాచ్యముకూడా మిళితమై ఉన్నది. వాచ్యము జహద్రూపము కాలేదు. కాబట్టి అజహత్స్వార్థ అని గ్రహించాలి. స్వార్థమును విడిచి స్వార్థసహితార్థాంతరమునందు లక్షణ ఉన్నది.

ఇక్కట అభిధచే స్వార్థము చెప్పబడదు. అట్లే అయితే స్వార్థములో అభిధ అంశాంతరములో లక్షణ అవుతుంది అప్పుడు ఒకే శబ్దానికి ఒకే సమయములో వృత్తి(వ్యాపార) ద్వయము ఆపన్నమవుతుంది, ఆవిధముగా సమసమయములో వ్యాపారద్వయము ఉంటుందనడము యుక్తముకాదు. స్వార్థమును అభిధనుండి విడదీసి లక్ష్యముగా స్వీకరించాలి. అప్పుడే అజహత్స్వార్థ అనే వ్యపదేశము సముచితమవుతుంది. ఇంకా ఈ విషయములో అబాల సులభప్రసంగాలను ఆకర గ్రంథములలో దర్శించాలి.

సాంగోపనిబంధన సారోప లక్షణ ఉదా:—

మంథానాచల మూలమేచక శిలాసంఘట్టన శ్యామికా
కారం యత్తుహినద్యుతౌ స్ఫురతి తత్సారంగ మాచక్షతే
మన్యే నన్విహ వీరరుద్రనృపతేః కీర్తిశ్రియా నిర్జితః
తన్ముద్రాంక వరాహ మిందురు రసాబి భ్రత్సముజ్జృంభతే,

చంద్రునిలో, సముద్రమథనానికై కవ్వముగా అయిన మంధర పర్వతముయొక్క మూలనీల శిలాసంఘట్టనము వలన అయిన శ్యామికాకారము కన్పిస్తున్నది. దానిని కొందరు సారంగమని అంటున్నారు నేను ఇట్లా అనుకుంటాను. వీరరుద్ర నృపతి కీర్తిశోభచేత చంద్రుడు పరాజితుడయినాడు. ప్రతాపరుద్రుని ముద్రాంకమయిన వరాహమును ఉరమున ధరించుతూ సముజ్జృంభించుతున్నాడు. కాగా చంద్రునిలోనినలుపు ప్రతాపరుద్ర ముద్రాంకవరాహము. ఈ పద్యములో చంద్రకళంకరూపమయిన సారంగమందు వరాహత్వము సమారోపితమవుతున్నది. అందువలన సారోప.

విషయమూ విషయి రెండూ శబ్దోపాత్తములై ఉండగా అభేదప్రతిపత్తి కలిగినట్లయితే సారోప అవుతుంది "అగ్నిర్మాణవకః" అనే చోట ప్రకృత మాణవకుడు విషయము. అప్రకృతవహ్ని విషయి. ఈ రెండూ సామానాధికరణ్యమున అనగా సమానవిభక్తికములుగా ఉపాత్తములయినవి. "అగ్న్యభిన్నో మాణవకః" అని అభేదప్రతిపత్తి (జ్ఞానము) కలుగుతున్నది. అందువలన ఇది సారోప. ప్రకృతోదాహరణములో చంద్రకళంక కురంగము విషయము, ముద్రాంక వరాహము విషయి. రెండిటికీ అభేదప్రతిపత్తి కలుగుతున్నది. కాబట్టి సారోప.

విషయము ఉపాత్తము కాక విషయిచే నిగీర్ణమయినప్పుడు అభేదప్రతిపత్తి కలిగినట్లయితే అధ్యవసానము అని అనబడుతున్నది. "అగ్నిర్మాణవకః" అన్నట్లు విషయమూ విషయీ రెండూ ఉపాత్తములు కాకుండా "అగ్నిః" అని విషయి మాత్రమె శబ్దోపాత్తమయినప్పుడు మాణవకరూప

మయిన విషయము నిగీర్ణమవుతుంది. అట్లా నిగీర్ణమాణవకుని యందు అన్యభేదప్రతిపత్తి కలుగుతుంది. ఆవిధముగా ఉండటము నకు అధ్యవసాయమని పేరు విషయము ఆరోప విషయమని విషయి ఆరోప్యమాణమని కూడా వ్యవహారము ఉన్నది సాదృశ్య నిబంధన సాధ్యవసాయ లక్షణ ఉదా:—

కాకతీయ కులాంభోధేః ప్రభవత్యేష చంద్రమాః
కృతః కువలయోల్లాసో యే నోదయ ముపేయుషా.

కాకతీయకుల సముద్రమునుండి ఈచంద్రుడు ఉదయించు తున్నాడు. ఉదయము పొందిన ఈతడు కువల యోల్లాస మొన రించుతున్నాడు. కువలయోల్లాస పదానికి రెండర్థాలు. చంద్రుడు కువలయములకు కలువలకు సముల్లాసమును సంపాదించు తున్నాడని ఒకటి చంద్రపదముచే అధ్యవసితుడయిన ప్రతాప రుద్రుడు భూవలయమునకు ఉల్లాసమును ఇస్తున్నాడని రెండ వది. దీనిలో ప్రతాపరుద్రుడు విషయము. చంద్రుడు విషయి ప్రతాపరుద్రుడు నిగీర్ణుడయినాడు. శబ్దముచే వేరుగా చెప్ప బడలేదు. చంద్రశబ్దముననె చెప్పబడు తున్నాడు. చంద్రుడుగా అధ్యవసితు డవుతున్నాడు. చంద్రాభేద జ్ఞానము అక్కడ కలుగుతున్నది. కాబట్టి సాధ్యవసాయ.

శ్లోకములో "ఏషచంద్రమాః" అని ఉన్నది. ఏషః అనే పదమున ప్రతాపరుద్రుడు చెప్పబడడు. అట్లే అయితే అది కూడా సారోపయె అవుతుంది కాని సాధ్యవసాయ కానేరదు. "ఏషః" అనే పదము ఆరోప్యమాణమయిన చంద్రునిలో విశేషణము. అది చంద్రునిలో అభేదమున అన్వయించు తున్నది. అది విషయవాచకము కాదు. అందువలన అధ్యవసా యితకు భంగము లేదని గ్రహించాలి.

ఈ పద్యములోనే కాకతీయకులాంభోధి అని సారోప కూడా ఉన్నది. కాకతీయకులము అంభోధి అనే విషయము విషయి రెండూ శబ్దోపాత్తములయినవి. విషయి విషయములకు అభేదము గోచరమవుతున్నది. ఈ విధముగా పద్యములో లక్షణాంతరముకూడా సంబంధించి ఉండడము వలన విచ్ఛిత్తి విశేషము ఉన్నదని తెలుసుకోవాలి.

వ్యం జ న

ఈ విధముగా అభిధా లక్షణా రెండూ నిరూపితములయినవి. ఇక వ్యంజన క్రమ ప్రాప్తమవుతున్నది. దానిని నిరూపించాలి. ఆయాపదాలచే చెప్పబడిన ఆయా పదార్థములు ఆకాంక్షాది వశమున పరస్పరమూ సంబంధముకలవై అన్వయము పొందిన అనంతరము [సమన్వయశక్తికలిగి వాక్యార్థము ప్రతీతమయిన పిమ్మట ప్రకరణాదివశమున ప్రాకరణికార్థము పర్యవసితము కాగా] కావ్య శరీర భూత వాక్యార్థమును ఉపస్కరించడము (శోభింప చేయడము) లో సమర్థమైన, వాచ్యల వ్యతిరిక్తార్థాంతరమును గోచరముచేయు నట్టి శబ్దవ్యాపారము వ్యంజన అవుతుంది. ఈవ్యంజన అభిధానంతరము సముల్లాసము పొందుతుంది. తాత్పర్యము వేరుగా ఉన్నదని అంగీకరించేవారు కూడా వ్యంజన తాత్పర్యానంతర భావి అని అంగీకరింపవలసి ఉన్నది. లక్షణకు కూడా అనంతరమే ఈ వ్యంజన సముల్లసించుతుంది. లక్షణా తాత్పర్యశక్తి సమన్వితమైన అర్థమును విధురీకరించుతుంది. కాబట్టి తదనంతర భావియె కాని సర్వోత్తీర్ణము కాదు. సకల వ్యాపారములూ ఉడిగి పోయినపిమ్మట శోభాధాయకార్థ ప్రతిపాదనము చేయడానికి వ్యంజన సముల్లాసము పొందుతున్నది. కాబట్టి

వ్యంజన సర్వోత్కృష్టము. వాచ్యలక్ష్యములకంటె అతిరిక్త మయిన అర్థము వ్యంగ్యము. దానిని ఈ వ్యంజన ప్రతిపాదించు తుంది.

వ్యంగ్య రహితమయిన కావ్యము అనాత్మక శరీరము (శవ శరీరము) వలె అరమణీయము. ఈ వ్యంజనా ప్రతిపాద్య మయిన అర్థము కావ్యశరీరమయిన వాక్యార్థమును ఉపస్క రించుతుంది. వ్యంజన శబ్దవ్యాపారమని అనడము కేవలమూ ఉపలక్షణము. అర్థము కూడా వ్యంజకమే. అర్థము తెలియ బడని గీతాది కేవల శబ్దాలు కూడా వ్యంజకములే. నిష్ప్రతి తార్థకములయిన శబ్దములు వ్యంజకములని ఇక్కడ నిర్దిష్ట మవుతూనే ఉన్నది. శబ్దముచే ప్రతిపాద్యము కాని అర్థము కూడా వ్యంజకమని అంగీకృతము. కాగా వ్యంజనయందు శబ్ద వ్యాపారత్వము అర్థవ్యాపారత్వమూ ఉన్నదని గ్రహించాలి.

ఈవ్యంజన మూడువిధాలు. శబ్దశక్తిమూలకము, అర్థశక్తి మూలకము ఉభయశక్తిమూలకమూ అని.

శబ్దశక్తిమూలకవ్యంజన

హర్యాదిపదములు నానార్థకములు. అవి ప్రకృతార్థమును అప్రకృతార్థమునూ బోధింపగలవు. వాని యందున్న అప్ర కృతార్థమును తెలియజేసే శక్తి ప్రకరణాది బలమువలన నివారిత మవుతున్నది. అప్పుడవి ప్రకృతార్థమును మాత్రమె చెప్పగలవు. అయినా అప్రకృతార్థము గోచర మవుతున్నది. దానిని చెప్పడానికి వ్యంజనే కావాలి. ఇటువంటి స్థలములలో వ్యంజన శబ్దశక్తి మూలకము. ఉదా:—

వాహిన్యః కాకలీం ద్రస్య సర్వతోముఖ సంభ్రమాః,
కుర్వం త్యుద్విగ్నకంఠాభ్యం ప్రతిపక్షబలాప్లవం.

కాకతీంద్రుని సేనలు అన్నిముఖములా సంభ్రమముకలవై శత్రుబల సముద్రమును అతిశయించిన కబంధములచే పరిపూర్ణముగా చేస్తున్నవి. ఇది ప్రకృతార్థము. నదులు ఉదక సంభ్రమము కలవై అర్ణవమును జలబంధ సమృద్ధముగా చేస్తున్నవి. అని అప్రకృతార్థము. ఈపద్యములో వాహినీ సర్వతోముఖ కబంధ శబ్దములు నానార్థకములు. వీనికి సైన్యము సర్వవ్యాపిత్వము లూ సమస్త దేహమూ అని క్రమముగా ప్రకృతార్థములు. నది జలము ఉదక బంధము అనేవి అప్రకృతార్థాలు. వాహిన్యాదిపదాలు రెండర్థాలను చెప్పడానికి సమర్థములె అయినా అప్రకృతనదీజల వాచకత్వము అర్థప్రకరణాదికముచే నియంత్రిత మవుతున్నది. వాహిన్యాదిపదాలశక్తి ప్రకృతార్థము నందె నియమితమవుతున్నది. అది ఎంతగా నియమితమయినా నదీజలప్రతిపత్తి కలుగుతూనే ఉన్నది. దానిని కలుగ జేయడానికి శబ్ద శక్తి మూలకమయిన వ్యంజనయే సమర్థము. అభిధ ఈ అప్రకృతార్థ ప్రతిపత్తిని కలుగిచేయలేదు. కేవలమూ ప్రాకరణికార్థములో పర్యవసానము పొందుతూ ఉన్న అభిధకు ఈ అర్థప్రతిపాదనములో శక్తి ఉండదు కదా! అప్రాకరణికార్థము వలన వాక్యార్థానికి శోభకలగాలని వక్తకు వివక్ష ఉన్నది. కాబట్టే అప్రకృతము గోచరమవుతున్నది. అటువంటి ఆ అప్రకృతము ఇతరములవలన గోచరము కాదు. దానికొరకైవ్యంజనను అంగీకరించాలి. ఆవ్యంజన ప్రసిద్ధవ్యాపారా తిరిక్తమయిన వ్యాపారాంతరము. ఇది ఇటువంటి స్థలములో శబ్దమును విడిచిపెట్టి ఉండదు. అందువలన ఈవ్యంజన శబ్దవ్యాపారమె అని నిశ్చితము.

పోనీ! లక్షణవలన ఆ అర్థము గోచరము కావచ్చుకదా. అంటారేమో? అది యుక్తము కాదు. వాచ్యార్థములో అనుపపత్తి లేనందువలన లక్షణకూడా ఇక్కడ ప్రసక్తము కాదు. రూఢ్యతిరిక్త స్థలములో ముఖ్యార్థ బాధ లేనప్పుడు లక్షణ ప్రసరించడము ఉండదు.

ఇంతగా అభిధవలనా గోచరము కాక లక్షణవలనా గోచరము కాకుండా ఉండే అర్థము దేనికి? ఈవిధముగా ఒకే వాక్యానికి అనేకార్థములను కల్పించడము కూడా దోషమే అవుతుందేమో! అనికూడా భావించడము ఉచితముకాదు. లౌకిక వాక్యాలన్నీకూడా ప్రయోగించే వాని వివక్షాధీనములుగా ఉంటవి. కాబట్టి ఇక్కడ అనేకార్థత్వము దోషము కాదు. పౌరుషేయ వాక్యాలన్నీ కూడా సాధారణముగా ఈ విధముగానే ఉంటవి. ఒకఅర్థము అభిధాద్వారా ప్రతిపాదిత మవుతుంది. వేరొకటి వ్యంజనాద్వారా ఉపపాదిత మవుతుంది.

ఒక వాక్యములో వ్యాపారద్వయమున అర్థద్వయ ప్రతిపాదనము ఉన్నట్లయితే ఏకార్థతకు హానికలుగుతుంది. వాక్యభేదమనే దోషము వాటిల్లుతుంది. అప్పుడు ఆ అర్థము స్వీకార్యమవుతుందా? ఈ అర్థము స్వీకార్యమవుతుందా? అని శంక ఉదయించుచుతుంది. ఎప్పుడయినా ఒకే అర్థము స్వీకార్యము కావాలి కాని రెండర్థాలూ స్వీకార్యాలు కావు. ఏదో ఒక్క అర్థమును స్వీకరించితే రెండో అర్థమును విడిచి పెట్ట వలసిందే అటువంటి అర్థము అగ్రాహ్యమే అవుతుంది. కదా! అగ్రాహ్యార్థము ఉండగానే అప్రమాణతా బుద్ధి కలుగుతుంది. ఇదంతా వైదిక వాక్యాలలోని విషయము.

ప్రకృతస్థలాలలో అట్లా కాదు. ప్రకృతార్థ పరమయిన వాక్య మువలననే అప్రకృతార్థముకూడా భాసించాలని ప్రయోక్త యొక్క భావము. ఇటువంటివాక్యాలలో వాక్యభేద దోష మును ఊహింపరాదు.

ప్రకృతార్థమును ప్రతిపాదనము చేసేటప్పుడు అప్రకృతా ర్థము స్ఫురించేటట్లయితే ఆఅప్రకృతార్థానికి ప్రకృతార్థ ములో ఏదయినా సంబంధమును చెప్పితీరాలి. కాకపోయినట్ల యితే కవి అసంబద్ధమయిన అర్థమును చెప్పినవాడవుతాడు. అప్పుడాతని వచనాలలో ఉన్మత్తాదుల వచనాలలో వలె అశ్ర ద్ధేయత కలుగుతుంది. కాబట్టి ప్రకృతిస్థలములో ప్రతిపాదిత మయిన ప్రకృతార్థమగు సేనా వృత్తాంతమునకూ అప్రకృ తార్థమయిన నదీవృత్తాంతమునకూ ఔపమ్యమును సంబంధ ముగా నిశ్చయించాలి. అందువలన ఇక్కడ ఉపమాలంకారము వ్యంగ్యము సేనలు నదీ సదృశములు అని వ్యంగ్యోపమా స్వరూపము.

ఈపద్యములోనే "ప్రతిపక్షబలార్ణవం" అనేచోట శత్రు బలమునందు అర్ణవత్వము ఆరోపింపబడుట వలన రూపకా లంకారము వాచ్యముగా ఉన్నది. వ్యంగ్యమయిన అర్థము వాచ్యమయిన రూపకము యొక్క సిద్ధిలో అంగమవుతున్నది. ఏదయినా సమానధర్మము లేకపోతే ప్రతిపక్ష బలమునందు అర్ణవత్వారోపము కుదరదు. వాహినీ సర్వతోముఖ కబంధ శబ్దాలవలన గోచరమవుతూ ఉన్న అర్థాంతరము అర్ణవధర్మా లను నిరూపించుతున్నది. కాబట్టే వాహిన్యాదులు సమాన ధర్మ సమర్పకములు. ఈ విధమయిన వ్యంగ్యమగు అర్థాంత రము ఉంటేనే కాని అర్ణవత్వారోపము కుదరదు. అందువలన న

వ్యంగ్యమవుతూఉన్న అర్థము వాచ్యరూపక సిద్ధిలో అంగమన్నమాట. ఇట్లా వాచ్యసిద్ధ్యంగమయి నప్పుడు గుణీభూత వ్యంగ్యమె కాని ఉత్తమ వ్యంగ్యము కాదు. దీనిని ధ్వని అంటారు కాగా ధన్యుదాహరణ ప్రస్తావములో గుణీభూతో దాహరణము ఉచితము కాదు కదా! అని ఇక్కడ శంక కలుగ వచ్చును. అయినా వ్యంగ్యసామగ్రీ మాత్రమును ఇక్కడ ప్రదర్శించాలి. అనేది మాత్రమె ఇక్కడ అభిప్రాయము అని స్వీకరించే టట్లయితే ఈ చెప్పినది అంతగా దోషము కాదు

ఇంకా ఇక్కడ ఒక విషయమును గ్రహించాలి. శ్లేషాలంకారము మూడు విధములు. ప్రకృతశ్లేష అప్రకృతశ్లేష ప్రకృతా ప్రకృతశ్లేష అని. ఈ విధముగానే అలంకార ప్రకరణము లో విద్యానాథుడు నిరూపించుతాడు. విశేషణములు మాత్రమే శ్లిష్టములై విశేష్యము శ్లిష్టము కాకపోయినట్లయితే ఉభయ శ్లేషఅవుతుంది. విశేషణములూ విశేష్యమూ శ్లిష్టములయితే శబ్దశక్తిమూల ధ్వని అవుతుందని అతడి వ్యవస్థ కాగా ప్రకృతములో విశేష్యముగా ఎన్నదగిన "ప్రతిపక్ష బలార్ణవం" అనేది శ్లిష్టము కాలేదు. అందువలన ఇది ఉభయశ్లేష అవుతుందిగాని శబ్దశక్తిమూల ధ్వని కానేరదు. కాబట్టి దీనిని ధ్వని అని అనడము అనుచితము పూర్వాపర విరుద్ధమూను. విషయము ఈ విధముగా ఉండగా దీనిని శబ్దశక్తిమూల ధ్వని లక్ష్యముగా దేనికి ప్రదర్శించారు?

అనే ఇటువంటి శంకతో ఇక్కడ పరిశీలించినట్లయితే ఈ అర్థము అవి భాసించుతుంది. ప్రాచీనులయిన మమ్మట భట్టాదులు ఉభయశ్లేషను అంగీకరించరు. విశేష్యము శ్లిష్టమయినా కాకపోయినా భాసించే అర్థము అప్రకృతము అయినట్లయితే

శబ్దశక్తి మూలధ్వనియె అవుతుందని వారు అంగీకరించుతు న్నారు. ప్రప్రథమములో ప్రాచీనుల పథమును అనుసరించి ఉదహరించడము వలన ప్రరోచన కలుగుతుందని విద్యానాథుడు ఈ విధముగా చేసిఉంటాడు. అలంకార ప్రకరణములో ప్రదర్శింపబడ బోవు నదిస్వమతము. అక్కడ తన్నిరూపణమును అనుసరించి నిరుక్తార్థములను సవరించుకొనడము సముచిత పక్షము. విద్యానాథుని ఈ ప్రదర్శనము కేవలమూ పరీక్షక ప్రతిభా పరీక్షార్థమని అనడం కంటె ప్రాచీనోపజీవ్య పథ ప్రదర్శనార్థమని భావించుట సమంజసము. ఇక ఈ ప్రసక్తి చాలును.

అర్థశక్తిమూలము

వాచ్యార్థము స్వగత సౌందర్య విశేషము వలన అర్థాంతరమును అవగమింప చేస్తుంది. అక్కడ చెప్పేవాని (వక్త) విశేషము, వినేవాని విశేషము ప్రతిపాదింప బడే వాని విశేషము అట్లాగే దేశకాలాది విశేషములూ అర్థాంతర ప్రత్యాయనము (వ్యంగ్యము చేయుట) లో ఉపకరించుతవి. అక్కడ అర్థాంతరము వ్యంజన వలననే గోచరమవుతుంది. ఈ వ్యంజన వాచ్యార్థావలంబనము వలన ఉదయించుతుంది కాబట్టి దీనిని అర్థశక్తి మూల వ్యంజన అనడము యుక్తము. శబ్దశక్తి మూలములో వాచ్యార్థము సహకారి అవుతుంది. అర్థశక్తి మూలములో శబ్దము ఉపకరించేది అవుతుంది. కాబట్టి ఒక దాని యందు వేరొక దానికి సహకారిత్వము ఉన్నదని గ్రహించాలి. ఉదా:—

శ్రుత్వా కాకతిభూభర్తుః క్షోణీ పాణిగ్రహోత్సవం
అంగుష్ఠే నాలిఖన్ భూపాః పాదపీఠం నతాననాః

కాకతి భూమిరుద్రుని క్షోణీపాణి గ్రహణోత్సవమును విని సామంత భూపతులు వినతాననులై పాదపీఠిని అంగుష్ఠముతో లిఖించినారు. దీనిలో సామంత భూపతులు విషణ్ణులయినారు. అని అర్థశక్తి మూలవ్యంజన వలన గోచరమవుతున్నది. విషణ్ణులు=విషాదము కలవారు. విషాదము ఒక సంచారి భావము. భావములు అసంలక్ష్యక్రమ వ్యంగ్యములు అని ఆలంకారిక సిద్ధాంతము. అయినా రసభావాదులు సంలక్ష్యక్రమములు కాకపోవు. ఇక్కడ విషాదమునకు నతానన సత్వము అనుభావము. ఈ నతాననసత్వము అనేక కారణముల వలన కలుగవచ్చును. నియత కారణము వెంటనే గోచరము కాదు. దానిని తెలిసికొనుటకు ప్రకరణాది పర్యాలోచనము ఆవశ్యకము. అప్పుడు వీరరుద్ర ధరణీ పరిణయ శ్రవణాను సారమున విషాదము హేతువుగా గోచరమవుతుంది. ఇట్లా విషాదము విలంబముగా ప్రతీయమానమవుతున్నది. కాబట్టి సంలక్ష్యక్రమము.

ఈ విధముగా విషాదరూపమయిన వ్యంగ్యము అర్థశక్తి మూలకము. దీనిని కొందరు అనుమానగమ్యమని అంటున్నారు. వారి భావము ఈ విధముగా ఉంటుంది ప్రత్యక్షముగా గోచరము కాని దానిని అనుమానముతో ఊహింపవచ్చును. అనుమానములో ఊహింపచేసే దానికి హేతువని సాధనమని గమకమని పేరు. ధూమము వలన అగ్నిని అనుమానింపవచ్చును. పర్వతమునందు ధూమముకనపడి నట్లయితే అక్కడ అగ్ని ఉన్నదని ఊహించుతాము. ధూమము ఉండే స్థలములో అంతటా అగ్ని ఉంటుంది. కనుకనే ధూమము సాధనమై అగ్నిని సాధ్యము చేస్తున్నది. సాధ్యమునకు ఆశ్రయముగా

ఉండేది పక్షము అవుతుంది. ప్రకృతములో నతాననత్వము హేతువుగా విషణ్ణత్వమును సాధింపవచ్చును. విషణ్ణత్వమునకు ఆశ్రయులయిన సామంతరాజులు పక్షములవుతారు. ఇట్టి అనుమాన విధానముననే రాజులు విషణ్ణులయినారు. అనే అర్థము గమ్యమవుతూ ఉండగా దానికొరకై అర్థశక్తి మూలకముగా వ్యంజనను అంగీకరించుట వ్యర్థము. అని అనుమానవాదుల వాదము.

కాని ఇది సముచితము కాదు. అర్థశక్తి మూలవ్యంజనములో అనుమానశంక యుక్తము కాదు. అనుమానములో వ్యాప్తి ఉండడము అవసరము. వ్యాప్తి అనగా సాధ్యసాధనముల నియత సంబంధము. ఇటువంటి నియతి ఉన్నపుడే అనుమానశంక ఉచితమవుతుంది. వ్యాప్తి లేనపుడు అనుమాన రచన ప్రసారము పొందదు. "యత్ర యత్ర ధూమః తత్ర తత్ర అగ్నిః" అనే వ్యాప్తి సుమరు బాటును పొందుతుంది కాబట్టి ధూమ హేతుకముగా వహ్నిని సాధ్యము చేయవచ్చును. ప్రకృతపద్యములో వ్యంగ్యవ్యంజకములుగా ఉన్న విషణ్ణత్వ నతాననత్వములకు అవినాభావము (అనగా నియత సాహచర్యము వ్యాప్తి) లేదు. నతాననత్వము అనేక కారణముల వలన కలుగవచ్చును. గురువందనము జేసే శిష్యుడు వినత శిరస్కుడవుతాడు. లజ్జాభరాలస అయిన లలన వినత వదన అవుతుంది భారాలసుడయిన భటుడు నతాననుడు అవుతాడు. "యత్ర యత్ర నతాననత్వం తత్ర తత్ర విషణ్ణత్వం" అనే వ్యాప్తి ఇక్కడ లేదు. నతాననత్వము ఉన్నా లజ్జాభరాలస లలనలో విషణ్ణత్వము లేదు. కాబట్టి నియతంగా నతాననత్వం వలన విషణ్ణత్వము గమ్యము

కాజాలదు. అందువలన అనుమానము ఉచితము కాదు. నియతమయిన కారణ ప్రతీతి కవి వివక్షాసహాయము కలిగిన వ్యంజకశబ్దము వలననె కలుగుతుంది. ఇంకా ఒకేవ్యంజకము వలన ఆయా నానావ్యంగ్యార్థముల ప్రతీతి కలుగవచ్చును. ఇట్టి నానా వ్యంగ్యార్థ ప్రతీతి వక్తృవివక్షాను సారముగా ఉం టుంది. సూర్యుడు అస్తంగతుడయినాడు అనే వాక్యస్థల ములో వివక్షాభేదమును బట్టి అనేకార్థములు గోచరములు కావడము సుప్రసిద్ధమై ఉన్నది. ఈ విషయము ఇదివరలో నిరూపితమే. అనేకవ్యంగ్యార్థప్రతిపత్తి అనుమాన పరిపాటీ విరుద్ధము. వ్యంగ్యము అనుమేయమూ అనేవి అత్యంతమూ విలక్షణములు. కాబట్టి వ్యంజనము అనుమానము కాదు.

అభిధయె ప్రతీయమానార్థములలో కూడా ప్రవర్తించుతుం దని మీమాంసకులు అనడము సముచితము కాదు. అభిధా వృత్తికి సంకేతార్థమునందే పరిచయ మున్నది. అది ప్రతీయ మానార్థములో ప్రసరించలేదు. మీమాంసకులుకూడా వ్యంజనమును అవశ్యముగా స్వీకరించాలి. ఈ విషయవిస్తర మును గ్రంథాంతరములలో విశదముగా గ్రహింపవచ్చును. ఇంతటి ఈ గమనికను అనుసరించి అర్థశక్తి మూలవ్యంజన విషయమును వివిక్తముగా ఎఱుంగవలయును.

ఉభయశక్తి మూలకము

శబ్దశక్తి మూలకము నందు నానార్థకములయిన శబ్ద ములు ప్రవేశము పొందును. అవి పరివృత్తి సహములు కావు. అర్థ శక్తి మూలకములో నానార్థ బోధక పదములు పరివృత్తి సహములగును. శబ్ద శక్తి మూలకములో అర్థశక్తి సహ కారితవుంటుంది, పరివృత్తిసహిష్ణువులుపరివృత్త్య సహిష్ణువులు

అయిన పదములు కూర్పబడు నపుడు ఉభయశక్తి మూలక వ్యంజన ఉంటుందని గ్రహించాలి. ఉదా:—

విజితారిపురో మూర్త్యా విలసత్సర్వమంగళః
రాజమౌళి రసౌ భాతి రుద్రదేవో జగత్పతిః

ప్రకృతార్థము:— శత్రుపట్టణములను జయించిన వాడును స్వరూపములో విలసించునట్టి నిఖిలమంగళములు కలవాడును రాజ చూడామణియు జగత్ప్రభువూ అయిన ఈ ప్రతాపరుద్రుడు భాసించుచున్నాడు.

అప్రకృతార్థము :- అరిపురముల జయించినవాడునూ స్వరూపమున శోభించు సర్వమంగళ (పార్వతి) కలవాడునూ శిరమున చంద్రుడు కలవాడునూ జగత్పతియూ అయిన శ్రీ శివుడు భాసించుచున్నాడు.

ఈ పద్యములో "విజితారిపురః జగత్పతిః" అనేవి అర్థశక్తి మూలకములు. "విలసత్సర్వ మంగళః రాజమౌళిః" అనేవి శబ్దశక్తి మూలకములు. అందువలన ఇక్కడ వ్యంజన ఉభయశక్తి మూలకముగా ఉన్నది. ప్రతాపరుద్రునకూ శ్రీ శివునకూ ఔపమ్యము గోచర మవుతున్నందువలన ఉపమాలంకారధ్వని.

కైశిక్యాదివృత్తులు

మొదటి సంగ్రహకారికలోని ఉద్దేశ క్రమానుసారముగా గుణాలంకారములను చెప్పవలసి ఉన్నది. అయినా అవి బహువక్తవ్యములగుట వలన ఇక్కడ ఉపేక్షితములు. వేరు వేరుగా అవి వాని వాని ప్రత్యేక ప్రకరణములలో నిరూపితములగును. శబ్దవృత్తి నిరూపణానంతరము వృత్తిపద

సామ్యమును బట్టి కైశిక్యాది వృత్తుల స్వరూప నిరూపణము ఇక్కడ ఉపక్రాంతమగును.

అత్యర్థ సుకుమారార్థ సందర్భా కైశికీ మతా
అత్యుద్ధతార్థ సందర్భా వృత్తి రారభటీ స్మృతా,
ఈషన్మృద్వర్థ సందర్భా భారతీ వృత్తి రిష్యతే,
ఈషత్ప్రౌఢార్థ సందర్భా సాత్వతీవృత్తి రిష్యతే.

అత్యంతమూ సుకుమారమయిన అర్థసందర్భము ఉన్నట్లయితే కైశికీవృత్తి అవుతుంది. అత్యుద్ధతార్థసందర్భము ఉన్నప్పుడు ఆరభటీవృత్తి కొంచెము మృదువయిన అర్థ సందర్భము ఉన్నట్లయితే భారతీ వృత్తి అవుతుంది. ఈషత్ప్రౌఢార్థ సందర్భము కలదయితే సాత్వతీవృత్తి అవుతుందని సాహిత్య విదులు అంగీకరించు తున్నారు.

శృంగారము కరుణమూ అనే రెండు రసములూ అత్యంత సుకుమారములు. రౌద్రభీభత్సములు అత్యుద్ధతరసములు. హాస్యము శాంతమూ అద్భుతమూ అనే మూడు రసములూ కించిత్సుకుమారములుగా కీర్తితములు. వీరభయానక ములు రెండూ ఈషత్ ప్రౌఢములు. శృంగార కరుణరస ములు అతికోమల సందర్భమున వర్ణింపబడిన స్థలములో కైశికీవృత్తి అని, రౌద్రభీభత్సములు అతి ప్రౌఢసందర్భమున వర్ణింపబడిన స్థలములో ఆరభటీవృత్తి అని, నాతిసుకుమారము లయిన హాస్య శాంతాద్భుతములు నాతిసుకుమారమయిన సందర్భమున సంగ్రథితము లయినప్పుడు భారతీ వృత్తి అనీ నాతిప్రౌఢములయిన వీరభయానకములు నాతి ప్రౌఢరచనలో నిర్వహింపబడినపుడు సాత్వతీవృత్తిఅనీ గ్రహించాలి. గ్రంథాంత రములలో వీని భేదప్రభేదములు అనేకములు నిరూపితము

లయినవి. వానిని అక్కడనే దర్శించాలి. యథాక్రమముగా వీనిని ఉదాహరింతుము.

కైశికీవృత్త్యుదాహరణము

జితమదనవిలాసం కాకతీయాన్వయేందుం
నరపతి మనిమేషం ద్రష్టు మాశంసినీనాం,
సపది విరచితాసీ దంగనానా మపాంగైః
దివి కువలయ దామ శ్యామలా తోరణశ్రీః.

మదనుని రూపవిలాసముల జయించినట్టి కాకతీయాన్వయ చంద్రుడయిన ప్రతాపరుద్ర నరపతిని రెప్పపాటు లేకుండా చూడ వలెనని అంగనలు ఉవ్విళ్లూరుతున్నారు. అప్పుడు ఆ అంగనల అపాంగములచేత ఆకాశములో కువలయదళ శ్యామలమయిన తోరణశోభ విరచితమయినది. దీనిలో నరపతి విషయకము అంగనాగతమూ అయిన రతి సముచిత విభావాదుల వలన సముల్లసితమై రసీభావము పొందుతున్నది. అసంయుక్త కోమల వర్ణ సందర్భమున శృంగార వర్ణనము ఉన్నది. కాబట్టి ఇది కైశికీవృత్తిశోభితము మహా కులీనతాది గుణగణము కలిగిన విదగ్ధనాయకుడు. ఆలంబన విభావము లోకోత్తర రూపయౌవనాదులు ఉద్దీపన విభావములు. అపాంగ ప్రసరణాదికము అనుభావము. ఔత్సుక్యాదికము వ్యభిచారి. వీనిచే రతి రసీభావము పొందుతున్నది. విభావాదుల స్వరూపము రసప్రకరణములో విశదమగును.

ఆరభటీ వృత్త్యుదాహరణము

ఖడ్గాఘాత నికృత్త శాత్రవశిరో నిష్ఠ్యూత రక్తచ్ఛటా
జాలై రుచ్ఛట శస్త్రఘట్టన భవత్స్ఫుర స్ఫులింగోత్కరైః,

స్త్యానాసృక్పిశితాస్థి ఖండ వికట స్థూలోజ్జ్వలాంగారకైః
ఉచ్చండ శ్చలమర్తిగండ నృపతేః క్రోధాగ్ని రాయోధనే.

చలమర్తి గండడు అనే బిరుదము కలిగిన ప్రతాపరుద్ర నృపతియొక్క క్రోధాగ్ని యుద్ధములో ఉచ్చండమై ఉన్నది. శాత్రవుల శిరములు ఖడ్గాఘాతమున నరుకబడినవి. ఆ నికృత్త శిరములనుండి రక్తచ్ఛటల సమూహములు ప్రసరించుతున్నవి. సమతిశయిత శస్త్రఘట్టనముల వలన గొప్ప స్ఫులింగ జాలములు ఉత్పన్నము లవుతున్నవి. ఘనీభూతమయిన రక్తము మాంసము అస్థిఖండములూ ఉన్నందువలన వికట స్థూల సముజ్జ్వలాగ్నికణములున్నట్లుగా క్రోధాగ్ని ప్రచండమై ఉన్నది. దీనిలో రౌద్ర బీభత్సములు పరుష వర్ణముల వికట బంధములో ప్రతిపాదితములయినవి. శస్త్రోల్లాసాదికము వలన రౌద్రమూ, రక్త మాంసాదులవలన బీభత్సమూ సూచితము లవుతున్నవి.

భారతీ వృత్త్యుదాహరణము

ఔన్నత్యం మహదన్యదేవ మహితః కోప్యేష గంభీరిమా
చాప్యన్యా సరణిః ప్రతాపయశసో రన్యైవ వాహ్వోః ప్రథా,
సర్వం నూతనమేవ రుద్రనృపతేః జానే న తన్నిర్మితౌ
సామగ్రీ చతురాననేన కియతీ ? కీదృక్క్రమా కల్పితా.

ఆ మహౌన్నత్యము వేరు. మహితమయిన ఈ గంభీరిమ చెప్పనలవి కానిది. ఆయశః ప్రతాపముల మార్గము కూడా లోక విలక్షణమె. బాహువుల ప్రఖ్యాతి విజాతీయము. రుద్ర నృపతికి సంబంధించినది సర్వమూ నూతనమె కదా ? ఆ ప్రతాపరుద్రుని నిర్మాణములో చతురాననుడు ఎంతటి ఎటువంటి సామగ్రిని ఎక్కడ కల్పించినాడో తెలియకుండా

ఉన్నాను. దీనిలో సంయుక్త మృదుబంధము ఉన్నది. అది అద్భుత రససూచకము. వీరరుద్ర దర్శనము వలన కలిగిన విస్మయము సముచిత విభావాది సముల్లసితమై అద్భుతరసము అవుతున్నది.

సాత్త్వతీవృత్త్యుదాహరణము

దూరాదాకర్ణ్య విశ్వప్రసృమర మహసో వీరరుద్రస్య జైత్ర
ప్రస్థానారంభ భేరీ నినద మరినృపాః పూర్ణ కర్ణజ్వరార్తాః
ఆరుహ్యాద్రీన్ విశంతో గహన మతిమహత్కంటకాకృష్ట కేశా
స్త్రాయధ్వం ముంచతేతి ప్రతినృపతి ధియా పాదపాన్ ప్రార్థయంతే.

వీరరుద్రుని పరాక్రమము ప్రపంచములో ప్రసరించు స్వభావము కలదిగా ఉన్నది. అటువంటి వీరరుద్రుని జైత్ర ప్రయాణ ప్రారంభములో వెలువడిన భేరీనాదమును శత్రుభూపతులు విని పూర్ణకర్ణ జ్వరము కలవారై పీడితు లయినారు. భయ త్రస్తులయినారు. వారు పర్వతములను ఎక్కి అరణ్యములను ప్రవేశించుతూఉండగా కంటకి వృక్షాలు వారి కేశములను పట్టుకొన్నవి. ఆ శత్రుభూపతులు అప్పుడు ప్రతిభూపతులు వచ్చి జుట్టు పట్టుతున్నారనే భావముతో "రక్షింపుడు, విడిచి పెట్టుడు" అని వృక్షాలను ప్రార్థించుతున్నారు. దీనిలోవికట మయిన బంధము పరుష మయిన వర్ణ సందర్భమూఉన్నది. దీనివలన భయానకము ప్రతిపాదిత మవుతున్నది.శత్రు నృపతి లోని భయములో భేరీనినద శ్రవణము ఆలంబనవిభావము. పర్వతా రోహణా రణ్యప్రవేశములు అనుభావములు. జ్వర శ్రమగ్లాన్యాదులు సంచారులు. వీని వలనభయముభయానక రసము అవుతున్నది. కాబట్టి ఇది సాత్వతీ వృత్తి.

మధ్యమారభటి మధ్యమకైశికి

మధ్యమారభటి మధ్యమకైశికి అని రెండు వృత్తులు సర్వ. రస సాధారణములై ఉన్నవి. వీని స్వరూపమును ఈ విధముగా గ్రహించాలి. మృదువయిన అర్థము ఉన్నప్పటికీ అనతి ప్రౌఢబంధము ఉన్నట్లయితే మధ్యమకైశికి అవుతుంది శృంగార కరుణములు అతిసుకుమారములే. అయినా అల్ప ప్రౌఢత్వము దోషము కాదు. కాని అతిప్రౌఢసందర్భము మాత్రము సమ్మతము కాదు. అతిప్రౌఢసందర్భము ఉంటే ప్రతికూలవర్ణము అనే దోషము సంభవిస్తుంది. ప్రౌఢార్థము ఉన్నప్పటికీ ఒకింత మృదువిన్యాసము ఉన్నపుడు మధ్యమారభటి అవుతుంది. రౌద్ర బీభత్సములు అతి ప్రౌఢము లై అయినా ఈషన్మృదుబంధము దోషావహము కాదు. కాని అతిమృదు సందర్భము విరుద్ధము. యథాక్రమముగా వీని ఉదాహరింతుము

మధ్యమ కైశికి

ఆసన్నేపి మహోత్సవే కథమిదం స్వక్త్వాపి ప్రవాసం వ్రజేః?
ధిక్! ధిక్!! సాహస మావయో ర్విఘటనం కో వా విధిః కాంక్షతి?
ఇత్థం స్వప్ననివారిత ప్రియతమ ప్రస్థానబుద్ధి స్తలో
బుద్ధ్వా మూర్ఛతి కాకతీయనృపతే! త్వద్వైరి నారీజనః,

మహోత్సవము సమాసన్నమయినది కదా! నన్ను విడిచి నీవు ప్రవాసము ఎట్లా వెళ్ళుతావు? నీ సాహసము యుక్తముగా లేదు. ధిక్! ధిక్!! మనకు విఘటనము కలుగ డమును ఏదైవము కాంక్షించుతుంది? అని ఈ విధముగా ఓ కాకతీయనృపతీ! నీ వైరి నారీజనము స్వప్నములో ప్రియ తముని ప్రస్థానాభిలాషమును నివారించుచుతూ నిద్రనుండి మేల్కొని మూర్ఛ పొందుతున్నది. ఇది భర్తృవియోగము

కలిగిన శత్రుస్త్రీవచనము. దీనియందు ఈషత్ ప్రౌఢసందర్భము ఉన్నది. శృంగార సంకీర్ణ మయిన కరుణ రసము దీనిలో ప్రతిపాదిత మవుతున్నది. స్వప్నములో ప్రణయ శృంగారము జాగ్రదవస్థలో కరుణమూ నిరూపణము పొందిన వని ఊహించాలి.

మధ్య మారభటి

మాంసకీకస సంకీర్ణాః ప్రసరద్రుధి రాపగాః
వసా కర్దమితా యుద్ధే భువోఽన్ధ్రి సుభటైః కృతాః

యుద్ధములో ఆంధ్రసుభటులు భూప్రదేశములను మాంసముతో సన్నని ఎముకలతో సంకీర్ణములనుగా నెత్తురుటేరులు ప్రవహించే టట్లుగా మెదడుఅనే బురద కలుగునట్లుగా చేస్తున్నారు. జుగుప్స స్థాయిగా కలిగిన బీభత్సరసము దీనిలో వర్ణితమైనది. సందర్భము ఈషన్మ్రదువుగా ఉన్నది. కాబట్టి మధ్యమారభటి. ఈ విధముగానే రసాంతరములలో కూడా ఉదాహరణములను గ్రహించాలి.

రీతులు

వైదర్భీ గౌడీ పాంచాలి అనేవి రీతులు. కొందరు వీటిని వృత్తులంటారు. అంత మాత్రాన కైశిక్యాది సామ్యమును ఊహించరాదు. వైదర్భ్యాది రీతులుశబ్దగుణములయిన మాధుర్యాదులను ఆశ్రయించి ఉంటవి. అవిఅర్థ విశేషమునుఅపేక్షించవు. కనుకనె శృంగారాది నిరపేక్షములు. కేవలము శబ్దముల సందర్భములోని సౌకుమార్యమును ప్రౌఢత్వమునూ మాత్రము అవి విషయముగా చేసికొనును. మాధుర్యాదులు రసధర్మములె అయినా రీతులు రస నిరపేక్షములె. రసాశ్రిత మాధుర్యాది శబ్దధర్మ పరత్వము వైదర్భ్యాదులకు ఉన్నది.

కైశిక్యాదులు సాత్త్వా ప్రదసపరములు. కాబట్టి కైశిక్యాదులకూ వైదర్భ్యాదులకూ భేదము అధికముగా ఉన్నది.

అసంయుక్తము లయిన కోమల వర్ణముల బంధము ఉన్నప్పుడు సందర్భము (రచన) అతి మృదువుగా ఉన్నదని, పరుష వర్ణములతో వికటబంధము ఉన్నపుడు రచన అతి ప్రౌఢమని సంయుక్తము లయిన మృదువర్ణములు ఉన్నపుడు రచన ఈషన్మృదువని, అవికట మృదు వర్ణము లున్నపుడు రచన ఈషత్ ప్రౌఢమని గ్రహించాలి. ఇకరీతుల స్వరూపోదాహరణములు.

రీతి సామాన్య లక్షణము

రీతిర్నామ గుణాశ్లిష్ట పదసంఘటనా మతా

గుణములతో కూడుకొనిన పదముల సంఘటనకు రీతి అని పేరు. మాధుర్యాది గుణ పరతంత్రము లయిన శబ్దముల సందర్భమె రీతి. ఓజః ప్రసాదాది గుణ విశిష్ట పదరచన రీతి అవుతుంది. శ్లేష మొదలయిన గుణాలు గుణప్రకరణములో నిరూపితము లవుతవి. మాధుర్యము, ఓజస్సు, ప్రసాదమూ అనేవి మూడే గుణాలని వ్యంగ్యవాదులకు సమ్మతము. విద్యానాథుడు వ్యంగ్యవాదియె అయినా శ్లేషాది గుణదశకమును అంగీకరించుచున్నాడు. అంతేకాదు భోజరాజ మతానుసారముగా ఇరవై నాలుగు గుణాలను ఉల్లేఖించు తున్నాడు. కాబట్టి శ్లేషాది గుణాశ్లిష్ట పదసంఘటన రీతిఅని గ్రహించవచ్చు. అటువంటి రీతి వైదర్భి గౌడి పాంచాలి అని త్రివిధము. విదర్భ దేశములో అధికముగా గౌరవింపబడడము వలన వైదర్భి అనే పేరు కలిగింది గౌడ దేశ వ్యవహారము వలన గౌడి అయింది. పాంచాలదేశ ప్రచారమువలన పాంచాలి

అయింది. ఈవిధముగా ఇవి ఆయా దేశాలలోని విదగ్ధ జన పరిగ్రహామును బట్టి ఆయా సంజ్ఞలను పొందినవి.

వైదర్భి

బంధపారుష్యరహితా శబ్దకాఠిన్య వర్జితా
నాతిదీర్ఘసమాసా చ వైదర్భీ రీతి రిష్యతే.

దుస్సంధులవలన బంధములో పరుషత్వము కలుగుతుంది. వైదర్భి ఇటువంటి బంధపారుష్యముతో రహితమైనదిగా ఉండాలి. పరుష వర్ణములతో రచన ప్రారంభింపబడినట్లయితే శబ్ద కాఠిన్యము కలుగుతుంది. శబ్దకాఠిన్య వర్జితమై ఉంటేనే వైదర్భి అవుతుంది. దీనిలో దీర్ఘ సమాసములు ఉండరాదు. రచన సమాస రహితముగా ఉండాలి. మధ్యమ సమాస అయిన రచన అయినా ఉండవచ్చును. ఇటువంటిది వైదర్భి.

ఉదా:—

కాకతీయ నరేంద్రస్య కీర్తిచందనచర్చనం
దిగంగనా వితన్వంతి వతంసీకృత తద్గుణాః

దిగంగనలు కాకతీయ నరేంద్రుని గుణములను కర్ణాభరణములనుగా చేసికొని ఆతని కీర్తిని చందనపు పూతగా అలము కొంటున్నారు. ఇందలి రచనలో పారుష్యము లేదు.

వేరొక ఉదా:—

వితరణగుణ లీలా తోషితాశేషలోకే
విభవతి నరనాథే కాకతీయాన్వయేందౌ
సురతరుగణనాయాం కామధేను ప్రసంగే
క్షితిజన సురతేయం వీతకౌతూహలాఽసీత్.

కాకతీయాన్వయ చంద్రుడయిన నరనాథుడు దానలీలచే అశేషలోకమునూ సంతసింప చేసి విలసిల్లు చుండగా భూసుర

సముదాయమంతా కల్ప తరువు పరిగణనము లోనూ, కామ ధేనువు ప్రసంగము లోనూ వీతకుతూహలమయినది. ఇక వానిని కుతూహలముతో యాచింప నవసరము లేదని భావించినవి. అని భావము. ఈ రెండు ఉదాహరణములలోనూ కోమల వర్ణములూ స్వల్ప సమాసములూ, మృదు బంధమూ ఉన్నది. కాబట్టి వైదర్భి రీతి అవుతుంది. "కీర్తి చందన చర్చనం" అనే చోట రేఫ సంయోగము ఉన్నది. తోషితా శేషలోకే అనే చోట పరుష వర్ణములు అనదగిన శ, ష, లు ఉన్నవి. అయినా అవి భూయో భూయః ప్రయుక్తములు కావు. కాబట్టి వైదర్భిత్వమునకు భంగము లేదు. ఈ విధముగానే ఆలంకారికులు అంగీకరించు తున్నారు. ఇటుపై ఉదాహరణములలో కూడా ఈ విధానమునె అనుసరించాలి.

గాడీరీతి

ఓజః కాంతి గుణోపేతా గౌడీయా రీతిరిష్యతే.

ఓజస్సు కాంతి అనే గుణాలతో కూడుకొన్న రచనకు గాడీరీతి అని పేరు. సమాస భూయస్త్వము ఉండుట ఓజో గుణము. ఉద్భట రచన ఉండుట కాంతి గుణము. ఈ రెండూ ఉన్నట్లయితే గాడీరీతి అవుతుంది. ఉదా:—

ప్రచండతరదోర్దండ ఖండితారాతి మండలః
బిభర్త్యశ్వీధరాం గుర్వీం ప్రభవన్నంధ్రభూపతిః.

ఆంధ్ర భూపతి అయిన ప్రతాపరుద్రుడు ప్రచండ తరములయిన భుజ దండములచే శత్రుమండలమును ఖండించి సమర్థతరుడు అవుతూ అతిశయిత మయిన పృథివీధురమును భరించు తున్నాడు. దీర్ఘ సమాసత సంయుక్త వర్ణ కృతోద్భటతా దీనిలో స్పష్టము.

వేరొక ఉదా:—

ఉద్యద్దోస్స్తంభ ఖడ్గ త్రుటదరిమకుటాటోప సంజాత రాహు
భ్రాంతి భ్రశ్యత్పతంగాభయకరణ చణస్ఫార నాసీరరేణుః
అంధ్రక్ష్మాభర్తు రాసీదధికరణధురా భిన్నమత్తేభ కుంభ
ప్రోద్యన్ముక్తౌఘతారా నికరపరివృతాస్స్వర్వధూవక్త్రచంద్రాః.

సమధిక మయిన భుజ స్తంభము నందలి ఖడ్గముచే శత్రు మకుటములు త్రుటితములై పైకెగిరినవి. ఆ శిరములను చూడగా సూర్యునకు రాహువు అనే భ్రాంతి కలిగింది. అందుచే అతడు పలాయితు డవుతున్నాడు. అప్పుడు ఆంధ్ర క్షమానాథుని సేనా పరాగము సూర్యునకు అభయకరణ చణము అయింది. ఆసమయములో యుద్ధ నిహత వీరులను వరించుటకు దేవాంగనలు వచ్చినారు. ప్రతాపరుద్రుని యుద్ధములో భిన్న భిన్నములయిన మత్తేభముల కుంభములనుండి ముత్యాల సమూహములనెడు తారా నికరములు వెలువడి ఆ స్వర్వధూవక్త్ర చంద్రులను చుట్టుకొన్నవి. ఈ రెండు పద్యాలలోనూ పరుష వర్ణఘటనము ఉన్నది. సమాసభూయస్త్వము ఉన్నది.

పాంచాల రీతి

పాంచాల రీతి ర్వైదర్భీ గౌడీ రీత్యుభయాత్మికా.

పాంచాలరీతి వైదర్భీ గౌడీ రీతుల సమ్మేళనాత్మకము. ఆ రెండురీతుల ప్రయోజనమునూ ఇది సంపాదించుతుంది.

ఉదా:—

జేతుః కాకతివీర రుద్రనృపతే ర్జైత్రప్రయాణోద్ధితే
క్షోణీరేణుభరే నభస్యతిభృశం ధూమిభ్రమం బిభ్రతి,
జాతా మర్త్యనదీ విశంకటతటీదీర్ఘా వియద్దీర్ఘికా
గాఢం గూఢతమా చ గౌతమనదీ పాతాళగంగాయతే.

జయనశీలు డయిన ప్రతాపరుద్రుని చైత్ర ప్రయాణములో భూపరాగము అధికముగా వెలువడింది. అది ఆకాశాన భాగావ్యాపించి భూవిభ్రమమును ధరించింది. అప్పుడు వియద్దీర్ఘిక అనబడె ఆకాశగంగ పరాగ కలనము వలన విశాలములయిన తటాలు కల్పై సూనవృలనదిగా అయినది. క్రింద ఉన్న గౌతమనగి, గోదావరి మిక్కిలి గాఢ గాఢమై పాతాళ గంగ అవుతున్నది. వేరొక ఉదా:—

స్థానే వచ్ఛలమర్తిగండ నృపతే! త్వత్ఖడ్గభోగీ ద్విషత్
ప్రాణై ర్యత్పరితోషమేతి సతతం కిం త్వేతదత్యద్భుతం
పీత్వేస ప్రతిపక్షపార్థివ యశఃక్షీరం గౌరత్విషం
యత్సంవర్ధయతి త్రిలోకభరితాం త్వత్కీర్తిలక్ష్మీసుధాం,

చలమర్తి గండడు అనుబిరుదము కలిగిన ఓ ప్రతాప నృపతీ! నీ ఖడ్గ భుజంగము శత్రు ప్రాణములచే పరితోషము పొందుట యుక్తమె. సర్పములు వాతాహారములుకదా! కాని ఈ చెప్పబోయేది అత్యద్భుతముగా ఉన్నది. నీ ఖడ్గ భోగి ప్రతిపక్ష పార్థివుల యశఃపయోధారలను పానము చేసి గౌరవర్ణము కల త్రిలోక భరితమైన నీ కీర్తిలక్ష్మీ సుధను వర్ధింప చేస్తున్నది. పాము త్రాగిన పాలు అమృతము కావడము చిత్రమె కదా! ఈ ఉదాహరణద్వయములో రీతి ద్వయసాంకర్యము ఉన్నది. అద్భుత రసము దీనిలో ప్రతిపాదిత మవుతున్నది. కాబట్టి పాంచాలి.

శయ్య

మొదట "రీతయశ్చేయతీ శాస్త్ర ప్రమేయం కావ్య పద్ధతిః" అనేచోట చకారము వలన శయ్యా పాకములు సముచ్చితములు అవుతున్నవి కదా! ఆ శయ్యాపాకములలో

శయ్యా శబ్ద ధర్మము కావడము వలన శబ్దధర్మకముల ప్రస్తావములో శయ్యా నిరూపణా ర్హము. కాబట్టి శయ్యను నిరూపింతుము.

యా పదానాం పరాఽన్యోన్యమైత్రీ శయ్యేతి కథ్యతే

వినిమయా సహిష్ణువు లయిన పదముల యొక్క నిరతిశయమయిన పరస్పర మైత్రి శయ్యా అవుతుంది. వైదర్భ్యాది రీతులలో పదములు వినిమయమును సహింపగలవు. దీనిలో అట్లా కాదు. కనుకనే శయ్యా రీతులకన్న భిన్నము ఉదా:—

దాతుః కాకతివంశమండనమణేః నిస్సీమవిశ్రాణన
శ్లాఘాలంఘిత కల్పపాదప గుణప్రౌఢే రగాధౌజసః
భిభ్రచ్ఛారదకౌముదీ పరిమళం సామంత సీమంతినీ
గండాభోగ నిరూఢ పాండిమధురం ధత్తే యశః ప్రాయశః.

కాకతి వంశాలంకార మహామణి అయిన ప్రతాపరుద్రుడు దాత. ఆతని నిస్సీమదానశ్లాఘచేత కల్పపాదపముల గుణ ప్రౌఢికూడా తిరస్కృత మయింది. ప్రతాపరుద్రుడు అగాధ ప్రతాప ఖని. తరచుగా ఆతని యశము శరచ్చంద్రికా సౌరభ్యమును భరించి సామంతనృపతి యువతి విశాల కపోలముల లో నిరూఢమయిన పాండిమ భారమును వహించుచున్నది. దీనిలోని రచన పదముల వినిమయమును సహింపదు. ఈశయ్యా పదానుగుణ్యము కలిగి ఉన్నది.

పాకములు

ఇక పాకమే మిగిలి ఉన్నది. దానిని చెప్పెదము. హృదయంగమ మయిన అర్థగంభీరిమ ఉన్నట్లయితే పాకమవుతుంది. శృంగారాది రసములయొక్క ఆస్వాద్యమానతలోని విశేషము పాకములో గోచర మవుతుంది. పాకము రెండువిధాలు

ద్రాక్షాపాకము నారికేళపాకము అని. ప్రస్ఫుట భావార్థములు ఉన్నట్లయితే ద్రాక్షాపాకము. అంతర నిగూఢభావార్థములు ఉంటే నారికేళ పాకమని సామాన్య లక్షణము. విశేషముగా వాని స్వరూపోదాహరణముల చెప్పెదము.

ద్రాక్షాపాకము

ద్రాక్షాపాకస్స కథితోబహిరంతఃస్ఫురద్రసః.

బయటికి స్ఫుటముగా రసము ప్రతీతము కావాలి. ఆలోచించిన కొలదీ అంతరములో గంభీరముగా రసము ఆస్వాద్యమానము కావాలి. అప్పుడది ద్రాక్షాపాకము అవుతుంది. ఈ పేరు సార్థకము. ద్రాక్ష బాల సులభ మధురిమను ఇస్తుంది. ఆస్వాద్యమయిన కొద్దీ మధుర మధురముగా ఉంటుంది కదా. ఉదా:—

స్మరస్మేరాన్ మందస్మితమధుర సౌరభ్యసుభగాన్.
మనాగ్వ్రీడా జాడ్యాన్ ప్రణయరస కల్లోల భరితాన్
కృతానేకస్కంధాన్ మనసిజ సహస్రాణి సృజతః
కటాక్షాన్వామాక్షీ కిరతి పరితో రుద్రనృపతిం.

సుందర నేత్రాలుకలిగిన ఒక రమణీ మణి రుద్రనృపతిని అంతటా నానా విధములయిన కటాక్షములను వెదజల్లుతున్నది. ఆచూపులు స్మరప్రధానములై మద మంథర మిాలితములై ఉన్నవి. మందస్మితముచేత సంతాపహరములుగా ఉన్నవి. ఆమె పద్మినీ జాతి యువతి అగుట వలన ఆ కటాక్షములు సౌరభ్యముచే సుభగములైఉన్నవి. నాయిక ప్రౌఢ. అందువలన అవి కొంచెపు లజ్జచే జడిమములై ఉన్నవి. ప్రణయరస కల్లోల భరితములై ఉన్నవి. నానా విధ స్కంధములనుసృజించు తున్నవి. వేయిమన్మథులను సృష్టించు

తున్నవి. ఈపద్యములోని కటాక్ష విశేషణములు నిగూఢ భావనా పరిశీలనా ర్హ్యములు. ఇక్కడి శృంగారము ఈవిధముగా సమ్మర్ద సహిష్ణువయినా పరి సమయములో కూడా చక్కగా ఆస్వాద్యమానమవుతున్నది. ఇట్లా దీనిలో అర్థ నిబంధనము ప్రసన్న గంభీరము కాబట్టి ద్రాక్షా పాకము.

నారికేళపాకము

సనారికేళపాకః స్యాదంతర్గూఢ రసోదయః

గూఢ గూఢరస స్ఫురణము ఉన్నట్లయితే అది నారికేళ పాకము. నారికేళమును బద్దలు కొట్టితేనే గాని ఆస్వాద్య మానమగు రసము ఉండదు. అట్లాగే ఇదీని. ఉదా:—

లీలా విభ్రమ............ శృంగారనాట్య క్రమః

ఈ పద్యము మొదటి ప్రకరణములో నాయికా ప్రసక్తి వచ్చినప్పుడు మధ్యమోదార రస ప్రస్తావములో నిరూపిత మయింది. దీనిలో వెంటనే అర్థప్రతీతి కాదు. ఇప్పటికి ఈ ఉదాహరణములు రసవిషయమైన ప్రదర్శితము లయినవి ఇట్లాగే వస్త్వలంకార ప్రతీతులలో కూడా గ్రహించాలి. అర్థము యొక్క ద్రుత ప్రతీతిలో ద్రాక్షా పాకము చరమ సీమను పొందిది. విలంబిత ప్రతీతిలో నారికేళము పరాకో టిని అధిష్ఠించింది. అటూ ఇటూ కాక వీని అంతరాళములో ఉండే మధ్యమ ప్రతీతి అనేక విధాల ఉంటుంది. కాబట్టి మధుపాకము, క్షీరపాకము, కదళీపాకము, రసాలపాకము, మొదలయినవి సంభావనానుసారముగా ఊహింప తగినవున్నవి

కావ్యవిశేషము

ఈ విధముగా కావ్య సామగ్రి నిరూపిత ప్రాయము. ఇక ఈకావ్య భేదములను నిరూపించాలి. ఒక చోట వ్యంగ్యము

ప్రధానమవుతుంది. వేరొకచోట అప్రధానమవుతుంది. మఱొకచోట అస్ఫుటమవుతుంది. ఈ రీతిగా వ్యంగ్య పరిస్థితిని బట్టి కావ్యము త్రివిధము. వ్యంగ్య ప్రాధాన్య మున్నప్పుడు ఉత్తమ కావ్యము. దీనినే ధ్వని అని వ్యపదేశించుతారు. వ్యంగ్యము అప్రధానమయినట్లయితే మధ్యమ కావ్యము. ఇది గుణీభూత వ్యంగ్యమని వ్యపదేశింపబడుతున్నది. వ్యంగ్యము అస్ఫుటమయినప్పుడు అధమకావ్యము. దీనికే చిత్రమని పేరు. లోకములో ఏదయినా వస్తువును తెలిసికొనడానికి దీపముపై ఆదరమును ప్రదర్శించుతాము. చీకటిలో ఉన్న వనితావదనారవిందావలోకనానికై దీపశిఖయందు యత్నము కలవారు కావడము ప్రసిద్ధమె కదా! అట్లాగే మహాకవి కూడా వ్యంగ్యార్థము కొరకై వాచ్యవాచక విచిత్రతలందు ప్రవర్తించుతాడు. అక్కడ వ్యంగ్యము మధ్యలో విశ్రాంతము కాదు. తనవరకూ సహృదయుల హృదయాలను ఆకర్షించుతుంది. కనుకనె ఉత్తమములో వ్యంగ్యానికి ప్రాధాన్యము ఉన్నదని అనుసంధించవలసి ఉన్నది. మధ్యమ కావ్యములో వ్యంగ్యము ప్రతిద్వంద్వరుద్ధముగా ఉంటుంది. కాబట్టి అక్కడ అది అప్రాధాన్యము పొందుతున్నది. ఇక్కడ వ్యంగ్య చారుత్వానికి అపకర్ష ఉన్నట్లయితే వ్యంగ్యములోని అప్రధానత స్వాభావికము కాదు వ్యంగ్య చారుత్వానికి అపకర్ష ఉన్నట్లయితే వ్యంగ్యము అప్రధానమని గ్రహించాలి. గుణీభూతవ్యంగ్యము అనే పదము వలన కూడా ఈ అర్థమె సూచితమవుతున్నది. అధమకావ్యము అస్ఫుట వ్యంగ్యము కావడము వలన నీరసము. అది కేవలమూ వాచ్యవాచకముల వైచిత్ర్యములను మాత్రము ఆశ్రయించి ఉం

టుంది. కనుకనె చిత్రముతో సమానము. దీనినే ఆలేఖ్య ప్రఖ్యము అంటారు. చిత్ర శబ్ద వాచ్యమగు ఇది శబ్ద చిత్ర మని, అర్థచిత్రమని, ఉభయచిత్రమని విభాగము పొందుతుంది.

ధ్వని

స్వామిన్ ! గోత్రమహీధరాన్ కిముపునా నీచైర్విధత్సే ? పుతో
గాధాసంబునిధీన్కరోషి ? కురుషే కిం దిక్పతీ నల్పకాన్ ?
ఇత్థం పార్శ్వచరానులాప మఖిలం న్యక్కృత్య ధర్మైకషిణా
సృష్టః పద్మభువా గుణైకవసతిః శ్రీవీరరుద్రో నృపః.

స్వామీ ! కులపర్వతాలను ఇప్పుడు ఏల క్రిందుగా చేస్తున్నారు ? సాగరములను గాధములనుగా చేస్తున్నారేమి ? దిక్పతులను అత్యంతమూ అల్పులనుగా చేయుచున్నారేమిటి? ఇట్లా పార్శ్వచరులు మాటిమాటికీ పలుకుతూ ఉన్నప్పటికీ ధర్మ బుద్ధి కలిగిన ప్రజాపతి ఈ అనులాపము నంతా పెడ త్రోసి గుణైక వసతి అయిన శ్రీ వీరరుద్ర నృపాలకుని సృజించినాడు. ఈ పద్యములో ప్రతాపరుద్రునకు కుల శైలాతి శాయి సమున్నతత్వము ఉన్నదని సముద్రాతిశయిత గాంభీర్యము కలదని, లోక పాలాధిక మయిన ఐశ్వర్యము ఉన్నదని ధ్వనించు తున్నది. ఇట్లాగే కాకతీయ నిర్మాణ వైభవము, కుల శైలములు, పయోనిధులు, లోకపాలురు వీరి నిర్మాణ సంరంభము కన్న అతిశయించి ఉన్నదని సర్వవిలక్షణమని వ్యంగ్య మవుతున్నది.

గుణీభూత వ్యంగ్యము

ప్రత్యగ్ర ప్రసరత్ప్రతాప విభవ వ్యాప్తాఖిలాశాంతరే
విశ్వత్రాతరి వీరరుద్రనృపతౌ సింహాసనాధ్యాసిని

ఆస్థానీం సముపాగతై ర్నృపవరై స్తాస్తాస్తథా దర్శితా
శ్చేష్టా యాభి రముష్య కాకతివిభో ర్దృష్టిః కృపార్ద్రీకృతా.

నూతనముగా ప్రసరించిన వీరరుద్రనృపతి యొక్క ప్రభావముచే నిఖిల దిగంతరములూ వ్యాప్తము లయినవి. ఆతడు విశ్వరక్షకుడై సింహాసనమును అధిష్ఠించగా ఆ స్థానమంటపమునకు వచ్చిన సామంత నృపవరులు ఆ యాచేష్టలను చేసినారు. వానిచే ఈ కాకతి విభుని దృష్టి కృపార్ద్రీకృత మయింది. ఈ పద్యములో అభిషేక మహోత్సవమును అనుభవించిన ప్రతాపరుద్రుని ఎదుట శరణార్థులయిన పార్థివులు తథావిధ నానావిధకృపణోక్తులనూ పునః పునః ప్రణామాదికములనూ ఆచరించినారు అనే అర్థములు వ్యంగ్యములవుతున్నవి. ఆ యా చేష్టలు దర్శితము లయినవి అనే వాచ్యార్థములో ఉన్న చేష్టా రూపము లయిన అనుభావములై రమణీయములు కాని యిచటి వ్యంగ్యము ఈ వాచ్యమును అతిశయించుట లేదు. కాబట్టి వ్యంగ్యము అగూఢమయిన దని చారుత్వాతిశయము దానిలో లేదని గ్రహించాలి. అందువలననే ఇది గుణీభూత వ్యంగ్యము అవుతున్నది. గుణము -అప్రధానము. అప్రధానీభూతము గుణీభూత మగును. వ్యంగ్యము ఎక్కడ గుణీభూత మవుతున్నదో అది గుణీభూత వ్యంగ్యము, అని నామసార్థకతను గ్రహించాలి.

చిత్రము

చిత్రకావ్యానికి అధమ కావ్య మని పేరు. ఇది త్రివిధము. శబ్దచిత్రము, అర్థచిత్రము, ఉభయచిత్రము అని. వ్యంగ్యరహిత కావ్యము చిత్ర మవుతుంది. వ్యంగ్యరహితములంటే వివక్షితముగా వ్యంగ్యము లేకపోవడము అని అర్థము. తలవని తలం

పుగా ఏదో ఒక వ్యంగ్యము ఉంటే ఉండవచ్చు. సామాన్య ముగా ఏ వాక్యమూ వ్యంగ్య రహితమై ఉండదుకదా! కాగా తాత్పర్యవిషయీభూత మయిన వ్యంగ్యము లేనపు డధమము అని తలచుట యుక్తము.

అర్థనిబంధనములో కంటె శబ్దనిబంధనములోనే కవితాత్ప ర్యము ఉండేటట్లయితే అక్కడ శబ్దకృత చమత్కారమే ప్రధాన మవుతుంది. అపు డది శబ్దచిత్ర మని వ్యపదేశమును పొందుతుంది. శబ్దనిబంధన రసికత్వముకంటె అర్థనిబంధరసిక త్వమే అధికముగా గోచర మయినట్లయితే అక్కడ ఉపమా ద్యర్థాలంకారములే చమత్కారులగును. అప్పుడా కావ్యము అర్థచిత్రవ్యవహారము కలదగును. శబ్దార్థచిత్రతలు రెండూ ఏక స్థలములో సమావేశము పొందినప్పుడు ఒకటి తక్కువఅని కాని అధిక మని కాని అనడానికి అవకాశము లేదు. అక్కడ శబ్దార్థములు రెండూ చమత్కారులే. కాగా అది ఉభయ చిత్రమవుతుంది.

శబ్ద చిత్రము

క్షోణీరక్షణదక్షిణాః క్షతజగత్క్షోభా దురీక్షక్రమాః
క్షుద్ర క్షత్రియపక్ష శిక్షణవిధౌ ప్రోత్క్షిప్త కౌక్షేయకాః,
ఉద్దా మోద్యమనస్య రుద్రనృపతే ర్దోర్దండయో శ్చండయో
ర్గర్జద్దుర్జన గర్వపర్వత భిదా దంభోళయః కేళయః.

సమతిశయిత ప్రతాపోద్యమనము కలిగిన రుద్రనృపతి యొక్క చండ భుజదండ క్రీడలు భూరక్షణ సమర్థములు, ప్రపంచ క్షోభనాశకములు. అతని ఆయుధ ప్రయోగ పరి పాటి చూడశక్యము కానిది. క్షుద్రక్షత్రియ పక్ష శిక్షణ విధానములో నిత్యమూ ఉద్యత ఖడ్గములై ఉన్న క్రీడలు

అహంకరించు దుర్జనుల గర్వ పర్వతములను భేదించడములో వజ్రాయుధములు. దీనిలో వృత్త్యను ప్రాస బహుళముగా ఉన్నది. గర్వమందు పర్వత త్వారోపణము వలన రూపకాలంకారము కూడా స్ఫుటముగానే ఉన్నది. అయినా పద్య రచయితకు శబ్ద చమత్కార నిబంధన వ్యసనిత అధికముగా కన్పడుతున్నది, కాబట్టి శబ్ద చిత్రమే అవుతుంది.

అర్థచిత్రము

ఖగ్గే జుజ్ఝవిజుంభిఏ రిఉమహీ ణాహంజలిం బింబిఅం
పేక్ఖంతో జయలచ్ఛివాసకమళం మణ్ణంతి విణ్ణాణిణో,
మణ్ణే పీర పలావ రుద్దావిహుణో జణ్ణేసు ఘేత్తుం ఉణో
సిత్థీఏ రిఉజీవిఅణ విహిణో జత్తస్స పీఢంబుఅం,

యుద్ధములో విజృంభించిన ప్రతాపరుద్రుని ఖడ్గమునందు శత్రు భూపతుల అంజలి ప్రతిబింబించింది. దానిని చూచి విజ్ఞానులు "ఇదిజయలక్ష్మి నివాసకమలము" అని భావించుతున్నారు. కాని అది ప్రతాపరుద్రునియుద్ధములలో హతులైన శత్రువుల జీవితములను పునః సృష్టికై గ్రహించవలెనని విచ్చేసిన విధియొక్క పీఠాంబుజము అని నేను భావించుతాను. ఈ పద్యములో ప్రతాపరుద్ర ఖడ్గ ప్రతిబింబిత మయిన రిపు నృపాంజలియందు జయలక్ష్మీ వాసకమలత్వమును ఆరోపించి అపహ్నవము చేయడము ఉన్నది. పక్షాంతరోపన్యాసము వలన ఈ అపహ్నవము అర్థసిద్ధము. ఇట్లా ఈ అపహ్నవ పూర్వకముగా బ్రహ్మాసన కమలత్వమును ప్రతిపాదించడము చేత ఇక్కడ అపహ్నవాలంకృతి ఉన్నది. ఈ అపహ్నవ నిరూపణములోనే కవికి అభినివేశము ఉన్నది. వృత్త్యను

ప్రాసలో అంతగా అభిమానము లేదు. కాబట్టి అర్థచిత్రమే కాని ఉభయ చిత్రము కాదు.

ఉభయ చిత్రము

విద్యాసముద్రే భువనైకభద్రే ప్రతాపరుద్రే జితవైరిభద్రే,
రక్షావినిద్రే ధృతశౌర్యముద్రే కాంతేవ పృధ్వీ రమతే గుణార్ద్రే.

విద్యలకు సముద్రుడూ, భువనమున కంతకూ ఒకే భద్ర స్వరూపుడూ, వైరి భద్రముల జయించినవాడూ, రక్షణములో నిద్రారహితుడూ, శౌర్యముద్రను ధరించినవాడూ, అయిన ప్రతాపరుద్రునియందు పృథివి ప్రియురాలి వలె రమించుతున్నది. దీనిలో 'ద్ర' కారము అనేక పర్యాయములు ఆవృత్తమయినందు వలన వృత్త్యను ప్రాస, ప్రియురాలివలె అనే ఉపమాలంకారమూ సమప్రధానములుగా ఉన్నందువలన ఉభయ చిత్రతను ఊహించాలి.

ఈ ఉదహరించిన చిత్రభేదత్రయములో వర్ణిత విషయాలకు ఏదోవిధముగా వీరశృంగారములలో పర్యవసానమును చెప్పవచ్చును. కాగా రసము గోచరమవుతున్నందువలన ఉత్తమ కావ్యత్వమునె అంగీకరించాలి కాని అధమ కావ్యత్వమును అంగీకరించరాదే! అని శంకించరాదు. దీనిలో పార్యంతికమయిన రస పర్యవసానము కవికి వివక్షితము కాదు. కాబట్టి అధమ కావ్యత్వమును చెప్పడమె సరసముగా ఉంటుంది.

ధ్వని విశేషములు

సామాన్యముగా కావ్యము త్రివిధమని ఇప్పటికి నిరూపితము. ఉత్తమ కావ్యమును సవిశేషముగా చెప్పవలసి ఉన్నది.

తద్విశేషములు ఇక ప్రస్తావింపబడును. మొదటగా ధ్వని అభిధామూలకమని లక్షణామూలకమని ద్వివిధము. అభిధా-మూలమునకు వివక్షితాన్యపరవాచ్యమని పేరు. ఇందలి వాచ్యము వివక్షిత మవుతుంది. వాచ్యార్థము స్వమాత్రమూ బాధాసహితము కాదు. అన్యపరముకూడా అవుతుంది. రాజును సేవించాలనే భావము ఉన్నప్పుడు ముందుగా రాజపురుషుని సేవించడము లోకములో ప్రసిద్ధముగా ఉన్నది. వనితావదనారవిందావలోకనమును అభిలషించిన పురుషుడు దీపశిఖపై యత్నము కలవాడవుతాడు. అట్లాగే వ్యంగ్యాదరము ప్రధానమె అయినా ముందుగా వాచ్యమునందు శ్రద్ధ ఉంటుంది. కాబట్టి వివక్షితాన్యపరవాచ్యమనే నామము సార్థకము. లక్షణా మూలకమునకు అవివక్షిత వాచ్యమని పేరు. దీనిలో వాచ్యార్థము వ్యంగ్యార్థముచే న్యగ్భావితమవుతుంది వివక్షితము కాదు కాబట్టి సార్థకనామము.

అవివక్షిత వాచ్యధ్వని

వివక్షితాన్యపరవాచ్యధ్వనికి భేదాలు చాలా ఉన్నవి. స్వల్పభేదాలు కలిగిన అవివక్షితవాచ్య ధ్వనిని ముందుగా నిరూపించడము సముచితము. అవివక్షిత వాచ్యధ్వని లోని వాచ్యము అర్థాంతర సంక్రమితవాచ్యమని, అత్యంత తిరస్కృత వాచ్యమని రెండు విధాలు. అవి ప్రత్యేకముగా వాక్యగతము, పదగతమని రెండు విధము లవుతున్నవి. కాగా ఇది నాలుగు విధములు. అర్థాంతర సంక్రమిత వాచ్యములో కొంతగా వాచ్యము ఉపపన్న మయినా అంతమాత్రాన ఉపయోగము లేదు. అది అర్థాంతరములో సంక్రమిత మవుతుంది. కాబట్టి అది అజహల్లక్షణా మూలకము. వాచ్యా

ర్థము అత్యంతమూ తిరస్కృతమయినప్పుడు అత్యంత తిరస్కృత వాచ్యమవుతుంది. ఇక్కడ వాచ్యానికి ఏమాత్రమూ ఉపపత్తి ఉండదు. కాబట్టి ఇది జహల్లక్షణామూలకము. దీనిలోని వాచ్యము ఈ విధముగా సంక్రమితము కావడములో వ్యంజన సహకారి వర్గప్రభావము హేతువని గ్రహించాలి. మొత్తము ఇట్లా నాలుగు విధములయిన ఈ ధ్వని నామములు ఈ విధముగా ఉంటవి.

౧. పదగతార్థాంతరసంక్రమితావివక్షిత వాచ్యధ్వని
౨. వాక్యగతార్థాంతరసంక్రమితావివక్షిత వాచ్యధ్వని
౩. పదగతాత్యంతతిరస్కృతావివక్షిత వాచ్యధ్వని
౪. వాక్యగతాత్యంతతిరస్కృతావివక్షితవాచ్యధ్వని

వివక్షితాన్యపరవాచ్యధ్వని

వివక్షితాన్యపరవాచ్యధ్వని సంలక్ష్యక్రమ వ్యంగ్యమని, అసంలక్ష్య క్రమ వ్యంగ్యమని రెండు విధాలు. వ్యంగ్య వ్యంజకముల ప్రతీతి క్రమము స్ఫుటసంవేద్య మయినట్లయితే సంలక్ష్య క్రమ వ్యంగ్య మవుతుంది. సంలక్ష్య-బాగా గోచరమవుతూ ఉన్న, క్రమ-క్రమము కలిగినవ్యంగ్యము-వ్యంగ్యము కలది. అని శబ్దార్థము. వాచ్యప్రతీతి ఒకటి, వ్యంగ్యప్రతీతి వేరొకటి. ఈరెండు ప్రతీతులకూ క్రమము ఉంటుంది. ముందుగా వాచ్యము ప్రతీతమవుతుంది తరువాత వ్యంగ్యము ప్రతీతమవుతుంది. ఈరెండిటికీ ఉన్న మధ్య కాలక్రమము సులక్షమయినప్పుడు సంలక్ష్య క్రమ వ్యంగ్యము అంటారు.

అసంలక్ష్యక్రమము

అసంలక్ష్య క్రమ వ్యంగ్యానికి రసాదిధ్వని అనిపేరు. దీనిలో విభావాదులు వ్యంజకములు. రసాదికము వ్యంగ్యము. వీని

ప్రతీతులలో క్రమము ఉన్నది. అది అత్యంతమూ సూక్ష్మము. నూరు పద్మదళాలను ఒకే పర్యాయము సూదితో గ్రుచ్చి. నప్పుడు వేధక్రమము గోచరము కాదు. అది శీఘ్రభావి. అచటి క్రమము సంలక్ష్యము కాదు. అట్లాగే ప్రకృతములో కూడా క్రమము సులక్షము కాదు. కనుకనె అసంలక్ష్య క్రమము అనే పేరు సార్థకము. అంతే కాని క్రమము ఇక్కడ లేకపోలేదు. కాబట్టి ఇది అక్రమ ధ్వని కాదు. కార్యకార ణములకు పౌర్వాపర్యము అవశ్యమూ ఉండి తీరుతుందికదా! విభావాదులు కారణములు. రసాదులు కార్యములు. కార ణము కార్యానికి నియతంగా పూర్వమె ఉంటుంది. అందు వలన విభావాది ప్రతీతి మొదటకలిగితే రసాది ప్రతీతి తరు వాత కలుగుతుంది. విభావాది ప్రతీతి సమకాలంలో రసాది ప్రతీతి కలుగదు. విభావాది ప్రతీతినే రసాది ప్రతీతి అని ఎవరూ అనరు. విభావాదుల వలన రసాది ప్రతీతి కలుగు తుంది అని అందరకూ సమ్మతము. కాగా ఆ రెండిటిలో ఉన్న ప్రతీతి క్రమము సంలక్ష్యమాణము కాదు. అని సూక్ష్మ దృష్టితో భావించాలి.

సంలక్ష్యక్రమము

సంలక్ష్య క్రమ వ్యంగ్యము శబ్దశక్తి మూలమని, అర్థశక్తి మూలమని, ఉభయశక్తి మూలమనీ మూడు విధములుగా ఉన్నది. వీనిలో

శబ్దశక్తిమూలము

నాలుగు విధములు. మొదటగా శబ్దశక్తి మూలకము వస్తు ధ్వని అని, అలంకార ధ్వని అని విభజింపవచ్చును. ఇవి ప్రత్యేకము

పదగతము, వాక్యగతమని భేదము పొందగా మొత్తము నాలుగు విధములు అవుతున్నది. వాని నామములు.

౧. పదగత శబ్దశక్తిమూల సంలక్ష్యక్రమ వివక్షితాన్యపర వాచ్య వస్తుధ్వని.

౨. వాక్యగత ,, ,, ,,

౩. పదగత ,, వివక్షితాన్య పరవాచ్యాలంకారధ్వని

౪. వాక్యగత ,, ,, ,,

అర్థశక్తిమూలము

ఇది మొత్తము ముప్పది ఆరు విధముల వుతుంది. వీని విరణమును ఈ క్రింది విధముగా గ్రహించాలి. అర్థశక్తి మూలకములోని మూల భూత వ్యంజకమయిన అర్థము స్వత స్సంభవి అని కవి ప్రౌఢోక్తి సిద్ధమని కవినిబంధనోక్తి సిద్ధ మని మూడు విధాలు. కేవలము సాహిత్యము లోనే సిద్ధ మగుట కాక లోకములో కూడా ఔచిత్యాన్ని బట్టి ఉండ డానికి అవకాశము ఉన్నదని సంభావిత మవుతూఉన్న అర్థము స్వతఃసంభవిఅవుతుంది. లోకములో లేకపోయినాకవితన ప్రతి భావిశేషమున సంభావించి సంపాదించే అర్థానికి కవి ప్రౌఢోక్తి సిద్ధము అని పేరు. కవి యొక్క ప్రౌఢోక్తి వలననే అది సిద్ధ మవుతుంది కాని లోకములో సిద్ధము కాదన్నమాట కవి తన గ్రంథములో పాత్రలను నిబంధించుతాడు. వారు కవినిబద్ధ వక్తలు. ఆ వక్తల వచనములలోని ప్రౌఢోక్తి వలన సిద్ధ మగు అర్థము కవినిబంధనోక్తి సిద్ధము అని వ్యవహరింప బడును. ఇట్లా త్రివిధమయిన వ్యంజకార్థము వస్తురూపముగా అలంకార రూపముగా ప్రత్యేకము ద్వైవిధ్యము పొంది మొత్తము ఆరు విధములు అవుతుంది. వస్తువు వ్యంజకము

కావచ్చును. వ్యంగ్యమూ కావచ్చును. అట్లాగే అలంకారము కూడా వ్యంజకము కావచ్చు. వ్యంగ్యమూ కావచ్చు. అందువలన వస్త్వలంకారములు వ్యంజకములూ వ్యంగ్యములూ అవుతవన్న మాట. అనగా వస్తు రూప వ్యంగ్యానికి వస్తువు వ్యంజకము. అలంకారము కూడా వ్యంజకమే. అలంకార రూప వ్యంగ్యానికి వస్తువు వ్యంజకము. అలంకారము కూడా వ్యంజకమే. ఇట్టి విధానము వలన పైని చెప్పిన ఆరు భేదాలూ పండ్రెండు విధములు అవుతున్నవి వాని నామములను ఈ విధముగా గ్రహించాలి. దీనిలో స్వతస్సిద్ధము నాలుగు విధములు. కవి ప్రౌఢోక్తి నాలుగు విధములు. కవి నిబద్ధ వక్తృ ప్రౌఢోక్తి నాలుగు విధములు.

౧. స్వతస్సిద్ధార్థశక్తి మూల సంలక్ష్యక్రమ వివక్షితాన్యపర వాచ్య వస్తువుచే వస్తుధ్వని.

౨. స్వతస్సిద్ధార్థశక్తిమూల ,, ,, అలంకారధ్వని.

౩. స్వతస్సిద్ధార్థశక్తిమూల ,, పరవాచ్యాలంకారముచే వస్తుధ్వని.

౪. స్వతస్సిద్ధార్థశక్తిమూల ,, ,, అలంకారధ్వని.

౫. కవిప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి ,, ,, పరవాచ్యవస్తువుచే వస్తుధ్వని.

౬. కవి ,, ,, ,, అలంకారధ్వని.

౭. కవి ,, ,, పరవాచ్యాలంకారముచే వస్తుధ్వని.

౮. కవి ,, ,, ,, అలంకారధ్వని.

౯. కవినిబద్ధవక్తృప్రౌఢోక్తిసిద్ధార్థశక్తి ,, పరవాచ్యముచే వస్తుధ్వని.

౧౦. కవి ప్రౌ. శ. సం. వి. ప. వాచ్యముచే అలంకారధ్వని.
౧౧. కవి ,, ,, ,, పరవాచ్యాలంకారముచే వస్తుధ్వని.
౧౨. కవి ,, ,, ,, అలంకారధ్వని.

ఇట్లా ద్వాదశ విధమయిన ఈ ధ్వని ప్రబంధ గతమని వాక్య గతమని పద గతమని ప్రత్యేకము త్రివిధము కాగా మొత్తము ముప్పది ఆరు విధము లవుతున్నది. ప్రబంధ గత వాక్య గత పద గత పదముల యోజనముచేసి ఈ షట్త్రింశత్ భేద (౩౬) నామములను గ్రహించాలి. వానిపేర్లు సుగమములని నిరూపించలేదు.

ఈ అర్థశక్తి మూలకమునకె అనురణన ధ్వని అని పేరు. అనుసరించి రణించుట (ధ్వనించుట) అనురణన మవుతుంది. ఒక కంచు గంటను మ్రోగించినపుడు ప్రథమ స్వనానంతరము స్నిగ్ధ మయిన స్వనము వెలువడుతుంది. అదే అనురణనము ప్రకృతములో కూడా ఒకవస్తువును అనుసరించి వేరొక వస్తువు ధ్వనించుతున్నది. అలంకారము ధ్వనించుతున్నది. అలంకారమును అనుసరించి వస్తువు ధ్వనించుతున్నది. అలంకారము ధ్వనించుతున్నది. ఇట్లా అనుసరించి ధ్వనించుట ఉన్నది. కాబట్టి అనురణన ధ్వని అనే పేరు సముచితముగా ఉన్నది.

ఉభయశక్తిమూలకము

ఉభయశక్తి మూలకమయిన ధ్వని వాక్యగతముగా ఏక విధమే. దానిలో భేదాంతరముల విచిత్రతా కల్పనము దుశ్శకము. "ఉభయశక్తిమూల సంలక్ష్య క్రమ వివక్షితాన్యపర వాచ్యధ్వని." అని దీని నామమును గ్రహించాలి. ఈవిధముగా

శబ్ద శక్తి మూలకములు నాలుగు, అర్థశక్తి మూలకములు ముప్పదియారు, ఉభయశక్తి మూలకము ఒకటి మొత్తమన్నీ కలిపి ఈ సంలక్ష్య క్రమ వ్యంగ్యధ్వని నలుబది ఒకటి భేదములు పొందు తున్నది.

అసంలక్ష్యక్రమ భేదములు

అసంలక్ష్యక్రమవ్యంగ్యమయిన రసాది ధ్వని ప్రబంధగతము వాక్యగతము పదగతము పదైకదేశగతము రచనాగతము వర్ణగతమూ అని ఆరువిధములు. వానినామములు—

౧ ప్రబంధగత వివక్షితాన్య పరవాచ్యా సంలక్ష్య క్రమ వ్యంగ్య రసాది ధ్వని.
౨ వాక్యగత „ „ వ్యంగ్య రసాది ధ్వని.
౩ పదగత „ „ రసాది ధ్వని
౪ పదైకదేశగత „ „ రసాది ధ్వని.
౫ రచనాగత „ „ రసాది ధ్వని.
౬ వర్ణగత „ „ రసాది ధ్వని.

రసాదులు అనేక విధములుగా ఉన్నవి. వాని భేద గణనము అశక్యము. తద్ద్యోతకము లయిన ప్రబంధాదులలోని భేదములనే రసాదులందు ఊహించుకొని షడ్భేదత్వమును గ్రహించాలి. రసము భావము రసాభాస భావాభాస భావోదయము భావసంధి భావశబలత భావశాంతులు అనేవి రసాదులు అని వివేకము.

శుద్ధభేదములు

ఇంతకు పూర్వము చెప్పిన నలుబది ఒకటి భేదములతో ఈఆరింటిని కలిపితే, వివక్షితాన్య పరవాచ్యధ్వని మొత్తము

నలుబది ఏడు విధము లవుతున్నది. మొట్టమొదట చెప్పిన అవివక్షిత వాచ్యధ్వని భేదాలను నాల్గింటిని కూడా వీనితో కలిపితే ధ్వని మొత్తము మొదటగా ఏబది ఒకటి భేదములు పొందుతున్నవి. ఈభేదాలు ఇతర ధ్వనులతో సంబంధము పొందనివి అగుట వలన విశుద్ధ భేదములు అనబడును.

మిశ్ర భేదములు

ఈ చెప్పిన శుద్ధ ధ్వని భేదములలో ఒక్కొక్క ధ్వనికి వేరొక ధ్వనితో సంబంధము ఉన్నప్పుడు మిశ్ర భేదములు సిద్ధములగును. అట్లొక దానితో వేరొక దానిని కలిపి నట్లయితే ప్రథమ భేదానికి ఏబది ఒక భేదములు సిద్ధము లగును. మొదటి భేదమయిన పద గతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్య ధ్వనికి పదగతార్థాంతరసంక్రమితావివక్షిత వాచ్య ధ్వనితోడనే సంబంధము ఉన్నపుడు ఒక భేదము కలుగుతుంది. వాక్య గతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్య ధ్వనితో సంబంధము ఉన్నట్లయితే రెండవ భేదము కలుగుతుంది. ఇట్లాగే ఇతర ధ్వనులతో సంబంధము వలన కలుగు ఇతర భేదములను కూడా ఊహించుకోవాలి. ద్వితీయ భేదానికి ఏబది భేదములె సిద్ధములగును. తృతీయ భేదానికి నలభైతొమ్మిది భేదాలు కలుగుతవి. ఈ విధముగానే చతుర్థ పంచమాది భేదాలకు క్రమ క్రమముగా ఒక్కొక్క భేదమును పరిత్యజించాలి. కాగా ఈ మిశ్ర భేదాలు పదమూడు వందల అరవై ఆరు (౧౩౬౬) అవుతవి.

ప్రాచీనుల మిశ్రగణనము

ఇక్కడ ప్రాచీనులు వేరొక విధముగా మిశ్ర భేదాలను పరిగణించారు. శుద్ధ ధ్వని భేదాలలో ఒక్కొక్కదానికి క్రమ

క్రమముగా ఒక్కొక్క భేదమును పరిత్యజించడమును, తన్నిమిత్తముగా ఒక్కొక్క భేదమును తగ్గింపవలసి ఉండడమును. వారు అంగీకరించినట్లు లేదు ప్రథమ భేదానికి ఏబదియొకటి ప్రకారములు కలుగునట్లు ద్వితీయ భేదానికి కూడా ఏబదియొకటి ప్రకారములు కలుగును. అట్లాగే తృతీయాది భేదాలకు కూడా కలుగుతవి. పదగతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్యధ్వనికి వాక్యగతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్యధ్వనితో సంబంధము కలుగగా ఒక మిశ్రభేదము ఉదయించునట్లు వాక్యగతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్యధ్వనికి పదగతార్థాంతర సంక్రమితావివక్షిత వాచ్యధ్వని సంబంధము వలన భేదాంతరము జనించుతుంది. లక్షణామూల ధ్వనికి అభిధా మూలధ్వని సంబంధము వలన మిశ్రభేదము కలుగునట్లు అభిధా మూల ధ్వనికి లక్షణా మూల ధ్వని సంబంధము వలన భేదాంతరము ఉదయించుతుంది. ఈ విధముగానే యాభైఒకటి శుద్ధ ధ్వని భేదాలకు పరస్పర సంబంధము వలన యాభైఒకటి యాభైఒకటి భేదాలు ఉంటవి. ఇట్లు ఈ భేదాలను అన్నిటినీ విచారించినట్లయితే మిశ్రభేదాలు రెండు వేల ఆరు వందల ఒకటి (౨౬౦౧) అగును. ఈ ప్రాచీనాంగీకృత పద్ధతిని కాక ఏకైక న్యూనత్వమును ఆశ్రయించి నష్టము పండ్రెండు వందల ఏభైఅయిదు (౧౨౭౫) భేదాలు తగ్గిపోతున్నవి. షడ్వింశత్యుత్తర శత త్రయాధిక సహస్ర (౧౩౨౬) సంఖ్యాకభేదములె సిద్ధములవుతున్నవి. ఈ సంఖ్యావలంబనము ఉత్తమమా అని ప్రాచీనాభిమానము ఉన్నపుడు శంక కలుగుతుంది.

విద్యానాథునిగణనోపపత్తి

ఈ ప్రాచీన వాదము యుక్తము కాదు. అవివక్షితవాచ్యానికి వివక్షితాన్యపరవాచ్య సంబంధము వలన కలిగే భేదము కంటె వివక్షితాన్యపరవాచ్యానికి అవివక్షిత వాచ్య సంబంధము వలన కలిగే భేదము వేరు కాదు. మొదటి భేదములోనే అది అంతర్భవించుతుంది. ఈ క్రమముగానే వస్తుధ్వనికి అలంకారధ్వని సంబంధము వలన కలిగే భేదము, అలంకార ధ్వనికి వస్తుధ్వని సంబంధము వలన కలిగే భేదము కంటే పృథగ్భూతము కాదు. కాబట్టి పూర్వ పూర్వానికి ఉత్తరోత్తర సంబంధముతో ఒకొక్క భేదము యొక్క న్యూనతను గ్రహించాలి. ప్రాచీనులు అంగీకరించిన విధానములో— దీనికి దానితో సంబంధము, దానికి దీనితో సంబంధమని, సంబంధి ప్రతి సంబంధుల ఉచ్చారణ వ్యత్యాసమె కాని విశేషము ఏమీ లేదు. కాబట్టి వానికి యథోచితముగా పరస్పరమూ అంతర్భావమును చెప్పడమె యుక్తము. చమత్కారానురోధమునుబట్టి ఏకైక భేద న్యూనతను అభిమానించాలి.

సంసృష్టిసంకరాయాతభేదములు

ఈ చెప్పిన మిశ్రభేదాలకు కూడా త్రిరూపకమగు సంకరముతో ఏక విధమయిన సంసృష్టితో మరల నాల్గువిధాల యోజనము చేసినట్లయితే అయిదు వేల మూడు వందల నాలుగు (౫౩౦౪) భేదాలు సిద్ధములగును. సందేహ సంకరము, అంగాంగి భావ సంకరము, ఏకవాచకానుప్రవేశ సంకరమూ, అని సంకరము మూడు విధాలు. సంకరము మాదిరిగా సంసృష్టి సాపేక్షము కాదు. కాబట్టి ఏకవిధమె. వీని స్వరూపములు ముందు విశదము లగును. ఇప్పటికి—

శుద్ధా శ్చైకపంచాశత్, మిశ్రా యుతసేత్రాన శేంధయః,
సంసృష్టిసంకరాయాతా స్త్వబ్ధి ఖాగ్ని శరాభిధాః.

శుద్ధ భేదములు ౫౧. మిశ్రభేదములు ౧౩౨౩. సంసృష్టి సంకరా యాతములు ౫౩౦౪. కావ్యప్రకాశ కారాది ప్రాచీనుల దృష్టిలో శుద్ధ భేదములు ౫౧ మిశ్రభేదములు ౨౬౦౧. సంసృష్టి సంకరా యాతములు ౧౦౪౦౪. ఇంకా భేద ప్రభేదముల కల్పనాను సారముగా అనంత ప్రకారములు ఉదయించును. వానిని అన్నిటినీ పరిగణించడము అవసరముగా తోచదు.

ఈ చెప్పిన శుద్ధ భేదాలలో కొన్నిటిని దిఙ్మాత్రముగా ఉదాహరింతుము. అందు

అర్థాంతర సంక్రమితాఽవివక్షిత వాచ్యధ్వని

మూర్ధానో యూయ మాస్మాకాః కిమిత్యౌన్నత్య మిచ్ఛథ,
ఇతి ప్రతాపరుద్రస్య ప్రణతాః ప్రతిపార్థివాః.

ఓ మాకు సంబంధించిన శిరములారా! మీరు ఔన్నత్యమును ఏల అభిలషించుచు తారు? అని ప్రతాపరుద్రుని శత్రురాజులు ప్రణతులయినారు. దీనిలో "ఆస్మాకాః" అనేది అర్థాంతర సంక్రమిత వాచ్యము. దీనివలన కేవలము అస్మత్సంబంధము (మాకు సంబంధించి నట్టి) మాత్రము ప్రతిపాదింపబడదు. అది అకించిత్కరము. అటువంటి అర్థము వలన ప్రయోజనము లేదు. మేము సర్వవిధ దైన్యములకు ఆవాసముగా ఉన్నాము మీరు ఇట్టి మాకు సంబంధించిన వారు. వైనతేయుని సన్నిధానములో సర్పాలవలె మీరు కూడా ఇప్పుడు విక్రమ విముఖులు కావడము సముచితము. అని ఇక్కడ గోచరమవు తున్నది. కాబట్టి అర్థాంతర సంక్రి

మితా వివక్షిత వాచ్యతను గ్రహించాలి. "అస్మాకాః" అనే అవివక్షిత వాచ్యపదము గోచరమవుతూ ఉన్న అర్థాంతరములో సంక్రమితమై వ్యంజకమవు తున్నది. మీరు దీనులకు సంబంధించిన వారు. కాబట్టి మీకు ఔన్నత్యా కాంక్ష సముచితము కాదు అని వ్యంగ్యము.

అత్యంతతిరస్కృతావివక్షితవాచ్యధ్వని

విశదిమ విలిప్త వియతో ధవళిమ పరిపూరితాఖిలాశాంతాః,
విహరంతి యశఃపూరా గౌరాః శ్రీకాకతీంద్రస్య,

శ్రీ కాకతీంద్రుని గౌరములయిన యశః ప్రవాహములు వైశద్యముచే ఆకాశాన విలేపనము చేస్తూ ధావళ్యముచే నిఖిలదిగంతములను పరిపూరితములను చేస్తూ విహరించు తున్నవి. విలేపనము మూర్త ద్రవ్యానికి కుదురు తుంది. కాని అమూర్తమైన ఆకాశానికి కుదరదు. కాబట్టి విలేపనము అక్కడ అనుపపన్నమై స్వార్థమును పరిత్యజించు తున్నది. ఆకాశమును రంజింప చేయు చున్నది అనే అర్థము లక్ష్యము. దీనివలన గగనము నందు ప్రకాశాధిక్యము ఉన్నదని వ్యంగ్యమవుతున్నది. ఇందుచే ఇక్కడ "విశదిమవిలిప్తవియతః" అనేది అత్యంత తిరస్కృత వాచ్యమని గ్రహించాలి. అవివక్షిత వాచ్యములోని ఈ భేదద్వయము ఇక్కడ పదగతముగా ఉదాహృత మయినది. ఇట్లాగే వాక్యగతముగా కూడా ఊహ్యము.

అర్థ శక్తి మూల వస్తువుచే వస్తుధ్వని

అబ్దాన్ ఋతూన్వినా మాసాన్ శుక్లపక్షాన్వినా తిథీన్,
రాత్రీర్వినాపి కాంక్షంతే కాకతీయ రిపుస్త్రియః.

కాకతీయ శత్రుయువతులు ఋతువులు లేని సంవత్స రములను శుక్లపక్షములు లేని మాసములను రాత్రులు లేని తిథులనూ కాంక్షించుతున్నారు. వసంతాది ఋతువులూ శుక్లపక్షములూ రాత్రులూ కామోద్దీపకములగుట వలన అవి లేక పోవడమును శత్రుస్త్రీలు కాంక్షించుతున్నారని ప్రతీయమానమవుతున్నది. దీనివలన వారలకు ప్రియ వియోగము కలిగినది అనే వస్తువు వ్యక్తమవుతుంది. ఈ ప్రియ వియోగ మయిన వస్తువుచే ప్రతాపరుద్రుని శత్రువు లందరూ నిహతులయినారని వ్యంగ్యమవుతున్నది. ఇట్టి వ్యంగ్యము వాచ్యము కంటె అతిశయిత రమణీయతానిధా నము. ప్రియ విరహ వివశలయిన శత్రుస్త్రీలు కొన్ని సంవత్స రాలు జీవించాలని మొదట ఋతువులు లేకపోవడమును కోరుతున్నారు. పిమ్మట కొంత కాలానికి వానిని కూడా గడప డానికి అశక్తులై కొన్ని మాసములందు మాత్రము ప్రాణాలను ధరించాలని వెన్నెలలు లేని పక్షములు నశించి పోవడమును కోరుతున్నారు. ఇంకా మాసాలను కూడా వెళ్ళ బుచ్చడానికి సామర్థ్యము లేక కొన్ని తిథులలో మాత్రము జీవితాలను నిలబెట్టుకోవాలని రాత్రుల సృష్టి లేకపోవడమునె అభిల షించుతున్నారు. ఈ విధముగా వస్తువుచే బహువస్తువు వ్యంగ్య మవుతున్నది.

వస్తువుచే అలంకారధ్వని

దృష్ట్వా కాకతివీరరుద్రనృపతేః కీర్తిం జగద్వాపినీం
వస్తుం వాంఛతి శంభు రత్ర శయితుం లక్ష్మీపతిః కాంక్షతి,
స్నాతుం ధావతి దివ్యతాపసగణః సంవర్ధితుం వార్ధయ
శ్శ్లేష్టుంతే సవిలాసమభ్రముఃరపి స్ప్రష్టుం శన్తై రీహతే,

కాకతి వీరరుద్రుని కీర్తి జగమంతటా వ్యాపించింది. దానిని చూచి శివుడు అక్కడే నివసించవలెనని వాంఛించుతున్నాడు. లక్ష్మీపతి అక్కడ శయనింప కాంక్షించుతున్నాడు దివ్య తాపసులయిన సప్తర్షుల గణము స్నానము చేయాలని భావనము చేస్తున్నది. సాగరములు సంవర్ధనము పొందడానికై చేష్టాయుక్తములవుతున్నవి. ఐరావతము యొక్క ప్రియురాలయిన అభ్రమువు సవిలాసముగా స్పృశించడానికి మెల్లగా ఉత్సుకమవుతున్నది. దీనిలో శివాదులకు నివాసాకాంక్షాదికము కలుగుట వ్యంజక వస్తువు. దీనిచే వ్యాపించిన కీర్తిని చూడగా శివునకు కైలాసమనే భ్రాంతి కలిగినదని విష్ణువునకు క్షీరార్ణవభ్రాంతి కలిగినదని, తాపసులకు మందాకినీ భ్రాంతికలిగినదని, సాగరములకు చంద్రభ్రాంతి కలిగినదనీ, అభ్రమువునకు ఐరావత భ్రాంతికలిగినదనీ భ్రాంతిమదలంకారము వ్యజ్యమాన మవుతున్నది.

వ్యంగ్యమునకు అలంకారవ్యపదేశము

వ్యంగ్యముగా ఉండేది అలంకార్యమె కాని అలంకారము కాదు. ఇక్కడ వ్యజ్యమానవుతూ ఉన్న భ్రాంతి ప్రధానముగా ఉన్నది. కాబట్టి అలంకార్యమె కావాలి కాని అలంకారము కాకూడదు. అయినా బ్రాహ్మణ శ్రమణన్యాయమును అనుసరించి "అలంకారము" అని వ్యపదేశించడము విరుద్ధము కాదు. పూర్వము బ్రాహ్మణుడుగా ఉన్న ఒకడు శ్రమణుడయినాడు. శ్రమణుడంటే బౌద్ధ సన్యాసి. శ్రమణావస్థలో బ్రాహ్మణత్వాదికము లేదు. అయినా "బ్రాహ్మణ శ్రమణుడు" అనే వ్యవహారము ఉంటున్నది. ఈతడు పూర్వావస్థలో బ్రాహ్మణుడుగా ఉన్నాడు అనే ప్రత్యభిజ్ఞానమును

మాత్రము ఆ వ్యవహారము సూచిస్తుంది. అట్లాగే ప్రకృతంలో కూడా అలంకార్యముగా ఉండే అవస్థలో అలంకారత్వము ఉపపన్నము కాదు కాబట్టి "ఇది ఒకరూపము అలంకారముగా ఉన్నది." అనే విశేషము సూచింపబడు తున్నదని గ్రహించాలి. ఈ విధముగానే ఉత్తర స్థలములందున్నూ గ్రహించుట సముచితము.

అలంకారముచే వస్తుధ్వని

ప్రతాపరుద్రస్య రణే కృపాణః సద్యస్సముద్యద్రుధిరారుణశ్రీః,
ఆలంబతే రోషకషాయితస్య కాళీకటాక్షస్య విజృంభితాని,

రణములో ప్రతాపరుద్రుని కృపాణము తత్కాలములో అతిశయించిన రుధిరముచేత ఎర్రని శోభకలదై రోషకషాయితమయిన కాళికాదేవి కటాక్షము యొక్క విజృంభితములను అవలంబించుచున్నది. దీనిలో కృపాణము కటాక్ష విజృంభితములను ధరించు చున్నది, అనడము వలన నిదర్శనాలంకారము స్పష్టము. కాళీ కటాక్షము క్షణములో రిపుక్షయము చేస్తుంది. అట్లాగే కృపాణముకూడా క్షణకాలములో సకల రిపుక్షయము చేస్తుంది అనేవస్తువు వ్యంగ్య మవుతున్నది.

అలంకారముచే అలంకారధ్వని

కాకతీయవిభోః కీర్తిపుండరీకే విజృంభితే,
ధత్తే మధుకరక్రీడాం తమాలశ్యామలం నభః,

కాకతీయ ప్రభువు కీర్తి పుండరీకము విజృంభించగా తమాలమువలె శ్యామమయిన గగనము మధుకర క్రీడను ధరించు తున్నది. దీనిలో నిదర్శనా లంకారముచే అధికాలంకారము ధ్వనించు తున్నది. కీర్తి పుండరీకము నందు ఆకాశము మధుకర క్రీడను ధరించు తున్నది అనుట నిదర్శనా

లంకారము. ఇది వ్యంజక మయిన వాచ్యము. ఆశ్రయము ఆశ్రయి అనే రెండిటికీ ఆనుగుణ్యము లేక పోవుట అధికాలంకారము. అది ఇక్కడ వ్యజ్యమాన మవుతున్నది దీనిలో యశము ఆధారము. నభస్సు ఆధేయము. పుండరీకము ఆధారము మధుకరము ఆధేయము. పద్మముపై విహరించే మధుకరము అల్పముగా ఉంటుంది. విహార స్థానమయిన పుండరీకము అధికముగా ఉంటుంది. మధుకర క్రీడను ధరించే నభస్సు అల్పముగానె ఉంటుంది. పుండరీకాయిత మయిన కీర్తి వైపుల్యము కలది అవుతుంది. ఆశ్రయ మయిన కీర్తిపుండరీకానికి వైపుల్యము ప్రతీయమాన మవుతున్నది. భ్రమర సాదృశ్య ప్రతిపాదనమువలన ఆకాశానికి అల్పత్వము ధ్వన్యమాన మవుతున్నది. ఈ విధంగా అధికాలంకారమును సమన్వయించుకోవాలి.

ఈ ప్రదర్శించిన ఉదాహరణ చతుష్టయములో వ్యంజకార్థము లోకసిద్ధమే కాబట్టి స్వతస్సిద్ధార్థశక్తి మూలత్వమును ఊహించాలి. ఇక కవిప్రౌఢోక్తి సిద్ధార్థ శక్తి మూలములను ఉదాహరించుతాము. వానిలో మొదటగా—

క. ప్రౌ. వస్తువుచే వస్తుధ్వని

శ్రావంశ్రావం ఖురళివిహరత్కార్తికేయేషు జాత
చ్ఛిద్రచ్ఛద్మశ్రవణ పదవీ చారిణీం చారణౌఘైః,
శశ్వద్గీతాం శ్రపణమహితాం కాకతీంద్రస్య కీర్తిం
క్రౌంచక్ష్మాభృ ద్భవతి మహతో విస్మయా న్నిశ్చలాంగః.

మల్లశాలలో విహరించు కుమారస్వామి తన బాణాలచే క్రౌంచపర్వతమును భేదించాడు. అపుడు ఛిద్ర(రంధ్రము)ము ఒకటి కలిగింది. ఆపర్వతానికి అది కర్ణము. భువన మహిత మయిన కాకతీంద్ర కీర్తిని చారణ గణములు మాటిమాటికి గానము

చేసినారు. ఆచిద్రచ్ఛద్మ శ్రవణపదవీ సంచారము చేసే కీర్తిని క్రౌంచము విని విని అత్యధిక విస్మయాన నిశ్చలాంగ మవుతున్నది. దీనిలో ప్రతాపరుద్రుని కీర్తి స్థావరములకు కూడా విస్మయ కారిక మని వస్తువు వ్యంగ్యమవుతున్నది. క్రౌంచము ఆ కీర్తి ని వినడము అనేది వ్యంజకమయిన వస్తువు విస్మయాన క్రౌంచము నిశ్చలాంగి మయింది అనే హేతూత్ప్రేక్ష ఇక్కడ ఉన్నప్పటికీ కీర్తి స్థావరాలకు కూడా విస్మయజనకము అనే వస్తువే చమత్కారక మగుటవలన వస్తువుచే వస్తువు వ్యంగ్యమవుతున్నదని గ్రహించడమె యుక్తము. అచేతనము వినడమనేది లోకసిద్ధము కాదు. కేవలమూ కవి ప్రతిభా నిర్మితము. అందువలన ఇది కవి ప్రౌఢోక్తి సిద్ధము.

క. ప్రౌ వస్తువుచే అలంకారధ్వని

వీరరుద్రభటాన్ దృష్ట్వా జయలక్ష్మీవృతాన్ రణే
కర్షంత్యరివధూకేశాన్ కాననే కంటకిద్రుమాః.

రణములో వీరరుద్ర భటులు జయలక్ష్మీ సమాలింగితులు కావడమును చూచి అరణ్యములో కంటక వృక్షాలు శత్రు స్త్రీ కేశములను గ్రహించుతున్నవి. కంటకిద్రుమకర్తృకమూ కేశకర్మకమూ అయిన కర్షణము ఇక్కడ వ్యంజకవస్తువు. జయలక్ష్మీ సమాలింగితులయిన వీరరుద్రభటులను చూచి కంటకి వృక్షాలు మన్మథావేశము కలవి యో అనునట్లు ప్రతిభూపాల వధూకేశములను ఆకర్షించుచున్నట్లు ఉన్నవి. అనే ఉత్ప్రేక్షాలంకారము వ్యంగ్యము.

౧ క. ప్రౌ. అలంకారము చే వస్తుధ్వని

అపసరతి సఖీభి స్సమం వధ్వా శ్శిధిల మానాయాః
ఆత్మ గ్రహాణ భయేనేవ సవిధ గతే మనోహరే దయితే.

మనోహరుడయిన దయితుడు సమీపమునకు రాగా ప్రణయమానము శిథిలమయిన నవవధువుయొక్క లజ్జ తనను గ్రహించుతాడేమో అనే భయముచే కాబోలు చెలికత్తెలతో సమంగా తొలగి పోతున్నది. దీనిలో ఆత్మ గ్రహణ భయముచే కాబోలు అనేది వ్యంజకమయిన ఉత్ప్రేక్ష. దీనిచే, మనోహరుడు నవవధువును ఆలింగన మొనర్చుకొన్నాడు. అనే వస్తువు వ్యంగ్యమవుతున్నది.

క. ప్రౌ. అలంకారముచే అలంకారధ్వని

అభయం యాచమానానాం కాకతీయేంద్ర విద్విషాం.
రక్షాం నాంగీకరోతీవ వనం శాఖాగ్ర కంపనైః.

అభయమును కోరుతూ ఉన్న కాకతీయేంద్ర శత్రువులకు శాఖాగ్ర కంపనములచే వనము రక్షణము చేయడమును అంగీకరించనట్లుగా ఉన్నది. దీనిలో అంగీకరించనట్లు ఉన్నది అనుట వాచ్యమగు వ్యంజకోత్ప్రేక్ష. దానిచే ప్రతాపరుద్ర శత్రురక్షణ మొనర్చుటకు వనము కూడా భయపడుతూ ఉన్నట్లు ఉన్నది అనే ఉత్ప్రేక్ష వ్యంగ్యమవుతున్నది. ఈ నిదర్శించిన నాలుగు ఉదాహరణములలో వాచ్యము లోకసిద్ధము కాదు. కవికల్పితము. కాబట్టి వీనిలో కవి ప్రౌఢోక్తి నిబంధనత ఉన్నదని గ్రహించాలి. ఇక కవి నిబద్ధ వక్తృ ప్రౌఢోక్తి సిద్ధార్థ శక్తి మూలకములను ఉదాహరించుతాము. అందు

యథా తథా భవతు నరనాథ! కురు రక్షణం శశినః,
యత్త్వయా కటాక్షోల్కా ఆజ్ఞప్తాస్తం మహీకర్తుం.

ఓ! నరనాథా! పూజ్యురాలయిన నాయిక ఎట్లాగయినా కానీ నీవు మాత్రము చంద్రుని రక్షణ చేయాలి ఏమంటావా?

ఆమె చంద్రుని మసీకరించడానికి తన కటాక్షోల్కలను ఆజ్ఞాపించింది. దీనిలో విరహాతుర అయిన ఆర్య చంద్రికను. సహించలేక రోష సముజ్జ్వలిత కటాక్షోల్కలచే చంద్రుని మసిగా చేస్తున్నది. ఆ చంద్రుని సంరక్షించుము. అనేది వ్యంజక మయిన వాచ్య వస్తువు. దీనిచే ఇటుపై ఆమె జీవితమును ధరించడానికి శక్తురాలు కాదు. ఇపుడే నీవు రావాలి అనే వస్తువు వ్యజ్యమాన మవుతున్నది. ఈ పదము దూతీవాక్యము. దూతి కవి నిబద్ధవక్త. తద్వచనములలోని ప్రౌఢోక్తి వలన ఈ వ్యంగ్యము గోచర మవుతున్నది. కాబట్టి కవి నిబద్ధవక్తృ ప్రౌఢోక్తిని సమన్వయించుకోవాలి. ఇట్లాగె మున్ముందూను.

క. ని. ప్రౌ. వస్తువుచే అలంకార ధ్వని

కస్త్వం శుభ్రాఖిలాంగశ్చరసి ? నను యశో వీరరుద్రస్య పత్రే
కోఽయం తే దివ్యదేహః స్ఫురతిపరిసరే ? మత్సుహృత్ త్వత్ప్రతాపః,
ప్రచ్ఛాద్యాలం స్ఫురద్భిః కుముదసరసిజైః ఖ్యాపితం వస్స్వరూపం,
సోమార్కా ! స్వాగతం వా మపధిగిరి రహం కల్పితో నిస్తమస్కః,

ఈ పద్యము ప్రథమార్థములో లోకాలోక పర్వతము నకూ వీరరుద్ర యశమునకూ జరిగిన ప్రశ్నోత్తర వాక్యములు నాలుగు ఉన్నవి. ద్వితీయార్థము లోకాలోక వాక్యము.

లోకాలోకము:— శుభ్రాఖిలాంగుడవై సంచరించుచున్నావు. నీవెవరవు ?

యశస్సు:— నేనా ? వీరరుద్రుని యశస్సును.

లోకా:— నీ పరిసరములో దివ్యదేహము కలిగి స్ఫురించు తున్నాడె. ఎవరీయన ?

యశ:—ఆతడు నాస్నేహితుడు. వీరరుద్రుని ప్రతాపము.

లో కాః— ఓ! నీవు రహస్యమును ఇక దాచనక్కర లేదు లె. వికసించుచున్న కుముదములు పద్మములచే మీస్వరూపము బాగాని తెలిసిందిలె. మీరు సోమార్కులు. మీకు స్వాగతము. రండు. నేను అవధిపర్వతమును. మీరాక వలస నేను వితమస్కముగా చేయబడితిని. ఈ పద్యములో అవధిగిరి వీరరుద్ర యశస్సుల ఉక్తి ప్రత్యుక్తి రూపముగా ఉన్న వాచ్యవస్తువు వ్యంజకము. ప్రతాపరుద్రుని యశఃప్రతాపాలకుసోమార్క సాదృశ్యము గోచరమవుతున్నది కాబట్టి ఉపమాలంకారము వ్యజ్యమానమవుతున్నది. కవినిబంధనోక్తి మూలకత్వము సుగమము. ఈ విధముగా ఉక్తి ప్రత్యుక్తులు లోకసిద్ధములు కావు. అవి కవి నిబద్ధ వక్తృప్రౌఢోక్తి సిద్ధములు.

క. ని. ప్రౌ. అలంకారముచే వస్తుధ్వని

అప్రాప్య సేవావసరం నాథ! కాంతావృతస్య తే,
త్వత్కీర్తిం సేవమానేవ శ్యామా సర్వాంగపాండురా.

ఓః ప్రభూ! మా శ్యామ కాంతాసమావృతుడ వయిన నీయొక్క సేవావసరమును పొంద జాలక నీ కీర్తిని సేవించు దాని వలె సర్వాంగ పాండుర అయినది సుమా! శ్యామ— యౌవనవతి, నల్లనియువతి. దీనిలో శ్యామా సర్వాంగ పాండురత్వములో ధవళకీర్తి సేవనము హేతువుగా ఉత్ప్రేక్షితమయింది. ఇది వ్యంజక మయిన ఉత్ప్రేక్షా లంకారము దీనిచే, నాథా! మీరు అవశ్యముగా అన్నివిధాలా ఆమెను స్వీకరించ వలసి ఉన్నది. అనే వస్తువు వ్యంగ్య మవుతున్నది.

క. ని. ప్రౌ. అలంకారముచే అలంకారధ్వని

పశ్య ! హలా ! వధ్వా స్తథాఽరూఢోఽపి నిర్భరో మానః
నృపతి సమాగమ సంభ్రమ సంజాత భయ ఇవాపసరతి.

చెలియలారా ! చూడండి! ఈ నవ వధువు నిర్భర ప్రణయ మానము ఆ విధముగా ఆరూఢమయినప్పటికీ నృపతి సమాగమము వలన పుట్టిన భయము కలిగిన దానివలె తొలగి పోతున్నది. దీనిలో భయము కలదాని వలె అనేది వాచ్యమగు వ్యంజకోత్ప్రేక్ష. దీనిచే కారణ మయిన ప్రియప్రార్థనము లేకుండానే కార్యమయిన మానినీ మానః ప్రసన్నత్వము కలిగినది అనే విభావనాలంకారము వ్యంగ్యమాన మవుతున్నది. *

ఇక ఈవిధముగానే ప్రబంధాది గతముగా కూడా యథా సంభవముగా ఉదాహరణములను ఊహించుకోవాలి. ఇప్పటికి ఈ చెప్పిన ఉదాహరణములలో అవహిత చేతస్కు లయిన వారు ఉదాహరణాంతరములను గ్రహించడము కష్టము కాదు. కాబట్టి వానిని మళ్ళీ ఇక్కడ ఉల్లేఖించుట గ్రంథగౌరవమే అనే భావముతో ఇక్కడ చెప్పడము లేదు. ఇతర గ్రంథాలలో వీని ప్రపంచము ఉన్నది.

శబ్దశక్తిమూలధ్వని

శబ్దశక్తి మూలధ్వనివస్తుధ్వని అనీ, అలంకారధ్వని అనీ, రెండు విధాలు. అలంకారముకూడా వస్తువే. అయినా అది విచిత్ర వస్తువు అగుట వలన అలంకారమని వ్యపదేశము

* మూలగ్రంథములో అలంకారధ్వని తరువాత వస్తుధ్వని ఉదాహృతమయింది. ఇదివరకు వస్తుధ్వనితరువాత అలంకారధ్వని ఉదాహృతము కావడము ప్రక్రాంతమనే అభిప్రాయముతో ఔచిత్యాన్నిబట్టి ఈ వరుస అనుసృత మయింది.

పొందుతున్నది. వస్తువు రెండు విధములు. చిత్రవస్తువని అచిత్రవస్తువని. అచిత్రవస్తువునకు వస్తువని పేరు. ఇదే శుద్ధ వస్తువు చిత్రవస్తువు అలంకారము.

అలంకారోఽథ వస్త్వేవ శబ్దా ద్యత్రావభాసతే,
ప్రధానత్వేన స జ్ఞేయః శబ్దశక్త్యుద్భవో ద్విధా.

శబ్దమువలన అలంకారముకాని, కేవల శుద్ధ వస్తువుకాని ప్రధానముగా అవభాసించే స్థలములో శబ్దశక్త్యుద్భవధ్వని ద్వివిధమని గ్రహించాలి. శబ్దస్వాభావ్యమున అవభాసించు తున్న అలంకారవస్తువులు ప్రధానములుగా గోచరములు కాకపోయినట్లయితే శబ్దశక్తి మూలధ్వని అనే పేరు లేదు. అని ప్రాచీనులు అంటున్నారు.

శబ్దశక్తి మూలాలంకార ధ్వని

ఏష సత్యం రాజా శ్యామా ఖలు త్వం సమాగమో ద్వయోః,
కిం పున ర్న ప్రదోష కథా దృశ్యతే ఏతత్ఖలు ఆశ్చర్యం.

ఈతడు సత్యముగా రాజు. నీవు శ్యామవు కదా! మీ ఇద్దరికే సమాగమము ఉచితము. కాని ఇక్కడ ప్రదోషకథ కన్పడడము లేదే! ఇదే ఆశ్చర్యముగా ఉన్నది కదా! ఇది సామాన్యార్థము. ఓ! యౌవనవతీ! నీవు నృపాలకుని ప్రేమించి నావు. మీకు సమాగమము యుక్తముగా ఉన్నది. మీ విష యమైన దోషదూషిత కథలు వెలువడక పోవడము చిత్రముగా ఉన్నది. ఔరా! అనేది ప్రకృతార్థము.

ఈతడు చంద్రుడు. నీవు రాత్రివి. మీకు సమాగమము యుక్తమే కదా! శ్యామా చంద్ర సమాగమము వలన ప్రదోష కాలము కలుగవలసింది కదా! అది లేదు. ఇది చిత్రము అని అప్రకృతార్థము. ఈ పద్యములో శ్యామా రాజ శబ్దములు

ప్రకరణ బలానుసారము వలన కాంతా నృపులకు వాచకములై ఉన్నవి. ఆశబ్దాల వలననె నిశాచంద్రప్రతీతి కలుగుతున్నది. కవి ఇక్కడ అనే కార్థ పద గుంభనమును చేసినాడు. కాబట్టి అర్థాంతరము ఆతనికి వివక్షితమె అని తెలిసికోవాలి. ఇట్లా వివక్షితమైన అర్థాంతరమునకు ప్రకృతార్థమునకూ ఏదో ఒక సంబంధము ఉండితీరాలి. లేకపోతే కవి అసంబద్ధార్థాభిధాయి అవుతాడు. ఈ అసంబద్ధతా పరిహారానికై ఔపమ్యము ఇక్కడ కల్పింప వలసి ఉన్నది. అట్లా అభ్యూహితౌపమ్యానుసారముగా ఉపమాలంకారము వ్యంగ్యమవుతున్నది. ఇటువంటి స్థలములందు ఈ ఉపమాలంకారము శ్లిష్ట శబ్దములు ఉంటేనే కలుగుతుంది. శ్లిష్టశబ్దములు లేక పోయినట్లయితే అది కలుగదు. కనుకనే ఇది శబ్దశక్తిమూలమని భావము అన్వయ వ్యతిరేకములను బట్టి శబ్దానికే ఆ శక్తిని అంగీకరించాలి.

శబ్దశక్తిమూల వస్తుధ్వని

కాంతారవాస సంతప్తా స్సంశృణుధ్వం హితాదితః,
కురుధ్వ మధునా రాజపాదసేవాం నరేశ్వరాః.

అరణ్య నివాసమున సంతప్తులయిన ఓ సామంత నరేశ్వరులారా! మేము మీకు హితులము మానుండి మీరు ఇది వినండి. మీరు ఇప్పుడు రాజ పాదసేవను ఒనరించండి. ఇక్కడ రాజపాదసేవా పదము ద్వ్యర్థము. రాజు పాదసేవ అని ఒకఅర్థము. చంద్రకిరణసేవ అని రెండవఅర్థము. శబ్దశక్తిచే ప్రకరణబలము వలన ప్రతాపరుద్రుని పాదముల సేవనే చేయాలి. అరణ్యావాసము వలన ఏల సంతాపపడుతారు? అనే వస్తువు వ్యంగ్యమవుతున్నది అరణ్యావాసములో

మామూలు సారతాప తప్తులకు చంద్రకిరణసేవ ఉపకారకము. ఇక్కడ ప్రతాపరుద్రుని వలన వ్యధితులై సామంత నృపాలకులు వనవాస పరితాపమును పొందుతున్నారు. అనే అర్థము ప్రకృతములో ప్రకరణబలాను సారముగా తెలియదగి ఉన్నది. ఈ విధముగా సంతప్తులకు చంద్రకిరణసేవ ఉపకారి కాదు. అటువంటి వారికి ప్రతాపరుద్రనృపుని పాదముల సేవ మాత్రమె ఉపకార జనకము. కాబట్టి రాజపాదసేవా శబ్దశక్తి స్వాభావ్యమువలన ప్రతాపరుద్రుని సేవ చేయండి. అని వస్తురూపమయిన అర్థము వ్యంగ్యమవుతూ ఉన్నదని సూక్ష్మముగా అవధారింపతగి ఉన్నది.

ఉభయశక్తిమూలధ్వని

జిష్ణు రేష భుజస్తంభ జృంభమాణాద్భుతాయుధః,
ముంచంతు క్ష్మాభృత స్సర్వే నిజపక్ష విజృంభితం.

దీనిలో రెండర్థములు. ఓ! పృథివీపతులారా! ఇతడు జయన శీలుడు. ఈతని భుజ స్తంభములందు అద్భుతమయిన ఆయుధము విజృంభించు తున్నది. మీరందరూ మీ మీ సేనాబల విజృంభణమును కట్టిపెట్టుదురు గావుత. ఇది ప్రథమార్థము. ఓ!పర్వతములారా! ఈతడు ఇంద్రుడు. ఈతని భుజ స్తంభములందు అద్భుతాయుధము విజృంభించుతూ ఉన్నది. మీరందరూ మీ మీపక్ష=రెక్కల విజృంభణమును విడిచిపెట్టుదురు గావుత. ఇది అప్రకృతార్థము. ఈపద్యములో "క్ష్మాభృతః,నిజపక్ష విజృంభితం,జిష్ణుః," అనే శబ్దాలు పరివృత్తి సహములు కానందువలన శబ్దశక్తి మూలత్వమును, "భుజ స్తంభ జృంభమాణా ద్భుతాయుధః" అనే శబ్దము పరివృత్తి సహము అవుతుంది కాబట్టి అర్థశక్తి మూలత్వమును గ్రహిం

చాలి. ఒకే వాక్యములో శబ్దార్థ శక్తులుకూడా ఉన్నందువలన ఉభయశక్తి మూలధ్వని. ఇది ఒకవాక్యము అగుటవలన వాక్యగతమె అని తెలియవలెను.

అసంలక్ష్యక్రమ ధ్వని

రసాది ధ్వనికి అసంలక్ష్య క్రమవ్యంగ్య మని పేరు. ఇట్లా అనడములో ప్రాచీనసమ్మతి ఉన్నది. రుద్రభట్టుని శృంగార తిలకమునందు ఇట్లాగే గడత మైనది.

రసభావ తదాభాస భావశాంత్యాది రక్రమః,
భిన్నో రసాద్యలంకారా దలంకార్యతయా స్థితః.

రసము భావము రసాభాస భావాభాస భావశాంత్యాదులు అక్రమములు అనబడును. అనగా అసంలక్ష్య క్రమములు అని అర్థము. ఈ అసంలక్ష్య క్రమవ్యంగ్యధ్వని అలంకార్య ముగా ఉంటుంది. కాబట్టి రసాద్యలంకారములకంటె భిన్నము. భావశాంత్యాదు లనేచోట ఆదిపదమున భావోదయము భావసంధి భావశబలతలను గ్రహించాలి. భావానికె శాంత్యు దయ సంధి శబలత్వములు ఉంటవి. రసానికి శాంత్యాదులు ఉండవు. అక్కడ శాంత్యాద్యవస్థావర్ణనము చమత్కారకము కాదు. కాబట్టి రసానికి శాంత్యాదులను గణించడము లేదు.

ధ్వని వాదమును అంగీకరించని ప్రాచీనులు రసభావాదులు వర్ణింపబడిన స్థలములో రసవదాద్యలంకారములను అంగీక రించుతున్నారు. రసాదులు ప్రధానములయినా అప్రధానము లయినా అవి అలంకారము లె అని వారి భావము. ఇది యుక్తముగ్గా తోచదు. అలంకరించేది అలంకారమవుతుంది. అనగా 'అప్రధానమె అలంకారమవుతుంది. కాని ప్రధానము అలంకారము కాదు.' అని భావము. ప్రధానము ఎపుడూ

అలంకార్యమే. రసభావాదులు ప్రధానముగా వర్ణింపబడిన స్థలములో అలంకారమనే వ్యపదేశము చేయడము సముచితము కాదు. అక్కడ కూడా రసాదికము అలంకారమే అయ్యేటట్లయితే అది దేనిని అలంకరించుతుంది? తనకు తానె అలంకార మవుతుంది. అని అనడములో ఉపపత్తి లేదు. అలంకారము కంటె అలంకరింపబడేది భిన్నముగా ఉండాలి. ఇది లోకసిద్ధమయిన న్యాయము కూడాను. కామినీ కంఠసీమలో హారము అలంకారము. కంఠసీమ అలంకార్యము. హారము కంఠసీమను అలంకరించుతున్నది. హారము వేరు. కంఠసీమ వేరు. రెండిటికీ భేదము ఉన్నది. అట్లాగే ప్రకృతంలోకూడా భేదముఉండాలి. ప్రధానములుగా రసాదులు వర్ణింపబడినపుడు అవికూడా అలంకారములె అయితే వాటికన్న భిన్నముగా వానిచేత అలంకరింప బడేది ఒకటి ఉండితీరాలి కదా. అటు వంటిది ఏమీ లేదే? తనకు తాను అలంకారము ఎట్లా అవుతుంది? రసభావాదులు అప్రధానముగా వర్ణింపబడే స్థలములోనే రసవదాద్యలంకారము లనివ్యవహరించడము యుక్తముగా ఉంటుంది. కాగా అలంకార్యముగా ఉండే రసభావాదులె అలక్ష్యక్రమ వ్యంగ్యధ్వనులు అనబడుతవి. రసప్రకరణములో రసభావ స్వరూప నిరూపణ ప్రపంచమును రసభావాదుల ఉదాహరణములనూ విశదముగా నిరూపించుతాము.

గుణీభూతవ్యంగ్యము

మధ్యమ కావ్య లక్షణము ఇది వరలో నిరూపిత మయింది. అదె గుణీభూతవ్యంగ్యమని నిరుక్తము. గుణీభూత వ్యంగ్యము అష్ట విధముగా ఉన్నది. ఇక వానిని నిరూపించుతాము. ఈ

విషయము కావ్యప్రకాశములో ఇట్లా ప్రతిపాదితమయింది. అగూఢము అపరాంగము వాచ్యసిద్ధ్యంగము అస్ఫుటము సందిగ్ధము తుల్యప్రాధాన్యము కాక్వాక్షిప్తము అసుందరమూ అని మధ్యమకావ్యము అష్టవిధము అని. ఈ మమ్మటవచనము మావచన సంవాదమును చూపుతున్నది. వీనిలోనే లక్ష్యనిర్దేశముకూడా ఉన్నది. ఇక లక్షణలక్ష్యములను ప్రదర్శించుతాము.

అగూఢము

కామినీ కుచకలశమువలె గూఢార్థమె చమత్కారకారి అవుతుంది. కాని అగూఢము అంతగా చమత్కారి కాదు. కాబట్టి అగూఢవ్యంగ్యము మధ్యమ కావ్యమె. కావ్యార్థము ద్రావిడీ స్తనగతి అత్యంతమూ ప్రకాశము కారాదు. ఘూర్జరీకుచ యుగక్రియ అత్యంతమూ నిగూఢమూ కారాదు. ఆంధ్ర వధూ కుచాభమై గూఢాగూఢముగా ఉండడమె మనోహరము. వ్యంగ్యము ఒకచోట ద్రుతప్రతీత మవుతుంది. అది అగూఢము. వేరొకచోట మధ్యమ రీతిని గోచర మవుతుంది. అది గూఢము. ఇంకా ఒకచోట విలంబిత ప్రతీతిక మవుతుంది. అది అస్ఫుటము. ద్రుతప్రతీతి విలంబిత ప్రతీతి ఉంటే మధ్యమ కావ్యమని మధ్యమ ప్రతీతి ఉన్నట్లయితే ఉత్తమకావ్యమని ఇక్కడి వివేకము. ఉదా:—

> ఔన్నత్యం యది కీర్త్యతే శిఖరిణః క్రుధ్యంతి నీచైఃకృతాః
> గాంభీర్యం యది పఠ్యతే జలధయః క్షుభ్యంతి గాధీకృతాః,
> తద్బ్రూహి వర్ణయితుం బిభేమి యది వా జాతోఽస్మ్యగస్త్యః స్థితః
> త్వత్పార్శ్వే గుణపిత్తలోహ జనకౌ శ్రీపినబుద్ధప్రభో!

ఓ! శ్రీ వీరబుద్ధప్రభూ! నేను మీ ఔన్నత్యమును కీర్తించినట్లయితే పర్వతములు క్రిందుగా చేయబడినవై క్రోధ

యుక్తములగును. గాంభీర్యమును వర్ణించి నట్లయితే జలధులు గాఢీకృతములై క్షోభయుక్తము లవుతవి. కావున నిన్ను వర్ణించడానికి భయపడుతున్నాను. ఓ గుణ రత్న రోహణ గిరీ! (రోహణ పర్వతము రత్నాలకు ఉత్పత్తి భూమి) నేనీ విధముగా భయపడడ మెందుకు? నీపార్శ్వములో నేను ఇప్పుడు అగస్త్యుడనై ఉన్నాను. దీనివలన — జలనిధి పర్వతాలకు నేను భయపడను అని వ్యజ్యమానమవుతున్నది. కుంభసంభవుడు వామనీకృత వింధ్యాచలుడు. చుళుకీకృత పయోరాశి కదా! ఈ వ్యంగ్యము వాచ్యాయమానముగానే ఉన్నది. అందువలన అగూఢము.

అపరాంగము

రసాదులకు రసాదులు అంగములు అయినట్లయితే అది అపరాంగమవుతుంది. ఇదిఅనేకవిధాలు కావడానికిఅవకాశము ఉన్నది. ఆభేదాలను ఈ విధముగా తెలియవచ్చును.

౧ ఒక రసమునకు వేరొక రసము అంగమగుట
౨ ,, భావము అంగమగుట
౩ ,, రసాభాస అంగమగుట
౪ ,, భావాభాస అంగమగుట
౫ ,, భావశాంతి అంగమగుట
౬ ,, భావోదయము అంగమగుట
౭ ,, భావసంధి అంగమగుట
౮ ,, భావశబలత అంగమగుట

ఇట్లాగే భావానికి భావము రసము భావాభాస రసాభాస భావశాంతి భావోదయము భావసంధి భావశబలతలు అంగము లగుటలో కూడా అపరాంగత్వమును ఊహించాలి. ఈ విధము

గానే తదాభాసాదులకు తత్తదంగత్వములో కూడా అపరాంగత్వమును గ్రహించుట శక్యము. ఇదే అనేక భేదాలవుతుంది. ఇంకా ఈ విధముగా రసభావాద్యర్థానికి అనురణనము అంగమయినపుడు కూడా అపరాంగమె అవుతుంది. వాక్యార్థభూతముగా ఉన్న వాచ్యార్థానికి రసభావాదులు అంగములయినా అపరాంగమె అవుతుంది. ఇట్లాగే సంలక్ష్యక్రమధ్వని అంగమయినా అపరాంగమనియే గ్రాహ్యము. ఈ విధముగా ఈ భేదములు అనంతములు కావడానికి అవకాశము ఉన్నది. రసానికి రసము అంగమగుటమాత్రము ఉదాహృతమవుతున్నది.

> వీతవ్రీడ మపాస్తమాన ముదయద్వైస్వర్య మావిర్భవ
> త్స్వేదం నిర్భరగాత్రవేపథు మిళన్మూర్ఛం గళద్బాష్పకం,
> సంజాతప్రళయంచ కాకతిమహీనాథ ! స్మరోద్వేజితా
> భూపాః శైలగుహాసు యాంతి విజనం భీత్యా సమాలింగితాః.

ఓ! కాకతిమహీనాథా ! భీతిసమాలింగితులయిన సామంత నృపాలకులు పర్వతగుహాలలో విజన ప్రదేశములను గురించి స్మరోద్వేజితులై పోతూ ఉన్నారు. వారలలో లజ్జ తొలగిపోతున్నది. అభిమానము అపాస్తమవుతున్నది. విస్వరత్వము ఉదయించుతున్నది. స్వేదము ఆవిర్భవించుతున్నది. నిర్భరమైన శరీరకంపము కలుగుతున్నది. మూర్ఛ కలుగుతున్నది. కన్నీరు ప్రసరించుతున్నది. ప్రళయము ఉత్పన్నమవుతున్నది. ఈ పద్యములో భయాలింగితులయిన సామంతకుల వ్యాపార విశేషము ప్రకృతము. అది భయానక రసమును అభివ్యక్తము చేస్తున్నది. భయానక రసానికి భయము స్థాయిభావము. సామంతకులు తదాశ్రయులు. భయభీతులలో వీతవ్రీడత్వాదికముఉంటుంది. భయానకరసానుగుణముగా సన్నివేశింప చేయ

బడిన పీతవ్రీడత్వాది విశేషణాల బలాన అప్రస్తుత నాయక ధర్మ ప్రతీతి కలుగుతున్నది. భీతి అనే నాయికచే సమాలింగిత సామంతనృపతులు స్మరోద్వేజితులై పీత వ్రీడత్వాదికము కలుగునట్లుగా నిర్జన ప్రదేశములను గురించి వెళ్లుచున్నారు అనేది నాయికా నాయక వ్యవహారము. ఇది శృంగార రసావగతిహేతువు ప్రకృతము కాబట్టి భయానకము ప్రధానము. శృంగారము అప్రధానము. అప్రధానమయిన శృంగారము భయానకమును పోషిస్తున్నది. కాబట్టి భయానకములో అంగమవుతున్నది. ప్రకృతబలాన భయానకము తెలియదగి ఉన్నది కాని వర్ణ్యమానమగుట శృంగారమె చమత్కారి అయినా అది భయానక రసానికి అంగమవుతున్నందు వలన అపరాంగము. ప్రధానమయినా భయానకము అంతగా చమత్కారి కాదు. కాబట్టి ఇక్కడ ధ్వని అనే వ్యవహారము లేదు. ఈ విధముగా ఇతరోదాహరణములను గ్రహించాలి.

వాచ్యసిద్ధ్యంగము

ప్రతీయమానమయిన అర్థము వాచ్యసిద్ధిలో (ఉత్పత్తిలో) అంగము అయినట్లయితే వాచ్యసిద్ధ్యంగము అవుతుంది. అపరాంగము ఇటువంటిది కాదు. తనంతట తాను సిద్ధమయిన అర్థానికి అంగమయినట్టిది అపరాంగము. వాచ్యసిద్ధిలోనే ఉపకరించేది వాచ్యసిద్ధ్యంగము. ఉదా:—

కరాళః కాకతీంద్రస్య కరవాల నవాంబుదః,
ధారయా శమయత్యుగ్రం ప్రతాపజ్వలనం ద్విషాం.

కాకతీంద్రుని కరాళమయిన ఖడ్గమేఘము శత్రువుల ఉగ్రమయిన ప్రతాపాగ్నిని ధారచే శమింప చేస్తున్నది.

ఇక్కడ ధారా పదము ఉభయార్థకము. కత్తిఅంచు అని ఒక అర్థము. జలధార అని రెండవ అర్థము. వీనిలో, జలధారా రూపార్థము వ్యంగ్యము. ప్రకరణ బలాన అభిధ ఖడ్గధారార్థములోనె నియంత్రిత మవుతున్నది కదా! ఈ పద్యములోనె "కరవాలనవాంబుదః" అనే చోట కరవాలము నందు నవాంబుదత్వము సమారోపిత మవుతున్నందు వలన రూపకాలంకారము ఉన్నది. "ప్రతాపజ్వలనం" అనే చోటకూడా రూపకాలంకారము ఉన్నది. ఈ రూపకము వాచ్యభూతము. ధారాపద వ్యంగ్యమయిన జలధార ఈ రూపకానికి సిద్ధిని ఆపాదించుతున్నది. రూపకము స్వనిర్వాహానికై ప్రతీయమాన జలధారను అపేక్షించు తున్నదని భావము. ఈ వ్యంగ్యము లేకపోయినట్లయితే "కరవాల నవాంబుదః" అనె చోట రూపకము సిద్ధించదు. "కరవాల నవాంబుదః" అనేది రూపకసమాసమా? ఉపమితసమాసమా? అనే సందేహము కలుగుతుంది. ఖడ్గధారయందు జలధారాత్వము ఆరోపిత మయినట్లుగా వ్యంగ్యముగా గోచరమవుతున్నది. అందువలన అది వ్యంగ్యరూపకము. ఖడ్గధారయందు జలధారాత్వారోపము ఉంటేనే కాని కరవాల మందు నవాంబుదత్వారోపము కుదరదు. ఇట్లా వ్యంగ్యము వాచ్య భూత రూపకానికి సిద్ధికారి. కాబట్టి ఇది వాచ్యసిద్ధ్యంగమనే గుణీభూతవ్యంగ్యమవుతున్నది.

సామాన్య ధర్మము ప్రయోగింప బడకుండా ఉన్నప్పుడే ఉపమిత సమాసము ఉపపన్నమవుతుంది. సామాన్య ధర్మము ప్రయుక్తమయినట్లయితే రూపక సమాసమే కాని ఉపమిత సమాసము కాదని వ్యాకరణ శాస్త్ర నియమము. ఇక్కడ

"కరాళః" అనేది కరవాలానికి నవాంబుదమునకూ సమాన ధర్మము. కాగా ఈ స్థలంలో రూపక సమాసమె కాని ఉపమిత సమాసము కాదు. అందుచే జలధారా రూపవ్యంగ్యము లేక పోయినట్లయితే సమాస సందేహము కలుగుతుంది అని అనడము ఉచితము కాదు. సామాన్య ధర్మ ప్రయోగము రూపక సాధకముగా ఉన్నది కదా! అందువలన ఇక్కడ జలధారా రూపవ్యంగ్యము రూపక సిద్ధి కృత్తనుట సముచితముగా లేదు. ఈ వ్యంగ్యము లేకపోయినా రూపక సిద్ధిలో అంతరాయములేదు. వ్యంగ్యాతిరిక్తార్థముచే వాచ్యము ఉపపన్నమవుతూ ఉన్నపుడు వ్యంగ్యము వాచ్య సిద్ధ్యుపకారక మయినా గుణీభూత మనరాదని సాహిత్య విదుల సిద్ధాంతము. ఈ హేతువులను బట్టి ఈ పద్యము ధ్వన్యుదాహరణమె అవుతుంది. కాని వాచ్య సిద్ధ్యంగ రూప గుణీభూతోదాహరణము కాదు. విద్యానాథుడు దీనిని ఇట్లా ఉదహరించడములో ఉపపత్తిమృగ్యముగా ఉన్నదని గ్రహించాలి.

అస్ఫుటము

వ్యంగ్యము మధ్యమ ప్రతీతికము కాక విలంబిత ప్రతీతిక మయినట్లయితే అస్ఫుటమనే గుణీభూత వ్యంగ్యమవుతుంది.
ఉదా:—

> వీరరుద్రకృపాణస్య మహిమా కోప్యనంకుశః,
> ప్రసూతే కీర్తిగంగాం యః పీత్వా ద్విషదసృఙ్నదీం.

వీరరుద్రుని కృపాణము యొక్క మహిమ అనంకుశము. అది అనిర్వాచ్యము. అడ్డులేనిది. ఆ కృపాణము శత్రురక్త నదిని పానము చేసి కీర్తిగంగను కలుగజేస్తున్నది కదా! దీనివల్లో జహ్నుమహర్షి కంటె కృపాణమునకు ఆధిక్యము

ప్రతిపాదింపబడినందున వ్యతిరేకా లంకారము వ్యంగ్యము. అది అత్యంతమూ నిగూఢముగా ఉన్నది. ఇదివరలో జహ్ను మహర్షి తన ఆశ్రమ పదములో ప్రవహించే గంగా నదిని పానముచేసి భగీరథుడు ప్రార్థించగా తన శ్రోత్రమార్గము నుండి గంగను విడిచిపెట్టినాడు. ఆతడు గంగనే త్రాగినాడు. గంగనె విడచినాడు. కృపాణము రక్తమును త్రాగి కీర్తిని ప్రసరించేటట్లు చేస్తున్నది. త్రాగినది వేరు. విడిచినది వేరు. కావున జహ్నువుకన్న ఆధిక్యము కలదని వ్యంగ్యము గూఢ గూఢముగా ఉన్న ఈ అర్థము కథనము వలననె తెలియ బడవలసి ఉండుటచే అస్ఫుటము.

సందిగ్ధము

కవి వివక్ష వ్యంగ్యార్థములో ఉన్నదా? వాచ్యార్థములో ఉన్నదా? అనే సందేహము ఉభయ కోటికమై ప్రధానముగా ఉన్నప్పుడు సందిగ్ధము అవుతుంది. వ్యంగ్య వివక్షయే కవికి ఉన్నా వాచ్యముకూడా వివక్షితమై ఉండడము ఉన్నదికదా! ఉదా:—

> హరతిత్మ్యపతే ర్దృష్టి రనురాగతరంగితా,
> లగ్నా కల్హారమాలేవ వధ్వా స్తుంగే కుచద్వయే.

కాకతీసుని అనురాగ తరంగితమైన దృష్టి నవవధూస మున్నతకుచద్వయమునందు కల్హారమాలవలె సంలగ్న మయింది. దీనిలో కాకతీయుడు ఆలింగనాభిలాషుడై ఉన్నాడని వ్యంగ్యము. ఈ పద్యవాక్యము ఆలింగన కాంక్ష లోనే విశ్రాంత మవుతున్నదా? కేవలమూ ఆ విధముగా స్తనమండలావలోకనములోనె విశ్రాంతిని పొందుతున్నదా? అని ఇక్కడ సందేహము కలుగుతున్నది. ఈ సందిగ్ధానికే

"కరాళః" అనేది కరవాలానికి నవాంబుదమునకూ సమాన ధర్మము. కాగా ఈ స్థలంలో రూపక సమాసమె కాని ఉపమిత సమాసము కాదు. అందుచే జలధారా రూపవ్యంగ్యము లేక పోయినట్లయితే సమాస సందేహము కలుగుతుంది అని అనడము ఉచితము కాదు. సామాన్య ధర్మ ప్రయోగము రూపక సాధకముగా ఉన్నది కదా! అందువలన ఇక్కడ జలధారా రూపవ్యంగ్యము రూపక సిద్ధి కృత్తనుట సముచితముగా లేదు. ఈ వ్యంగ్యము లేకపోయినా రూపక సిద్ధిలో అంతరాయము లేదు. వ్యంగ్యాతిరిక్తార్థముచే వాచ్యము ఉపపన్నమవుతూ ఉన్నపుడు వ్యంగ్యము వాచ్య సిద్ధ్యుపకారక మయినా గుణీభూత మనరాదని సాహిత్య విదుల సిద్ధాంతము. ఈ హేతువులను బట్టి ఈ పద్యము ధ్వన్యుదాహరణమె అవుతుంది. కాని వాచ్య సిద్ధ్యంగ రూప గుణీభూతోదాహరణము కాదు. విద్యానాథుడు దీనిని ఇట్లా ఉదహరించడములో ఉపపత్తిమృగ్యముగా ఉన్నదని గ్రహించాలి.

అస్ఫుటము

వ్యంగ్యము మధ్యమ ప్రతీతికము కాక విలంబిత ప్రతీతికమయినట్లయితే అస్ఫుటమనే గుణీభూత వ్యంగ్యమవుతుంది.

ఉదా:—

వీరరుద్రకృపాణస్య మహిమా కోప్యనంకుశః,
ప్రసూతే కీర్తిగంగాం యః పీత్వా ద్విషదసృఙ్నదీం.

వీరరుద్రుని కృపాణము యొక్క మహిమ అనంకుశము. అది అనిర్వాచ్యము. అడ్డు లేనిది. ఆ కృపాణము శత్రురక్త నదిని పానము చేసి కీర్తిగంగను కలుగజేస్తున్నది కదా! దీనిలో జహ్నుమహర్షి కంటె కృపాణమునకు ఆధిక్యము

ప్రతిపాదింపబడినందున వ్యతిరేకా లంకారము వ్యంగ్యము. అది అత్యంతముగా నిగూఢముగా ఉన్నది. ఇదివరలో జహ్ను మహర్షి తన ఆశ్రమ పదములో ప్రవహించే గంగా నదిని పానముచేసి భగీరథుడు ప్రార్థించగా తన శ్రోత్రమార్గము నుండి గంగను విడిచిపెట్టినాడు. ఆతడు గంగనే త్రాగినాడు. గంగనె విడచినాడు. కృపాణము రక్తమును త్రాగి కీర్తిని ప్రసరించేటట్లు చేస్తున్నది. త్రాగినది వేరు. విడిచినది వేరు. కావున జహ్నువుకన్న ఆధిక్యము కలదని వ్యంగ్యము గూఢ గూఢముగా ఉన్న ఈ అర్థము కథనము వలననె తెలియ బడవలసి ఉండుటచే అస్ఫుటము.

సందిగ్ధము

కవి వివక్ష వ్యంగ్యార్థములో ఉన్నదా? వాచ్యార్థములో ఉన్నదా? అనే సందేహము ఉభయ కోటికమై ప్రధానముగా ఉన్నప్పుడు సందిగ్ధము అవుతుంది. వ్యంగ్య వివక్షయే కవికి ఉన్నా వాచ్యముకూడా వివక్షితమై ఉండడము ఉన్నదికదా! ఉదా:—

కాకతీశ్మాపతే ర్దృష్టి రనురాగతరంగితా,
లగ్నా కల్హారమాలేవ వధ్వా స్తుంగే కుచద్వయే.

కాకతీసుని అనురాగ తరంగితమైన దృష్టి నవవధూస మున్నతకుచద్వయమునందు కల్హారమాలవలె సంలగ్న మయింది. దీనిలో కాకతీయుడు ఆలింగనాభిలాషుడై ఉన్నాడని వ్యంగ్యము. ఈ పద్యవాక్యము ఆలింగన కాంక్ష లోనే విశ్రాంత మవుతున్నదా? కేవలముగా, ఆ విధముగా స్తనమండలావలోకనములోనె విశ్రాంతిని పొందుతున్నదా? అని ఇక్కడ సందేహము కలుగుతున్నది. ఈ సందిగ్ధానికే

సందిగ్ధ ప్రాధాన్యమని పేరు. వ్యంగ్యము చమత్కారియై ప్రధాన మవుతున్నదా? వాచ్యమె ప్రధాన మవుతున్నదా? అని సమన్వయమును చూచుకోవాలి.

తుల్య ప్రాధాన్యము

వాచ్యార్థానికి వ్యంగ్యార్థానికి సమాన ప్రాధాన్యము ఉన్నట్లయితే తుల్య ప్రాధాన్యమవుతుంది. సామాన్యముగా వాక్యములో ఒకే అర్థమె ప్రధానము. ఇతరార్థములు ఉన్నా తదంగ భావమును పొంది తీరాలి. రెండర్థములకూ సమప్రాధాన్యము ఉన్నట్లయితే ఏకార్థతకు భంగము వాటిల్లుతుంది. ప్రకృతములో వాచ్య వ్యంగ్యములు సమబలములయినా ఐకార్థ్యభంగదోషము వాటిల్లుతుంది. కాని ఈ వాక్యభేదమనేది లౌకికవాక్యములలో దోషము కాదని ఇదివరలో ప్రతిపాదితము. ఉదా:—

నృపాః ప్రతాపరుద్రస్య నిషేవధ్వం పదాంబుజే,
అన్యథాఽస్య మనస్తావత్ప్రసాదం కలుషాయతే.

ఓ! నృపాలకులారా! ప్రతాపరుద్రుని పదాంబుజములను సేవింపుడు. కాకపోయినట్లయితే అంతటి ప్రసన్నతకల ప్రతాపరుద్రుని మనస్సు కలుష మవుతుంది సుమా. ఈ చెప్పినది వాచ్యార్థము. ప్రతాపరుద్రుని పాదసేవను పరిత్యజించినట్లయితే నగరనివాసము దుర్లభమవుతుంది అని వ్యంగ్యము. ఈ వ్యంగ్యమూ పూర్వము చెప్పిన వాచ్యమూ సమప్రధానములై ఉన్నవి. కవి ఎల్లప్పుడూ వ్యంజనైక ప్రవణుడై ఉండాలి. దీనిలో అట్లా కాక వాచ్యప్రవణత కూడా కన్పడుతున్నది. వాచ్యవ్యంగ్యముల ప్రాధాన్యాది నిర్ణయములో సహృదయులె ప్రమాణము అన్యథాన్యథాపలికే ఉద్ధతులు ప్రమాణము కారు.

అసుందరము

ఉద్దేశ క్రమాను సారముగా కాక్వాక్షిప్తమును ఉదాహరించవలసింది. కాని దానిని ఉల్లంఘించి విద్యానాథుడు అసుందరమును ఉల్లేఖించుతున్నాడు. దీనివలన ఉద్దేశక్రమము వివక్షితము కానట్లు సూచిత మవుతున్నదని ఊహించవచ్చును. కాని ఈవిధముగా భావించుట ఉచితముగా ఉంటుంది. కొందరు కాక్వాక్షిప్తమును గుణీభూతముగా తలచరు. స్వరము వేదమునందే విశేషార్థ ప్రతీతి కృత్తని వారిభావన. కావ్య స్వరము విశేషాధాయకము కాదని కూడా వారి తలంపు. కాక్వాక్షిప్తము కూడా గుణీభూతమె అని విద్యానాథ హృదయము. దీనిని ఆ విధముగా తలచని వారి వాదమును నిరసించడానికి కాక్వాక్షిప్తమును చివరకు ఉంచి ప్రస్తుతము అసుందరమును నిరూపించడము సముచితము అని భావించి విద్యానాథుడు అసుందరమునే ఉదాహరించు చున్నాడు.

ఏకశిలా మహిళాణాం శ్రుత్వా నరేంద్ర దర్శనా మోదం
గురుజన నియంత్రితాయా వధ్వాః శ్యామలం వదనం.

ఏకశిలా నగరములోని యువతుల నరేంద్రదర్శన నిమిత్తకమయిన సంతోష మహాలాభమును వినగా గురుజనముచే నియంత్రితురాలయిన ఒక నవవధూ వదనము శ్యామలమయింది. దీనిలో నరేంద్ర దర్శన నిమిత్తమయిన హర్షమును ఊహించు వధువు మలినముఖము కలదయిందని వాచ్యము. గురుజన నియంత్రితనయిన నేను నరేంద్రుని చూడడానికి వెళ్ళకపోయితిని కదా! అని వ్యంగ్యార్థము. వాచ్యమె మనోహరముగా ఉన్నది. వ్యంగ్యము సుందరముగా లేదు. కాబట్టి అసుందరము.

కాక్వాక్షిప్తము

కాకువు అనేది శబ్ద ధర్మము. అది ఒక స్వర విశేషము. అట్టి కాకువుచే అర్థాంతము ఆక్షిప్త మయినట్లయితే అది కూడా గుణీభూత వ్యంగ్యమె అవుతుంది. అక్కడ ప్రతీయ మానార్థము శబ్దస్పృష్టమవుతుంది. కాబట్టి ధ్వని వ్యవహారము ఉచితము కాదు. కాకువు కొన్ని స్థలములలో ప్రశ్నమాత్ర పర్యవసాయి అవుతుంది. వ్యంగ్యము దానిచే సమున్నీతము కాదు. అటువంటి స్థలములో వ్యంగ్యము గుణీభావము పొందదు. కేవలకాకుసామర్థ్యమున వ్యంగ్యము గోచరమగుస్థల ములో కాకువు ప్రశ్న పర్యవసానము పొందదు. కాబట్టి వ్యంగ్యానికి గుణీభావమె కలుగుతుంది ఉదా:—

> ప్రియసఖి! కథయ! అధికా క్షోణీ లక్ష్మీః సరస్వతీ మత్తః?
> యాం బహుమన్యతే స నరనాథో గుణ విశేషజ్ఞః.

గుణవిశేషజ్ఞు డయిన ఈ నరనాథుడు వారినె అధికముగా అభిమానించు తున్నాడు కదా! నాకన్న క్షోణి కాని లక్ష్మి కాని సరస్వతికాని అధికురాలా? ప్రియసఖీ నీవేచెప్పు. దీనిలో నాకన్న అధికురాలా? అని ప్రశ్నార్థకముగా కాకు కల్పనచేసి నట్లయితే అధికురాలు కాదు. అనే వస్తువు వ్యంగ్యమవుతుంది. అధికురాలు కాదు. అనే నిషేధార్థమునకు వాచకము ఏమీ దీనిలో లేదు. అది కేవలమూ వాచ్యసామర్థ్య లభ్యమె. అయినా కాకుసంస్పర్శము వలన గూఢత్వము పోయింది. తన్నిమిత్తముగా చారుత్వాతిశయముకూడా భగ్నమయింది. వ్యంగ్యము శబ్దధర్మ స్పృష్టమయినది అన్నమాట. అందువలన గుణీభూతమే అవుతున్నది.

చిత్రము

ఇప్పటికి గుణీభూత వ్యంగ్య ప్రపంచ నిరూపణము అయింది. ఇక అధమ కావ్యమును ప్రపంచించాలి. అధమ కావ్యము చిత్రము అని నిరూపితమె. చిత్రకావ్యము శబ్దాలంకార చిత్రమని అర్థాలంకార చిత్రమని ద్వివిధమై అవాంతర భేదాలతో బహువిధమవుతుంది. తత్ప్రపంచము అలంకార ప్రకరణములో వ్యక్తము అవుతుంది.

మహాకావ్యము

ప్రబంధములు ధ్వన్యాశ్రయములు. ప్రబంధములంటే ఎటువంటివో లక్షణము లేకపోతే తెలియదు. కాబట్టి మహాకావ్యాది ప్రబంధముల లక్షణ నిరూపణమును చేసెదము. నగరము సముద్రము పర్వతము ఋతువులు చంద్రోదయ సూర్యోదయ వర్ణనము ఉద్యానవిహారము జలక్రీడ మధుపానము రతోత్సవము విప్రలంభము వివాహము కుమారోత్పత్తి వర్ణనము రాజకీయ మంత్రాలోచనము దూత్యము జైత్రయాత్ర యుద్ధము నాయకుని అభ్యుదయమూ అనే పదునెనిమిది వర్ణితములయి నట్లయితే మహాకావ్యమని వ్యవహారము కలుగుతుంది. వీనిలో కొన్ని లేకపోయినా మహాకావ్యత్వమునకు లోటులేదు. ఇంకా మహాకావ్య విషయమై అనేక విశేషములు గ్రంథాంతరములలో నిరూపితము లయినవి. ఇట్టి ఈ కావ్యము మూడువిధములు; గద్యమయము పద్యమయము ఉభయమయమూ అని.

అపాదః పదసంఘాతో గద్యం పద్యం చతుష్పదం

అన్నట్లు పాదరహితమైన పదముల సమూహము గద్యము అవుతుంది. నాలుగు పాదముల నియతి ఉన్నట్లయితే పద్యము

అవుతుంది. కాదంబరి తిలకమంజరి మొదలయినవి గద్య కావ్యములు. రఘువంశము మొదలయినవి పద్యకావ్యములు. రామాయణ చంపువు మొదలయినవి ఉభయమయములు.

ఉపకావ్యము

అసర్గబంధమపి యదుపకావ్య ముదీర్యతే,

మహాకావ్యములో సర్గ నిబంధనము ఉంటుంది. సర్గనిబంధనము లేకపోయినట్లయితే ఉపకావ్య మవుతుంది. సూర్య శతకాది గ్రంధములలో సర్గనిబంధనము లేదు. కాబట్టి అవి ఉప కావ్యములు.

చంపువు

గద్య పద్యమయం కావ్యం చంపూరిత్యభిధీయతే,

గద్య పద్య మయముగా ఉండే కావ్యము చంపువు అన బడును. చంపూరచన క్లిష్ట సుందరము. గద్య పద్య నిబంధనము ఉన్నంతమాత్రాన యథేచ్ఛారచనకు అవకాశము ఈయబడదు. విషయౌచిత్యమును అనుసరించి గద్య పద్యములు ఉండవలయును.

ఆఖ్యాయిక

వక్త్రం చాపరవక్త్రం చ సోచ్ఛ్వాసత్వం చ భేదకం,
వర్ణ్యతే యత్ర కావ్యజ్ఞైః అసావాఖ్యాయికా మతా.

వక్త్రము అపరవక్త్రము ఉచ్ఛ్వాసములు కలిగి ఉండుట అనే భేదకధర్మములు వర్ణింప బడిన స్థలములలో కావ్యజ్ఞులు ఆఖ్యాయిక అని తలంచుతారు. వక్త్రము అపర వక్త్రమూ అనేవి వృత్తవిశేషములు. ఆఖ్యాయికలో ఇవి నిరూపితములు కావలయును. ఆఖ్యాయిక ఉచ్ఛ్వాస

విభాగములచే పరిచ్ఛిన్నము కావలయును. హర్షచరితము మొదలయినవి ఆఖ్యాయికలు. కేవలమూ గద్యనిబంధనము ఉన్నట్లయితే కథ అవుతుంది. కాదంబర్యాదులు ఇటువంటివే. అందువలన అవికథలు. కథ ఆఖ్యాయిక అనేవి గద్యజాతికి సంబంధించినవి. ఈ చెప్పిన అఖ్యాయికా ధర్మములు కథ కన్న భేదమును సంపాదించుతవి.

వక్త్రము అనేది మాత్రావృత్తములలో ఒకటి. దీనిలో నాలుగు పాదములు ఉంటవి. పాదములో ఎనిమిది అక్షరములు. అపరవక్త్రమనేది అర్ధ సమవృత్తములలో ఒక భేదము. వీని లక్షణములు వృత్త రత్నాకరములో ఈ విధముగా నిరూపితము లయినవి.

వక్త్రం నాద్యాన్నసౌ స్యాతా మబ్ధే ర్యోఽనుష్టుభి ఖ్యాతం,
అయుజి న న ర లా గురుః సమే, తదపరవక్త్ర మిదం న జౌ జరౌ.

అనుష్టుప్ వృత్తములో పాదానికి ఎనిమిది అక్షరాలు. నాలుగు పాదాలు. ఆ అనుష్టుప్పులో ప్రథమాక్షరం తరువాత నగణ సగణములు ఉండక నాలుగో అక్షరము తరువాత యగణము ఉన్నట్లయితే వక్త్రము అనే వృత్తమవుతుంది. మొదటి అక్షరము ఎనిమిదవ అక్షరమూ గురు లఘువులలో ఏదయినా కావచ్చు. దీనిలో నాలుగో అక్షరానికి పూర్వము గణాపేక్ష లేదు. అక్షరప్రాధాన్యం ఉంటుంది. అయిదవ వర్ణము నుండి గణప్రాధాన్యం ఉంటుంది. అందువలననే దీనిని మాత్రావృత్తము అని అంటారు. అపరవక్త్రములో నాలుగు పాదాలు. ప్రథమ తృతీయ పాదాలలో రెండు నగణాలు ఒక రగణము ఒక లఘువు ఒక గురువూ ఉండాలి. ద్వితీయ చతుర్థ పాదాలలో నగణము రెండు జగణాలు రగణమూ ఉండాలి. ౧, 3

పాదాలలో ౧౧ అక్షరాలు. ౨, ౪ పాదాలలో ౧౨ అక్షరాలు. అందువలననే దీనికి అర్థసమవృత్తాలలో గణనము.

క్షుద్రప్రబంధములు

ఇక క్షుద్రప్రబంధముల నిరూపింతును. ఇవి అనేక విధములుగా ఉన్నవి. ఉదాహరణము చక్రవాళము భోగావళి బిరుదావళి తారావళి అనువాని స్వరూపములు మాత్రము ఇక్కడ నిరూపితము లగును.

ఉదాహరణము

> యేన కేనాపి తాళేన గద్యపద్య సమన్వితం,
> జయత్యుపక్రమం మాలిన్యాదిప్రాస విచిత్రితం,
> తదుదాహరణం నామ విభక్త్యష్టక సంయుతం.

ఆది తాళము జంపె తాళము ఎంచత్పుట తాళము మొదలగు సంగీతశాస్త్ర ప్రసిద్ధములయిన తాళములలో ఏదో ఒక తాళమునకు అనుకూల గతి కలిగిన గద్యములు పద్యములూ ఉండాలి. ఉపక్రమములో 'జయతి' అని ఉండాలి. మాలిన్యాది వృత్తములతో రమ్యపద్య నిబంధనము ఉండాలి. అనంతరము 'ఇతి' అనే ఉపక్రమము ఉన్న ఎనిమిది వాక్యములు. ఈ వాక్యములు ప్రాససహితములు కావలయుట, తాళ సహితములు కావలయుట విధి. ఈపద్ధతి ప్రతి విభక్తిలోనూ కూడు కొని ఉండాలి. సంబోధన విభక్తి ఎనిమిదవది. ఒక్కొక విభక్తికి ఎనిమిది వాక్యములు చొప్పున ఎనిమిది వాక్యాష్టకములు ఉండాలి. అనంతరము సర్వవిభక్త్యంకితమయిన శ్లోకము ఆవశ్యకము. తుదకు కవి ప్రబంధ నామాంకిత మయిన పద్యవిశేషము అపేక్షితము. ఈలోపుగా విభక్త్యాభాసలను నిబంధింప వలయును ఇట్టి విధానములు

కల కావ్యము ఉదాహరణము. విభక్తులవలె ఉండే విభక్తులు కానిపదములు విభక్త్యాభాసములు. విహాయ, విహాస్య, కథం, చిరాయ, చిరాత్, చిరస్య అనేవి విభక్తులవలె ఉన్నవి కాని విభక్తులు కావు. అవి విభక్త్యాభాసములు. మాలినీ వృత్తము ప్రతిపాదములోనూ నగణ నగణ మగణ యగణ యగణములు ఉంటవి. ఎనిమిదవ స్థానమున ఏడవ స్థానము లోనూ విరతి రూపమగుయతి ఉండవలెను. ఇది మాలినీవృత్త లక్షణము.

చక్రవాళము

సంబోధన విభక్త్యా యత్ప్రచురం పద్యపూర్వకం,
విముక్తపునరాకృష్టశబ్దం స్యాచ్చక్రవాళకం.

సంబోధన విభక్తి బహుళముగా ఉండాలి. పద్యపూర్వకముగా ఉండాలి. గద్యముకూడా కళికారూపముగా అనుప్రవిష్టము కావచ్చును. విముక్త పునరాకృష్ట శబ్దములు ఉండాలి. ఆద్యంత పదములు శృంఖలితములై ఉండాలని భావము. ఇట్టిది చక్రవాళము అనబడుతుంది.

భోగావళి

ఆద్యంతపద్య సంయుక్తా సంస్కృత ప్రాకృతాత్మికా,
అష్టభిర్వా చతుర్భిర్వా వాక్యైః స్కంధసమన్వితా,
ప్రతిస్కంధం భిన్నవాక్యరీతి ర్దేవ నృపోచితా
సర్వైతో దేవతస్తాది రేషా భోగావళీ మతా.

మొదటా చివరా పద్యాలు ఉండాలి. ఈ భోగావళి సంస్కృత ప్రాకృతాత్మకముగా ఉంటుంది. ఎనిమిదిగాని నాల్గుకాని వాక్యములు సకంధసకంధములుగాకూడి ఉండాలి, ప్రతిసకంధములోనూ వాక్యరీతి భిన్న భిన్నముగా ఉండ

వలయుట అవశ్యకము. దేవ నృప అనే పదాలతో అది సముచితము కావాలి. అంతటా దేవశబ్దము మొదట్లో గ్రథితము కావాలి. ఇట్టిది భోగావళి. దీనిలో భోగోపకరణములు అయిన ఉద్యాన సంపదాదుల వర్ణనము తరచుగా ఉండాలి.

బిరుదావళి

వర్ణ్యమానాంకబిరుద వర్ణన ప్రచురోజ్జ్వలా,
వాక్యాడంబర సంయుక్తా సా మతా బిరుదావళీ.

భోగావళీ స్వరూపానికి బిరుదావళీ స్వరూపానికీ అంతటా సామ్యము ఉన్నది. భోగావళి విశేషములన్నీ దీనిలో ఉండాలి. ఇది ఒక్కటి మాత్రము దీనిలో విశేషము. వర్ణింప బడువాని చిహ్నములు బిరుదములూ ప్రచురముగా వర్ణితములు కావాలి. వాక్యాడంబరము అతిశయించి ఉండాలి. ఇది బిరుదావళి అనే క్షుద్రప్రబంధము.

తారావళి

తారాణాం సంఖ్యయా పద్యై ర్యుక్తా తారావళీ మతా.

నక్షత్రముల సంఖ్యకల పద్యములతో కూర్పబడినది తారావళి అవుతుంది. ఇట్లాగే చతుశ్శత్తరము చతుర్భద్రము మొదలయినవి అనేకములు ఉన్నవి. ఇవి అన్నీ కవిప్రౌఢోక్తి సిద్ధములయిన క్షుద్రప్రబంధములు. విస్తరభయమున వానిని అన్నిటినీ ఇక్కడ చెప్పజాలము. యథాసంభవముగా ఊహించుట సముచితము.

నాటక ప్రకరణము

నాట్య స్వరూపము

ముందుగా నాట్య స్వరూపము నిరూపింప బడును.

చతుర్విధై రభినయై స్సాత్వికాంగిక పూర్వకైః
ధీరోదాత్తా ద్యవస్థానుకృతి ర్నాట్యం రసాశ్రయం.

సాత్వికము ఆంగికము వాచికము ఆహార్యము అనేవి చతుర్విధాభినయములు. వీనిచే ధీరోదాత్తా ద్యవస్థలను అనుకరించుట నాట్యము. ఈనాట్యము రసమును ఆశ్రయించి ఉంటుంది. వాక్యార్థీభూతముగా ఉండేరసమును విషయముగా చేసికొని ఉంటుందని భావము. "అభినయతి పదార్థా నిత్యభినయః" అని అభినయ పదవ్యుత్పత్తి. పదార్థములను అభివ్యక్తము చేసేది అభినయమవుతుందన్నమాట. సత్వము వలన కలిగే స్తంభ ప్రళయ రోమాంచాదులు సాత్వికములు. అనిమేష నయనత్వాదికముతో సాత్వికము అభినయించాలి. హస్తపాదాదులు అంగములు. పతాకా హస్తము మొదలయినవి హస్తాదుల వ్యాపారములు. అవియె ఆంగికాభినయములు అనబడును. పఠ్యమనబడునట్టి కావ్య నాట్యాదికము వాచికమవుతుంది రసోచితమయిన రాగాలాపాదికము వాచికాభినయము. నాట్యానికి తగిన వేష భూషాదులను ధరించుట ఆహార్యాభినయము. ఇట్టి ఈనాలుగు విధములయిన అభినయముల ద్వారా ధీరోదాత్తాది నాయకుల యొక్క ధీరోదాత్తత్వాద్యవస్థలను అనుకరించుట అనగా

అభినేయులయిన రామాదుల తాదాత్మ్యమును పొందుట నాట్యమని పర్యవసితము. ఈనాట్యము రసాశ్రయమగుటవలన వాక్యార్థాభినయాత్మకమని గ్రహించాలి. నట అవస్పందనే అనేధాతువు నుండి నాట్యశబ్దము వ్యుత్పన్నమవుతున్నది. కించిచ్చలనమని ధాత్వర్థము. కాగా నాట్యములో సాత్త్వికాభినయ బాహుళ్యముఉంటుందని సూచితము. ఈనాట్యము చేసేవారునటులవుతారు. నటకులధర్మము నాట్యమవుతుందని గ్రహించాలి.

నృత్యము - నృత్తము

భావాశ్రయం తు నృత్యంస్యాన్నృత్తం తాలలయాన్వితం.

నృత్యము భావాశ్రయము నృత్తము తాలలయసమన్వితము. రస సామగ్రిగా చెప్పదగిన విభావాదులు పదార్థీభూతములు అవినృత్యములో విషయములుగా ఉండును. కనుకనె నృత్యము పదార్థాభినయాత్మకమని గ్రహించాలి. నృతీ—గాత్రవిక్షేపే అనేధాతువు వలన నృత్యశబ్దము వ్యుత్పన్నమవుతున్నది. కాబట్టి ఆంగికాభినయ బాహుళ్యము నృత్యములో ఉంటుందని సూచితము. దీనిని అభినయించే వారికి నర్తకులనిపేరు. ఇటువంటి నిరూపణము వలన నాట్యమునకంటె నృత్యానికి భేదము సిద్ధమయింది. ఈనృత్యానికి మార్గమని కూడా పేరున్నది.

తాలము లయ అనేవి సంగీత శాస్త్ర సంకేతపదాలు నృత్తము ఏతదుభయాశ్రయము. దీనికే దేశి అని వేరొక నామము ఉన్నది. ఈప్రక్రియ దశరూపక ప్రతిపాదితము నృత్యము నృత్తమూ రెండూ నాటకాదులకు ఉపకారకములై అంగములుగా ఉంటవి కాబట్టి ఇక్కడ వాని స్వరూపము

నిరూపితమయింది. ఇవి నాటకాదులకు అంగములగుటవలన దశరూపకములో చెప్పబడినవి. నృత్యము ఒక్కొక్క స్థలములో అవాంతర పదార్థాభినయాత్మకముగా ఉంటుంది. నృత్తము శోభాహేతువుగా ఉంటుంది కాబట్టి ఇవి నాట్యాంగములై.

ఇంకా దశరూపకములో ఈవిధముగా నిరూపితమయినది. ఈ నృత్య నృత్తములు రెండూ మధురోద్ధత భేదాన రెండు విధములవుతవి. మధురనృత్యము మధురనృత్తము, ఉద్ధత నృత్యము ఉద్ధత నృత్తమూ అని. ఈ మధురములయినవి రెండూ లాస్యరూపములని ఉద్ధతములయినవి రెండూ తాండవ రూపములని వ్యపదేశము పొందుతున్నవి. పార్వతీ పరమేశ్వరులలో పార్వతీదేవి ఒనర్చిన నృత్య నృత్తములు లాస్యమని పరమేశ్వరుడొనర్చిన నృత్య నృత్తములు తాండవమనీ వ్యవహారము పొందినవి. ఇవి నాటకాదులకు ఉపకారకములుఅని.

దశరూపకములు

నృత్య నృత్తోపకృతమయిన నాట్యమును అనుసరించి పది రూపకములు సిద్ధములవుతున్నది. నాటకము, ప్రకరణము, భాణము, ప్రహసనము, డిమము, వ్యాయోగము, సమవకారము, వీథి, అంకము, ఈహామృగము అని రూపకములు పది విధములవుతున్నవి. రసాశ్రయమయిన నాట్యము వలన ఈ పది భేదములై కలుగును. భావాశ్రయమయిన నృత్యమువలన ఉపరూపకములు అనేకములు సిద్ధములవుతవి. వానిని విస్తర భీతిచే ఇక్కడ ఉపపాదించడము లేదు.

ఈ రూపకములన్నీ నాట్యాశ్రయములై. అంత మాత్రాన ఇవి అన్నీ అభిన్నములు అనే శంక సముచితము కాదు. ఒక్కొక్క రూపకములో వస్తువు (ఇతివృత్తము కథ) ఒక్కొక

విధముగా ఉంటుంది. నాయకులు కూడా భిన్న భిన్నముగా ఉంటారు. రసమూ వేరు వేరుగా ఉంటుంది. కాబట్టి ఆరూపకాలకు వస్తువు నాయకుడు రసమూలూ భేదమును సంపాదించుచున్నవి.

వస్తువు ఆధికారికమని ప్రాసంగికమని రెండు విధాలు. ప్రాసంగిక వస్తువుకూడా పతాకావస్తువని ప్రకరీవస్తువని రెండు విధాలు. కాగా వస్తువు ౧ ఆధికారికవస్తువు ౨ పతాకా వస్తువు 3 ప్రకరీ వస్తువూ అని త్రివిధమవుతున్నది. వీని స్వరూపము ముందు ముందు విశదమవుతుంది. ఇట్లా భేదము పొందిన ఈ వస్తువు ప్రఖ్యాతమని ఉత్పాద్యమని మిశ్రమని మళ్లా త్రివిధమవుతున్నది. అందువలన వస్తువునకు నవ విధత్వమును గ్రహించాలి. ఇదె దివ్యరూపమున మర్త్యరూపమున ఉభయరూపమున భేదము పొందినట్లయితే ఇంకా బహుభేదాలు సిద్ధములు కావచ్చు. ఆనానా భేదాలను లక్ష్యములలో చూచుకోవాలి. ప్రఖ్యాతోత్పాద్య మిశ్రత్వ భేదాన వస్తువు త్రివిధమవుతుందని దశరూపక కర్తకూడా చెప్పుతున్నాడు. ఇతిహాస పురాణాలలో ప్రసిద్ధమై ఉన్నకథ నిబంధనముగా కలవస్తువు ప్రఖ్యాత వస్తువవుతుంది. కవి కల్పితమయిన వస్తువు ఉత్పాద్యము. ఏతదుభయ సాంకర్యాన సిద్ధమయ్యేది మిశ్రవస్తువు. ఇటువంటి వస్తుభేదము వలన రూపకాలకు పరస్పరమూ భేదము కలుగుతున్నది.

నాయక భేదము ఇది వరలో నిరూపితము. ఆ నాయక భేదముకూడా రూపకభేదకమె. రసభేదములు రస ప్రకరణములో నిదర్శితములవుతవి. రసభేదమును అనుసరించికూడా రూపకములు భిన్నములవుతున్నవి. ఏ యే రూపకములో

ఏయే వస్త్వాదులు ఉంటవో ఈ క్రింది విధాన గ్రహించాలి.

రూపకభేదక ధర్మములు

౧. నాటకములో:— ప్రఖ్యాతమయిన ఇతివృత్తము ఉంటుంది. నాయకుడు ధీరోదాత్తుడు శృంగారము కాని వీరము కాని ప్రధానముగా ఉంటుంది. ఇతర రసములు అంగములుగా అనుప్రవేశముపొందుతవి. ౨. ప్రకరణములో:— ఇతివృత్తము ఉత్పాద్యము. నాయకుడు ధీరశాంతుడు. దీనిలో శృంగార రసానికె ప్రాధాన్యము ఉంటుంది. ౩. భాణములో:- ఇతివృత్తము ఉత్పాద్యము. ధూర్త విటుడు నాయకుడు. శృంగారము వీరమూ రెండూ సూచనామాత్రసారములై ఉంటవి. ౪. ప్రహసనములో:— ఇతివృత్తము కల్ప్యము. పాషండులు మొదలయిన వారు నాయకులు. హాస్యరసము ప్రధానము. ౫. డిమములో:— ప్రఖ్యాతమయిన ఇతివృత్తము ఉంటుంది. దేవ గంధర్వ పిశాచాది ధీరోద్ధత నాయకులు పదునారుగురు ఉంటారు. రౌద్రరసము ప్రధానము. శృంగార వీరములు అనుప్రవేశము పొందుతవి ౬. వ్యాయోగములో:— వస్తువు ప్రఖ్యాతము. నాయకుడు ధీరోద్ధతుడు. వీరరసము ప్రధానము ౭. సమవాకారములో:— దేవాసురాది నాయకులు పన్రెండుగురు ఉంటారు. వీరరసము ప్రధానము. ఇతివృత్తము ప్రసిద్ధమయినా కావచ్చు, కల్పితమయినా కావచ్చు. ౮. వీధిలో:— ఇతివృత్తము కల్పితము. ధీరోద్ధతుడు నాయకుడు. శృంగారము సూచనామాత్ర సారముగా ఉంటుంది. ౯. అంకములో:— ప్రఖ్యాతమయిన వస్తువు ఉంటుంది. ప్రాకృతజనుడయిన వాడు నాయకుడుగా ఉంటాడు. కరుణ రసము ప్రధానము ౧౦. ఈహామృగములో:— వస్తువు

మిశ్రాత్మకము. నాయకుడు ధీరోదాత్తుడు. దీనిలో శృంగార రసాభాస నిరూపితమవుతుంది. ఇట్లా వస్త్వాది భేదమున రూపక భేదమును గ్రహించాలి. ఇకవస్తు ప్రపంచము.

సంధిపంచకము

ఆ నాటకాదుల సామగ్రిని నిరూపించుతాము. అయిదు సంధులు ఉంటవి. ఈవిషయము దశరూపకములో ఈవిధముగా చెప్ప బడింది. ముఖసంధి, ప్రతిముఖసంధి, గర్భసంధి, అవమర్శ సంధి (దీని నే విమర్శసంధి అంటారు) ఉపసంహృతి సంధి (దీనికి నిర్వహణ సంధి అనికూడా పేరు.) అని సంధులయిదు. ఈసంధిపంచకము రూపకములలో ఉండాలి.

సంధి

ఒక మహా ప్రయోజనముతో అన్వయము పొంది ఉన్న కథలకు అవాంతర ప్రయోజనములతో సంబంధము ఉండుట సంధి అవుతుంది. రూపకములలో నిరూపితములయిన కథలకు ధర్మార్థ కామములు ప్రయోజనములుగా ఉంటవి. ఇవి శుద్ధములుగా ఉండవచ్చును. అంటే ఒక్కొక్కటే ప్రయోజనముగా ఉండవచ్చు అన్నమాట. ఇంకా ఏకానేకానుబంధముగా ఉండవచ్చు. రెండు మూడు కలిసి ప్రయోజనముగా ఉండవచ్చు అని భావము. ఇటువంటి విధానములో పంద్రెండు విధాల ప్రయోజన సంబంధము ఉండవచ్చు.

ధర్మము ధర్మార్థములు ధర్మకామములు ధర్మార్థ కామములు
అర్థము అర్థధర్మములు అర్థకామములు అర్థ ధర్మకామములు
కామము కామధర్మములు కామార్థములు కామధర్మార్థములు.

ఈ చెప్పిన ప్రయోజనాలలో ఏదయినా ప్రధానముగా ఉంటుంది, ఒక రూపకములో నిరూపింపబడె ప్రధానేతి

వృత్తానికి అనేకేతివృత్తఖండములు ఉంటవి. ఇవి అన్నీ ప్రధానేతివృత్తానికి ఉన్న ప్రయోజనముతోనే సంబంధము కలిగి ఉంటవి. అట్లయినా వానికి అవాంతర ప్రయోజన సంబంధము ఉండుట సంధి అవుతుందని తాత్పర్యము. అవస్థలు అర్థప్రకృతులు అనువాని సంబంధము వలన ముఖాది సంధులు ఉత్పన్నములగును. ప్రయోజన సిద్ధిలో హేతువులుగా ఉండేవి అర్థ ప్రకృతులని కొందరి భావము. అర్థ ప్రకృతులనేవి కథా శరీరములో కారణములుగా ఉంటవని మరికొందరు భావించు తున్నారు. మహాప్రయోజన సంపాదములో హేతువుగా ఉండేది ఒకటి ఉంటుంది. ప్రారంభము మొదలు ఫలసిద్ధి పర్యంతమూ మొదటి హేతువుస్వరూప విశేషముతో ప్రసరించు తుంది. ఆ హేతువుయొక్క స్వరూప విశేషములే అర్థప్రకృతులు. బీజము బిందువు పతాక ప్రకరి కార్యమూ అని అర్థప్రకృ తులు ఐదు ఉన్నవి. ఫలసిద్ధికై ఉపాయము స్వీకరింప బడును. అది నాయకుని వ్యాపార రూపము. ఆ ఉపాయము ప్రారంభము మొదలు ఫలసిద్ధి పర్యంతము అయిదు స్వభావములను పొందు తుంది. అవె అవస్థలు. ఆరంభము, ప్రయత్నము, ప్రాప్త్యాశ నియతాప్తి ఫలాగమమూ అని ఆ అవస్థాపంచకము యొక్క నామములు. ఆరంభ బీజముల సంబంధము వలన ముఖసంధి కలుగుతుంది. ప్రయత్న బిందువుల సంబంధములో ప్రతిముఖ సంధి ప్రాప్త్యాశా పతాకల సంబంధములో గర్భసంధి, నియ తాప్తి ప్రకరుల సంబంధములో అవమర్శసంధి, ఫలాగమ కార్యముల సంబంధములో నిర్వహణసంధీ ఉత్పన్నములవు తవి. దశరూపకములో కూడా ఇదే అర్థము నిరూపితమయింది.

బీజ బిందు పతాకాఖ్యప్రకరీ కార్యలక్షణాః
ఆరంభ యత్న ప్రాప్త్యాశా నియతాప్తి ఫలాగమాః
అర్థప్రకృతయః పంచ పంచావస్థాసమన్వితాః
యథాసంఖ్యేన జాయంతే ముఖాద్యాః పంచ సంధయః

ఈ దశ రూపక కారికల అర్థము సుగమము.

అవస్థా నిరూపణము

౧ ఆరంభము

ఔత్సుక్యమాత్రమారంభః ఫలలాభాయభూయసే

కాలాక్షమత్వ రూపమయిన అభిలాష ప్రకర్షము ఔత్సుక్య మనబడును. రూపకములలో ధర్మార్థ కామ రూపమయిన ఫలమె అభీష్టము. కాని క్షుద్రఫలములు ఉద్దిష్టములు కావు. ఆ మహాఫలము యొక్క అధిక లాభానికై ఔత్సుక్యము మాత్రము ఉండుట ఆరంభము అనబడును. ఫలసిద్ధి కొరకయిన నాయక వ్యాపారము స్వరూపమునుండి కొంతగా ఉచ్ఛూనమయినట్లయితే ఆరంభమవుతుంది అని భావము.

౨ ప్రయత్నము

ప్రయత్నస్తు ఫలప్రాప్తౌ వ్యాపారోఽతిత్వరాన్వితః.

ఫలప్రాప్తి విషయములో అత్యంతమూ త్వరాన్వితమయిన వ్యాపారము ప్రయత్నమవుతుంది. కార్య సంపాదనములోని యోగ్యత ప్రయత్నము అనిభావము. ప్రకృష్టమయిన యత్నము ప్రయత్నము అని సార్థకనామము.

౩ ప్రాప్త్యాశ

ఉపాయాపాయశంకాభ్యాం ప్రాప్త్యాశా కార్య సంభవః,

ఉపాయము ఉన్నది అనె శంక, అపాయము ఉన్నది అనే

శంక వీనివలన వివక్షితమయిన కార్యము సంభవమగుట ప్రాప్త్యాశ అవుతుంది. ఏదయినా కార్యము సిద్ధించవలెనంటే కొన్ని ఉపాయములు ఉంటవి. కొన్ని అపాయములు కూడా ఉంటవి. వీనిని చక్కగా పరిశీలించి కార్యసంభవమును ఊహించాలి. ఊహలో భాసించే ప్రతిబంధకములను అన్నిటినీ నశింప చేసుకుంటూ ప్రాప్తి విషయమై ఆశ కలిగి ఉండుట ప్రాప్తి ఉండవచ్చునని ఊహచేయుట ప్రాప్త్యాశ అవుతుందని పరమార్థము.

౪ నియతాప్తి

అపాయాభావతః కార్యనిశ్చయో నియతాప్తికా

అపాయములు లేనందువలన కార్యము అవశ్యముగా కలుగుతుంది అని నిశ్చయించుట నియతాప్తి అవుతుంది. నియతము-నిశ్చితమయిన, ఆప్తి-ప్రాప్తి, ఉన్నదని సార్థకము. ప్రతిపక్షములన్నీ నివృత్తములయినందున ప్రాప్తి నిశ్చితమె అవుతుందని భావము.

౫ ఫలాగమము

సమగ్ర ఫలసంపత్తిః ఫలాగమ ఉదాహృతః,

సమగ్రమయిన ఫలము సంపన్నమగుట ఫలాగమము అవుతుంది. బాధకములన్నీ అబాధకములైనందువలన ప్రకృతార్థము అబాధితమయినందువలన సంపూర్ణముగా ఫలపర్యంతమయిన రచన అవ్యాహతమవుతుంది. ఫలము అర్థసిద్ధమె అవుతుంది. అదే ఫలాగమము.

బీజాదిపంచకము

ఇక అర్థప్రకృతులనబడు బీజాది పంచకము నిరూపితమగును.

౧ బీజము

స్తోకోద్దిష్టః కార్యహేతుః బీజం విస్తార్యనేకధా

స్వల్పముగా ఉపక్షిప్త మయ్యేది అనేకవిధాల విస్తరించేదిన్ని ఫలానికి హేతువుగా ఉండేది బీజమనబడును. ఫల సంపాదక మయిన బీజము మొదల స్వల్పముగా ఉన్నా పిమ్మట మూలముగా బోదెగా శాఖలుగా ఆకులుగా పుష్పములుగా అనేక విధాల విస్తరించుతుంది. అట్లాగె త్రివర్గ రూప ఫలహేతువయిన ఇదికూడా మొదట స్వల్పమె. అనంతరము నాయకుడు ఉపనాయకుడు ప్రతినాయకుడూ అనే భేదాలతో విస్తరించుతుంది. ఆబీజము ఒక్కొక చోట స్వాయత్తసిద్ధి అయిన నాయకునకు ఆత్మోత్సాహాత్మకముగా ఉంటుంది. ఒక్కొక చోట సచివాయత్త సిద్ధిగా నాయకుడు ఉండే స్థలములో సచివునకు ఉత్సాహాత్మకముగా ఉంటుంది. రాజు ఉభయాయత్తసిద్ధిగా ఉన్నచోట బీజము ఉభయోత్సాహాత్మకముగా ఉంటుంది. అమాత్యగతోత్సాహము కూడా నాయకునకె ఫలజనకమవుతుంది.

౨ బిందువు

అవాంతరార్థ విచ్ఛేదే బిందురచ్ఛేద కారణం

పరమ ప్రయోజనానికి అవాంతరముగా కూర్పబడు వాని వలన కొంతగా విచ్ఛేదము కలిగినట్లయితే అటువంటి విచ్ఛేదము లేకుండునట్లుగా చేయడములో హేతువుగా ఉండేది బిందువవుతుంది. గ్రంథములో నిరూపింపబడు బీజము కొన్ని అవాంతర ఫలములను కూడా కలుగజేస్తుంది. అట్టి అవాంతర ఫలములచే మహాఫలము విచ్ఛిన్నప్రాయమవుతూ ఉన్నప్పుడు అవిచ్ఛేదహేతువుగా ఉండేది బిందువు అనిభావము.

౩ ప తా క

ప్రతిపాద్యకథాంగం స్యా త్పతాకా వ్యాపినీకథా,

ఫలమును ఉద్దేశించి ప్రవర్తించేది కావడము వలన ప్రతిపాద్య కథ ప్రధానము. ప్రతిపాద్యకథకు అంగముగా వుండేది పతాక అవుతుంది. ప్రధాన కథకు ఇది సంబంధించి ఉంటుంది. గ్రంథములో కొంతగా మాత్రము వ్యాపించి ఉంటుంది. రామాయణములో రాముడు నాయకుడు. తద్వ్యాపారరూపమయిన కథ ప్రధానము. సుగ్రీవుడు ఉపనాయకుడు. తద్వ్యాపార రూపకథ రామకథాంగము. రామకథా సంబద్ధము కాబట్టి అది పతాక.

౪ ప్ర క రి

అవ్యాపినీ ప్రకరికా........

అధికముగా వ్యాపించకుండా ఉండే వృత్తాంతము ప్రకరి అవుతుంది. అల్పమగు ప్రకరము ప్రకరి. రామాయణములో జటాయువృత్తాంతమూ శబరీ వృత్తాంతము ఈ విషయములో దృష్టాంతములు. పుష్పాదిప్రకరము తమకంటె అతిరిక్తమయిన పదార్థానికి శోభను కలుగజేస్తుంది. అట్లాగే గ్రంథములో ఉపాత్తమయిన ఋతువర్ణనాదికము ప్రధానమునకే ఫలజనకమవుతుంది కానితనకు ఏమీ ఫలమును ఆపాదించుకోదు. ప్రకరికాస్వరూపము ఈవిధముగా ఉంటుంది. ప్రతిపాద్య కథకు అంగమగుట అనేపతాకకు చెప్పిన విశేషమును ఇక్కడ కూడా సమన్వయించుకోవాలి.

౫ కా ర్య ము

............కార్యం నిర్వాహకృ త్ఫలే,

ప్రధాన ఫలమును నిర్వహించు నట్టి అంతిమ కథావయవ

మునకు కార్యము అని పేరు. ఇతరములకువలె కార్యమునకు అవాంతర ఫల సంబంధమును ఊహింప నక్కర లేదు. ఇది సాక్షాత్తుగా ప్రధాన ఫలజనకము. కార్యేతరములు అవాంతర ఫలములతో సంబంధము ఉంటే నేకాని ప్రధాన ఫలమును కలుగజేయడానికి సమర్థములు కాలేవు. ఈవిధముగా అవస్థలూ అర్థప్రకృతులూ నిరూపితములయినవి. ఈపంచక యుగళ సమన్వయము వలన సంధిపంచకము సిద్ధమవుతుంది. ఇక వానిని చెప్పెదము.

ము ఖ సం ధి

ముఖం బీజసముత్పత్తి ర్నానార్థరససంభవా
అంగాని ద్వాదశైతస్య బీజారంభసమన్వయాత్.

నానా ప్రయోజనములు కల రసానికి హేతువయిన బీజసముత్పత్తి ఉంటే ముఖసంధి అవుతుంది. బీజము ఆరంభమూ అనే రెండిటి సమన్వయము వలన దీనిలో పండ్రెండంగములు ఉత్పన్నములగును. గ్రంథములలో అంతటా రసమె మహా ప్రయోజనము. ఆ రస సంభూతి కయిన బీజము ముఖసంధిలో ఉండాలి. ఆదినుండి అంతము వరకు ప్రసరించే రసానికి అవాంతర ప్రయోజనములు అనేకములు ఉంటవి. ఇట్టి ఈ అవాంతర ప్రయోజనాలు త్రివర్గ వ్యతిరిక్తములని గ్రహించాలి. ప్రహసనము మొదలయిన కొన్ని రూపకాలలో త్రివర్గము ఫలముగా ఉండదు. అక్కడ ధర్మార్థకామాతిరిక్తములయిన ప్రయోజనములె రసోపకారకములవుతవి. ఇట్లా అనేకావాంతర ప్రయోజనవ ద్రస సంభూతికి సమర్థమయిన బీజసముత్పత్తి ఉన్నట్లయితే ముఖసంధి అవు

తుందని గ్రహించాలి. బీజారంభములకు అనుగుణముగా ముఖ సంధ్యంగములను నిబంధించాలి.

ఉపక్షేపము, పరికరము, పరిన్యాసము, విలోభనము, యుక్తి, ప్రాప్తి, సమాధానము, విధానము, పరిభావన, ఉద్భేదము, భేదము, కరణము అనేవి ముఖసంధ్యంగములు. ఇవి అన్నీ అన్వర్థములు. వీనిస్వరూపమును ఈవిధముగా తెలుసుకోవాలి.

ముఖసంధ్యంగ స్వరూపము

౧. ఉపక్షేపము:— బీజము యొక్క వ్యసనము ఉపక్షేపమవుతుంది. బీజ సదృశమయిన ప్రస్తుతేతి వృత్తమును సంక్షేపముగా సూచించి నిర్దేశించుట ఉపక్షేపము అనిభావము. బీజప్రాయమయిన నాటకీయార్థమును నిరూపించాలన్నమాట.

౨. పరికరము:— బీజము యొక్క వృద్ధి అనగా ప్రస్తుత సూక్ష్మేతివృత్తముయొక్క విషయవిస్తారము పరికర మగును.

౩. పరిన్యాసము:— బీజము యొక్క నిష్పత్తి- బీజార్థము సిద్ధించుట పరిన్యాసమగును. వర్ణనీయవిషయమును నిశ్చయరూపాన ప్రకటించుట అని భావము.

౪. విలోభనము:—బీజ గుణ వర్ణనము విలోభనము. మూల భూతార్థమునందు అభిలాషను ఉదయింపచేయ దానికై గుణ వర్ణనము చేయుట అని భావము.

౫. యుక్తి:— బీజార్థములో అనుకూలముగా సంఘటనము పొందిన ప్రయోజనములను బాగా నిర్ణయించుట యుక్తి అవుతుంది.

౬. ప్రాప్తి:— బీజమునకు సంబంధించిన సుఖప్రాప్తి ప్రాప్తి అవుతుంది.

౭. సమాధానము:— నాయికా నాయకులకు అభిమతముగా ఉండేటట్లుగా బీజార్థమును ప్రదర్శించుట సమాధానము.

౮. విధానము:—బీజార్థములోని సుఖదుఃఖముల కారణ నిబంధనము విధానము.

౯. పరిభావన:—ఏవయినా ఆశ్చర్య జనక దృశ్యములను చూచి కుతూహల సహితులై పరిభాషించుట పరిభావన అనబడును.

౧౦. ఉద్భేదము:—బీజ రూపాన గూఢంగా ఉన్న అర్థమును బహిరంగము చేయుట ఉద్భేదమవుతుంది.

౧౧. భేదము:— బీజాను గుణముగా ప్రోత్సాహము చేయుట.

౧౨. కరణము:—బీజానుకూలమయిన ప్రస్తుత కార్యమును ఆరంభించుట కరణము అనబడును. ఈ పండ్రెండున్ను ముఖ సంధ్యంగములు. వస్తు విన్యాసములోని సూక్ష్మ భాగోప భాగముల విషయమై గ్రంథనిబంధకునకు ఎటువంటి అభిరుచి ఉంటుందో ఆ అభిరుచిని ఈ అంగములు సూచించుతవి. అన్ని అంగములనూ రూపకములో నిబంధించడము కష్టము. కాబట్టి దీనిలో ఉపక్షేప పరికర పరిన్యాస యుక్తి ఉద్భేద సమాధానములు అనే ఆరు అంగములు ఉండడము చాలా ఆవశ్యకము. అందువలన అవి ప్రధాన నిబంధనీయములు. మిగిలిన ఆరూ ఉంటే మంచిదే. అవి లేక పోయినా ముఖ సంధి ఉద్దేశము వీనివలన సిద్ధమవుతుంది అన్నమాట.

ప్ర తి ము ఖ స ం ధి

లక్ష్యాలక్ష్యస్య బీజస్య వ్యక్తిః ప్రతిముఖం మతం
బిందుప్రయత్నానుగమా దంగా న్యస్య త్రయోదశ.

లక్ష్యాలక్ష్యముగా ఉన్న బీజార్థము యొక్క అభివ్యక్తి ప్రతిముఖసంధి అవుతుంది. బిందు ప్రయత్నముల అనుగమము వలన దీని అంగములు పదమూడు. ముఖసంధిలో గోచర మయిన బీజము ఒకానొక అంశములో లక్ష్యమవుతుంది. వేరొక అంశములో అలక్ష్యమవుతుంది. నాటకీయ ప్రధాన ఫలసాధక మయిన ఇతివృత్తము ఒకప్పుడు గుప్తమవుతుంది. వేరొక ప్పుడు స్పష్టమవుతుంది. ఈ ప్రతిముఖసంధి ప్రయత్నబిందువుల శృంఖలలో అనుగతమవుతుంది. కాబట్టి ప్రయత్నావస్థలో ఫలప్రాప్తికై శీఘ్రోద్యోగము కలుగుతుంది. బిందువులో కథ అవిచ్ఛిన్నమై ప్రసరించుతుంది. ముఖసంధిలో సూత్రితమయిన ప్రధాన ఫలము ప్రతిముఖసంధిలో కొంతగా వికాసము పొందుతుంది. ప్రధాన ఫలానుకూలానేక ప్రయోజనములలో కొన్ని మాత్రము నిష్పన్నములు కావడము కొన్ని నిష్పన్న ములు కాకపోవడమూ దీనిలో ఉంటుంది. బిందు ప్రయ త్నానుగుణముగా ప్రతిముఖ సంధ్యంగములను ప్రయోగించాలి.

విలాసము పరిసర్పము, విధూతము, శమము, నర్మ, నర్మ ద్యుతి, ప్రగమనము, విరోధము, పర్యుపాసనము, వజ్రము, పుష్పము, ఉపన్యాసము, వర్ణసంహారము. అని దీని త్రయోద శాంగములు. వీనిస్వరూపమును ఇట్లా గ్రహించాలి.

● ప్రతిముఖసంధ్యంగ స్వరూపము

౧ విలాసము:— సంభోగ విషయమగు మనోరథము విలా

సము. ఆనందము నిచ్చు పదార్థములను, కోరుట విలాసము అని అర్థము.

౨ పరిసర్పము:— మొదట కన్పడి తరువాత గోచరముకాక దృష్టనష్టముగా ఉండే పదార్థమును అనుసరించుట పరిసర్పము అనే అంగము.

౩ విధూతము:— సుఖప్రదము లయినప్పటికీ అనిష్టము లయిన అరతిని ఇచ్చే పదార్థములను తిరస్కరించుట విధూత మవుతుంది.

౪ శమము:— అరతి ఉపశమించుట శమము.

౫ నర్మ:— పరిహాసాత్మకము యిన వచనము నర్మ.

౬ నర్మద్యుతి:— అనురాగమును ఉద్ఘాటించి నందువలన కలిగే ప్రీతి నర్మద్యుతి అవుతుంది. నాయికా నాయకులలో ఒకరొకరి అనురాగమును విశదము చేసినపుడు వారియందు ప్రీతి ఉదయించుతుంది. అదే ఇది.

౭ ప్రగమనము:— ఉత్తరోత్తరము నిరూపితము లయిన ట్టిన్నీ ఉత్తర ప్రత్యుత్తర రూపముల యినట్టి ఉత్కృష్ట వచనములచే అనురాగ బీజమును ప్రకాశింప చేయుట ప్రగమనము అవుతుంది.

౮ విరోధము:— ఏదయినా మనచే హితప్రాప్తిని నిరోధించుట.

౯ పర్యుపాసనము:— ఇష్టజనులను ప్రతిమాలు కొనుట పర్యుపాసనము, కోపపడిన వారిని అనునయించుట అని భావము.

౧౦. వజ్రము:— మొదట్లోనే సమ్ముఖములో నిష్ఠురంగా మాటలాడుట వజ్రమనబడును

౧౧. పుష్పము:— అనురాగమును ప్రకాశింప చేయునట్టి విశేషతా పూర్ణమయిన వచనము పుష్పము. ఈవిశిష్టవచనము విశేషానురాగమును కలుగ జేస్తుంది.

౧౨. ఉపన్యాసము:—అనురాగమును కలుగ జేయడములో యుక్తి సహితమయిన వచనము ఉపన్యాసమనబడును.

౧౩. వర్ణసంహారము:— నాలుగు వర్ణముల సమ్మేళన మును చక్కగా వర్ణించుట వర్ణసంహారమవుతుంది. ఇక్కడ వర్ణము అంటే నాటకీయ పాత్రలని ఒకరి భావము. వారి సమాగమమును వర్ణించుట దీని స్వరూప మవుతుంది.

ఈ నిరూపించిన త్రయోదశాంగములలో పరిసర్ప ప్రగమన వజ్ర ఉపన్యాస పుష్పములు అనే అంగములు అవశ్యముగా ఉండాలి. అందువలన అవి ప్రధానములు. కేవలమూ వీనిని నిబంధించినా ఇతి వృత్తము సముచితము కాగలుగుతుంది.

గర్భసంధి

గర్భస్తు దృష్టనష్టస్య బీజస్యాన్వేషణం ముహుః
అస్యాప్త్యాశా పతాకానుగుణ్యేనాంగ ప్రకల్పనం.

ప్రతిముఖ సంధిలో దృష్టనష్టముగా ఉన్న బీజమును మఱల మఱల అన్వేషించుట గర్భసంధి అవుతుంది. ప్రతిముఖ సంధిలో బీజము కొంతవరకు ప్రకాశిత మవుతుంది. అదే మాటి మాటికీ ఆవిర్భావ తిరోభావములచే అన్విష్టమయి నట్లయితే గర్భసంధి అని గ్రహించాలి. బీజము ఇదివరలో దృష్ట నష్టముగా ఉన్నందువలన అది ఒకప్పుడు అపాయం పొందేది అవుతుందేమో! అనేశంక కలుగవచ్చును. అప్పుడు తద్విచ్ఛేదము కూడా సంభావితము కావచ్చును. అందువలన ముళ్ళా మళ్లా దానిని అన్వేషించడము గర్భసంధి స్వరూపము. ఈగర్భ

సంధిలో పతాకా ప్రాప్త్యాశలకు అనుగుణంగా అంగములను కల్పించాలి. దీనిలోని ప్రాప్త్యాశావస్థలో సఫలతా సంభావనతో బాటు విఫలతాశంక కూడా ఉంటుంది. అర్థప్రకృతి అయిన పతాకలో ప్రధానఫలమును సిద్ధింపచేసే ప్రాసంగిక వృత్తాంతము ఉంటుంది. ఈసంధిలో పతాక అనియతము. అది వైకల్పికము. పతాక లేకపోయినా ప్రాప్త్యాశ ఉంటుంది. పతాకా ప్రాప్త్యాశలకు అనుగుణముగా గర్భసంధ్యంగములను ప్రయోగించాలి.

అభూతాహరణము, మార్గము, రూపము, ఉదాహరణము, క్రమము, సంగ్రహము, అనుమానము, తోటకము, అధిబలము, ఉద్వేగము, సంభ్రమము, ఆక్షేపము, అని గర్భసంధ్యంగములు పద్రెండు ఉన్నవి. వాని స్వరూపమును ఈ విధముగా గ్రహించాలి.

గర్భసంధ్యంగ స్వరూపము

౧. అభూతాహరణము:—ప్రస్తుతమునకు ఉపయోగించే ఛద్మాచరణము కపట వచనము అభూతాహరణ మనబడును.

౨. మార్గము:—యథార్థమును చెప్పుట మార్గము.

౩. రూపము:—వితర్క- యుక్తమయినట్టిన్ని విశేషమును ప్రతిపాదింపునట్టి వాక్యము రూపము అవుతుంది.

౪. ఉదాహృతి:—ప్రస్తుతమునకు ఉత్కర్ష కలిగే ట్లుగా పలుకుట ఉదాహరణము, ఉదాహృతి అవుతుంది.

౫. క్రమము:—బాగా ఆలోచించిన అర్థముల ప్రాప్తి క్రమము. అభిలషించినవస్తుప్రాప్తి. ఏదైనా విషయముయొక్క యథార్థ జ్ఞాన ప్రాప్తి క్రమమవుతుందని కొందరి ఊహ.

ఉంటుంది. గర్భసంధిలో నిర్భిన్నమయిన బీజార్థముతో ఇది సంబంధించి ఉంటుంది. గర్భసంధిలో బీజార్థము ఒకవిధముగా విస్తృతి పొంది ఉన్నప్పటికీ అందులో కన్న ఇక్కడ ఈ విమర్శసంధిలో అధికముగా విస్తృతమై ఫలోన్ముఖము అయ్యే టప్పుడు శాపక్రోధవిపత్తి విలోభనాదులు కారణముగా విఘ్నములు కలుగ వచ్చును. ఇటువంటి ఈ క్రోధాదులచే ఆ బీజము బాగా విమృష్ట మవుతుంది. కాబట్టి ఇది విమర్శ సంధి. దీనిలో నియతాప్తి అవస్థ. ప్రకరి అర్థ ప్రకృతి. వీనిని అనుసరించి పదమూడు అంగములు స్వరూప లాభమును పొందుతవి.

అపవాదము, సంఫేటము, విద్రవము, ద్రవము, శక్తి, ద్యుతి, ప్రసంగము, ఛలనము, వ్యవసాయము, నిరోధము, ప్రరోచనము, విచలనము, ఆదానము అని దీని అంగములు. వీని స్వరూపమును నిరూపింతును.

విమర్శసంధ్యంగ స్వరూపము

౧. అపవాదము:—దోషమును ప్రఖ్యాపనము చేయుట అపవాదము.

౨. సంఫేటము:—రోష సంభరితమయిన పరస్పరమూ ప్రసరించు సంభాషణమునకు సంఫేట మని పేరు.

౩. విద్రవము:— వధబంధాదికము ఉండుట.

౪. ద్రవము:— గురుజనులను అవమానించుట తిరస్కరించుట ద్రవము.

౫. శక్తి:— విరోధము శమించి పోవుట.

౬. ద్యుతి:— భయపెట్టుట ఉద్వేగపెట్టుట ద్యుతి

౭. ప్రసంగము:— గురుజనుల సంకీర్తనము.
౮. ఛలనము:— అవమానము చేయుట ఛలనము.
౯. వ్యవసాయము:— తనశక్తిని ప్రశంస చేయుట.
౧౦. నిరోధనము:— క్రోధ సంబిద్ధులయిన వారి యొక్క పరస్పర విక్షేపము నిరోధన మవుతుంది. దీనిలోనే ప్రకృత కార్యములో విఘ్నముఉండడముకూడా సూచిత మవుతుంది.
౧౧ ప్రరోచనము:— రాబోవు శ్రేయమును సిద్ధమయి నట్లుగా చెప్పుట ప్రరోచనమవుతుంది. సఫలతా లక్షణము లను చూచి భవిష్యమును ఊహించుట అని భావము.
౧౨. విచలనము:— తన గుణాలను ఆవిష్కరించు కొనుట విచలనము
౧౩. ఆదానము:— కార్యసంగ్రహము ఆదానము. తన ప్రయోజనమును సాధించుట అని భావము. వీనిలో ఏయే అంగములకు ప్రాధాన్యము ఉన్నదో విద్యానాధుడు సూచించ లేదు. అయినా దశరూపకంలో చెప్పిన విధానానుసారముగా చూస్తే అపవాద శక్తి వ్యవసాయ ప్రరోచనాఽదానములు ప్రధానములు అని గోచరమవుతున్నది. వానిని మాత్రమె గ్రంథములో నిబంధించినా కార్యశృంఖలకు ఆనుగుణ్యము ఉంటుందని గ్రహించవచ్చును.

నిర్వహణ సంధి

బీజవంతో ముఖాద్యర్థా విప్రకీర్ణా యథాయథం
ఐకార్థ్య ముపనీయంతేయత్ర నిర్వహణం హి తత్
ఫలాప్తి కార్యానుగుణ్యా దంగాన్యస్య చతుర్దశ.

నానావిధములుగా తమ తమ స్థానాలలోనే నిరూపితము లయి ఉండడము వలన బీజయుక్త ముఖాద్యర్థములు విప్ర

కీర్ణములై ఉంటవి. వాటికి ముఖ్యార్థమయిన పరమ ప్రయోజనము యొక్క సంబంధమును నిరూపణము చేసినట్లయితే నిర్వహణ సంధి అవుతుంది. ఆయాస్థలములలో వేరువేరుగా ఉండడము వలన ముఖసంధ్యాదులలోని ప్రయోజనాలకు అంతగా పరస్పర సంబంధము ఉన్నట్లు కనపడదు. మహా ప్రయోజన సంబంధము కూడా అంతగా భాసించదు. వాటికి పరస్పరసంబంధమును విశదము చేస్తూ ముఖ్యఫల సంబంధమును నిశ్చయించడము నిర్వహణసంధి అవుతుందని భావము. దీనిలో ఫలప్రాప్తి అవస్థ. కార్యము అర్థ ప్రకృతి ఈ రెండిటికి అనుగుణముగా దీని అంగములు పదునాలుగు ఉన్నవి. ఫలాప్తి కార్యానుగుణముగా ఈ నిర్వహణ సంధిలో చతుర్దశాంగములను నిరూపించాలి.

సంధి, విరోధము, గ్రథనము, నిర్ణయము, పరిభాషణము, ప్రసాదము, ఆనందము, సమయము, కృతి, ఆభాషణము, ఉపగూహనము, పూర్వభావము, ఉపసంహారము, ప్రశస్తి అని నిర్వహణసంధి అంగములు. ఇక వీటి స్వరూపము.

నిర్వహణసంధ్యంగస్వరూపము

౧. సంధి:— ముఖసంధిలో ఉపక్షిప్తమయిన బీజార్థమును ఉద్భావనము చేయుట సంధి అవుతుంది.

౨. విరోధము:— కార్యమును అనుసంధానము చేయుట ప్రథమ సంధిలో ఉపక్షిప్తమయిన ఫలరూపార్థమును అన్వేషించుట విరోధము. దీనిని విబోధము అని కూడా అంటారు.

3. గ్రథనము:— కార్యార్థమును ఉపక్షేపము చేయుట గ్రథనము.

౪. నిర్ణయము:— బీజానుగుణమయిన కార్యమును ప్రఖ్యాపనము చేయుట, అనుభూతార్థమును చెప్పుట నిర్ణయము అవుతుంది.

౫. పరిభాష:—అన్యోన్యమూ సంభాషించుట పరిభాష.

౬. పర్యుపాసనము:—ఏదయినా చేసికాని, ఏదయినా పలికికాని, ప్రసన్నతను సంపాదించుట పర్యుపాసన మవుతుంది.

౭. ఆనందము:— వాంఛితార్థసంప్రాప్తి మొదట కలగాలని తలచిన ఫలము కలుగుట ఆనందము.

౮. సమయము:— దుఃఖము నశించుట. అవాంతరంగా కలిగిన అంతరాయములన్నీ అంతరించి పోవడము సమయము.

౯. కృతి:— లబ్ధార్థస్థిరీకరణము కృతి. లభించిన ఫలము ద్వారా శోకాదికము శమించడము. శోకాములవలన సముత్పన్నమైన అస్థిరత నివృత్తమగుట కృతి అవుతుందని భావము.

౧౦. ఆభాషణము:— ప్రతిష్ఠ గౌరవము యశస్సు మొదలయిన వాని ప్రాప్తి ఆభాషణ మవుతుంది.

౧౧. ఉపగూహనము:— అద్భుత వస్తుప్రాప్తి.

౧౨. పూర్వభావము:— ఇష్ట కార్యదర్శనము.

౧౩. సంహారము:— కార్యార్థమును ఉపసంహరించుట (సమాప్తము చేయుట) వరాదానప్రాప్తి సంహార మవుతుంది.

౧౪. ప్రశస్తి:— శుభశంసనము—ఆశీస్సు.

ఈ చెప్పిన పదునాలుగూ నిర్వహణాంగములు. వీనిలో ప్రధానములంటూ వేటికీ ప్రత్యేక నిరూపణము లేదు. మొత్తము మీద వీనిని అన్నిటిని నిరూపించాలని తాత్పర్యము. ఈ అయిదు సంధులలోనూ అరువదినాలుగు అంగములు

ఉన్నవి. ఈవిధముగా చతుష్షష్ట్యంగసమన్వితము లయిన పంచసంధులూ ప్రతిపాదితములయినవి. ఈ చెప్పిన ఉపక్షేపాదికాంగములలో క్రమము లేదు. వీనిలో వేటికయినా కార్యకారణభావము ఉన్నట్లయితే అక్కడ క్రమమును అంగీకరించాలి. కార్యకారణ భావము లేని స్థలములో కూడా క్రమమును అంగీకరించడములో హేతువు కనపడదు. మహాకవుల లక్ష్యగ్రంథములలో క్రమము కన్పడడము లేదు. ఏవిధముగా నయినా ప్రతిపాదింప తగిన వస్తువు సౌష్ఠవముతో కూడు కొనిన విన్యాసముకలది కావడమె వివక్షితము. కాబట్టి కథావస్తువు సముచితముగా ఉండేటట్లు అంగములను నిబంధించాలి. కార్యవ్యాపారశృంఖల శిథిలము కాకుండా ఉండేటట్లు నిరీక్షించాలి.

సంధిప్రయోజనములు

ఈ సంధ్యంగముల ప్రయోగము ఆరు ప్రయోజనములను ఉద్దేశించి ఉంటుంది. సామాన్యముగా ప్రధానమునకు ఏ ఫలము ఉంటుందో ఆ ఫలమె అంగములకు కూడా సిద్ధిస్తుంది. అంగములకు వేరుగా ప్రయోజనము ఉండవలసిన అవసరము లేదు. అయినా ఇక్కడ అంగములకు ప్రత్యేకప్రయోజనములు ఉన్నవని చెప్పడము అనుపపన్నము కాదు. ప్రతి పదార్థానికీ కొన్ని దృష్టాదృష్ట ప్రయోజనాలు ఉంటవి. ఈ రూపకములలో అంగములకూ ప్రధానములకూ సంబంధించిన మహా ఫలము అదృష్ట ఫలమనీ ఈ చెప్పబోయే ఆరుఫలములూ దృష్ట ఫలములనీ గ్రహించాలి.

౧. వివక్షితార్థ ప్రతిపాదనమనేది మొదటి ప్రయోజనము. రూపకములో కవినిరూపించదలచిన అర్థము వీనివలన

(అంగముల వలన) స్పష్టముగా ప్రతిపాదిత మవుతుంది. వస్తువు వీనిలో ఇంతగా విస్తృతిని పొందుతుంది కాబట్టి వివక్షితార్థ. ప్రతిపాదనము విస్పష్ట మవుతుంది.

౨. గోప్యార్థగోపన మనేది రెండవ ప్రయోజనము. రూపక రచనలో చుంబనా లింగనాది సురత ప్రభేదములు గోపనీయములు. ఈ అంగములు ఆధారముగా గోప్యార్థమును గోపనము చేయడానికి అవకాశము ఉన్నది. అందువలన ఇది కూడా ప్రయోజనములలో ఒకటి.

౩. ప్రకాశ్యార్థ ప్రకాశనమనేది మూడవ ప్రయోజనము. కార్య ప్రణాళిక సమముగా ప్రసరించడానికి కొన్నిటిని ప్రకాశింప చేయవలసి ఉంటుంది ఈ అంగములు అటువంటి ప్రకాశ్యార్థమును ప్రకాశింప చేయగలవు.

౪. అభినయ రాగిసమృద్ధి అనేది నాల్గవ ప్రయోజనము. నాలుగు విధములయిన అభినయముల ద్వారా సామాజిక మనములను రంజింప చేయవలసిఉన్నది. అటువంటివిధానానికి కూడా సంధ్యంగములు బాగా ఉపకరించుతవి. కాబట్టి అదీ ఫలమె.

౫. చమత్కారిత్వ మనేది పంచమ ప్రయోజనము. చమత్కారమును కలుగజేయడానికై ఆశ్చర్యకర ప్రయోగములు ఆవశ్యకములు. సంధ్యంగములు ఇటువంటి అవకాశమును ఇస్తున్నవి.

౬. ఇతివృత్తవిస్తరమనేది ఆరవ ప్రయోజనము. రూపకములోని వృత్తాంతము ఉపక్షయము పొందకుండా ఉండే టట్లుగా రూపకకర్తాత పరిశీలించాలి. ఉపక్రమో పసంహార

ములను అనుసరించి కథ విస్తరింప బడుటకు ఈ అంగములు మంచి అవకాశమును సంపాదించుతున్నవి. కాబట్టి ఇతివృత్తము బాగా పెంపు పొందుతుంది. అంగోపాంగములతో అది పరిపుష్టమవుతుంది. అందుచే ఇతివృత్త విస్తరము కూడా ప్రయోజనమే. ఈ ఆరు విధములయిన ఉద్దేశ్యములు సిద్ధము లయ్యేటట్లుగా దృశ్యకావ్యరచనలో సంధిసంధ్యంగములను నిబంధించాలి.

వస్తువిభాగము

రూపకములోని ఇతివృత్తము వేరొక రీతిని బట్టి కూడా ద్వివిధ మవుతుంది. సూచ్యవస్తువు మొదటిది. అసూచ్యవస్తువు రెండవది. అనుచితము గానూ నీరసముగానూ ఉండే వస్తువును అభినయించరాదు. అది ఉద్వేగ జనకము. దానిని విస్తరింప చేయరాదు. ఏదో ఒక విధముగా దానిని సూచించడమే సముచితము. అదే సూచ్యవస్తువు. కొన్నికొన్ని విషయాలు అత్యంతమూ మధురములూ ఉదాత్తములూ అయి ఉంటవి. వాటి రసభావములు అత్యంతమూ ఉద్దీప్తములై ఉండడానికి అవకాశము ఉన్నది. అటువంటి వాటిని చక్కగా అభినయించి ప్రదర్శించడము ఆవశ్యకము. వానిని సూచనామాత్రసారములనుగా చేయరాదు. చక్కగా విస్తరింప చేయాలి. అప్పుడు అది అసూచ్యవస్తువవుతుంది.

ఈ అసూచ్యవస్తువు దృశ్యమని శ్రవ్యమని రెండు విధాలు శ్రావ్యగతముగా అవాంతరభేదములు అనేకములు ఉన్నవి. సర్వశ్రావ్యమని నియతశ్రావ్యమని శ్రావ్యము రెండు విధాలు. రంగములో ఉండే వారందరూ వినదగినది సర్వశ్రావ్యము. కొందరు మాత్రమె వినతగినది నియతశ్రావ్యము. ఇక్క

డనె అశ్రావ్యమనేది కూడా వేరొకటి ఉన్నది. ఈ అశ్రావ్యవస్తువు స్వగతము అనే పేరుతో ఉంటుంది. ఒక పాత్ర తనలోతాను అనుకొనే వచనమును స్వగతమని అంటారు. ఏతదతిరిక్త శ్రావ్యభేదాలు ప్రకాశ రూపములు. నియత శ్రావ్యమనేది జనాంతికమని అపవారితక మని రెండు విధాలు. రంగస్థలములో ఉన్న జనుల సన్నిధానములోనే త్రిపతాకా కరమును జనులకు అడ్డముగా పెట్టి పరస్పరమూ సంభాషణము చేయుట జనాంతికము. రంగములో వేరొక ప్రక్కకు తిరిగి తన అభీష్టునితో రహస్యమును చెప్పడము అపవారితమవుతుంది. సూచ్యార్థము యొక్క సూచనా క్రమము అయిదు విధములుగా ఉన్నది. ఈ విషయము దశ రూపకములో ఈ విధముగా నిరూపించి యుంది. "విష్కంభము చూళిక అంకాస్యము, ప్రవేశకము, అంకావతరణము" అనేవానిచే సూచ్యార్థమును సూచించాలి అని. ఈ అయిదూ అర్థోపక్షేపకములు. ఇక వీని స్వరూపమును యథాక్రమముగా నిరూపించుతాము.

౧ విష్కంభము

వృత్తవర్తిష్యమాణానాం కథాంశానాం నిదర్శకః
సంక్షేపార్థస్తు విష్కంభో మధ్యపాత్రప్రయోజితః.

విష్కంభమును ప్రస్తావనానంతరము రచించాలని కొందరంటారు. అంకద్వయ మధ్యభాగములో రచించాలని కొందరి ఆశయము. విష్కంభము జరిగిన జరుగబోవు కథాంశములను నిదర్శించేదిగా ఉండాలి. అది సంక్షేపరూపముగా ఉండాలి. తదర్థనిబంధనము సంక్షేపముగా ఉండేటట్లు పరిశీలించడము ఆవశ్యకమని భావము. విష్కంభము మధ్యపాత్రలచే ప్రయు

క్తము కావాలి. మధ్యములగు వారు ఒకరు కాని అనేకులు కాని ఇందు పాల్గొన వచ్చును. ఇది శుద్ధమని సంకీర్ణమని రెండువిధాలు. కేవలము సంస్కృత భాషాప్రచురముగా (శిష్టభాష) ఉండేది శుద్ధము. సంస్కృత ప్రాకృత (గ్రాంధిక వ్యావహారిక) భాషామిశ్రితముగా ఉండేది సంకీర్ణము. ఒకడు కాని అనేకులు కాని మధ్యములు ప్రయోగించి నట్లయితే శుద్ధమవుతుందని, మధ్యమ నీచపాత్రప్రయుక్త మయినట్లయితే సంకీర్ణమవుతుందనీ గ్రహించాలి. ఏక మధ్యమ పాత్రప్రయుక్త శుద్ధవిష్కంభము అనేక మధ్యమపాత్ర ప్రయుక్త శుద్ధవిష్కంభమూ అని శుద్ధవిష్కంభము ద్వివిధము కావచ్చును. శుద్ధ విష్కంభములో మధ్యమపాత్రల భాషణము వార్తాలాప మూను సంస్కృతములో ఉంటుంది. మిశ్రవిష్కంభములో మిశ్రభాష ఉంటుంది.

౨ చూళిక

అంతర్యవనికా సంస్థైః సూచనార్థస్య చూళికా.

యవనికాభ్యంతరములో నుండి రంగస్థలములో ప్రవేశము పొందకుండగానే పాత్రలు అర్థమును సూచించినట్లయితే చూళిక అవుతుంది. నేపథ్యములో నుండి ఏదైనా రహస్యార్థమును సూచించుట చూళిక అని తాత్పర్యము.

౩ అంకాస్యము

అంకాంతపాత్రైరంకాస్యముత్తరాంకార్థసూచనా.

పూర్వాంకాంతము నందున్న పాత్రలచే ఉత్తరాంకార్థము సూచిత మయినట్లయితే అంకాస్యము అని పేరు. రాబోవు నట్టి అంకములోని విషయమును పూర్వాంకాంతములోని పాత్రలు భాషణావసరమున సూచించాలి.

౪ ప్రవేశకము

వృత్తవర్తిష్యమాణానాం కథాంశానాం నిదర్శకః
ప్రవేశకస్తు నాద్యేంకే నీచపాత్ర ప్రయోజితః.

విష్కంభములో మాదిరిగా దీనిలో కూడా వృత్తవర్తి ష్యమాణ కథాంశ నిదర్శనము ఉంటుంది. కాని ఇది నీచపాత్ర ప్రయోజితము. ప్రవేశకము రెండు అంకాలకు మధ్య లోనే ఉంటుంది. కాని ఎప్పుడూకూడా ప్రథమాంకములో ఉండదు. ఆవిధముగా ఉండరాదని నియమము. ప్రవేశకము లోని పాత్రల భాష ఉత్కృష్టముగా ఉండదు. గ్రామ్యముగాఉంటుం దన్నమాట.

౫ అంకావతారము

యత్రస్యాదుత్తరాంకార్థః పూర్వాంకార్థానుసంగతః
అసూచితాంకపాత్రం తదంకావతరణం మతం.

ఉత్తరాంకార్థము పూర్వాంకార్థాను సంగతమై ఉండాలి. పూర్వోత్త రాంకార్థ కథలలో విచ్ఛేదము ఉండరాదు. ఉత్త రాంకములో ప్రవేశించే పాత్రలకు వేరుగా సూచనమంటూ ఉండదు. పూర్వాంకాంతములో పాత్రలందరూ వెడలిపోయి ఉత్తరాంకములో మరలవారె ప్రవేశించాలి. అంకాస్యము నకూ అంకావతారమునకూ ఈభేదము ఉన్నది. అంకాస్య ములో ఉత్తరాంకార్థ విషయము సూచనా మాత్రముగా నిర్దిష్ట మవుతుంది. అంకావతారములో పూర్వాంక పాత్రలు ఉత్తరాంకములో మళ్లాప్రవేశించి కార్యవ్యాపారమున అగ్ర సరులై ఉంటారు.

అర్థోపక్షేపకములు అనబడే ఈ విష్కంభాది పంచకమున సూచ్యార్థమును సూచించాలి. దృశ్యమయిన అర్థమును అంక

ములచే ప్రదర్శించాలి. ఇక అంకస్వరూపమును ప్రదర్శించెదము.

అంకము

ప్రత్యక్షనేతృచరితో బిందువ్యాప్తి పురస్కృతః
అంకో నానాప్రకారార్థ సంవిధాన రసాశ్రయః.

అంకములో నాయక చరితము ప్రత్యక్షముగా ఉండాలి. నాయక వ్యాపారమును రంగములో ప్రవేశింప చేసి నిర్దేశించాలి. బిందు రూపార్థమును అభివ్యక్తము చేయడమును అంకము పురస్కరించుకోవాలి.

బిందుసూచనార్థమై అంకము పరిచ్ఛిన్నం కావాలి. ఇంకా అంకము నానాప్రకారార్థ సంవిధాన రసాశ్రయము కావడము కూడా అపేక్షితము. నానా విధములయిన అవాంతర ప్రయోజనములకున్నూ కథా సన్నివేశ విశేషములకున్నూ అంగభూతము లయిన రసములకున్నూ అంగిగా ఉండే రసానికిన్నీ అంకము ఆశ్రయముగా ఉండాలి. కవి అంకములో కేవల రస నిబంధనైకరసికత్వముతో వస్తువును విచ్ఛిన్నము చేయరాదు. వస్త్వలంకార నిబంధనాభిలాషముతో రసమును తిరోధానించరాదు. ఇట్లా వస్తురసములు పరస్పరమూ బాధారహితములై ఉండాలి. దూర ప్రయాణము వధ యుద్ధము రాజ్య దేశాది విప్లవము. శత్రువులముట్టడి, భోజనము, స్నానము, సురతము, అనులేపనము, వస్త్రగ్రహణము మొదలగు వానిని రంగములో ప్రత్యక్షముగా చూపించరాదు. అధికారి అయిన ప్రధాన నాయకుని వధను ఏమాత్రమూ దర్శించరాదు. అధికారివధ ఉన్నట్లు కొంతగా కల్పన చేయవచ్చును. కాని ఆతనికి మరల ప్రత్యుజ్జీవనమును చెప్పడము ఆవశ్యకము. ఆవశ్యకమయిన దానిని ఏమాత్రమున్నూ విడువరాదు. నాయకుని ఒకనాటి

చరితమును అంకములో ప్రతిపాదించాలి. ఒక దినము లోని ఘటనల కంటె అధికముగా ఘటనలను సమావేశింప చేయరాదు. కావ్యసౌష్ఠవమునష్టము కాకుండా ఉండేటట్లుగా ఇతివృత్తమును సంక్షిప్తముచేయాలి. అంకరచనలో ఉండే వస్తుఘటనలు అసంబద్ధముగా ఉండరాదు. వానిలో కార్యకారణభావము ఉండితీరాలి. అంకములోని వస్తువిన్యాసము సవ్యగ్రీతిలో ఉండడమూ పరస్పరమూ సంబంధము కలిగిఉండడమూ ఆవశ్యకము. ఆయా అంకాలలోని కార్య సమాప్తులనూ ఫలప్రాప్తులనూ కార్యవ్యాపారప్రసారములలో ఉపయోగించేటట్లుగానూ అక్కడ అగ్రసరములు అయ్యేటట్లుగానూ నిబంధించాలి. ఒక్కొక్క అంకానికి మధ్యకాలము ఒక్కొక్క సంవత్సరము కంటె అధికముగా ఉండరాదు. ఇతి హాసవశాన ఇంతకన్న అధిక కాలము సంప్రాప్తమయినా దానిని సంవత్సరముగా సంకోచింప చేయుడము ఆవశ్యకము. ఈ అంకముల అంతరమును సూచనము చేయడానికె అర్థోపక్షేపకములు నిర్దేశింపబడినవి. ఒక అంకానికి ఒకే ప్రయోజనము ఆశ్లిష్టమై ఉండాలి. నాయకుడు అందు ఆసన్నుడై ఉండాలి. విదూషకుడు మొదలయిన ముగ్గురు నలుగురు పాత్రలతో అంకమును కూర్చాలి. సర్వపాత్రలూ నిష్క్రమించుట అంకమునకు అవసానము. ఇటువంటి ఈ అంక విశేషస్వరూపములు గ్రంథాంతరములందు విపులముగా నిరూపితము లయినవి.

విష్కంభాదులు సూచ్యవస్తు ఖండ ప్రతిపాదకములు. అంకములు అసూచ్య వస్తుఖండ ప్రతిపాదకములు. ఈ రెండిటి స్వరూపములూ నిరూపితము లయినవి. ఇక బారసి

వృత్తిని నిరూపించ వలసి ఉన్నది. భారతీ వృత్తి సర్వ కార్యార్థ సూచకము. సంస్కృత ప్రధాన మయిన వాగ్వ్యాపారము భారతి. విశిష్ట మానవులు దీనిని ప్రయోగించాలి. ప్రధాన వ్యక్తులు సంస్కృత బహుళంగా ఉక్తి ప్రత్యుక్తులతో వ్యవహరించడ మన్నమాట. రూపక ప్రారంభములో ఇది నటుని ఆశ్రయించి ఉంటుంది. ఇతర స్థలాలలో అయితే కొంత విశేషము కలవారు ప్రయోగిస్తారు. తదంగములు నాలుగు ఆముఖము ప్రరోచన వీథి ప్రహసనమూ అని సామాన్యముగా వీథీ ప్రహసనములు ప్రబంధాదిలో ప్రయుక్తములు కావడము లేదు. రూపక దశక మధ్యములో వీథి ప్రహసనములు రూపక భేదములుగా పరిగణింప బడుతున్నవి. వాటిలక్షణాలను ఆ యా ప్రసంగములలో నిరూపించుతాము. ఈప్రసంగమున ప్రరోచనను నిరూపింప వలసినదె. విద్యానాథుడు ఇక్కడ దాని స్వరూపమును చెప్పక పోయినా ఉదాహరణములో సమన్వయ విధానమును సూచించుతున్నాడు. కాబట్టి ఇక్కడ ప్రరోచనను ఉపపాదించడము ప్రరోచనకు (ప్రీతికి) హేతువు కాకపోదు కదా!

ప్ర రో చ న

ప్రస్తుతార్థమును ప్రశంస చేస్తూ సభాసదులకు సముత్కంఠను కలుగ జేయడము ప్రరోచన అవుతుంది. పశంస రెండు విధాలు. చేతనాశ్రయ మని అచేతనాశ్రయ మనిదేశకాల ప్రశంస అచేతనాశ్రయము. కవిసభ్యనట కథానాయక ప్రశంస చేతనాశ్రయము. కవి తన ప్రకృత్యను సారముగా నాలుగు విధాల ప్రరోచనా ప్రయోగ మొనరించుతాడు. ప్రకృత్యనుసారమున కవికూడా నాలుగు

విధములవుతాడు. ఉదాత్తుడు ఉద్ధతుడు ప్రౌఢుడు వినీతుడూ అని. ఉదాత్తకవి అభిమాన పరిపూర్ణమైన వచన ప్రయోగము చేస్తాడు. ఉద్ధతకవి ఇతరులను అవమానించి తన ఉత్కర్షను చెప్పుకొంటాడు. ప్రౌఢకవి తనఉత్కర్షనుయుక్తి విశేషముతో స్పష్టము చేస్తాడు. వినీతకవి వినయపూర్వకముగా తన అపకర్షను ఉల్లేఖించుకొంటాడు.

సభ్యులు కూడా ప్రార్థనీయులని ప్రార్థకులని ద్వివిధముగా ఉంటారు. ఎవరిఆగమనాని కై నాట్య ప్రయోక్త ఉత్కంఠితుడవుతాడో ఎవరిరాక వలన తాను సమ్మానింపబడినట్లుగా తలంచుతాడో వారు ప్రార్థనీయసభ్యులు. నాటకమును చూడవలెనని ఉత్కంఠ పడేవారు నాట్యమును ప్రయోగించే వారిచే (నటులచే) తాము అనుగ్రహింపబడితిమని భావించే వారు ప్రార్థక సభ్యులు, ప్రరోచన కూడా సంక్షిప్త మని విస్తృత మనీ రెండు విధాలు.

ఆ ము ఖ ము

సూత్రధారో నటీం బ్రూతే మారిషం వాథ విదూషకం
స్వకార్య ప్రస్తుతాక్షేపి చిత్రోక్త్యా యత్తదాముఖం.
ప్రస్తావనా వా యత్ర స్యా త్కథోద్ఘాతః ప్రవర్తకం
ప్రయోగాతిశయశ్చేతి త్రీణ్యంగాన్యాముఖస్య తు.

సూత్రధారుడు నటుని గురించి గాని మారిషుని గురించి గాని విదూషకుని గురించి కాని చిత్రోక్తులతో పలుకుట ఆముఖ మవుతుంది. ఆ చిత్రోక్తి అభిమత రూపక ప్రయోగములో పరిషదారాధనాత్మకమైన ప్రస్తుత కార్యమును తెలియజేసేదిగా ఉండాలి. ప్రస్తుతమయిన కావ్యార్థమును

సూచించేది కావాలి. చిత్రోక్తితో నాట్యాదికమును పలుకుట ఆముఖము అని భావము.

సూత్రధారులు ఇద్దరు ఉంటారు. ఒకడు పూర్వరంగ విధాత. రెండవ సూత్రధారుడు మొదటి వానివలె గుణము ఆకారమూ కలిగి ఉంటాడు. ఈతడు ప్రస్తావనా ప్రవర్తకుడు. స్థాపకుడని ఈతనికే వేరొక నామము. నటీ మారిషాది సంభాషణమును బట్టి ఈతడె ఇక్కడ వివక్షితుడని ఊహించాలి. నటి ఈతని గృహిణి. వెంటనంటి తిరుగు వాడు (పారిపార్శ్వకుడు) మారిషుడు. నర్మసచివుడు విదూషకుడు కవినాయకుల గుణములను ఆసూత్రించే వాడునూ కావ్య వస్తువును సూచించేవాడునూ రంగప్రసాధన ప్రౌఢుడూ అగు వాడు సూత్రధారు డనబడును. అతని గృహిణిఅయిన నటి సంగీత వాద్యకుశల కళావిశారద అభినయచతుర సర్వభాషా విచక్షణ. నటుని కృత్యములలో ఉపకారిణిగా ఉంటూ అనుకారిణి అవుతూఉంటుంది. భరతుడు నిర్దేశించిన నానా ప్రకార రసభావాశ్రయము లయిన అభినయములను చక్కగా పరిష్కరింప గలవాడు మారిషుడు. ప్రత్యుత్పన్నమతి నర్మప్రయోగ చతురుడు వేద వేత్త హాస్యప్రాయుడూ అయినవాడు విదూషకుడు. ఇటువంటి వీరితో నటుడు స్వకార్యము కావ్యార్థమూ ఆక్షిప్త మయ్యేటట్లుగా పలుకుట ఆముఖము అని గ్రహించవచ్చును.

ఇంకా ఈవిషయమును ఇక్కడ గ్రహించాలి. రూపక ముఖ్యకథా ప్రారంభానికి పూర్వము కొన్ని కృత్యములను విధానించ వలసి ఉన్నది. దీనినె పూర్వరంగమంటారు. అభినయము చేసేవారు రూపకము ప్రారంభించడానికి పూర్వము

రంగశాలా విఘ్నములను దూరీకరించవలసి ఉన్నది. ఈపూర్వ రంగమునందు ఆవిధానములు కూడి ఉంటవి. భరతుడు ఈవిధానములను విపులముగా ప్రతిపాదించినాడు. తదను సారము అన్నిటికన్న ముందుగా నాటకము ప్రారంభము కాబోవు చున్నదని సూచించడానికి వాద్యఘోషణము చేయబడుతుంది అనంతరము గాయకులు వాదకులూ రంగానికివచ్చి తమతమ సాధనాల స్వరాదికమును మేళవించి గాన వాద్యములను ప్రారంభించుతారు. అప్పుడు సూత్రధారుడు రంగములో పువ్వులు చల్లుతూ ప్రవేశించుతాడు. ఆతనితో బాటు ఒకసేవకుడు ఒకజలపాత్రను పట్టుకొని వస్తాడు. వేరొకడు ఇంద్ర ధ్వజమును తీసికొని వస్తాడు, సూత్రధారుడు జలపాత్రనుండి ఉదకమును గ్రహించి తనను పవిత్రముచేసి కొంటాడు. ఇంద్ర ధ్వజమును హస్తములతో బట్టి రంగముననిలిచి స్తుతిపాఠము చేస్తాడు. ఈస్తుతిపాఠమె నాంది. అనంతరము ఏదేవతోత్సవమును అనుసరించి నాటకము జరుగనున్నదో ఆదేవతను స్తవముచేయాలి. రాజవందనము చేయాలి. బ్రాహ్మణ నమస్కారము చేయాలి. ఇట్లా నాంది సమాప్తము కాగానే రంగద్వారము అనే కృత్యము ప్రారంభింప బడుతుంది. ఇక్కడి నుండి నాటక ప్రారంభము. అప్పుడే శ్రీపార్వతీదేవి ప్రమథ గణములు భూతములు మొదలగువారి ప్రసన్నత కొరకు నృత్యము జరుగుతుంది. సూత్రధార విదూషకులు సంభాషణము చేస్తారు. రూపక కథ సూచిత మవుతుంది. సూత్రధారాదులు నిష్క్రమిస్తారు. అనంతరము స్థాపకుని ప్రవేశము. ఈతడు రూపములో గుణాలలో సూత్రధార సదృశుడు. తాను సూత్రధారుని వలె వేషమును ధరించు తాడు.

నాటక విషయమును నామమునూ సూచించుతాడు. నాట్యకారుల గుణాములను వర్ణించుతాడు, ఉపయుక్త గుణ వర్ణనము చేసి రూపకమును ప్రారంభిస్తాడు. దివ్యవస్తువును దివ్యుడుగా అభినయించుతాడు. మర్త్య వస్తువును మర్త్యుడుగా అభినయించుతాడు. మిశ్రవస్తువును అన్యతరుడై సూచిస్తాడు. ఆముఖము అంటే ఇది. దీనినే ప్రస్తావన అంటారని విద్యానాథుడు దశరూపకకారాశయమును ఉల్లేఖించుతున్నాడు. ప్రస్తావన అని స్థాపన అని ఆముఖము రెండు విధాలు. కొన్ని వీథ్యంగముల ప్రయోగము ఉంటే స్థాపన అవుతుంది. శృంగార ప్రధానక రూపకములలో ఆముఖము, వీరాద్భుత ప్రధానకములలో ప్రస్తావన హాస్య భీభత్స రౌద్ర ప్రధానకములలో స్థాపన యోజితము కావాలని కొందరి ఆశయము.

ఈ ఆముఖ కార్యము మూడు విధాల ఉంటుంది. కాబట్టి కథోద్ఘాతము ప్రవర్తకము ప్రయోగాతిశయమూ అని మూడంగములు ఉన్నవి. ఈ అంగముల స్వరూపము.

౧ కథోద్ఘాతము

స్వేతివృత్తసమం వాక్యమర్థం వా యత్ర సూత్రిణః
గృహీత్వా ప్రవిశేత్పాత్రం కథోద్ఘాతో ద్విధైవ సః

రూపకములో ప్రవేశించు పాత్రధారి తన యితివృత్తముతో సమానమయిన సూత్రధారుని వచనమును కాని వచనార్థమును కాని స్వీకరించి ప్రవేశించినట్లయితే కథోద్ఘాతమవుతుంది. వాక్యమును స్వీకరించి ప్రవేశించడము ఒకటి, వాక్యార్థమును స్వీకరించి ప్రవేశించడము రెండు. ఇట్లా ఇది రెండు విధాలు.

౨ ప్రవర్తకము

ప్రస్తూయ మానకాలస్య గుణవర్ణనయా స్వతః
ప్రవిశేత్సూచితం పాత్రం యత్ర తత్స్యాత్ప్రవర్తకం.

సూత్రధారుడు రంగ ప్రపంచమునందు వసంతాది ఋతువునుగురించి గానము చేస్తాడు. కాబట్టి అట్లా స్వభావసిద్ధముగా ప్రస్తావింప బడుతూ ఉన్న వసంత శరదాది కాల గుణ వర్ణనము వలన సూచితమయిన పాత్ర ప్రవేశించినట్లయితే ప్రవర్తక మవుతుంది. సూత్రధారుడు చేసే ఋతు వర్ణనము ను ఆశ్రయించి పాత్ర ప్రవేశించడము ప్రవర్తక మవుతుందని భావము.

౩ ప్రయోగాతిశయము

ఏషోఽయమిత్యుపక్షేపాత్సూత్రధార ప్రయోగతః
పాత్రప్రవేశో యత్రాయం ప్రయోగాతిశయో మతః.

వీడుగో ఇతడు అనే సూత్రధారి ప్రయోగమును అనుసరించి ఉన్న ఉపక్షేపమును బట్టి పాత్ర ప్రవేశించినట్లయితే ప్రయోగాతిశయమవుతుంది. సూత్రధారుడు రంగములో ప్రవేశించి తానుపలుకు వచనముతో ప్రవేశింపబోయె పాత్రయొక్క సామ్యమును గ్రహించుతాడు. 'ఇదుగో' అని ప్రవిశత్పాత్రను సూచించుతాడు. అట్లా ఉపక్షేపించుట ప్రయోగాతిశయము.

భారతీ వృత్తభేదమయిన వీధికి పదమూడు అంగములున్నవి. వీధ్యంగములె ఆముఖాంగములు. వాని స్వభావము అటువంటిదే కాబట్టి దానిని ఇక్కడ చెప్పడము అవసరము.

ఉద్ఘాత్యకము, అవలగితము, ప్రపంచము, త్రిగతము,

ఛలము, వాక్కేలి, అధిబలము, గండము, అవస్యందితము, నాళిక,అసత్ప్రలాపము; వ్యాహారము, మృదవము.

అని ఇవి పదమూడు. ఈ వీథ్యంగములూ ఆముఖాంగములూఅభిన్నములైనా వీథ్యాముఖములు అభిన్నములుకావు. ఆ ముఖములో ఉండేకథోద్ఘాతాదిత్రయము వీథిలో ఉండదు. సూత్రధారాది సంబంధము వీథిలో ఉండదు. ఉద్ఘాత్యకాది సర్వాంగములూ వీథిలో ఆవశ్యకములు. ఆముఖములో అట్లా కాదు. కాబట్టి రెండిటికీ భేదము ఉన్నదని గ్రహించాలి.

ఇక వీని స్వరూపమును నిరూపింతుము.

౧. ఉద్ఘాత్యకము:—రంగమున ప్రవేశించిన వారిపరస్పరాలాపములో గూఢార్థకములయిన శబ్దములు వానిపర్యాయము వాచకములయిన శబ్దములు మాలారూపముగా ఉన్నట్లయితే; అంటే ప్రశ్నఉత్తరము ప్రశ్నఉత్తరమురూపముగా ఉన్నట్లయితే ఒక విధమయిన ఉద్ఘాత్యక మవుతుంది. వస్తువిశేష జ్ఞానము కొరకై ప్రశ్నోత్తరమాల నిబద్ధ మయినట్లయితే రెండవ ఉద్ఘాత్యక మవుతుంది. పరస్పరమూ నిబద్ధములయిన ప్రశ్నోత్తరముల వలన అనేక విషయములను తెలిసికొనడానికి అవకాశము ఉంటుంది గదా!

౨. అవలగితము:— ఇది రెండు విధములు. ఒక చోట ఒక కార్యమును సమావేశింప జేయడము వలన తత్సాదృశ్యము మొదలయినవి కారణముగా వేరొక కార్యము సాధితమయినట్లయితే మొదటి అవలగితము. దీనిలో ప్రకృత కార్యము ప్రయత్నపూర్వకముగా ఉంటుంది. అన్య కార్యమే అయత్నముగా ప్రాసంగికముగా సిద్ధ మవుతుంది. ఒక కార్యమును

ఆచరించుట అనే విషయములో ఇతర కార్యాచరణము ప్రథమావలగితమని సారాంశము.

ఇతర కార్య ప్రసంగము వలన ప్రకృత కార్యము అయినట్లయితే రెండవ అవలగితము. ప్రకృతమునకు ఏదో విధముగా సంబంధించిన అప్రకృత కార్య ప్రసంగము చేయుబడే టప్పుడు ప్రకృత కార్యము సిద్ధ మయినట్లయితే ద్వితీయా వలగితమని భావము.

౩. ప్రపంచము:— లేనిపోని పరదారాభిగమనాది కమును చెప్పి అసత్ప్రాయ మయిన పరస్పర స్తోత్రమును నిబంధించుట ప్రపంచము అనబడును. కొందరు ఈ విధముగా అంటారు. చెడు పనులను ఆచరించి నందు వలన ఒకడు వేరొకని సోపహాసముగా కొంత ప్రశంస చేయుట ప్రపంచమవుతుంది అని. ఈ రెండు స్వరూపములూ ఒకటే అయినా రెండవదాని స్తోత్రములో హాస్యము ప్రవేశము పొందడమె విశేషము. పరస్త్రీ గమనాదికము లోని చాతుర్యము అసత్కార్మలో సమ్మిళితమె అవుతుంది.

౪. త్రిగతము:— ఇది రెండువిధాలు. పూర్వరంగాంగము మొదటిది. ప్రస్తావనాంగము రెండవది. నటాదులు సల్లాప మొనర్చుట పూర్వ రంగాంగ త్రిగతము. ప్రస్తావ నాంగముగా ఉండే త్రిగతము ఈ విధముగా ఉంటుంది. ఒక శబ్దము వలన శ్రుతిసామ్యమును బట్టి అనే కార్థములకు యోజనము చేయుట. పూర్వ రంగములో సూత్రధారుడు నటుడూ పారిపార్శ్వకుడూ అనే ముగ్గురూ సంలాపము ఒనరించుట వలన వారందరూ ఒకే ధ్వనిలో మేళనము పొందేటట్లు పలకడము

వలన ఈ శ్రుతిసమత్వమును ఊహించడానికి అవకాశము కలుగుతుంది.

౫. ఛలము:— దీనికే ఛలన మని కూడా పేరు. మొదట చూడడానికి ప్రియముగా ఉన్నప్పటికీ వాస్తవముగా అప్రియముగా ఉండే వాక్యములతో లోభపెట్టుట ఛలమవుతుంది. ఏదో కార్యమును లక్ష్యముగా పెట్టుకొని ప్రలోభ పెట్టువాని హాస్యము కాని రోషము కలుగ జేయు వాని వచనము కాని ఛలమవు తుందని కొందరంటారు.

౬. వాకేళి:— ఇది రెండు విధాలు సాకాంక్షమయిన వాక్యమును మధ్యలో నివర్తింపచేయుట, పలుకుతూ పలుకుతూ ఉన్న వాక్యమును ఆపివేయుట వాకేళి అవుతుంది. ఇది మొదటి విధము. రెండు మూడు పర్యాయములు ఉక్తి ప్రత్యుక్తులను నిబంధించడము రెండవ వాకేళి. అనేక ప్రశ్నలకు ఒకే సమాధానము ఉండడముకూడా వాకేళియె అవుతుందని కొందరిభావము.

౭. అధిబలము:— ఇద్దరు వ్యక్తులు పరస్పరమూ తమ తమ సామర్థ్యమును ప్రకాశింప చేసికొనడానికై స్పర్ధతో మాటలు మీరడము (వాక్యాధిక్యము) అధి బలమవుతుంది.

౮. గండము:— ప్రస్తుత విషయముతో సంబంధము ఉన్నప్పటికీ భిన్నార్థసూచకమయిన ప్రస్తుత విరోధి అయిన త్వరాయుక్త వాక్యము ఆలోచింపకుండా పలికిన వాక్యము గండము అవుతుంది.

౯. అవస్యందితము:— రసవశాన పలికిన వాక్యానికి అన్యథా వ్యాఖ్యానము చేయడము అవస్యందితము.

౧౦. నాళిక:— గూఢభావము కలిగిన సోపహాస ప్రహేళికా వచనము నాళిక అవుతుంది. దీనిలో అసలర్థము దాచబడి ఉంటుంది. దీనిలో బాహ్యార్థము కాని అభ్యంతరార్థము కాని గోపిత మవుతుంది. ప్రహేళిక అంటె చిత్రవచనము. ఏదో ఒక అర్థమును వ్యక్తము చేస్తూ సహజార్థమును గోపనము చేసి పలకడము ప్రహేళిక. బాహ్యాభ్యంతరార్థములలో ఒకటి గోపిత మవుతుంది. వేరొకటి ప్రకట మవుతుంది. ఈ ప్రహేళికా విశేషములను ఇతర స్థలములలో విశదంగా గ్రహించాలి.

౧౧. అసత్ప్రలాపము:— అసంబద్ధ కథా ప్రాయమయిన ప్రలాపము అసత్ప్రలాప మవుతుంది. ఆవేశములో ఇటువంటి అసంబద్ధ ప్రలాపము ఉదయించుతుంది. స్వప్నములో ఈ విధముగా పలకవచ్చును. ఉన్మాదము వలన ఈ విధముగా పలకవచ్చును, బాలత్వ సులభముగా ఇటువంటి వచనాలు రావచ్చును. అందువలననే ఇక్కడ "అసంగతి" అనే వాక్య దోషము వాటిల్లదు.

౧౨. వ్యాహారము:— వేరొకరి ప్రయోజనమును సిద్ధము చేసి కొనడానికై హాస్య పూర్ణమయిన లోభకారి అయిన వచనమును పలుకుట వ్యాహారము.

౧౩. మృదవము:— దోషమును గుణీకరించడము కాని గుణమును దోషీకరించడము కాని మృదవ మవుతుంది.

ఇట్లా ఈ పదమూడంగములూ నిరూపితము లయినవి. ఆముఖములో వీటి నన్నిటిని నిబంధించాలన్న నియమము నిర్బంధము లేదు. యథా సంభవముగా ప్రస్తావనలో వీనిని కూర్చాలి. ఈ ఆముఖము అంతా ఏసాపకానిక ఉపోద్ఘాత

రూపము. ఇక ఇటుమీద దశరూపకముల స్వరూపమును నిరూపించాలి.

సాంగై ర్ముఖ ప్రతిముఖ గర్భవిమర్శోపసంహృతైః
పూర్వం ప్రకృతి రన్యేషా మాధికారిక వృత్తవత్
వీరశృంగారయోరేకః ప్రధానం యత్ర వర్ణ్యతే
ప్రఖ్యాతనాయకోపేతం నాటకం తదుదాహృతం,

నాటకము దశరూపకములలో మొదటిది. కావున ప్రకృతి. సర్వాంగోపదేశము కలది ప్రకృతి అవుతుంది. నాటకములో ఆయా అంగములతో కూడుకొన్న ముఖ ప్రతిముఖ గర్భ విమర్శ నిర్వహణ సంధులు అయిదూ ఉండాలి. నాటకము కంటె ఇతరములయిన రూపకములన్నీ వికృతులు. వానికి అన్నిటికీ ఇది ప్రకృతి. వికృతిలో సర్వాంగోపదేశము ఉండదు ప్రకృతినుండి వికృతి అతిదేశమున అంగమును గ్రహించు తుంది. సర్వాంగోపదేశము లేనప్పుడు ఎక్కడ అన్ని అంగ ములూ ఉంటవో అక్కడినుండి ఈ అంగములను తెచ్చు కోవాలి.

దర్శపూర్ణమాస యాగము ప్రకృతియాగము. దానిలో కావలసిన సర్వాంగములూ ఉపదిష్టములై ఉన్నవి. అదివేరొక చోటనుండి అంగములను తెచ్చుకొనవలసిన అవసరము లేదు. ఐంద్రాగ్న్యాది యాగములు వికృతియాగములు. వానిలో సర్వాంగోపదేశము లేదు, అక్కడ కావలసిన అంగములు దర్శపూర్ణమాస యాగములనుండి అతిదేశమున సంప్రాప్తము లవుతవి. ఒకచోటనుండి వేరొకస్థలానికి అంగములు సంప్రాప్త ములు కావడమునకు అతిదేశము అని పేరు.

ఇక్కడ ప్రకృతముతో ప్రకరణాది రూపకములు వికృతులు

అక్కడ అన్ని అంగములూ చెప్పబడవు. అక్కడ కావలసిన వానిని నాటకము నుండి గ్రహించాలి. కాబట్టి నాటకము అన్నిటికీ ప్రకృతి. ఇది ఆధికారిక వృత్తము కలిగి ఉంటుంది. ఆధికారిక పదార్థము ఇదివరలో నిరూపిత మయింది. నాటకములో వీరశృంగార ములలో ఏదో ఒకటి ప్రధానముగా వర్ణింప బడాలి. కాబట్టి రసాంతరములు అంగములుగా ఉండాలని సూచితము.

విద్యానాథుడు చెప్పక పోయినా గ్రంథాంతర విషయమును ఇక్కడ ఈవిధముగా గ్రహించాలి. నాటకములో వీర శృంగారములలో ఏదో ఒకటి ప్రధానముగా ఉండాలనేది నియమమై అయినా ఇతర రసములు ప్రధానముగా ఉండ రాదనే నిషేధము లేదు. ప్రబంధములకు ఉత్కర్షను సంపాదింప దలచిన కవి నవరసములలో ఏరసము నయినా ప్రధానముగా నాటకములో వర్ణింప వచ్చును. కాబట్టి ఒకచోట వీరము ప్రధానము ఇంకొక చోట శృంగారము ప్రధానము వేరొక స్థలములో కరుణము ప్రధానము. మరిఒకచోట శాంతము ముఖ్యము. ఇంకోచోట అద్భుతము ప్రధానము కావచ్చును. కనుకనె భవభూతి ఉత్తర రామచరితములో కరుణము ప్రధానమని కొందరనుట సంగత మవుతున్నది. ప్రబోధ చంద్రోదయములో శాంతము ప్రధానము. ముద్రా రాక్షసములో అద్భుతము అంగిరసము. వీరశృంగారములె ప్రధానముగా ఉండవలె నని అనడము ఇతరములు ప్రధానములు కారాదను నిషేధపరమై అయినట్లయితే ప్రబోధ చంద్రోదయాదులు నాటకములె కాకపోవలసి వస్తుంది. ప్రబోధచంద్రోదయాదులు నాటకములె అని సహృదయముల

నిశ్చయము. కాగా వీరశృంగారములలో ఏదయినా ఒకటి ప్రధానముగా ఉండాలి, అనే వచనభావమును ఈవిధముగా గ్రహించాలి. రసములలో వీరశృంగారములు బహుజన సాధారణములు కాబట్టి వానిని ప్రధానముగా వర్ణించినట్లయితే ప్రబంధములకు ఉత్కర్ష బహుజనాదృతి కలుగుతుంది. ఇతర రసాలు అంతగా బహుజన సమాదరణము పొందినవి. కావు. కాబట్టి వానివర్ణనము వలన బహుజనాదృతి కలుగక పోవచ్చు. అందుచేత వీరశృంగారములలో ఏదో ఒకదానిని ప్రధానముగా వర్ణించాలి. ఇతర రసాలుకూడా బహుజన సమాదరణమును పొందేవిగా చెప్పబడినట్లయితే వానినికూడా ప్రధానముగా వర్ణించవచ్చును.

రామాయణాది గ్రంథప్రఖ్యాతుడయిన ధీరోదాత్త నాయకుడు నాటకములో నాయకుడుగా ఉండాలి. ఇంకా దీనిలో నాయకుడు కాదగినవాడు రాజర్షికాని దివ్యుడుకాని అవుతాడు. అభిగమ్యగుణయుక్తుడు ప్రతాపయుతుడు కీర్తికాముడు మహోత్సాహుడు వేదరక్షకుడు మహీపతి ప్రఖ్యాతవంశ్యుడూ అయిన వాడే నాయకుడు కావాలి. దీనిలో ఆధికారిక వృత్తము ప్రఖ్యాతముగా ఉండాలి, ఇతిహాసాది ప్రఖ్యాత వస్తువునందు నాయకునకుగాని రసమునకుగాని అనౌచిత్యమును సంపాదించు సంఘటనము ఉన్నట్లయితే దానిని పరిత్యజించి అన్యథాయోజనముచేయాలి. ఇట్టిది నాటకము,

ప్రస్తుత మూలగ్రంథములో లేకపోయినా ఆవశ్యకములయిన ఈ విషయాలను కూడా ఇక్కడ గ్రహించడము సముచితముగా ఉంటుంది. నాట్య శాస్త్ర సంబద్ధము లయిన సర్వ విషయములూ నాటకములో ఉన్నవి. సర్వ రసాలకూ

నాటకములో సమావేశము ఉన్నది. కావుననె సర్వ ప్రకారములయిన రూపకాలకున్నూ ఇది ప్రతినిధి. నాటకము సర్వగ్రాహిణి ప్రకృతి అయినందు వలన దేశభాషలలో నాటక శబ్దము రూపక స్థానాపన్నము అయినది. నాటక శబ్దము వలన సకల దృశ్య కావ్య బోధ కలుగు తున్నది. ఈ విధముగా ఆ శబ్దమును ప్రయోగించడము శాస్త్రీయముగా అనుచితమె అయినా లోకములో అది ప్రసారము పొందింది. కాబట్టి నాటకము అంటే రూపకమని రూపక భేదమయిన నాటక మనిన్ని అర్థము. శాస్త్రీయ దృష్టిచే లిఖింప బడని గ్రంథాలలో ఈ భేదమును గ్రహించాలి.

నాటక కథ ఇతిహాస ప్రసిద్ధము. ఇతిహాస ప్రసిద్ధము కాని కేవల కల్పిత కథను ఆధారము చేసికొని నాటకమును రచించ రాదు. ఇక్కడ ప్రధాన కార్య సహాయములో నలుగురో అయిదుగురో వ్యక్తులు నాయకుని అనుసరించుతారు. నాయకుని కంటె ఇతరుడు ప్రాసంగిక మయిన కథానకములో నాయకుడు కావచ్చును. నాటకములో అయిదంకాలకు తక్కువ ఉండ రాదు. పది అంకములకంటె అది మించ రాదు. పంచాధికాంకములు ఉంటే దానిని మహానాటకము అని అంటారు.

నాటక రచన గోపుచ్ఛాగ్ర భాగసమానముగా ఉండాలని నాట్యాచార్యుల భావము. ఇక్కడ అగ్రభాగ సామ్యము చెప్పడములో అనేకులు అనేకాభిప్రాయములను చెప్పుతున్నారు. ఉత్తరోత్తరాంకములు చిన్న చిన్నవిగా ఉండాలని కొందరి అభిప్రాయము. మరికొందరీ విధముగా అంటారు: గోపుచ్ఛములో కొన్ని వాలములు చిన్నవిగా ఉంటవి. కొన్ని దీర్ఘములై ఉంటవి, అట్లాగే నాటకములో

ముఖ సంధిలో కొన్ని కార్యములు మాత్రమే ఉపనిబద్ధములు కావాలి. ప్రతి ముఖసంధిలో అంతకన్న అధికంగా కార్యములు నిబంధింప బడాలి. అంతకంటే గర్భాది సంధులలో అధిక ప్రయోజన నిబంధనము ఉండాలి. తుది అంకములో అన్ని ప్రయోజనములూ సమాప్తములు కావాలి అని. మరి ఒకరు ఈ విధముగా అంటారు, గోపుచ్ఛాగ్ర భాగములో ఒకటో రెండో వాలములు అతిదీర్ఘములై ఉంటవి. అట్లాగే నాటకారంభములో ఒకే అర్థము వ్యాపకమై ఉండాలి. గోపుచ్ఛములోని వాలములు వానిసంఖ్య ఉత్తరోత్తరమున పెరిగి ఏకస్థానములో సమన్వితము లవుతూ ఉన్నట్లు నాటకములో కూర్పబడే కథలన్నీ క్రమ వృద్ధి కలవై ఉప సంహారములో మహా సమన్వయము పొందేవి కావాలి అని.

నిర్వహణ సంధిలో అద్భుత రసము ఉండుట అవసరము. ఇంకా ఇటువంటి విశేషాలను గ్రంథాంతరములను అనుసరించి గ్రహించాలి.

నాందీస్వరూపము

ఇక నాందీ స్వరూపమును నిరూపించుతాము. నాటక ప్రారంభములో విఘ్ననాశకమయిన పూర్వరంగము అనే కర్మ విశేషమును అవశ్యముగా ఆచరించాలి: రంగ విఘ్నోప శాంతికై కుశీలవులు నాటకవస్తువునకు పూర్వము ఆచరించే కర్మ పూర్వరంగ మవుతుందని ప్రాచీనాచార్యులు పలుకుతున్నారు. ఆ పూర్వరంగములో ప్రత్యాహారము మొదలయిన అంగములు ఇరువది రెండు ఉన్నవి. ఎన్ని అంగములున్నా నాటకములో విఘ్నశాంతికై నాందిని ఆచరించాలని సంప్రదాయ విదులు అంటారు.

అర్థతః శబ్దతోవాపి మనాక్కావ్యార్థ సూచనం
యత్రాష్టభిః ద్వాదశభిః అష్టాదశభిరేవ వా
ద్వావింశత్యా పద్యైర్వాపి సా నాందీ పరికీర్త్యతే.

అర్థ ద్వారమున కాని శబ్దద్వారమున కాని కొంతగా కావ్యార్థమును సూచించుట నాంది అవుతుంది. ఈనాందిలో ఎనిమిది కాని పండ్రెండు కాని పద్దెనిమిది కాని ఇరవై రెండు కాని పదములు ఉండాలి. అని నియమము. నాందిలో ఉండదగిన పదాలు సుబంత తిఙంత రూపములు. అని కొందరి ఆశయము. శ్లో కానికి నాలుగు పాదాలు ఉంటవి కాబట్టి శ్లోకపాదమె పదము అని కొందరి అభిప్రాయము. ఒక్కొక వాక్యము ఒక్కొక పదమని మరికొందరి భావము. నాటకాది రూపకాలలో మొదట నిరూపించిన పద్యము నాంది అవుతుంది కదా! వేణీ సంహారము అనే భట్ట నారాయణుని నాటకములో అష్ట పద నాంది ఉన్నది. మురారి కవిరచించిన అనర్ఘ రాఘవ నాటకములో ద్వాదశ పద నాంది ఉన్నది. రాజశేఖరుని బాలరామాయణ నాటకములో ద్వావింశతి పద నాంది ఉన్నది. కొందరు నాందిలో పదనియమము ఉండడమును అంగీకరించరు. పదనియమము లేని నాందీ రచన కూడా కొన్ని నాటకములలో గోచర మవుతున్నది.

మొదట ప్రవేశించిన సూత్రధారుడు ఈ నాంది పఠనము చేస్తాడు. ఈ నాంది అనంతరము వేరొక సూత్రధారుడు ప్రవేశించి రంగ ప్రసాధన పురస్సరముగా భారతీ వృత్తిని ఆశ్రయించి శ్లోకములతో (పద్యములతో) కావ్యార్థమును సూచించాలి. నాట్య సాంప్రదాయికులయిన వారు రంగ భూమియందు ప్రవేశించి సభాపతి ఎదుట నృత్తగీత వాద్య

విశేష ప్రయోగము ఒనర్చుట రంగ ప్రసాధనము అని బడుతుంది. భారతీ వృత్తి స్వరూపము ఇది వరలో నిరూ మయింది. పద్యముల ద్వారా కావ్యార్థమును సూచింప యును. అనే విషయమును దశరూపక కర్త ఈ విధము అంటున్నాడు.

రంగం ప్రసాధ్య మధురైః శ్లోకైః కావ్యార్థసూచకైః
ఋతుం కం చిదుపాదాయ భారతీం వృత్తిమాశ్రయేత్.

కావ్యార్థమును సూచనము చేసే మధుర శ్లోకాల ద్వా రంగప్రసాధనము చేసి అనంతరము ఏదయినా ఋతువు గ్రహించి భారతీ వృత్తిని ఆశ్రయింప వలసినది అని. ఈ చెప్పి ప్రక్రియ అంతా నాటకానికే ముఖ్యమని గ్రహించాలి.

౨. ప్రకరణము

ఉత్పాద్యేనేతి వృత్తేన ధీరశాంత ప్రధానకం
శేషంనాటక తుల్యాంగంభవేత్ప్రకరణం హి తత్,

ప్రకరణములో ఇతివృత్తము కల్పితముగా ఉండాలి. నా కుడు ధీరశాంతుడు ఆముఖము మొదలయిన అంగముల నాటకములో మాదిరే. ఈచెప్పిన విశేష స్వరూప మాత్రము ప్రకరణా సాధారణము. మిగిలినవన్నీ నాటకము వలె దీనిలో యోజనీయములు.

నాటకము ప్రకృతి ప్రకరణాదులు వికృతులు కన ప్రకరణములో కావలసిన అంగములన్నీ నాటకమునుండి దేశ ప్రాప్తములవుతవి. ఈ అతిదేశ విధాన రావడ మ మిగిలిన రూపకాలలో అంతటా గ్రహించాలి. "ధీరశా ప్రధానకం" అనేమూలపదాన్ని అనుసరించి దీనిలో చెప్ప

ఇతరోపదేష్టవ్య ధర్మాంతరములను కూడా గ్రహించాలి. ఈ ధర్మాంతరములు దశరూపకములో ఈవిధముగా ఉపదిష్టము లయినవి.

ప్రకరణములో నిరూపితము కావలసిన ఇతివృత్తములో కాశ్రయమై కల్పితము కావాలి. లోకములో అది సంభావిత సిద్ధి కలది కావాలి. అమాత్యుడు బ్రాహ్మణుడు వైశ్యుడు వీరలలో ఎవరయినా నాయకుడు కావచ్చును. ధీర ప్రశాంతుడుగా ఉండే నాయకుడు ధర్మ కామార్థ తత్పరుడై ఉండాలి, అపాయ సహితుడుగా నిబంధింప బడాలి. ఆతని ప్రయోజన సిద్ధి అపాయ కలితముగా ఉండాలని భావము.

ప్రకరణములో నాయిక మూడు విధాలు. కులస్త్రీ కాని వేశ్యాంగన కాని ఇద్దరూ కాని దీనిలో ఉంటారు. ఇటువంటి నాయికా నిబంధన విశేషమును బట్టి ప్రకరణము కూడా మూడు విధాలుగా ఉంటుందని తెలుసు కోవాలి. గణిక ప్రాకృత భాషిణి కులజ సంస్కృత భాషిణి. భాణము మొదలయినవి కృత్యంతరములకంటె దీనిలోసంధి సంధ్యంగములకు ప్రకృష్టకరణము (ప్రకృష్టముగా ఒనరింప బడుట) ఉంటుంది. అందువలన ప్రకరణ నామము సార్థకము.

౩. భాణము

భారతీవృత్తి భూయిష్ఠం శౌర్య సౌభాగ్య సంస్తవైః
సూచ్యేతే వీరశృంగారౌ విటేన నిపుణోక్తినా.
కల్పితే నేతివృత్తేన ధూర్తచారిత్ర వర్ణనం
ఏకాంకో ముఖనిర్వాహౌ యత్ర భాణః స సమ్మతః.

భాణములో భారతీవృత్తి బహుళముగా ఉండాలి. శౌర్యము సౌభాగ్యమూ సంస్తోయ మానములు కావాలి.

నిపుణవచనములు కల విటుడు వీరశృంగారములను సూచించాలి. దీనిలో ఇతివృత్తము కల్పితము ధూర్తుల చరిత్రము వర్ణితము కావాలి. ఒకటే అంకము ముఖసంధి నిర్వహణ సంధి అని రెండు సంధులే ఉండాలి. తాను అనుభవించిన కథ కాని ఇతరానుభూతేతి వృత్తముకాని దీనిలో ఉండాలి. పాత్రము ఒకటే. విటుడు ప్రవేశించి ఆకాశభాషితముతో వ్యవహరించాలి. గేయపదము మొదలయిన లాస్యాంగములు పదిన్నీ దీనిలో ప్రతిపాదింపబడాలి. గేయపదాదుల లక్షణము ను గ్రంథాంతరములందు చూచుకోవాలి. ఈ భాణములో అభినయ మొనరింప గలిగిన బుద్ధిమంతుడయిన విటుడు కల్పిత వ్యక్తితో వార్తాలాపము ఒనరించుతాడు. రంగభూమిపై వచ్చిన నాయకుడు ఆకాశమును చూస్తూ వింటూ ఉన్నట్లుగా అభినయించుతూ కల్పిత పురుషునితో ఉక్తిప్రత్యుక్తులను జరుపుతాడు. స్వయముగా ప్రశ్నించుతాడు. వారు పలికిన సమాధానమును వినినట్లుగా అభినయించి తానే పలుకుతాడు. వారి ప్రశ్నలను చెప్పి తాను ఉత్తరించుతాడు. ఇటువంటి ఉక్తి ప్రత్యుక్తులకు ఆకాశభాషితము అని పేరు. కాగా ఒకే వ్యక్తి ఇద్దరి కృత్యములనూ ఆచరించుతాడని భావము.

౮. ప్రహసనము

యత్ర సంధ్యంగ వృత్త్యంగ వర్ణనం భాణవన్మతం
హాస్యో రసః ప్రధానం స్యాద్బవేత్ప్రహసనం హి తత్.

ప్రహసనములో కూడా సంధ్యంగములు వృత్త్యంగములు లున్నూ భాణములో మాదిరిగా వర్ణింపబడాలి. దీనిలో హాస్యరసము ప్రధానము, హాస్య వచనములు ఇక్కడ ప్రచు

రముగా ఉంటవి కాబట్టి ఇది ప్రహసన మవుతుంది. ప్రహసనము మూడు విధాలు. శుద్ధము వైకృతము సాంకీర్ణమూ అని.

శుద్ధము:— పాషండ విప్రప్రభృతి చేటీ చేట సమాకులం
వేషభాషాది సహితం శుద్ధం హాస్య వచోన్వితం.

వేదనిందకు లయిన పాషండులు శ్రోత్రియులుగా కనబడే విప్రులు మొదలయిన వారు శుద్ధ ప్రహసనములో ఉంటారు. ఇది చేటీచేట సమాకులమై ఉంటుంది శ్రోత్రియాదుల వేష భాషాయుతమై ఉంటుంది. హాస్య వచః సమన్వితమై ఉంటుంది. ఇట్టిది శుద్ధ ప్రహసనము.

వైకృతము;— కాముకాదివచోవేషైః షండ కంచుకి తాపసైః
ప్రహాసాభినయప్రాయం వైకృతం తత్రప్రకీర్త్యతే.

వైకృత ప్రహసనములో నపుంసకులు కంచుకులు తాపసులున్నూ కాముకాదుల వచోవేషాదుల్ని కలిగి ఉంటారు. ప్రహసింపదగు అభినయము దీనిలో ప్రధానముగా ఉంటుంది. ఇట్టిది వైకృతము.

సంకీర్ణము;— యద్వీథ్యంగైః స్సమాకీర్ణం సంకీర్ణం ధూర్తసంకులం.

ఉద్ఘాత్యకము మొదలయిన వీథ్యంగములతో సమాకీర్ణము ధూర్తులయిన చోర ద్యూతకరాదులతో సంకులముగా ఉండే ప్రహసనము సాంకీర్ణము.

౫. డిమము

యత్ర వస్తు ప్రసిద్ధం స్యాత్ వృత్తయః కైశికీం వినా
నేతారో దేవగంధర్వయక్షరక్షోమహోరగాః
భూతప్రేతపిశాచాద్యాః షోడశాత్యంతముద్ధతాః
హాస్యశృంగారరహితా రసా రౌద్రప్రధానకాః
చత్వారోంకాః సంధయశ్చ చత్వారో మర్శవర్జితాః

మాయేంద్రజాల సంగ్రామ సూర్యచంద్రగ్రహోదయః
శేషం నాటకవత్సర్వం స డిమః పరికీర్త్యతే.

డిమమునందు వస్తువు ప్రసిద్ధముగా ఉండాలి. కైశికీ వృత్తి తప్ప మిగిలిన వృత్తులన్నీ దీనిలో ఉంటవి. దేవ గంధర్వ యక్షరక్షోమహోరగభూత ప్రేత పిశాచ ప్రముఖులు అత్యంతమూ ఉద్ధతులూ అయిన పదునలుగురు నాయకులు ఉంటారు. దీనిలో రసములు దీప్తములు హాస్య శృంగారములు ఇక్కడ ఉండవు. శాంతమునకు ఇంకు ప్రసక్తియే ఉండదు. దీనిలో నాలుగే అంకములు. నాలుగే సంధులు. విమర్శ సంధి ఉండదు. మాయ ఇంద్రజాలము యుద్ధము సూర్య గ్రహణము చంద్ర గ్రహణము మొదలయినవి దీనిలో నిబద్ధములు కావాలి. పిడుగులు పడుట తోక చుక్కలు రాలుటలు కూడా ఇందు ఉండాలి. మిలిగిన విశేషములన్నీ నాటకములో మాదిరిగానే ఉంటవి. డిమ ధాతువునకు సంఘాతము సమూహము అని అర్థము. కాగా నాయకుల సంఘాత వ్యాపారము దీనిలో ఉంటుంది. కాబట్టి డిమము అని అనడము సముచితముగా ఉంటుందని ధనికాదులు పలుకుతున్నారు.

౬ వ్యాయోగము

యత్ర ఖ్యాతేతివృత్తం స్యాదుద్ధతో నాయకో మతః
గర్భావమర్శరాహిత్యం డిమవద్రసపోషణం
ఏకవాసరకార్యం చసవ్యాయోగో మహారణః

వ్యాయోగములో ఇతి వృత్తము ప్రఖ్యాతమై ఉండాలి. నాయకుడు ద్ధతుడు. గర్భ సంధి విమర్శ సంధి ఉండదు. శాంతశృంగారహాస్య రహితములు రౌద్ర ప్రధానకములూ

అయిన ఆరు రసాలు దీనిలో ఉండాలి. కైశికి తప్ప మిగిలిన వృత్తులు ఉంటవి. స్త్రీ నిమిత్తముగా ఉండని మహాయుద్ధము ఇక్కడ ఉండాలి. ఒకనాటి కార్యమిక్కడ వర్ణితము కావాలి. ఇటువంటి ఈ విశేషాలలో ఇది డిమతుల్యము. అనేకులు ఇక్కడ కూడుకొని ఉంటారు. కాబట్టి వ్యాయోగమనే నామము సార్థకము. "వ్యాయుజ్యంతే బహవః పురుషాః ఇతి వ్యాయోగః" అని వ్యుత్పత్తి. దీనిలో అనేక పురుషులు సమావేశము పొందుతారు అని భావార్థము.

౭ సమవకారము

యత్రాముఖం నాటకవత్సంధయో మర్శవర్జితాః
నేతారో ద్వాదశ పృథక్ఫలా దేవాసురాదయః
వీరప్రధానాశ్చ రసాః త్రయోంకా స్తేషు చ క్రమాత్.
వస్తుస్వభావదైవాదికృతాః స్యుః కపటాస్త్రయః
పురరోధరణాగ్న్యాదినిమిత్తా విద్రవాస్త్రియః
ధర్మార్థకామానుగుణాస్త్రిస్త్రః శృంగారరీతయః
ప్రథమేంకే నిబద్ధవ్యా కథా యామత్రయావధిః
యామావధిః ద్వితీయేంకే తృతీయేంకేర్ధయామికా
అసౌ సమవాకారః స్యాద్వీథ్యంగైః కైశ్చిదన్వితః

సమవకారములో ఆముఖమును నాటకములో వలె రచించాలి. రూపకములలో ఆముఖ రచన అత్యంతమూ ఆవశ్యకము. దీనిలో విమర్శ సంధి ఉండదు. మిగతా నాలుగు సంధులూ ఉండాలి. దేవాసురాదు లయిన నాయకులు దీనిలో పన్నెండుగురు ఉంటారు. వీరందరూ ఒకే కార్యమును అనుసరించి ప్రవర్తించే వారయినా వేరు వేరు ఫలములు కలవారుగా ఉండాలి. వీరరసము ప్రధానము. శృంగా

శాది రసాలు అంగములుగా ఉండాలి. మూడె అంకములు ప్రథమాంకములో ముఖ ప్రతిముఖ సంధులను ద్వితీయాంకములో గర్భసంధిని తృతీయాంకములో నిర్వహణ సంధిని నిబంధించాలి. అంకత్రయములోనూ మూడు కపటములను మూడు విద్రవములను మూడు శృంగారములనూ నిబంధించాలి. కపట మనగా మోహము. మోహాత్మకముగా ఉండే భ్రమ కపటమునకు స్వరూప మని పెద్దలు చెపుతున్నారు. ఇది నిమిత్తాను రోధమున మూడు విధముల వుతుంది. వస్తు స్వభావ కపటము దైవిక కపటము శత్రుజ కపటము. క్రూరమృగములు మొదలయిన వాని వలన కలిగేది మొదటిది. వహ్ని వర్ష వాతాది సంభవము రెండవది సంగ్రామాది సముద్భవము మూడవది. కపటము వలన కలుగు పలాయనమునకు విద్రవము అనిపేరు. విద్రవము త్రివిధము. శత్రువులు పట్టణమును ముట్టడించుట యుద్ధము మొదలగు నది మొదటిది ఇది శత్రువుల వలన కలుగు తుంది. అగ్ని మొదలయినవి నిమిత్తముగా కలిగేది రెండవ విద్రవము, ఇది దైవికము. సర్ప వ్యాఘ్రాదులు నిమిత్తముగా కలిగే విద్రవము మూడవది, ఇది వస్తు స్వభావ కృతము.

ధర్మశృంగారము అర్థ శృంగారము కామ శృంగారము అని శృంగారము మూడు విధాలు. దానిని బట్టి శృంగార రీతులున్నూ మూడువిధాలు. యథాక్రమముగా అంకత్రయములో కపట త్రయ విద్రవ త్రయ శృంగార త్రయమును వర్ణించాలి, ఒకకపటము ఒకవిద్రవము ఒకశృంగారమూ ప్రత్యంకములోనూ ఉండాలని భావము. ప్రథ

మాంకములో మూడుజాములు అవధిగా కల కథను నిబంధించాలి. రెండవ అంకములో ఏకయామావధిక కథను. మూడవ అంకములో అర్ధయామిక కథను నిబంధించాలి. ఈ సమవకారములో యథాలాభముగా ఉద్ఘాత్యకాది వీథ్యంగములను నిబంధించాలి. దీనిలో అంతటా అర్థములు అవకీర్ణములై ఉంటవి కాబట్టి సమవకారము సార్థకము "సమవకీర్యంతే అర్థా అస్మిన్నితి సమవకారః" అనివ్యుత్పత్తి.

౮. వీధి

యత్రభాణ వదంగానాం క్లృప్తిః వృత్తిస్తు కైశికీ
శృంగారః పరిపూర్ణత్వాత్సూచనీయోఽతిభూయసా
ఉద్ఘాత్యకా దీన్యంగాని సా వీథీ వీథి వన్మతా

వీథిలో అంకముల రచన అంతా భాణములో మాదిరిగా ఉండాలి. అనగా అంకము ఒకటే ఉంటుంది. ముఖసంధి నిర్వహణసంధి అనే సంధులు రెండే ఉంటవి. దీనిలో వృత్తి మాత్రము కైశికి ఉంటుంది. శృంగారమును పరిపూర్ణము గా అత్యధికముగా సూచించాలి. తదితర రసాలను అంగములను అల్పముగా ప్రతిపాదించాలి, ప్రస్తావనా ప్రసంగములో సూచించిన ఉద్ఘాత్యకాద్యంగములను దీనిలో నిరూపించాలి ఈ వీథిలో అంగము లన్నీ వీథిలో వలె పంక్తిగా మార్గ ముగా నిబద్ధము లవుతవి కాబట్టి వీథి అనే నామము సము చితముగా ఉంది. ఇంకా దీనిలో ఒకడె పాత్ర కాని ఇద్దరు పాత్రలుగాని అభినయించుతారు. దీనిలో లాస్యాంగ దశకము ఉన్నాసరే! లేకపోయినా హాని లేదు. అనురాగము కల సామాన్య స్త్రీ కాని పరకీయ కాని ఇక్కడ నాయికగా ఉండాలి. ఇది సంత సారకాయము వలె బహిరంగ వస్తుకము

కాబట్టి కులపాలిక (కులజ) అయిన స్త్రీని నాయికగా చేయరాదు.

౯ అంకము

యత్రేతివృత్తం ప్రఖ్యాతం ప్రధానం కరుణో రసః
స్త్రీణాం విలాసో వాగ్యుద్ధం నేతారః ప్రాకృతానరాః
భాణవత్ సంధివృత్త్యాదిస ఉత్సృష్టోఽంక సంజ్ఞితః

అంకములో ఇతివృత్తము ప్రఖ్యాతము ఉత్పాద్యమునూ కావచ్చు అని కొందరి భావము. కరుణరసము ఇక్కడ ప్రధానము. స్త్రీలవిలాసము అధికము వాగ్యుద్ధము మాత్రము ఉండాలి. ప్రాకృతనరులు నాయకులుగా ఉంటారు ఇంకా మిగిలినసంధి వృత్త్యాదికము అంతా భాణములోవలె ఉండాలి ఈ అంకమనే రూపకము సామాన్యముగా రూపకాలలో నిబంధింప బడే నానాప్రకారార్థ సంవిధాన రసాశ్రయముగా చెప్పబడిన అంకము కాదు. కనుకనే దీనికి ఉత్సృష్టము అని పేరు. ఉత్సృష్టికాంకము అనిన్నీ ధనికాదులు అంటారు.

౧౦ ఈహామృగము

మిశ్రమీహామృగే వృత్తం చతురంకం త్రిసంధికం
మర్త్య దివ్యౌ చ నియమా న్నాయక ప్రతినాయకౌ
ధీరోద్ధతౌ స్త్రియం దివ్యాం హర్తుకామౌ చ కాముకౌ
అవధం యుద్ధమన్యోన్య మాభాసరసయో స్తయోః.

ఈహామృగములో ఇతివృత్తము మిశ్రముగా ఉంటుంది. నాలుగె అంకాలు. మూడె సంధులు. గర్భసంధి విమర్శసంధి ఉండవు. నాయకులు మర్త్యులు దివ్యులుగా ఉంటారు. ప్రతినాయకులున్నూ అట్లాగే ఉంటారు. నాయకుడు దివ్యుడయితే ప్రతినాయకుడు మర్త్యుడు. నాయకుడు మర్త్య

డయితే ప్రతినాయకుడు దివ్యుడు. నాయక ప్రతినాయకులు ఇద్దరూ ధీరోద్ధతులు. కాముకులై దివ్య యువతిని హరించాలని ప్రయత్నించుతారు. వారిద్దరకూ యుద్ధమును దీనిలో వర్ణించాలి. కాని వధ ఎవరికీన్నీ వర్ణింపరాదు. అవధ యుద్ధమన్నమాట. వీరిద్దరూ అనురాగ రహిత నాయిక యందలి అనురక్తులు కాబట్టి వారి రసము ఆభాసరూపము. వీరిద్దరిలో ఏ ఒకరిని కూడా అభిమానింపని దివ్యయువతిని వీరు అపహరించాలని యత్నించుతారు. వీరి యుద్ధము మేక పోతుల యుద్ధము వలె వధరహితము. మృగము వలె అలభ్యగా ఉండే నాయికను నాయకుడు కోరుతాడు కాబట్టి ఇది ఈహామృగము అవుతున్నది.

ఇట్లా పది రూపకములూ నిర్ణీతము లయినవి. ఈ ప్రక్రియ అంతా దశరూపకమును అనుసరించి నట్టిదె కేవలము స్వోపజ్ఞమూలకము కాదు. ఇంకా ఉపరూపకముల స్వరూప విశేషములను గ్రంథాంతరము లందు గ్రహించాలి.

నాటక ప్రకరణము

రస ప్రకరణము

దృశ్య శ్రవ్య భేదము పొందిన సర్వవిధ కావ్యాలకూ రసము ఆత్మ వంటిది. అట్లా జీవిత భూతమయిన రసము యొక్క స్వరూపము ఈ ప్రకరణములో నిరూపిత మవుతుంది. విభావానుభావ సాత్త్విక వ్యభిచారి సామగ్రీ సముల్లాసితమయిన స్థాయిభావము రసము. అని రససామాన్య లక్షణము. స్థాయిగా ఉండే భావము రసమవుతుంది. ఆస్థాయి భావము విభావాది సామగ్రిచేత సముల్లసితము కావాలి. విభావము, అనుభావము సాత్త్వికభావము, వ్యభిచారిభావము అనేవి రససామగ్రి. వీని స్వరూపము మున్ముందు ప్రతిపాదిత మవుతుంది. విభావాదులు సరస కావ్యములో సంగృహీతములు అవుతవి. రంగములో నిపుణుడయిన నటునిచే కూడా ప్రకాశితములు అవుతవి. ఇట్లా కావ్యనాట్యోపాత్తమయిన విభావాది సామగ్రి సహృదయ సామాజికునిచే భావ్యమానము అవుతుంది. వీనిచే సముల్లసితమయిన స్థాయిభావమే రసము. సముల్లాసిత మగుట అంటే ఆస్వాద్యమానము కావడమన్నమాట. నిర్భరానంద సంవిద్రూపమును పొందింప బడడము అనిభావము. సామాజిక నిష్ఠమయిన రత్యాది స్థాయిభావము విభావాది సామగ్రీ వశాన ఆస్వాద్యమానము అయినపుడు రసత్వము పొందుతుందని తాత్పర్యము. ఈవిషయము దశరూపకములో ఈ విధముగా నిరూపితమయింది.

విభావై రనుభావైశ్చ సాత్త్వికై ర్వ్యభిచారిభిః
ఆనీయమానః స్వాద్యత్వం స్థాయిభావో రసః స్మృతః

విభావము, అనుభావములు, సాత్త్వికములు, వ్యభిచారులు వీనిచే స్వాదుత్వమును పొందింపబడిన స్థాయిభావము రసము అవుతుంది. అని భావము. 'స్వాద్యత్వం' అనేచోట 'స్వాదుత్వం' అని కూడా పాఠము ఉన్నది. కేవలమూ అన్నము స్వాదువుగా తినడానికి రుచిగా ఉండదు. కూర పప్పు పులుసు పచ్చడి మొదలయిన వ్యంజన ద్రవ్యముల సంబంధము వలన అన్నములో స్వాదుత కలుగుతుంది. అపుడు అన్నము ఆస్వాద్యమానము అవుతుంది. కేవలస్థాయి స్వాదువుగా ఉండదు. విభావాదుల సంబంధము వలన స్థాయియందు స్వాదుత కలుగుంది. అపుడు స్థాయి ఆస్వాద్యమానము అవుతుంది. అదె రసము. ప్రస్తుతములో రసచర్చ ప్రసక్తము కాబట్టి కొంతిగా రసమును మీమాంసించుతాము.

నాట్యవేదమును ఆవిష్కరింప చేసిన భరతముని సాహిత్యాచార్య మూర్ధన్యుడు. ఆతడు

"విభావానుభావ వ్యభిచారి సంయోగా ద్రస నిష్పత్తిః"

అని రసప్రతీతిని సూత్రించాడు. దీనిని అనుసరించి అనేకులు అనేకవిధాల రసవాదములను ఆవిష్కరించారు. వానిలో ప్రధానములయినవి నాలుగు వాదాలు. భట్టలోల్లటుడు శ్రీశంకుకుడు భట్టనాయకుడు అభినవగుప్త పాదాచార్యుడు అనేనలుగురూ రససూత్రమును వ్యాఖ్యానించారు, వానిలో భట్టలోల్లటుడు మీమాంసకుడు. శ్రీశంకుకుడు తార్కికుడు భట్టనాయకుడు సాంఖ్యవాది. అభినవగుప్త పాదాచార్యుడు ఆలంకారిక మూర్ధన్యుడయిన సాహిత్యవేది. ఈవాదాలలో శ్రీమదభినవగుప్త పాదాచార్యుని మతమె సిద్ధాంతమతము. సాహిత్యకారులు అందరూ దీనినే ఆధారంగాచేసికొని తమ

గ్రంథాలను ప్రసరింప చేసారు. విద్యానాథుడుకూడా రసవాదములో అభినవ గుప్తానుయాయి.

భట్టలోల్లటునివాదము

భరతుని సూత్రములో "సంయోగాత్, నిష్పత్తిః" అని రెండు పదాలు ఉన్నవికదా! ఉత్పత్తి వాది అయిన ఈలోల్లటుడు ఈరెండు పదాలకున్నూ తన వాదానుకూలముగా అర్థము చెప్పుకొంటాడు. విభావాదుల సంయోగమువలన రసము నిష్పన్నమవుతుంది అనే సూత్రార్థములో విభావాదులు హేతువులని రసము కార్యమని స్పష్టము. విభావసంయోగము వలన అనుభావ సంయోగము వలన వ్యభిచారి సంయోగము వలన రసము నిష్పన్నమవుతుంది, విభావానికి రసానికిన్నీ ఉత్పాద్యోత్పాదక భావ సంబంధము ఉన్నది. విభావాదులు ఉత్పాదకములు. రసము ఉత్పాద్యము. అనుభావాలకు రసానికీ గమ్య గమక భావ సంబంధము ఉన్నది. అనుభావములు గమకాలు. రసము గమ్యము. వ్యభిచారులకు రసానికి పోష్య పోషక భావ సంబంధము ఉంది. వ్యభిచారులు పోషకములు రసము పోష్యము. కాగా రసము విభావాల వలన ఉత్పన్నమవుతుంది. అనుభావాల వలన గమ్యము అవుతుంది. వ్యభిచారుల వలన పోష్య మవుతుంది. అని భావము. దీనిని శృంగారరసములో ఈ విధముగా సమన్వయించి చూచుకోవాలి. లలనాదులు ఆలంబన విభావాలు. వీని వలన రత్యాదిస్థాయి ఉత్పన్న మవుతుంది. ఉద్యానమంద మారుతాదులు ఉద్దీపన విభావాలు. వీనివలన స్థాయి ఉద్దీపిత మవుతుంది. కటాక్ష భుజక్షేపణాదులు అనుభావాలు వీనివలన రతి ప్రతీతి యోగ్యము అవుతుంది. ఉత్కంఠ మొదలయినవి

వ్యభిచారి భావాలు వీనివలన రతిపరి పుష్టము అవుతుంది. ఈవిధముగా విభావాదుల వలన ఉత్పన్నమై ప్రతీతమై పుష్టమ యిన రతి శృంగారరసము అవుతున్నది; ఈరసానికి రామాది నాయకులు ఆశ్రయులు. వారిరతి భావమే కావ్యనాట్యాలలో అభిధావృత్తిచేత చెప్పబడుతున్నది కాబట్టి అభిధావృత్తినిబట్టి ఈ రసము వారిదే అని నిశ్చితమవుతున్నది. నాట్యమును అనుసరించి అభినేయములో కూడా ఈ రసము ఉన్నదని అంగీకరించవచ్చు. నటుడు రామాదుల తుల్య రూపత్వమును అనుసంధానించుతున్నందువలన రసము నటుని యందు ఉన్నదని సామాజికులు ఆరోపించుతున్నారు. ఇట్లా ఆరోప్యమాణమయిన ఇది సామాజికులకు చమత్కార హేతువు అవుతున్నది.

శ్రీశంకుకుని వాదము

విభావాదులకు రత్యాది భావాలకూ అనుమాప్యానుమాపక భావసంబంధము ఉన్నది. విభావాదులు అనుమాపకములు. రత్యాదులు అనుమాప్యములు. ఇట్లా అనుమీయమానములు అవుతూఉన్న రత్యాదిస్థాయి భావములె రసములు. అనుమాపకములయిన విభావాదుల సంబంధము వలన రసానుమితికలుగుతున్నది. లోకములో సామాన్యముగా నాలుగు విధాల ప్రతీతులు ఉంటవి. చిత్రతురగమును చూచేటప్పుడు చతుర్విధ ప్రతీతులకంటె విలక్షణమయిన ప్రతీతి కలుగుతుంది. నటుని చూచినప్పుడు కూడా విలక్షణ ప్రతీతి ఉదయించుతుంది. నటుడు అభినయములో దృఢాభ్యాసము కలవాడు కాబట్టి విభావము అనుభావము వ్యభిచారి అనే త్రయము ఆతనిలో వాస్తవంగా లేకపోయినా గోచరమవు

తుంది. ఆతడు ప్రదర్శించే రోమాంచాదులు కృత్రిమములై అయినా కృత్రిమములుగా తలచబడవు. ఇటువంటి విభావాదుల వలనఆతనియందు రత్యాదిస్థాయిఉన్నట్లు ఊహింపబడుతుంది. ఈ అనుమానమె చమత్కార రూపమయిన చర్వణ. ఈచర్వణలో విషయముగా ఉన్న స్థాయిభావమె రసము. సామాజికులె ఈచర్వణ కలిగి ఉన్నారు కాబట్టి రసము వారియందె ఉంటుందని వ్యవహారము. ఇక్కడ ఉన్న స్థాయ్యనుమానము ఇతరానుమానాలవంటిది కాదు. ఇతరానుమానాలు చమత్కారకములు కాకపోవచ్చు కాని ఇది మాత్రము వస్తు సౌందర్య బలము వలన రసనీయమై చమత్కారకము అవుతుంది.

భట్టనాయకునివాదము

విభావాదులకు రత్యాదిభావాలకూ భోజ్య భోజక భావ సంబంధము ఉన్నది. విభావాదులు భోజకములు. రసము భోజ్యము. విభావాది సంబంధము వలన అంటే భోజ్య భోజక భావసంబంధము వలన రసానికి నిష్పత్తి అనగా భుక్తి కలుగుతుంది. శబ్దాత్మకముగా ఉండే కావ్యములో మూడు వ్యాపారములు ఉన్నవి. అభిధాయకత్వము భావకత్వమూ భోజకత్వమూ అనివీటినే అభిధ భావన భోగీకృతి అంటారు. అభిధ వాచ్యార్థవిషయముగా ఉంటుంది. భావనావ్యాపారము రసాదులను విషయముగా చేసికొనిఉంటుంది భోజకత్వమనే భోగీకృతి సహృదయులను విషయముగా చేసికొని ఉంటుంది. భావకత్వానికే సాధారణీకరణము అనిపేరు. ఆవ్యాపారము చేత విభావాదులు స్థాయి అన్నీ కూడా సాధారణముగా చేయబడుతవి. అంటే ఒకవ్యక్తికి సంబంధించినవి అని కాకుండా అందరకూ

సంబంధముచేవిగా సర్వ సామాన్యములుగా చేయబడుతవి. సీతాదివిశేషములు అన్నీకూడా ఆయావిశేష ధర్మాలను పరిత్యజించుకొని సాధారణముగా కామినీత్వాది సామాన్య రూపముగా ఉపస్థితములు కావడమునకు సాధారణీకరణము అని పేరు. అభిధావ్యాపారముచేత సీతారామాది పదార్థములు గోచరములు కావడము భావకత్వ వ్యాపారముచేత విభావాదులు సాధారణీకృతములు కావడమూ జరుగుతుంది. ఆతరువాత భోజకత్వ వ్యాపారము కూడుకొనగానే రత్యాదిస్థాయి భావము భుజ్యమానము అవుతుంది. ఈస్థాయి భోగములో రజస్తమోగుణములు తిరస్కృతములు అవుతవి. సత్వగుణోద్రేకము కలుగుతుంది. దానివలన ఆనందము ప్రకాశించుతుంది. ఆనంద స్వరూపమయిన స్వసంవేదనము సిద్ధమవుతుంది. ఇట్లా సహృదయుల చేత రత్యాది స్థాయి భావము ఆస్వాదింప బడుతుంది. ఈరీతియొక్క ఆస్వాదమె రసనిష్పత్తి.

అభినవగుప్తుని వాదము

శ్రీమదభినవగుప్తపాదాచార్యుడు ఆ కాలంనాటికే మూర్ధన్యుడు. ఈతని వాదమె నేటివరకు సిద్ధాంతమై నిలిచిఉంది. ఆవాదసారమును ఇట్లా గ్రహించాలి. రసాలకు విభావాదులకూ వ్యంగ్య వ్యంజక భావ సంబంధము ఉన్నది. విభావాదులు వ్యంజకములు రసములు వ్యంగ్యములు. విభావాదుల సంబంధము వలన రసము నిష్పన్నమవుతుంది అంటే అభివ్యక్తము అవుతుందన్నమాట. ఈ విషయమును ఇట్లా విపులముగా గ్రహించాలి. లోకములో స్త్రీ ఆలంబన కారణము. చంద్రికాదులు ఉద్దీపన కారణాలు. అశ్రుపాతాదులు మొదలయినవి కార్య

ములు. చింతాదులు సహకారులు వీనివలన రతిభావము ఉన్నట్లుగా అభ్యూహించడములో పరిశీలన పాటవము కలిగిన లోక ప్రవృత్తినిఎరిగిన సామాజికులకు అనుభవము ఉంటుంది. అటువంటి సామాజికుల హృదయంలో రత్యాదిభావము సంస్కార రూపముగా అంతఃస్థితమై ఉంటుంది. కావ్యములో కాని నాట్యములో కాని ఈ చెప్పిన కారణాదులు తమ: కారణత్వాదులను పరిత్యాగము చేసికొంటువి. కారణములందు విభావనము కలుగగానే కారణత్వముపోయి విభావాది వ్యవహారము కలుగుతుంది. కార్యములలో అనుభావనము కూడుకొనగానే కార్యత్వముపోయి అనుభావ వ్యవహారము కలుగుతుంది. సహకారులందు సంచారణము కూడుకొనగానే సహకారిత్వము పోయి సంచారి వ్యవహారము కలుగుతుంది. ఆసమయములో ఒకసంబంధ స్వీకార విశేషము కాని సంబంధ పరిహార విశేషము కాని ఏమీగోచరము కాదు. సీతాదులు కామినీత్వాది సామాన్యరూపాన గోచరము లవుతారు. ఆసమయములో అంతఃస్థితమయిన రత్యాది స్థాయి అభివ్యక్తము అవుతుంది. అట్లా అభివ్యక్తమయిన రత్యాదికమె రసము. మెదటగా కావ్యపదాల వలన అయా అర్థోపస్థితి కలగడము; అనంతరము యథాస్థితముగా ఉన్న విభావాదుల వాక్యార్థబోధ. అప్పుడే సాధారణ్యము కలుగగానే రత్యాదులకు అభివ్యక్తి కలుగుతుంది. ఈఅభివ్యంగ్యమయిన స్థాయి విభావాది సముల్లసితము అయినది కాబట్టి రసము అవుతున్నది

ఈనాలుగు మతాల సారమును ఈ విధముగా సంధిరూపము చేసికోవచ్చు. విభావాదులకు రసమునకూ ఉన్న ఉత్పాద్యో

తద్వారక భావసంబంధము వలన రసమునకు ఉత్పత్తి కలుగుతుంది అని భట్టలోల్లటుడు, అనుమాప్యానుమాపక భావ: సంబంధమువలన రసమునకు అనుమితి కలుగుతుంది. అని శ్రీశంకుకుడు, భోజ్య భోజక భావసంబంధము వలన రసమునకు భుక్తి కలుగుతుంది. అని భట్టనాయకుడు వ్యంగ్య వ్యంజక భావసంబంధము వలన రసమునకు అభివ్యక్తి కలుగుతుంది. అని అభినవగుప్తపాదులు అంగీకరించుతున్నారు. ఇంకా రసవిషయములో చాలా వాదాలు ఉన్నవి. ఆ వాదముల ప్రదర్శనము ఇక్కడ బరువు అవుతుందని నిరూపించడము లేదు.

స్థాయి భావము

విభావాది పరిపుష్టమయిన స్థాయిభావము రసమవుతుంది. అని ఇంతవరకు నిరూపితాస్పము భావానికి స్థాయిత్వము అంటే ఏమిటి? తెలియవలసి ఉన్నది. అందులోనూ ముందుగా భావ స్వరూపమును గుర్తించాలి. పిమ్మట స్థాయిత్వమును గ్రహించి నిర్ణయించుకోవాలి. సంస్కారము అనే పేరుగలిగిన సామాజిక మనోవికారమునకు భావము అని పేరు. కావ్యములో నాట్యములో రామాదుల సుఖదుఃఖములు నివేదింపబడుతూ ఉంటవి. ఆ సుఖదుఃఖాదులను భావించుతూ సహృదయుడు సామాజికుడు వానిని తన అనుభూతికి అందించుకుంటుంటాడు. ఆ అనుభవము వలన వాసనారూపమయిన సంస్కారము వానిలో కలుగుతుంది. అదే భావము. తద్భావభావనము భావమవుతుందని సారము. సామాజికులయిన భావకులచిత్తము రామాదుల సుఖదుఃఖాది భావనము చేత భావితమవుతున్నది.

ఈ భావితము అయిన భావము రెండువిధాల ఉంటుంది. ఒకటి సన్నిహితము వేరొకటి వ్యవహితము. మొదటిది వస్త్రములో తంతువు వలె ఉంటుంది. దారములో వస్త్రముకంటె ఆకారమాత్రములోనే తేడా ఉంటుంది అట్లాగే రసములో స్థాయిభావము ఆకారమాత్రములోనే వ్యవహితముగా ఉంటుంది కాని మిగతా అంతా ఒకటే, కాబట్టి స్థాయి రసానికి సన్నిహితము. బాగా ప్రకర్ష కలిగి రసత్వమును పొందే భావము స్థాయి అవుతుందని పెద్దలున్నూ చెపుతున్నారంటే బాగా సన్నిహితత్వమును నిరూపించుతున్నారన్నమాట.

వ్యవహితముయినరీతిని విభావాదులలో సమన్వయించుకోవాలి. రసానికీ విభావాదులకున్నూ మధ్యలో భావాంతరము వ్యవధానము సంపాదించేదిగా ఉంటుంది. విభావాదులెపుడున్నూ స్థాయిద్వారా రసోల్లాసకములు అవుతూఉంటవి. కాగా ఇంతకూ ఇది సారాంశముగా తేలుతుంది. సామాజికుల మనోవికార రూపము రసానికి సన్నిహిత పూర్వావస్థావిశేషమూ అయినట్టిదిస్థాయిభావమన్నమాట. రామాదుల సుఖదుఃఖాదిభావితమయిన భావము సజాతీయ విజాతీయాభిభూతముకాకుండా రసానుభవపర్యంతమూ ఉండేది అయినట్లయితే స్థాయిభావము అవుతుంది. దశరూపకములో కూడా ఇట్లాగే అంగీకృతమయింది. సజాతీయ భావముల చేతగాని విజాతీయ భావముల చేతగాని తిరస్కృతము కాకుండా రసీభావం కలిగే వరకూ ఉండే భావము స్థాయి అవుతుంది అని అక్కడి భావము.

ప్రకృతభావానికి సజాతీయ భావములు కొన్నీ విజాతీయ భావములు కొన్నిన్నీ ఉంటవి. ఒక నాయికయందు ఒక

నాయకునకు ఉన్న రతిభావానికి ఇతర నాయికల యందలి రతిభావము సజాతీయ భావము అవుతుంది. సమానకోటికి సంబంధించిన భావాలు సజాతీయములన్నమాట. అసమానకోటికి సంబంధించినవి విజాతీయములు. రతిభావానికి బీభత్స రస సంబంధ భావాలు విజాతీయములవుతవి. ఇటువంటి సజాతీయములు కాని విజాతీయములు కాని భావాన్ని తిరస్కరించకుండా కప్పిపుచ్చకుండా ఉండాలి. దీనిని ఇట్లా ఉదాహరణములో గ్రహించవచ్చు.

నరవాహనదత్తునకు మదనమంజూషపై ఉత్కటానురాగమున్నది. ఇంకా తదితర నాయికలందున్నూ ఒక్కొక విధమయిన అనురాగభావము ఉన్నది. అయినా ఆ ఇతర నాయికానురాగాలు మదనమంజూషా విషయకమయిన అనురాగమును తిరస్కరించ లేదు. ఇతర నాయికానురాగాలు అన్నీ సజాతీయములు. ఇట్లా సజాతీయములచేత ప్రకృతానురాగము అభిభూతము కాకుండా ఉంది. కాబట్టి సజాతీయానభిభూతత్వము సిద్ధమయింది. మాలతియందు మాధవునకు అనురాగం ఉంది. ఇది బాగా సముత్కటమయిన అనురాగము. మాలతి తనకు లభించదని ఒకప్పుడు మాధవుడు మహాశ్మశానంలో తిరుగాడుతున్నాడు. అప్పుడు అక్కడ అతనికి పీనుగులు పిశాచములకు సంబంధించిన ఏవగింపు కలగజేసే అంశాలు ఎన్నో గోచరించినవి. అపుడు ఉదయించిన భావాలు బీభత్సమునకు సంబంధించినవి కాబట్టి ప్రకృత శృంగారేతరములు అయినందువలన విజాతీయములు. ఆ విజాతీయ భావములచేత కూడా అతని మాలతీ విషయకమయిన భావము ఏమీ తిరస్కృతము కాకుండా ఉన్నది.

ఈ విషయమును భవభూతి శ్మశానాంకంలో స్పష్టంగా నిరూపించాడు. ఎన్నెన్ని ఇతరభావాలు కలవర పెట్టుతున్నప్పటికి మాధవునకు మాలత్యనురాగమె దృఢ సంస్కారంగా ఉన్నది. ఇట్లా ఆ అనురాగము విజాతీయ భావానభిభూతము.

ఈరీతిగా విరుద్ధా విరుద్ధావిచ్ఛిన్న స్వాభావకముగా భావము ఉన్నప్పుడు అది స్థాయి అవుతుంది. సముద్రము తనలో చేరిన మధురమయిన నదీజలమును ఇతర జలమునూ అంతనూ ఉప్పగానే చేస్తుంది. అన్నిటికి ఆత్మభావమును సంపాదిస్తుంది. అట్లాగే స్థాయికూడా తనకు ఇతరములయిన సజాతీయ విజాతీయముల నన్నిటినీ తనలో కలిపివేసి కొంటుంది. ఇంకా ఇటువంటి ఈభావము అనుభవపర్యంతమున్నూ ఉండేది కావాలి. సంస్కార రూపముగా ఉన్న ఇది నిరంతర నిధ్యానము వలన విజాతీయ ప్రత్యయము ఏమీలేనిదై భావునకు తన్మయతను ఆపాదించుతుంది. అంతపర్యంతమూ ఇది ఉన్నప్పుడు స్థాయి అవుతుందని గ్రహించాలి.

రసములు

రసములు తొమ్మిది ఇక్కడ నిర్దేశింపబడుతున్నవి. రసముల సంఖ్యలోనేక వాదాలు ఉన్నవి. శృంగారము ఒక్కటే రసము. ఇతరములు ఏవీ రసములె కావు. వీరాదులు రసములు. అని అనడము మిథ్యాప్రవాద అని భోజదేవుని భావము. అద్భుతమొ రసమంటె రసము. ఇతరములకు రసత్వమేమిటి? అని నారాయణపండితుడు అంటాడట. భక్తిరసమొ వాత్సల్య రసము; అని భక్తిప్రియుల వాదము. శృంగార వీర రౌద్ర బీభత్సములు నాలుగే అసలు రసాలు అని కొందరంటారు. శాంతము ఒక్కటే స్వభావరసము. తక్కినవి ఇటువంటివి కావు.

కనుక సిద్ధరసము శాంతము ఒక్కటే అని మరికొందరి నిశ్చయము. అసలు శాంతము రసము కానేకాదు. తదితరములయిన శృంగారాదులె రసములు. అవి ఎనిమిది. "అష్టౌ నాట్యే రసాః" అని అంటున్నారు కదా! అని ధనికాగుల ఊహ. శాంతముతో కలిపి రసములు తొమ్మిది అని అనవలసిందే అని కొందరి ఉపపాదన. వత్సల రసమును కూడా కలుపుకొంటే పదిరసాలు అవుతవి. అందువలన వత్సలరసము కూడా రసమె అని అన్యభావము. భక్తినికూడా రసాలలో పరిగణించాలి. దీనినికూడా కలిపితే రసాలు పదకొండు అని ఒక ఊహ. స్నేహముకూడా రసమె కాబట్టి దానితో రసాలు పన్నెండు. అని ఇంకొక భావము. ఆ ఏవయినా రసాలు కావచ్చు. రస్యమానములన్ని రసములె. కాబట్టి "అనంతా వైరసాః" అని కూడా కొందరి భావము. ఇట్లా రసవిషయమై అనేక విప్రతిపత్తులు ఉన్నవి. ఈ న్యూనాధిక సంఖ్యా నివారణమునకు రసాలను విభాగించి పరిగణించాలి.

౧. శృంగారము ౨. హాస్యము ౩. కరుణము
౪. రౌద్రము ౫. వీరము ౬. భయానకము
౭. బీభత్సము ౮. అద్భుతము ౯. శాంతము.

అని రసములు తొమ్మిది. ఈ విధముగా ప్రామాణికులయిన పెద్దలు నిర్ణయించారు. ఈ రసాల వరసను చెప్పడములో కూడా అభిప్రాయ విశేషాలు ఉన్నవి. కొందరు ఈ వరుసలో వీనిని నిర్దేశించడము లేదు. రస్యమానావస్థలో రసాలన్ని ఏకాస్వాదజనకములు కాబట్టి ఒకటి ముందు మరొకటి తరువాత అనే విధానము అక్కరలేదు. దేనిని ముందు చెప్పినా చెప్పవచ్చును. అని కొందరి ఆలంకారికుల

ఊహగా కన్పించుతుంది. మరికొందరు క్రమవిన్యాసములో అభిప్రాయ విశేషమునున్నా ఊహించుతున్నారు. సత్వరజస్తమోగుణముల యొక్క పరస్పర సంబంధము వలన తొమ్మిది భేదాలు సిద్ధములవుతవి. అట్లాగే జాగ్రత్స్వప్నసుషుప్త్యవస్థల పరస్పర సంబంధంలోనూ నవభేదసిద్ధి ఉంది. సాత్విక సాత్వికము సాత్విక రాజసము సాత్విక తామసము ఈవిధంగా ఇతర భేదాలున్నా. వీనికీ రసాలకూ సంబంధం ఉంది. సాత్విక సాత్వికాదికంగా పరిగణించడములో క్రమౌచిత్యం ఉన్నది. కాబట్టి రసాలను కూడా ఒకక్రమంలో సంఖ్యానించడము మంచిది. కాగా శాంత శృంగార కరుణములు హాస్యాద్భుత భయానకములు వీర బీభత్స రౌద్రములూ అనే క్రమిక రీతి సుసంగతంగా ఉంటుందని సాహిత్యసార కారాదుల ఆశయము.

ఇక్కడ నిర్దేశించిన క్రమంలోనూ ఒక విశిష్టభావము ఉన్నది. ధర్మార్థ కామ మోక్షములనే చతుర్వర్గములో కామమనేది సర్వప్రాణి సులభము. సర్వహృదయంగమము. కాబట్టి శృంగారమును మొదట నిర్దేశించడము సముచితము. హాస్యము శృంగారజన్యము కాబట్టి తదనంతరము నిర్దేశించాలి. ఏతద్విరోధి అయిన కరుణమును అనంతరము పరిగణించాలి. తరువాత కరుణములో నిమిత్తభూతమయిన అర్థప్రధానమయిన రౌద్రమును చెప్పడము ఉచితమే. అర్థ కామములు రెండూ ధర్మమూలములుగా ఉండాలి. కాబట్టి ధర్మప్రధానమయిన వీరమును దాని తరువాత నిర్దేశించాలి. వీరమనేది భయపడిన వారికి అభయమివ్వడమే సారముగా కలిగి ఉంటుంది. అందువలన వీరము తరువాత భయానక గణనము యుక్తము. దాని పిమ్మట భయానక కారణ భూత

మయిన బీభత్సము తగి ఉంటుంది. వీరాక్షిప్తములయిన భయానకాదులను చెప్పిన తరువాత వీరరస ఫలభూత మయిన అద్భుత గణనము అర్థముగా ఉంటుంది. ఇట్లా త్రివర్గ ఫలకములయిన రసాలను గణించిన తరువాత మోక్ష ఫలకమయిన శాంతమును చెప్పాలి. ఇట్లా ఈ ఉద్దేశక్రమము నకు ఉపపత్తిని అభ్యూహించాలి. ఈ విధంగానే అభినవగుప్త పాదులున్నూ అంగీకరించారు. తదభిప్రాయానుసారముగా రసములు ఇట్లా ఉద్దిష్టములయినవి. ఈ చెప్పిన రసాలకు వరుసగా ఇవి స్థాయిభావములు.

౧. రతి ౨. హాసము ౩. శోకము
౪. క్రోధము ౫. ఉత్సాహము ౬. భయము
౭. జుగుప్స ౮. విస్మయము ౯. శమము

అనే ఈ తొమ్మిదిన్నీ స్థాయి భావాలు. ఇవి తొమ్మిదే ఎందుకు కావాలి? అనేది ఇతర గ్రంథాల్లో దర్శించాలి.

విభావము

విభావము అనుభావము సాత్త్వికభావము సంచారిభావము అనే ఈ నాలుగూ రససామగ్రి. వాని నిరూపణము ఇప్పుడు ప్రసక్తము. ముందుగా విభావ విభాగ ప్రదర్శనము సంగత ముగా ఉంటుంది. "విశేషేణ భావ్యతే ఇతి విభావః" "విశేషేణ భావయతీతి విభావః" అని విభావ పదానికి రెండు వ్యుత్పత్తులు ఉన్నవి. విశేషముగా భావింప బడేది కాబట్టి విభావము అని ఒక అర్థము. బాగా స్థాయిభావమును భావింపచేసేది కాబట్టి విభావము అని వేరొక అర్థము. ఈ విభావము రసోత్పాదనములో కారణముగా ఉంటుంది. ఇక్కడ రసము అంటే లౌకికమయిన రత్యాదిస్థాయి భావ

ముగ్రహించాలి. అది రసము కాబోతున్నది కాబ
రసమని వ్యవహృతము కావడము అసముచితం కాదు. ముఖ్య
రసానికి ఉత్పత్తి వినాశాలు అంటూ ఏవీ ఉండవుకదా! ఇట్టి
రసోత్పాదనములో కారణముగా ఉండే విభావము ఆలంబ
విభావమని ఉద్దీపన విభావమని రెండు విధాలు. ఆలంబ
విభావము రసములో సమవాయి కారణముగా ఉంటుంది
మన్ను ఘటములో తంతువులు పటములో సమవాయి కా
ణాలు. ఘటము మన్నును అవలంబించి ఉంటుంది. రసమ
ఏవిభావమును అవలంబించి ఉంటుందో అది ఆలంబన విభా
వము. నాయికా నాయకులను అవలంబించి శృంగార రసమ
ఉంటుంది కాబట్టి వారు ఆలంబన విభావము. మిగిలిన కార
జాతమంతా ఉద్దీపన విభావము. రసమును ఉద్దీపింప చేయ
డానికి ఇది సమర్థము కాబట్టి సార్థకము. ఘటములో కుల
లుడు నిమిత్త కారణము శృంగార రసములో విశిష్టములయి
దేశకాలాదులు ఉద్దీపన విభావములవుతవి. ఈ ఉద్దీపన విభా
వము నాలుగు విధాలు. శృంగార తిలకములో ఈవిధంగా
గానే నిరూపించారు. ఆలంబనగుణము, తచ్చేష్ట, తదలంకృ
తటస్థము అని ఉద్దీపనక్రమము చతుర్విధము. రూపము యౌవ
నము మొదలయినవానిని ఆలంబన గుణము అంటారు. యౌవ
నము వలన ఉదయించిన హావ భావాదులు తచ్చేష్టలుగ
చెప్పదగినవి. నూపురము అంగదము హారము మొదలయిన
తదలంకరణము అన్నమాట. మలయానిల చంద్ర చంద
బంభరాదులు తటస్థములయిన ఉద్దీపన విభావాలు. ఈ ఉద్దీ
పన విభావము నాలుగు విధాలనడము శృంగార రస విషయ
ములోనే సుసంగతంగా ఉంటుంది.

అ ను భా వ ము

"అను భావ్యతే ఇతి అనుభావః అనుభావయతీతి అనుభావః" అని రెండువిధాల అనుభావ వ్యుత్పత్తిని చెప్పవచ్చు. రసోచితమయిన స్థాయి భావమును అనుసరించి దానివెంటనే భావింపబడేది కాబట్టి అనుభావము అని ఒక్క అర్థము. స్థాయి భావమును స్వమహిమచేత అనుభవింపచేస్తుంది కాబట్టి అనుభావము అని వేరొక అర్థము. శరీరజన్యములయిన కటాక్ష భుజాక్షేప మందగమనాదులు అనుభావములవుతవి. ఈ అనుభావము రసానికి కార్యభూతము. ఇక్కడ కూడా రసము అంటే స్థాయిత్వ యోగ్యమయిన లౌకికమయిన రత్యాదికము అనే గ్రహించాలి. ఇటువంటి రత్యాదికమునకు కామినీ కటాక్షాదులు కార్యభూతములు అవుతవి. ఇవి ఇట్లా కార్యములుగా ఉండే అభినయాది ద్వారా భావకుల మనస్సులో ప్రతిబింబించుతవి. తరువాత వారి హృదయ స్థాపితమయిన రత్యాది భావమును అనుభవింప చేస్తవి. కాబట్టి అవి అనుభావాలు.

సాత్త్వికములు

సాత్త్వికములు కూడా కటాక్షాదుల వలె కార్య భూతములు అయి భావమును సూచించేవి అవుతున్నవి కటాక్షాదులు సాత్త్వికములూ ఎవరి యందు గోచరములవుతవో వారియందు రత్యాదిభావము ఉన్నదని మనము ఊహించగలము. అందువలన ఇవి భావ సంసూచనాత్మకములన్నమాట. సాత్త్వికములు ఈవిధంగా అనుభావములే అవుతున్నప్పటికి వేరుగా పరిగణించడములో ఒక అసాధారణ కారణం ఉంది. సత్త్వము వలన ఉత్పన్నములగు భావాలను సాత్త్వికములు అని పేరు.

ఇతరగుల సుఖదుఃఖాదులను భావించడములో అంతఃకరణము అత్యంతమూ అనుకూలముగా ఉండడమునకు సత్వము అని పేరు. పరగత సుఖదుఃఖాదులను భావించడము చేత అంతః కరణము భావితమవుతుంది. అదే సత్వము. ఈ సత్వము నిమిత్తముగా ఉండే భావాలు కాబట్టి సాత్వికభావములు అవుతున్నవి. వీటికి అనుభావత్వము ఉన్నప్పటికీ సత్వ జన్యత్వము ఉన్నది కాబట్టి వేరుగా పరిగణనము చేయవలసి వచ్చింది.

ఈ సాత్వికభావాలు ఎనిమిది.

౧. స్తంభము ౨. ప్రళయము ౩. రోమాంచము
౪. స్వేదము ౫. వైవర్ణ్యము ౬. వేపథువు
౭. అశ్రువు ౮. వైస్వర్యము

ఈ ఎనిమిదిన్నీ సాత్వికభావాలుగా పరికీర్తితములు అవుతున్నవి. ఈ స్తంభాదులు ఎనిమిదన్నీ బాహ్యములయిన శరీర ధర్మాలు భౌతికములున్నూ. ఇవి ఆంతరాళికములయిన సాత్వికభావాలను అవగమింప చేస్తవి. కాబట్టి న్యాయంగా ఇవి గ్లాని నిర్వేదాది గమకములె అని అనవచ్చును. స్థాయి భావ సంచారి భావ సంఘము జీవుని మనోమయావస్థను పొంది కారణరూపములయిన ఆంతర సాత్వికములను సంపాదిస్తుందని తత్వము.

ఈ సాత్వికతత్వ కథనంలో అనేక విధములయిన అభిప్రాయాలు ఉన్నవి. కొందరు ఈ విధంగా అంటారు. మానవునకు ఆయిదు దేహాలు. అన్నమయము ప్రాణమయము మనోమయము విజ్ఞానమయము ఆనందమయము అనే సంజ్ఞలతో ఆదేహాలు ఉంటవి. రత్యాదిస్థాయిభావాలు మనోమయవస్తులు. అవి పంచభూతాత్మకమయిన అన్నమయమును

క్షోభింపచేస్తవి. ఇట్లా అన్నమయ క్షోభకమవుతూ ఈరత్యాది గణము, సత్వ గుణాతిశయము ఉన్నందు వలన సత్వము అని చెప్పదగిన ప్రాణమయమును ప్రవేశించి సాత్వికత్వము పొందుతున్నది. అపుడు ప్రాణమయము భూభాగానుగ్రహములో ఉంటే స్తంభము కలుగుతుంది జలభాగానుగ్రహం ఉంటే బాష్పము. తీవ్రమైన తేజస్సు యొక్క అనుగ్రహం ఉంటే స్వేదము. ఆ తేజోనుగ్రహము తీవ్రము కాకపోతే వైవర్ణ్యము. ఆకాశానుగ్రహం ఉంటే ప్రలయమూ కలుగుతుంది. అనిలానుగ్రహము మందముగా మధ్యమంగా ఉత్కృష్టంగా ఉంటుంది. కాబట్టి క్రమంగా రోమాంచము వేపథువు వైస్వర్యము కలుగుతవి ఈరీతిగా ఎనిమిది భావాలు పుట్టడానికి అవకాశం ఉంది ఇంకా ఉండే అభిప్రాయాలకు ఇది అదను కాదు.

వ్య భి చా రు లు

వ్యభిచారి భావాలకే సంచారి భావములని కూడా పేరు. "విశేషేణ అభితః చరంతీతి వ్యభిచారిణః" అని వ్యుత్పత్తి. విశేషముగా అంతటా సంచరించుచుతూ ఉండేవి అని అర్థము ఇవి రసానికి సహకారులుగా ఉంటవి. సముద్రములో తరంగాలు పైకి లేస్తూ క్రిందకు పడుతూ ఉంటవి. అటువంటి మజ్జననిమజ్జనాలద్వారా అవి సముద్రానికి ఉత్కర్షను కలుగజేస్తున్నవి తుదకు సముద్ర రూపమును పొందుతున్నవి. అట్లాగే వ్యభిచారులున్నూ స్థాయిలో నిమగ్నములై ఉన్మగ్నములై స్థాయిని పోషించుచూ ఉంటవి. తుదకు రసాత్మతను పొందుతవి. ఈవ్యభిచారులు ముప్పయిమూడు ఉన్నవి.

౧ నిర్వేదము	౨ గ్లాని	౩ శంక
౪ అసూయ	౫ మదము	౬ శ్రమము

౭ ఆలస్యము	౮ దైన్యము	౯ చింత
౧౦ మోహము	౧౧ స్మృతి	౧౨ ధృతి
౧౩ వ్రీడ	౧౪ చపలత	౧౫ హర్షము
౧౬ ఆవేగము	౧౭ జడత	౧౮ గర్వము
౧౯ విషాదము	౨౦ ఔత్సుక్యము	౨౧ నిద్ర
౨౨ అపస్మారము	౨౩ సుప్తి	౨౪ విబోధము
౨౫ అమర్షము	౨౬ అవహిత్థ	౨౭ ఉగ్రత
౨౮ మతి	౨౯ వ్యాధి	౩౦ ఉన్మాదము
౩౧ మరణము	౩౨ త్రాసము	౩౩ వితర్కము

ఇంకా ఇతరములు ఏవయినా వీనిలోనే అంతర్భవించుతవి. విభావానుభావ వ్యభిచారులకు సంబధించిన ఈవిషయమును కావ్యప్రకాశగ్రంథములో మమ్మటభట్టు ఈవిధముగా నిరూపిస్తున్నారు.

కారణాన్యథ కార్యాణి సహకారీణి యాని చ
రత్యాదేః స్థాయినో లోకే తాని చేన్నాట్య కావ్యయోః
విభావా శ్చానుభావాశ్చ కథ్యంతే వ్యభిచారిణః.

లోకములో స్థాయిత్వ యోగ్యమయిన రత్యాది భావానికి కారణములుగా కార్యములుగా సహకారులుగా ఏవి ఉంటు న్నవో అవే నాట్యములో కావ్యములో సంభావితములై వ్యపదేశింపబడేటప్పుడు వరుసగా విభావములని అనుభావములని వ్యభిచారులని అనబడుతున్నవి. సామాన్యంగా లోకంలో శృంగార ప్రవృత్తి ఉన్న స్థలంలో చూస్తే నాయికా నాయకులు కారణముగానూ, కటాక్ష భుజాక్షేపాదులు కార్యములుగానూ, నిర్వేదాదులు సహకారులు గానూ చెప్పబడుతూ ఉన్నవి. అవే కావ్య నాట్యములలో విభావన

వ్యాపారము ఉన్నందువలన కారణములు విభావములనీ, అనుభావన వ్యాపారము ఉన్నందువలన కార్యములు అనుభావములని, వ్యభిచరణ వ్యాపారము ఉన్నందువలన సహకారులు వ్యభిచారులని ఆయాశబ్దములచే వ్యపదేశ్యములవుతున్నవి అని భావము. ఒకచోట విభావములుగా ఉన్నట్టివి వేరొకచోట అనుభావములు కావచ్చు. సంచారులూ కావచ్చు. అట్లానే ఒకచోట అనుభావాలుగా ఉన్నట్టివి వేరొకచోట విభావములూ కావచ్చు. వ్యభిచారులూ కావచ్చు. అదేవిధంగా ఒకచోట వ్యభిచారులుగా ఉన్నట్టివి వేరొక చోట విభావములు కావచ్చు అనుభావములూ కావచ్చును. అయినప్పటికీ అవి ఏవిషయంలో విభావములుగా అనుభావములుగా వ్యభిచారులుగా ఉంటున్నవో ఆ విషయములో అవి నియతములు గానే ఉంటవి. అటువంటి నియతవ్యవస్థను అనుసరించియే మమ్మటుడు కారణకార్య సహకారులు విభావానుభావ వ్యభిచారి శబ్ద వ్యపదేశ్యము లవుతవని నిరూపించినాడు.

రసాభాస

“ఆ ఈషత్ భాసతే ఇతి ఆభాసః” కొంచెముగా భాసించేది ఆభాస అవుతుంది. స్పష్టముగా రసముయొక్క రూపము భాసించకుండా ఏదో కొంచెముగా రసము భాసించి భాసించనట్లుగా ఉండేటట్లయితే రసాభాస అవుతుందని గ్రహించాలి. రసము లేకపోయినప్పటికీ రసము ఉన్నట్లుగా భాసించడముకూడా రసాభాసే అవుతుంది రసము సముల్లసితము కావడానికి ఎంతటి విభావాదిసామగ్రి అవసరమో అంతటి విభావాది సామగ్రి సరిగా లేక సంకుచితముగా ఉంటే రసాభాస

అవుతుంది. అప్పుడు రసప్రతిభాసము సరిగా ఉండదు. ఇది ఒక విధమయిన రసాభాస. అంగరసము తన హద్దును దాటి ప్రవృత్తమయినప్పుడు శృంగారరసము బాధిత మవుతుంది. అవినీతుడైన అమాత్యుడు స్వామిని (ప్రభువును) అధికారము చలాయించనీయక అభాసపాలు చేసినట్లుగా స్వేచ్ఛాప్రవృత్తి ప్రవృద్ధమయిన అంగరసము అంగిరసమును ఆభాసీకరించు తుంది. సామాన్యంగా రెండుపాళ్ళు అంగిరసమును వర్ణించాలి. రెండు పాళ్లు ఇతరరసాలను వర్ణించాలి. ఆనుర్యాన్ని అతిక్రమించి అంగరసము తృతీయ భాగమును ప్రవేశించినట్లు వర్ణించితే ముఖ్యరసము స్వపోషానికి అలబ్ధ స్థానమై ఆభాస అవుతుంది. ఇది రెండవ విధమయిన ఆభాస. ఒక రసాన్ని ముఖ్యంగా నిరూపించ దలచి, ఫుడు వేరొక రసాన్ని ప్రబలం చేయడాని తాత్పర్యము. హాస్యము మొదలయినవి అధికము అయినట్లయితే శృంగారాది రసాలు ఆభాస అవుతవి. గ్రంథాలలో రసపరిపోష విశేషము చేత రమతులయిన విదగ్ధజనులకు మాత్రము ముఖ్యంగా గోచరమవుతుంది. శృంగారము వీరము రౌద్రము అద్భుతము శాంతము అనే ఈ రసాలు లోకోత్తర నాయకాశ్రయములుగా ఉంటే పరిపోషాతిశయము ఉంటుంది. కనుకనే శృంగారమును మ్లేచ్ఛాది విషయముగా నిరూపించితే ఆభాసత్వమే కాని రసత్వము సిద్ధము కాదు. విభావాది పరిపూర్తి బాగా ఉంటే రసత్వము ఉంటుంది. విభావాది పరిపూర్తి సరిగా లేకపోతే అక్కడ రసము ఆరోపితము కావచ్చునే కాని వాస్తవంగా ఉండదు. మ్లేచ్ఛాదులలో విభావాది పరిపూర్తి బాగా ఉండదు. అటువంటి స్థలాలలో స్థాయి చర్వణారూఢము కాదు. ఈ విషయంలో పెద్దల సమ్మతికూడా ఉన్నది.

ఏకత్రైవానురాగశ్చే త్తిర్యఙ్మ్లేచ్ఛగతోఽపి వా
యోషితో బహుసక్తిశ్చే ద్రసాభాస స్త్రిధా మతః.

రసాభాస విషయములో పెద్దలు ఈవిధముగా అభిప్రాయపడుతున్నారు రసాభాసము మూడువిధాలుగా ఉంటుంది. ఒకటి:- నాయికా నాయకులలో అనురాగము ఒకచోటనే ఉండి రెండవచోట లేకపోయినట్లయితే అక్కడ రసపూర్తి బాగా ఉండదు. కాబట్టి అది ఒక విధమయిన ఆభాస. రావణునిపై సీతాదేవికి అనురాగంలేదు. రావణునకు మాత్రమె అనురాగం ఉంది. కనుక ఆవిధానము ఈ ఆభాస కోటిలో చేరుతుంది. నాయికా నాయకులలో మొదట ఏ ఒక్కరికో అనురాగం కలుగుతుంది. ఇద్దరికీ సమకాలం అనురాగం కలుగదు. రెండోవ్యక్తికి తరువాతి కాలంలో అనురాగం కలుగుతుంది. ఇటువంటి స్థలములో ఏకత్రానురాగమె కాబట్టి రసాభాసయే అవుతుందా? అని శంకించ నక్కరలేదు. అటువంటి స్థలములో విభావాది పరిపూర్తి ఉంటుంది అనే సంభావన కలుగవచ్చు కాబట్టి రసాభాసత్వంలేదు. మొదట రత్నావళి వత్సరాజును ప్రేమించింది. అప్పటికి ఇంకా వత్సరాజుకు ప్రేమ కలుగలేదు. అయినా రత్నావళీ పూర్వానురాగమునకు ఆభాసత్వము లేదు. తరువాత వత్సరాజు ప్రేమించడము వారి అనురాగమునకు విభావాది పరిపూర్తి ఉండడమున్నూ ప్రసిద్ధమె. కాబట్టి ఆ దంపతుల అనురాగానికి రసత్వసిద్ధి ఉన్నది. రెండు:- మ్లేచ్ఛగతముగా తిర్యగ్గతముగా అనురాగము వర్ణితమయితే రసత్వము లేదు. ఆభాసత్వమే ఉంటుంది. తిర్యక్కు-అంటె వైదగ్ధ్య గంధము ఎప్పుడూ కూడా అనుభవించని ప్రాణులు. విభావాది భావ

ములున్నా వాటికి ఎపుడూ అనుభూతము కావు. మ్లేచ్ఛులు (అత్యంతమూ పామరులయిన ఆటవికులు) మాట్లాడడము మాత్రము నేర్చి ఉంటారే కాని తక్కిన్నా అన్నిటిలోనూ వారు తిర్యక్సహోదరులు. తద్గతంగా శృంగార వర్ణనము ఆభాసే అవుతుంది. ఒకనాయికకు అనేక పురుషులందు అనురాగమును వర్ణించడమున్నా రసాభాసమే. ఉపనాయకస్థ వర్ణితమయినపుడు విభావాది పరిపూర్తి ఉండదు. సరిగా స్థాయ్యాస్వాదము కలగదు. అందువలన రసాభాస. ఈ చెప్పిన మూడు స్థలాలలోనూ వరుసగా సహానురాగము లేనందు వలన, అవివేకము వలన, అనేకానురాగము వలన రతి ఆరోపితము కావడమే కాని వాస్తవంగా ఉన్నట్లు కాదు. రతి ఆరోపితమయితే హాస్యాస్పదము అవుతుంది. ఇట్లా ఇది ఆరోపితమయినప్పటికీ ఏదో తత్కాలంలో చమత్కారకమే కావచ్చు కాబట్టి రసాభాసకూడా ఉపాదేయమే కావ్యాలలో ఔచిత్యానుసారంగా వర్ణితము కావచ్చునని కొందరి భావము. ఇప్పటికి ఈ చెప్పిన ఆభాస వివేకము బహుళంగా శృంగారమునకు సంబంధించి ఉన్నది. రసాంతరాల విషయంలో గ్రంథాంతరములను అనుసరించి ఆభాస విజ్ఞానమును సంపాదించుకోవాలి. ఇట్లాగే భావాభాస విషయములోనూ అన్వయానుసరణము చేయాలి.

భావశాంత్యాదులు

వ్యభిచారి భావముల ఉత్పత్త్యాది విశేషములను బట్టిన్నీ చమత్కారము ఉదయించుతుంది. ఆ చమత్కార నిబంధనముగా నాలుగు భేదాలు ఉన్నవి. భావోదయము భావ శాంతి భావ సంధి భావ శబలత అని ఆ భేదాల పేర్లు. వ్యభిచారి

భావాలకు ఉదయదవస్థను వర్ణించితే భావోదయము. ప్రశాంత్యవస్థను వర్ణించితే భావశాంతి. పరస్పర విరుద్ధము లయిన రెండు రసాల నాశ్రయించిన రెండు భావాలకు స్పర్ధతో కూడుకొన్న సంబంధమును ఒకచోట వర్ణించితే భావసంధి. ఒకదానికొకటి ఉపమర్దించుకొనేటట్లు అంటే పూర్వ పూర్వ భావమును ఉత్తరోత్తర భావము ఉపమర్దనము చేసేదిగా పూర్వపూర్వమును ఉత్తరోత్తరము బాధించేదిగా సమావేశింపజేయ బడినట్లయితే భావ శబలత అవుతుంది. ఈ విషయము దశరూపకములో కూడా ? నిర్దిష్టమయింది. భావమునకు శాంతి ఉదయము సంధిశబలత అని నాలుగు భేదాలు ఉన్నవి. అవి. ఇక వీని ఉదాహరణములు తత్తదవసరములో నిరూపితము లవుతవి.

స్థాయిభావములు

ఇక యథాక్రమముగా రతి మొదలయిన స్థాయిభావాల యొక్క స్వరూపములను లక్ష్యములనూ ప్రదర్శించుతాము.

౧. రతి

సంభోగవిషయ ఇచ్ఛావిశేషో రతిః

సంభోగ విషయిక మయిన ఇచ్ఛావిశేషము రతి అవుతుంది. యువావస్థలో ఉన్న స్త్రీ పురుషులకు పరస్పరమూ ఆనంద జనక మయిన దర్శనాలింగనాది కర్మలకు సంభోగము అని పేరు. కామోపచారము సంభోగము. స్త్రీ పురుషుల సుఖము కామము అని అంటారు. ఆ స్త్రీ పురుషుల యొక్క పరస్పర విమర్దము వలన ఉదయించే ఆనంద సంభేదమె సుఖ మవుతుంది. ఆ ఆనందమును సంధానించే కర్మ

ఉపచార మన్నమాట. కాగా పైన నిరూపించిన సంభోగ స్వరూపము స్పష్టమయినట్లు. అటువంటి సంభోగము విషయముగా ఉన్న ఇచ్ఛావిశేషము 'సంభోగమును ఒనరించాలి' అనే కోరిక రతి అవుతుంది, దీనినే స్పృహ మొదలయిన పదాలతో పిలుస్తారు. ప్రమోదాత్మకమయిన మనోవృత్తి రతి అని భావము. ఉదా:—

> శృంగారైకరసః స్మరోఽస్తు జగదానందైక నిష్యందభూ
> రిందు స్తిష్ఠతు విభ్రమైకవసతి ర్జాగర్తు పుష్పాకరః
> సంత్వన్యేపి గుణప్రసాదితదిశః కిం తై రశేషోన్నతో
> జాతః కాకలివల్లభో మమ పతిః కామస్య కామోత్సవః

శృంగారమె ఏకరసముగా ఉన్న మన్మథుడు ఉండుగావుత! జగములకు ఆనందమును సంధానించడములో అద్వితీయ నిష్యందభూమి అయిన చంద్రుడుకూడా ఉండుగావుత! సకల విలాసాలకూ ఏకైక వసతి అయిన వసంతుడు ఉండనీ! అభిరూప్యము మొదలయిన గుణసంపదచేత లోక భువాలను సుప్రసన్నంగా చేసికొన్న దిగంత విశ్రాంత గుణ గణము కలిగిన గంధర్వ గీర్వాణాదులు కూడా ఉంటే ఉండుదురుగావుత! వారంతా ఒక్కొక్క గుణానికి ఆశ్రయ భూతులు వారి వలన ఏమి ప్రయోజనము? సర్వాధికుడు మన్మథునకు కూడా మన్మథోత్సవ రూపుడూ అయిన శ్రీ కాకతి వల్లభుడు నా పతి అయినాడు. నాకు ఇక ఏమీ లోటు లేదు. ఈ పద్యములో ఒక నాయికకు వీరరుద్రుని యందు ప్రమోదాత్మకమయిన రతి ఉన్నదని గోచరము అవుతున్నది. ఆ నాయిక తనయందు అనురక్తుడయిన ప్రియుని లాభము వలన ముదిత (సంతుష్ట) అయింది, ఈ నాయికకు ఇక్కడ మదన ఇందు

వసంతాది వైరాగ్యము ఉన్నది. అభిమాన మూలమయిన ప్రియవిషయ ప్రేమయే దీనిలో ముఖ్యము. నాకు ఇతరము ఏమీ ఇష్టముకాదు. ఇదే ఇష్టము. ప్రియము అని ఆమె ప్రత్యయము.

౨. హాసము

వికృతిదర్శనాది జన్యో మనోవికారో హాసః

వికృతి దర్శనాదుల వలన ఉత్పన్నమయిన మనో వికారమునకు హాసము అని పేరు. తనయందుగాని ఇతరుని యందుగాని ఉన్నటువంటి వికృతములయిన వేషభాషా కార వికారములను విరుద్ధా లంకారములను అస్పష్ట భాషణములను ఈ మొదలయినవానిని చూడడమువలన, వినడమువలనా మనో వికారము కలుగుతుంది. ఇదే హాసము. దీనిలో బాష్పాదులు అనుభావాలుగా ఉంటవి. నిద్రాలస్యాదులు సహకారులుగా ఉంటవి. ఉత్తములలో రెండు విధాలుగా మధ్యములలో రెండు విధాలుగా అధములలో రెండువిధాలుగా ఉంటుంది. స్మితము హసితములు ఉత్తములకు విహసితము ఉద్ధసితములు మధ్యములకు అపహసితము అతిహసితములు అధములకూ ఉంటవి. ఇంకా దీనిలో స్వగత భేదాలు పరగత భేదాలు చాలా విధాలుగా ఉన్నవి. వాని స్వరూపాదులను ఇతర స్థలములలో గ్రహించాలి. ఉదా:—

> బిభ్రాణాః కబరీః ధృతాంజనదృశః కృత్వా కుచౌ కృత్రిమౌ
> స్త్రీవేషా న్నిశి కాకతీంద్రనగరే ప్రచ్ఛన్నరూపాః నృపాః.
> దృష్ట్వా క్షౌమముపాస్య వక్షసి కుచావాకృష్య నీవీస్పృశో
> హీ ! హీ !! కష్టమితి త్యజంతి విపణిశ్రేణీషు ధూర్తా విటాః.

కాకతీంద్రుని చేత జయింపబడిన శత్రురాజులు రహస్య

రూపముతో ప్రతాపరుద్రుని పట్టణములో తిరుగు తున్నారు. రాత్రి పూట వారికి ధూర్తులు ఎదురయినారు. అప్పటి విశేషము ఈ విధముగా ఉన్నది. స్త్రీజనానికి తగిన కేశపాశమును ధరించి కంటికి కాటుకను పెట్టుకొని కృత్రిమములయిన కుచాలను ఏర్పాటు చేసికొని రాజులు స్త్రీవేషము కలవారై కాకతీంద్రుని నగరములో రాత్రియందు ప్రచ్ఛన్న రూపముగా ఉన్నారు. ధూర్తులయిన విటులు వీధుల శ్రేణులలో స్త్రీ రూపముగా ఉన్నవారలను చూచి, వారు కట్టుకొన్న తెల్లని దుకూలాలను ఊడదీస్తున్నారు. వక్షస్థలాన కుచాలను ఆకర్షించుతున్నారు. నీవిని స్పృశించారు. అప్పుడు వారికి తత్త్వము తెలిసింది. ఆకుచములు కృత్రిమాలు కాబట్టి వీరు స్త్రీలు కాదని వారు గ్రహించారు. కుచాకర్షణ సమయంలోనే నీవీ స్పర్శకూడా చేశారు. విషయం తెలిసింది. హీ! హీ! అన్నారు. పొరపాటు పనిచేశామని వారిని విడిచి పెట్టుతున్నారు. ఖైదీలుగా గ్రహింపబడిన శత్రువులు తప్పించుకొని పోవాలని రాత్రిప్పు స్త్రీవేషాలతో వెళ్ళుతూ ఉంటే ఇది ఘటించింది. వైరి భూపతులలో ఉన్న వికారాకారము హీ! హీ! అనే హాసానికి హేతువయింది.

౩. శోకము

ఇష్టజన వియోగాదినా ఆత్మని దుఃఖాతిశయః శోకః

ఇష్టజన వియోగము అనిష్ట ప్రాప్తి ద్రవ్యనాశము గృహదాహము మొదలయిన వానివలన తనచిత్తములో కలిగే దుఃఖప్రకర్షకు శోకము అని పేరు. ఉదా:—

తాతః! నిష్కరుణోసి రక్షయసి కిం వన్యాం శరీరస్థితిం?
తస్మాద్భగ్నిభవా గృహాః క్వను గతాః? స్థానం మరుః కల్పితం

హా నాథాః! పతితాః ప్రతాపన్నృపతేః క్రోధార్చిషీతి ద్విషత్
యోషాణాం తదనూప మృత్యుభిరహో! జాతం స్థలం మారవం.

ఇష్టజన వియోగము వలన కలిగే శోకానికి ఇది ఉదాహరణము. ప్రతాపన్నృపతి తోటి మహాయుద్ధంలో భర్తలు చనిపోగా శత్రు స్త్రీల భార్యలు ఈ విధముగా శోకించుచున్నారు. ఓ! ధాతా! నీవు దయలేని వాడవు. ఘాతుకుడవు. మాకు ఇప్పుడు వనములో ఉత్పన్నములవుతూ ఉండే ఫల మూలాదులతో ఆధారమయిన శరీరస్థితిని కలుగజేస్తున్నావేమయ్యా! మాకు ఇటువంటి శిక్షణము ఇస్తున్నావె! నీకు దయలేదా? నానా విధ భోగోపకరణాలతో పరిపూర్ణములయిన ఆ మా గృహాలు ఏమయిపోయినవి? అవన్నీ ఎక్కడికి పోయినవి? ఇపుడు మాకు మరు ప్రదేశాలనే స్థానముగా కల్పించావు కదా! మాకు దప్పిక కలిగితే ఈ ప్రదేశాలలో ఉదకము కూడా లభ్యము కాదే! పోనీ, మహారణ్యాలలోనయినా భర్తలతో కూడి మృగ మిథునాలవలె ఏదో విధంగా సంచరించుదామా? అని అనుకొంటే అదికూడా లేదే! మా దైవ దుర్విపాకము ఎటువంటిదో? ఎట్లాంటిదో? కాని ఇంత వ్యథ పడుతున్నాము. ఆ భర్తలు కూడా వీరరుద్రుని క్రోధాగ్నిలో మిడతలు అయిపోయినారు. హా నాథుల్లారా! ఆ నృపతి క్రోధాగ్నిలో పడిపోయినారా? మీరంతా భస్మమయినారా? మీరు మళ్ళా రానేరారా? ఈవిధముగా శత్రుస్త్రీలు దుఃఖపడుతూ ఉంటే వారి కన్నీళ్ళచేత ఆ ప్రదేశము అంతా జలప్రాయము అయింది. ఈపద్యములో శత్రుస్త్రీలు శోకానికి ఆలంబన విభావముగా ఉన్నారు. భర్తృ వియోగము రాజ్య భ్రంశముల వలన

వారికి దుఃఖాతి భూమికలిగింది. దైవోపాలంభనము చేస్తున్నారు. రోదనము మొదలుపెట్టారు. ఈవిధంగా వారిశోకము సూచితమవుతున్నది. భూమిపై పౌర్లాడడము ఉరస్తాడనము మొదలయినవి అనుభావాలు. దైన్యము మోహము చింత విషాదము మొదలయినవి సంచారి భావాలు.

౪. క్రోధము

శత్రుకృతాపహారేణ మనఃప్రజ్వలనం క్రోధః

శత్రువు భృత్యులు ప్రతిపక్షులు మొదలయినవారు చేసిన అపచారమువలన కలిగిన మనః ప్రజ్వలనానికి క్రోధము అని పేరు. భృత్యాదులు తిరస్కరించినా ఈ మనోవృత్తి కలుగుతుంది. ఇది క్రోధము కోపము రోషము అనిమూడు విధాలు క్రోధము క్రూరజనులను ఆశ్రయించి వధాదికము చేయించుతుంది. అది కాగానే పోతుంది. కోపము వీరజనులలో ఉండి ఇతరుల ప్రార్థన చేయగానే తొలిగిపోతుంది. రోషము స్త్రీపురుషులలో పరస్పరమూ ఉంటుంది. ఒకరికి ఒకరిమీదనమ్మకం కలిగే వరకూ ఇదిపోదు. ఉదా:—

రే! రే! సేవణ! కస్తవాయమనిదంపూర్వోఽద్య గర్వో మహాన్
ఉత్తీర్ణా కిల యేన గౌతమనదీ ప్రాప్తోసి మృత్యోర్ముఖం
ఏషా "కాకతివీరరుద్ర" ఇతి కిం నాశ్రావి సప్తాక్షరీ ?
ప్రత్యక్ష ప్రతిపక్ష పార్థివ మహాభూత గ్రహోచ్చాటనీ.

ఈపద్యములోని క్రోధము క్రూరులను అవలంబించి ఉన్నది. అవజ్ఞా మూలముగా ఇదికలిగింది. ఓయీ! సేవణా! ఏమిరా. ఇది? ఈమహాగర్వము ఇదివరలో ఎప్పుడూ లేదే! ఈక్రొత్త గర్వము ఎక్కడిదిరా? గౌతమనదిని ఆగర్వముతోటే కాబోలు దాటివచ్చావు? ఎంతపని చేసావు!!! గౌతమిని

దాటినావా? అయితే మృత్యుముఖానికి వచ్చితివి లే! కాకతి వీరరుద్రః అనే సప్తాక్షరీ మహామంత్రాన్ని నీవు వినలేదా? అతిశయించుతూఉన్న ప్రతిపక్ష పార్థివులు అనే మహాభూత గ్రహాలు అన్నింటినీ ఉచ్చాటనముచేసి ఇది పోగొట్టుతుందే! ఈమంత్రాన్ని వినగానే వారంతా కాందిశీకులు అవుతారె! నీవు ఇపుడు ఈ విధముగా ఉద్యమించుతున్నావేమిటి? ఈ పద్యములో కంఠ గర్జనము దంత ఘట్టనము మొదలయినవి అనుభావాలు.

౩. ఉత్సాహము

లోకోత్తరేషు కార్యేషు స్థేయాన్ప్రయత్న ఉత్సాహః

లోకోత్తరములయిన పనులలో అతి స్థిరమయిన ప్రయత్నానికి ఉత్సాహము అనిపేరు. తాను తలచిన కార్య సాధనలో బాగా ఉత్సుకత్వము ఉండాలన్నమాట. నేను ఇటువంటి వాడను ఈ పనులను చేయగలను అనే ఆత్మ విశ్వాసము ఉంటే అభిమానాత్మక మయిన ఉత్సాహము కలుగుతుంది. అన్ని పనులలోనూ ఉండే మానసావేశము దీని స్వభావము. ఇది సహజము కావచ్చు. అహార్యము (తెచ్చిపెట్టుకునేది) కావచ్చు. ఉదా:—

క్షుబ్ధేష్వబ్ధిషు సంభ్రమా త్త్రిభువన గ్రాసేచ్ఛయా సర్వతః
సన్నద్ధేష్వపి పర్వతేషు పరితో గండోపలా న్వర్షితుం
శక్తా ఏవ వయం నివారణవిధౌ ఇుద్రక్షమాభృజ్జయే
శ్లాఘా నః కియతీతి కాకతివిభో ర్గర్జంతి సైన్యే భటాః.

కాకతి ప్రభువు సైన్యములో భటులు ఈ విధముగా గర్జనము చేస్తున్నారు. మూడు లోకాలనూ గ్రసించవలెను అనే కోరికతో సముద్రములు ప్రళయంలో మాదిరిగా క్షోభము కలవె

నప్పటికి పర్వతాలన్నీ గండశైలాలను వర్షించడానికి అంతటా సన్నద్ధములు అయినప్పటికీ నివారణము చేయడములో మేము సమర్థము గానే ఉన్నాము. క్షుద్ర రాజులను జయించడములో మాకు కలిగే శ్లాఘ ఏమి ఉంది? ఈ పద్యములో భటుల ఉత్సాహము శత్రు రాజులను విషయముగా చేసికొని సముద్ర సంక్షోభమును పర్వత సన్నాహమును మేము నివారించ గలము. అనే వాగారంభణంతో కనపడుతున్నది. వీర స్థాయి అయిన ఉత్సాహము మూడు విధాలుగా ఉంటుంది. కాబట్టి వీరముకూడా త్రివిధము. దానవీరము యుద్ధవీరము ధర్మవీరమూ అని. దయా వీరము అనేదాన్ని కూడా కొందరు చెప్పుతున్నారు. ఈ భేదాంతరాలను ఇతర స్థలాలలో గ్రహించాలి.

౬. భయము

రౌద్రసందర్శనాదిభి రనర్థాశంకనం భయం

రౌద్రమయిన ఆకారమును రౌద్రమయిన శబ్దమును చూచినందు వలన వినినందువలన అనర్థము వస్తుందేమో అనే శంక కలుగుతుంది. అది మనశ్చాంచల్య స్వరూపము. దానినే భయము అంటారు. ఈ భయము స్త్రీలకు దుర్బల స్వభావులకూ స్వాభావికము. ఉత్తములకయితే కృతకము. వారికి సహజము కాదట. అందరిలోనూ కృతకమె కాని ఎక్కడా సహజముగా ఉండదు అని కొందరంటారు. ఇది ఇట్లా అనేక విధముల ఉంటుందని కొందరి భావము. ఉదా:—

> దూరాదాకర్ణ్య విశ్వప్రసృమర మహసో వీరరుద్రస్య జైత్ర
> ప్రస్థానారంభభేరీ నినద మవిరళం పూర్ణకర్ణజ్వరార్తాః
> ఆరుహ్యాద్రీ న్విశంతో గహన మతిమహత్కంటకాకృష్టకేశాః
> త్రాయధ్వం ముంచతేతి ప్రతినృపతి ధియా పాదపాన్ ప్రార్థయంతే

విశ్వవ్యాపి ప్రతాపము కలిగిన ప్రతాపరుద్ర మహారాజు గారి జైత్ర ప్రస్థానములోని ఆరంభ భేరీధ్వనిని శత్రురాజులు దూరముగా ఉండి విని బాగా కర్ణజ్వరము కలవారయినారు. ఆ జ్వరార్తులై పర్వతాలను ఎక్కి అరణ్యములను ప్రవేశించు తున్నారు. ఆ ప్రదేశములో పెద్దకంటకి వృక్షాలు తమ పెద్ద పెద్ద కంటకములతో శత్రురాజుల కేశములను పట్టి లాగినవి. అప్పుడు వారు ప్రతినృపతులు వచ్చి లాగుతున్నారనే అభిప్రాయముతో రక్షింపుడు. విడిచిపెట్టుడు అని ప్రార్థించు తున్నారు. వ్యాకులాంతః కరణము కలవారై దీనోక్తులతో వేడుకొను చున్నారు. దీనిలో శత్రురాజ గతమయిన భయానికి కంటకా కర్షణము ఉద్దీపనము. దీనాలాపములు అనుభావములు. భయానక స్థాయి ఈ విధముగా స్పష్టమవుతున్నదని గ్రహించాలి.

౮. జుగుప్స

అర్థానాం దోషసందర్శనాదిభి ర్గర్హణా జుగుప్సా

రక్తము కక్కిన పదార్థమూ మొదలుగా గల అహృద్యములు అయిన వానిని వినినప్పుడు కాని చూచినపుడు కాని ఆ పదార్థ దోషములను గ్రహించి నపుడు కలిగే మనః సంకోచమునకు జుగుప్స అని పేరు. ఇది కలిగినపుడు నానా విధాన ఉమ్మి వేయుట మొదలయిన అనుభావములు ఉంటవి. భయము అపస్మారము ప్రభృతు లయినవి అన్నీ సహకారులు. విభావములోని భేదమును బట్టి ఇది రెండు రకాలుగా ఉంటుంది. క్షోభము ఉద్వేగమూ అని రెండు విధములు. రుధిరాంత్రాది దర్శన స్పర్శనముల వలన మనఃక్షోభము కలుగుతుంది. క్రిమి, పూతి, విష్ఠ మొదలయిన వాని వలన ఉద్వే

గము కలుగుతుంది. వైరాగ్యము వలన, యువతి గర్హావలన మూడవది సిద్ధ మవుతుందని కొందరు అభిప్రాయ పడుతారు.

ఉదా:—

విష్వగ్విస్తీర్ణపంకే మహతి నిపతితోచ్ఛూన మాతంగ దేహ
శ్రేణీ లబ్ధ ప్రచారాః ప్రసహాదుదవసా మజ్జ రక్త ప్రవాహాః
రాశీభూతాస్థికూట స్థపుటిత నికటా నిస్సరం ద్విస్రగంధాః
కుర్వంత్యాయోధనోర్వ్యో భయ మవనిభృతాం వీరరుద్రేణ సృష్టాః

వీరరుద్రుని చే సృజింపబడిన యుద్ధభూములు శత్రురాజులకు భయము కలుగచేస్తున్నవి. ఆ యుద్ధభూమి వర్ణనమే ఈ పద్యములో ఉన్నది. యుద్ధభూమి అంతటా కూడా మస్కిమక పంకము అధికముగా సిద్ధమయింది. ఆ బురదలో నడిచి వెళ్లలేక, మావటి వాళ్లు కొట్టుతూ ఉంటే ఏనుగులు పడి పోయినవి. పడి చనిపోయి ఉబ్బినవి. అటువంటి గజ దేహముల పంక్తులలో నక్కలు మొదలయినవి అన్నీ దేహాల మీదుగా నడుస్తూ సంచారము చేస్తున్నవి. ధాతుసారము ఎముకల రసము రక్తమూ పెద్ద ప్రవాహముతో ప్రవహించుతూ ఉన్నవి. ఎముకలన్నీ గుట్టలు గుట్టలుగా పోగు వేయబడి ఉన్నవి. సమీప ప్రదేశాలను అన్నిటినీ ఆ ఎముకలు ఎగుడు దిగుడుగా చేసినవి. అంతటా కూడా గవులుకంపు వస్తున్నది. యుద్ధ భూములు ఈ చెప్పినవిధంగా అసహ్యకరముగా ఉన్నవి.

౮. విస్మయము

అపూర్వార్థసందర్శనా చ్చిత్తవిస్తారో విస్మయః

లోక మర్యాదను అతిక్రమించిన అపూర్వ పదార్థాలను చూచి నందువలన మనస్సుకు విస్తృతి కలుగుతుంది. దానికే

విస్మయము అని పేరు. అలౌకికములయిన వస్తువులను సరిగా అనుభవములోకి తెచ్చుకోలేక మనస్సు విస్మయావేశము పొందుతుంది. ఈ విస్మయావిష్టత అద్భుత రసమునకు హేతువు అవుతుంది. ఉదా:—

ఔన్నత్యం మహదన్యదేవ మహతః కోప్యేష గంభీరిమా
కాప్యన్యా సరణిః ప్రతాపయశసో రన్యైవ బాహ్వోః ప్రథా
సర్వం నూతనమేవ రుద్రనృపతే ర్జానే న తన్నిర్మితౌ
సామగ్రీ చతురాననేన కియతీ? కీదృక్క్రమా కల్పితా.

ఈ పద్యము కావ్యప్రకరణములోనే నిరూపితమయింది. దీనిలో ప్రతాపరుద్రునకు సంబంధించిన ఔన్నత్యాదికము అలౌకికముగా నిరూపితమయింది.

౯. శమము

శమో వైరాగ్యాదినా నిర్వికార చిత్తత్వం.

వైరాగ్యము ఈశ్వరానుగ్రహము సత్సంగము మొదలగు వానివలన నిర్వికారమయిన చిత్తవృత్తి కలుగుతుంది. దానికే శమము అని పేరు. ఈ శమము కలిగినప్పుడు విషయాభిలాషలు నశించి పోతవి. ఈ మనోవికారమునకు తృష్ణాక్షయము అని పేరు. యమ నియమాదుల యొక్క అనుసరణము ఉన్నప్పుడే ఇది కలగడానికి అవకాశము ఉంది. ఉదా:—

కిం లబ్ధం చతురాననేన మహతీ మాయుఃప్రథాం గచ్ఛతా?
లబ్ధ్వా సంపద మప్యనన్యసుగమా మింద్రేణ వా కిం కృతం
ఇత్యస్త్రాంతరుపప్లవాః సుకృతినో నో జానతే దాహ్యాము
ప్యద్యోపప్లవ మంధ్రనాథతిలకే విశ్వంభరాం బిభ్రతి.

ఆంధ్ర నాథ తిలకుడయిన వీరప్రతాపరుద్రుడు విశ్వం భరను భరించుచూ ఉండే సుకృతము కలవారి శమావస్థ

దీనిలో వర్ణితము అవుతున్నది. బ్రహ్మ దేవుడు గొప్ప ఆయు ప్రవృద్ధను పొంది ఏమి సంపాదింప కలిగినాడు? ఇతరులకు సుగమము కాని సంపదను పొంది ఇంద్రుడు మాత్రం ఏమిచేయ గలిగాడు? ఆయుస్సంపాదనములో సంపత్సంపాదనములో వీరు ఇద్దరూ పరమావధిగా ప్రసిద్ధులు. అటు వంటి వారు కూడా ఈసుకృతుల దృష్టిలో లెక్కగా లేరు. ఈ విధంగా వారు బ్రహ్మేంద్రులను భావించుతూ అంతరుపప్లవాల నన్నిటినీ నశింపచేసికొని బాహ్యమును కూడా వారు ఏమాత్రమూ తెలిసికొనడము లేదు. ఇది అంతా కూడా నిరుపద్రవాగా రాజ్య పాలనము చేస్తూ ఉన్న ప్రతాపరుద్రుని మహిమ.

శాంతము రసమా?

నాట్యరసాలు ఎనిమిదే ఉన్నవి. శాంతమంటూ రసము వేరుగా లేనేలేదు. శాంతము కూడా ప్రత్యేకముగా రసమె అయినట్లయితే పెద్దలు పరిగణనము చేసే వారె! వారు రసాలను పరిగణించుతూ 'అష్టౌ నాట్య రసాః' అంటున్నారు. అందువలన శాంతమనే తొమ్మిదవ రసము లేదు. కావ్యార్థ భావనము వలన నాలుగు విధము లయిన చిత్త వృత్తులు కలుగుతవి. వికాసము విస్తరము క్షోభము విక్షేపమూ అని, వీని వలన ఎనిమిది రసాలు కలుగుతున్నవి. అంతేనే కాని వీటికంటే అతిరిక్తముగా తొమ్మిదవ రసము ఉత్పన్నము కావడానికి ఏమీ అవకాశము లేదు. వైరాగ్యాత్మక మయిన చిత్త వృత్తి ఎన్నడూ కలగ డానికి అవకాశము లేదు. అనాదికాల ప్రవాహంనుండి పరం పరగా వస్తూ ఉన్న రాగ ద్వేషాదులను విడిచి పెట్టడము శక్యము కాదు. ఈ విధముగా వైరాగ్యము ఉత్పన్నమె కాదె! కాగా శమము ఎక్కడినుండి

వస్తుంది? శమోత్పత్తికి అనుకూలమయిన సామగ్రి ప్రపంచంలో ఎక్కడా లేనే లేదు. ఒక వేళ అటువంటిది ఎక్కడ నయినా ఉన్నా అది శ్లాఘ్యము కాదు. కొందరికి మాత్రం శ్లాఘ్యము అయినప్పటికీ దానిని వేరుగా పరిగణించ నక్కర లేదు. వీర ములో నయినా బీభత్సములో నయినా అది అంతర్భవించు తుంది. ఒకప్పుడు అంతర్భావము రాక పోయినా అదొక పురుషార్థముగా చెప్ప తగ్గది కాదు. అందువలన శాంత మనేది రసముగా చెప్పతగినది కాదని శాంత ప్రతిక్షేపము చేసే వారు పలుకు తున్నారు. దీన్ని సమీక్షించాలి.

శాంతము రసమే

శాంతమున్నూ ప్రత్యేకంగా ఒక రసమని సిద్ధాంతము. దీనిని ఈ విధము గా గ్రహించాలి. భరతముని ఇతర రసాలతో పాటు శాంతరసమును కూడా చెప్పనే చెప్పాడు. మహర్షియే అంగీకరిస్తున్నాడు కాబట్టి ఇతరులు ఏల అంగీకరించ రాదు? శాంతము రసము. శాంతానికి కూడా అనుకూల మయిన సామగ్రి పుష్కలంగానే ఉంది. శమోత్పత్తికి తగిన అవకా శాలు బాగానె ఉన్నవి. శృంగారాది రసాలు రాగి జనులకు ఇష్టము లయినట్లు అవి వారి శ్లాఘా పాత్రములయినట్లు శాంతము కూడా విరాగులకు ఇష్ట మవుతుంది. వారి శ్లాఘా పాత్రమూ అవుతుంది. ఇది ఏ రసములోనూ అంతర్భవించదు. మహా పురుషార్థముఅని చెప్పదగినట్టిది శాంతరసము ఒక్కటే. శాంతము స్వభావ సిద్ధమయిన ఆదిరసము. దాని స్థాయిఅయిన శమము సిద్ధభావము. భరతముని సంచారి భావాలను పరిగణ నము చేస్తూ మొదటగా నిర్వేదమును నిర్దేశించుతున్నాడు. అమంగళ ప్రాయమయిన నిర్వేదమును ప్రథమంలో చెప్ప

డము అంత ఉచితము కాకపోయినా భరతుడు చెప్పినంద
వలన నిర్వేద స్థాయిక మయిన శాంతరసము ఉన్నట్లుగా భ
తుడు అంగీకరించాడని గోచర మవుతున్నది. ప్రత్యేకము
శాంతరసమును చెపుతూ దాని భావ విభావాదులను భ
తుడు విశదంగా నిరూపించుతున్నాడు. ప్రామాణికు లయి
ఆలంకారికు లందరూ శాంతసత్త విషయములో ఏకమతుల
అవుతున్నారు. సర్వవిధములయిన విషయాభి లాషలూ నశిం
పోతే నివృత్తిరూపముగా నిర్వేదము కలుగుతుంది. అవిద్
నశించగానే సుఖరూపత్వము గోచరమవుతూ ఉన్నట్లుగ
తృష్ణా నివృత్తిలో సుఖరూపత్వము గోచరము అవుతూ
ఉన్నది. కామసుఖముకాని దివ్యమయిన మహాసుఖము కా
ఈకోరికల నాశనము వలన కలిగే సుఖము యొక్క చిన్న
వంతునకయినా పనికిరావు. ఈరసానికి వైరాగ్యాది సామగ్రి
కూడా బాగానేఉంది. పరమేశ్వరానుగ్రహము పూర్వజన్మ
పరిపాకము సద్గురుసేవ సత్పురుషుల అనుగ్రహము వేదాంత
విచారణ యమనియమాదులు మతిస్మృతి చింతాదులు ఇవన్ని
కూడా శమసామగ్రిగా ప్రసిద్ధము. రాగద్వేష కలుషతాంత
కరణులు శాంతమును ఏవగించు కొన్నంత మాత్రాన ఇది
లేకపోలేదు. కొందరు మెచ్చుకోలేదని ఇదిరసము కాకపో
తుందా ? వీతరాగులు శృంగారాన్ని ఒప్పుకోరు. అంతమా
త్రాన అదిరసము కాకపోయిందా? కాబట్టి వీతరాగులయిన
పుణ్యాత్ములకు అభిప్రేతమయిన ఈ శాంతము సుస్థిరముగానె
ఉంటుంది. ఈరసము శృంగారములో అంతర్భవించదు.
దానికీ దీనికీ చాలాదూరము. ధర్మవీరములో శాంతము అంతర్భ
వింపవచ్చునేమో అనితలచ నక్కరలేదు. వీరము నెప్పుడూ

కూడా అభిమానాత్మకము. అహంకారప్రాణముగా ఉంటుంది. సర్వాహంకారములూ ప్రశాంతములై పోవడమే శాంతముయొక్క రూపము. ఇంతటి వైజాత్యముఉంటే ఒకదానికి ఒకదానిలో అంతర్భావము కుదురుతుందా? నాల్గవ పురుషార్థమయిన మోక్షము శాంత్యైక సాధ్యమని ప్రామాణికులు అంగీకరిస్తున్నారు. సర్వప్రకారములూ సంపూర్ణకాముడై సంతుష్ట మానసుడై శాంతమును స్వీకరించినపుడే మానవుడు ముక్తిని పొందుతాడు. మోక్షఫలకమయిన ఈశాంతము సర్వరసాలకంటె ప్రధానతమము. కావ్యార్థ సంభేదమువలన కలిగే స్వాదము శాంతానికికూడా అనుకూలమె. ముదిత మైత్రి కరుణ ఉపేక్ష రూపముగా చిత్తవృత్తి లిగినపుడు శమప్రాదుర్భావానికి అవకాశం ఉన్నది. ఈవిధముగా శాంతము అప్రతిక్షేప్యము అయిన రసమైఉంటూ ఉండగా దీనిని ప్రతిక్షేపము చేయ పూను కొనడము అసముచితముగా ఉంటుంది. ఇంకా ఈవిషయములో విస్తరమును ఆకరగ్రంథములో గ్రహించాలి.

విభావము

విభావము అనుభావము సంచారులు అనేవి ఆయా రసాలకు అసాధారణములుగా ఉంటవి. వాటిని ప్రత్యేకంగా నిరూపించి ఉదహరించడము ఉచితమయిన పద్ధతి. మొదటగా శృంగార రసమునకు సంబంధించిన ఆలంబన విభావము దాని ఉదాహరణమూ ఈవిధముగా ఉంటుంది.

లావణ్యైకఖనిః విధాతృరచనాశిల్ప ప్రతిజ్ఞావధిః
శృంగారప్రతిభూర్విలాసవిపణిః కందర్ప ఘంటాపథః
నారీణా మధిదేవతా చ తరుణీ సేయం కిమన్యైర్గుణైః
అస్యా మస్మిన్మషమస్మిఫః ప్రియతమః శ్రీపీఠపుత్రో నృపః

లావణ్యానికి ఏకఖని. ఈమెలోని లావణ్యము ఎప్పుడూ ఏమాత్రమూ క్షయించిపోదు. విధాత రచనాశిల్ప ప్రతిజ్ఞకు ఈమె అవధి. అంగములనూ ఉపాంగములనూ సౌష్ఠవముగా నిర్మాణించాలి అని బ్రహ్మప్రతిజ్ఞచేసి ఈమెను నిర్మించి ఉంటాడు. ఇటుమీద ఇంతకన్న చక్కని స్త్రీని సృజించాలి, అంటే ఏవిధంగా ప్రతిజ్ఞ చేయవలెనో కూడా బ్రహ్మకు తెలియదు. ఈమెశృంగారానికి ఒక ప్రతినిధి ఇతర స్థలాలలో శృంగారమును రాబట్టడానికి ఈమె ఈవిధముగా అయింది. అందువలన వైరాగ్యములో నుండికూడా శృంగారమును స్వీకరించుతుంది. ఈతరుణి సర్వవిలాసాలకూ పణ్యవీథి. ఎవరికయినా విలాసములు కావలెనన్నట్లయితే ఈవిలాసిని దగ్గరకువచ్చి ఖరీదుచేయవలెను. మన్మథునకు ఈమె ఘంటాపథము ఈమె నారీ దేవత. ఇంకా ఇతరగుణాలుచెప్ప నేటికి? ఈమెయొక్క సామగ్రీ ఫలముగా ప్రియుడు కూడా లభించాడు. మన్మథునకు మన్మథుడయిన శ్రీ వీరరుద్ర నృపుడు ఈమెకు ప్రియుడు. దీనిలో ఆలంబన విభావముగా ఉన్నతరుణి యొక్క సౌందర్యాదికము ఆలంబనముగా వర్ణిత మయింది.

ఉద్దీపన విభావము

ఉరోమాత్రోత్సేధం భవదపి విలాసైరభినవైః
మృగాక్ష్యాస్తారుణ్యం త్రిభువనమిదం వ్యాకులయతి
స్తనాభోగస్ఫీతం యది కిల భవేత్కా ఖలు రణా
భవిత్రీ ? కిం వాన్యత్ ? విజిత మఖిలం పుష్పధనుషా.

ఈమృగాక్షీ తారుణ్యము ఉరము మాత్రము ఎత్తుగా ఉన్నదయినా అభినవ విలాసములతో ఈముల్లోకము భువనాలనూ వ్యాకుల పెట్టుతున్నది. ఆ వయస్సులో స్తనాలవాల

స్థలము కొంచెము ఉన్నతముగా ఉన్నది. ఇక ఇటుమీద ఆ తారుణ్యము స్తనముల విస్తారముచేత సమృద్ధమయినట్లయితే ఇక ఏమి కథ అవుతుందో? ఏమి చెప్పగలము? ఇంత కన్నా అయ్యే దేమిటి? పుష్పబాణుడు సర్వజగమును జయించి నట్లే! ఉదయ ద్యౌవనమె జగన్మోహనముగా ఉంది. ఆ యౌవనము ఉదిత మయినప్పుడు పరిపూర్ణ మయి నప్పుడూ ఇంకా ఎట్లా ఉంటుందో? దీనిలో కన్యావక్షస్సు రత్యుద్దీపన విభావముగా నిరూపితమయింది.

అనుభావము

స్మరస్మేరాః మందస్మిత మధుర సౌరభ్య సుభగాః
మనాగ్వ్రీడా జాడ్యాః ప్రణయరస కల్లోల భరితాః
కృతానేక స్కంభాః మనసిజ సహస్రాణి సృజతః
కటాక్షాః వామాక్షీ కిరతి పరితో రుద్రనృపతిం.

ఈ పద్యము కావ్యప్రకరణములో నిరూపిత మయింది. ఇదేవిధంగా రసాంతరములకు సంబంధించిన విభావానుభావములను ఉదాహరించి గ్రహించాలి. ఇక ఇటుమీద సాత్త్విక భావముల స్వరూపోదాహరణములను నిరూపిస్తున్నాము.

సాత్త్వికములు

సాత్త్విక భావముల యొక్క సామాన్య లక్షణ ప్రస్తావములో సాత్త్వికములు బాహ్యములని ఆంతరములని నిరూపింప బడింది. ఇక్కడ బాహ్యములయిన స్తంభాదుల యొక్క స్వరూపము నిరూపిత మవుతుంది.

౧ స్తంభము

స్తంభః స్యాన్నిష్క్రియాంగత్వం రాగ భీత్యాదిసంభవం.

క్రియలు లేని అంగములు కలిగ ఉండడము స్తంభము

అవుతుంది. ఇది అనురాగము వలన భయము వలన విషాద విస్మయాదుల వలనా ఉత్పన్న మవుతుంది. ఉదా:—

కాకతిపుర స్త్రియః పశ్యంత్యో నరేంద్రకందర్పం
మదనశరోత్కీర్ణా ఇవ స్థితా నిశ్చలాంగ్యః.

కాకతిపట్టణమయిన వరంగలులోని స్త్రీలు రాజ మన్మథుని చూస్తూ మన్మథ బాణాలచే చెక్కబడినట్లుగా నిశ్చలములయిన అంగములు కలవారై నిలబడి ఉన్నారు. దీనిలో స్త్రీలు చూస్తూనే నిశ్చల స్వభావము కలవారయినారని అనడము వలన చైతన్యము ఉన్నప్పటికిన్నీ నిశ్చేష్టత్వము చెప్పినట్లయింది. కాబట్టి స్తంభమనే సాత్త్వికము.

౨ ప్రళయము

ప్రళయః సుఖదుఃఖాద్యై ర్గాఢ మింద్రియ మూర్ఛనం.

సుఖము దుఃఖమూ మొదలయినట్టి భావములచేత ఇంద్రియములు గాఢముగా మూర్ఛ పొందుట ప్రళయము అవుతుంది. వాక్కాయ మనస్సులు సామాన్యముగా దీనిలో నష్టచేష్టము లవుతవి ఉదా:—

జితమదనరూపసారః సఖి! ఏష వీరరుద్రనృపచంద్రః
యం దృష్ట్వా నిమజ్జతి మూర్ఛాయా మింద్రియగ్రామః,

ఓ సఖీ! ఈ వీరరుద్రనృపచంద్రుడు మదనరూపసారమును గూడా జయించినాడు గదమ్మా! ఆతనిచూడగానే ఇంద్రియ సమూహము అంతా మూర్ఛానిమగ్నము అవుతున్నది. దీనిలో ఇంద్రియములన్నీ తమ తమ వ్యాపారములనుండి మరలి పోయినట్లు నష్టచేష్టత కలిగినట్లూ వర్ణింప బడింది, కాబట్టి ప్రళయ మవుతుంది.

౩ రోమాంచము ౪ కంపము

సుఖాద్యతిశయాజ్జాతా రోమాంచో రోమవిక్రియా
రాగరోషభయాదిభ్యో వేపథు ర్గాత్రవేపనం.

రోమాంచ కంపములు రెండింటికీ ఉదాహరణ లాఘవమును బట్టి ఒకే పర్యాయము లక్షణము చెప్పబడుతున్నది. రోమ వికారమునకు రోమాంచము అనిపేరు. సుఖము ఉత్సాహము భయము విస్మయమూ అధికముగా కలిగినప్పుడు రోమ వికారము కలుగుతుంది. రాగము రోషము భయము జ్వరము మొదలయిన వాని వలన కలిగిన గాత్ర కంపమునకు వేపథువు అని పేరు. సుఖజన్యమయినరోమాంచ కంపములకు ఉదాహరణమును ఈ విధముగాదర్శించాలి.

దయితాలింగన నిర్భర కంపా చ వధూ ర్వియోగజీర్ణాంగీ,
ఉద్గిరతి అంతరస్థితమదనశరాణ్ పులకచ్ఛద్మనా.

వధువు ప్రియుడు ఆలింగనము చేసికొనడము చేత అత్యధిక కంపము కలది అయింది. అంతకు పూర్వము ఆమె అంగములన్నీ ప్రియుని వియోగము వలన జీర్ణములై ఉన్నవి. ఇప్పుడు ఈ విధముగా కంపము కల్దై పులకలు అనే మిషతో తనలో దాగి ఉన్న మన్మథ బాణాలను ప్రకటనము చేస్తున్నది. దీనిలో కంపము కలగడము రోమాంచము ఉత్పన్నము కావడమూ విస్పష్టముగా ఉన్నది.

౫ స్వేదము

వపుర్జలోద్గమః స్వేదః రతిఘర్మ శ్రమాదిభిః.

సంభోగ శ్రమ వలనను నిదాఘపరిశ్రమ వలననూ శరీరము నుండి జలము ఉద్గమించును. అదే స్వేదము ఉదా:—

ప్రణ్వంతీ ప్రియసందేశం ప్రేయసః కాకతీశితుః,
స్మరరాజ్యాభిషిక్తేవ స్విన్నాంగీ వామలోచనా.

ప్రియుడయిన కాకతీశ్వరుని యొక్క ప్రియమైన సందేశమును వింటూ ఉన్నదై ఆసుందర నేత్రములు కలిగిన తరుణి మన్మథ రాజ్యమునందు అభిషిక్తురాలైన దానివలె స్విన్నాంగి అయింది. ప్రియుడు చెప్పే మాటలు వింటూ ఉంటే ఆమెకు స్వేదము ఉదయించింది. సమన్వయము స్పష్టమె.

౬ వైవర్ణ్యము

విషాదమదరోషాద్యైః వర్ణాన్యత్వం వివర్ణతా

విషాదము మదము రోషము మొదలయిన వాని వలన వేరొక వర్ణము కలగడము ముఖాదికమునందు రంగు మారుట వైవర్ణ్యమవుతుంది. ఉదా:—

నరనాథ! చంద్రధవలాః తవ గుణాః సాధు సంస్మరంత్యాః,
అంగాని పాండురాణి ఇదానీం జాతాని శ్యామాయాః.

ఓ నరనాథా! చంద్రునివలె తెల్లగా ఉన్న నీగుణములను మూచెలి బాగా సంస్మరణ చేస్తున్నది. అట్లా ఉంటే ఆ శ్యామ (అంటే యువతి అనీ ఒకఅర్థము. శ్యామవర్ణము కలది అని వేరొక అర్థము) అవయవములు పాండురములు అయినవి. నీగుణాలు తెల్లనివి కాబట్టి తెల్లని వానిని స్మరణం చేస్తూఉంటే అవయవాలన్నీ తెల్లనివి అయినవి అని ఒక భావము. నీవు లభించక పోవడము వలన నీ విరహంతో వ్యథను అనుభవించుచూ ఆమె నీ గుణగానం చేస్తూ ఉంటే శరీరమునందు అంతటా వివర్ణత్వము కలిగింది. అని వేరొక భావము. ఆమె నల్లనిది అయినప్పటికీ అంగములు తెల్లవయిన

వని అంతగా తెలుపు దనము సిద్ధము కావడము విరహాతి శయమును ద్యోతనము చేస్తుంది.

౭ అశ్రువు

అశ్రు నేత్రోద్భవం వారి దుఃఖ రోష ప్రహర్షజం

దుఃఖము రోషము ప్రహర్షము మొదలయిన వాని వలన కంటిలో ఉదకము పుట్టుతుంది. దానికి అశ్రువు అని పేరు.

ఉదా:—

వీరరుద్రనృపాద్భీతం పాండ్యం మగ్నం పయోనిధౌ
అన్వేష్టుమివ తద్భోపి దశ్రుధారాపగాయతే.

వీరరుద్ర నృపాలుని వలన భయపడి పాండ్యరాజు సముద్రములో మగ్నుడయినాడు. ఆతని భార్య కన్నీరు ఆతనిని వెదకడం కోసరము కాలువలు నదివలె అవుతున్నది. పాండ్యరాజు పోగా ఆతని భార్య అధికముగా దుఃఖించుచున్నది. అని భావము. సమన్వయము స్పష్టము.

౮ వైస్వర్యము

మదతం గద్గదభాషిత్వం వైస్వర్యం స ముదాహృతం

సంతోషము మొదలయినవాని వలన గద్గదభాషిత్వము కలుగుతుంది. దానికే విస్వరత్వము అని పేరు. ఆ సమయము లోని మాటలు సరిగా రాక గద గద అనే ధ్వనితో వస్తవి.

ఉదా:—

విజనే ప్రియేణ సమం కామకామాక్షరం భణంత్యాః
ఏకో జానాత్యనంగో అర్థం వధ్వా భణితానాం

నిర్జన ప్రదేశములో సురత సమయములో ప్రియునితో కూడా సుఖపారవశ్యము వలన ఆ వధువు పలుకుతున్నది. ఆ

పలుకులలో అక్షరాలు కృశించి పోయినవి. మణితధ్వనులతో అవి కలసి ఉన్నందువలన ఆవచనాలకు అర్థము ఏమిటో ఇత రులకు గోచరము కావడము లేదు. ఒక మన్మథుడు మాత్రమే తెలుసు కొంటున్నాడు. మొత్తానికి ఆవధువు యొక్క గద్గద వాక్యములు బాగా కామోద్దీపకములు అయినవి. ఆ పలుకు లలో విస్వరత్వము ఉన్నది. కాబట్టి సమన్వయము స్పష్టము.

వ్యభిచారిభావములు

ఇక ఇటు మీద నిర్వేదాది వ్యభిచారి భావములను. వాని స్వరూపోదా హరణములనూ నిరూపించ వలసి ఉన్నది.

౧ నిర్వేదము

దుఃఖేర్ష్యా తత్వబోధాద్యై ర్నిర్వేదో నిష్ఫలత్వధీః
తత్ర చింతాశ్రునిశ్వాసదీనతాః సంభవంతి చ.

దుఃఖము ఈర్ష్య తత్వబోధ మొదలయిన వానివలన నిర్వే దము కలుగుతుంది. అందువలన అంతటా నిష్ఫలత్వ బుద్ధి కలుగుతుంది. చింత అశ్రువు నిశ్వాసము దీనత్వములు దీనిలో సంభవించుతవి. ఇవి నిర్వేదాను భావములు. ఈ నిర్వేదము భావాంగముగా అనుభావాంగముగా రసాంగముగా స్వతం త్రముగా కూడా ఉండవచ్చును. ఇక్కడ మామూలుగా సామాన్య స్వరూపము మాత్రము సంగ్రహముగా చెప్పబడు తున్నది. ఉదా:—

సఖి! కర్పూరేణ కృతం కిం కస్తూర్యా మలయజ స్తిష్ఠతు
గుణశిశిరం యశస్సురభిం ఆనయ ప్రతాపరుద్రం చ.

ఓ! చెలీ! కర్పూరము చాలులె. కస్తూరి ఇంకా దేనికి? మంచి గంధమూ ఉండనీ! ఇపుడు వాని వలన ఏమీ ఉప యోగము లేదు. ప్రస్తుతము ప్రతాపరుద్రుణ్ణే తీసికొనిరా!

ఆతడు తన గుణాలతో చల్లగా ఉంటాడు. తన యశస్సుతో పరిమళించుతూ ఉంటాడు. నాకు ఆతడే కావాలి. దీనిలో ప్రియ వియోగ జన్యమయిన దుఃఖము హేతువుగా కర్పూరాదులందు నిష్ఫలత్వము నిరూపించబడింది. కాబట్టి నిర్వేదము

౨ గ్లాని

గ్లాని రబలస్యాపచయో వైవర్ణ్యారతి కారణం

బలము తగ్గిపోవడము గ్లాని. క్షుత్పిపాసలవలన సురత ప్రయాసము వలనా బలము తగ్గిపోవచ్చు. వైవర్ణ్యము అరతి కృశించి పోవడము సరిగా పలక లేకపోవడము మొదలయిన వానిని ఇవి కలుగజేస్తుంది. ఉదా:—

త్రైలోక్యం వహతి మహీ తాం ధరతి భుజః పతాపరుద్రస్య
తం హృదయేన ధరంతీ సాహసికీ దుర్బలాంగ్యస్మి.

ఒకయువతి సురత శ్రాంతఅయింది. ఆమెశరీరం అలసిపోయింది. ఆపిల్ల చాలా దుర్బలఅయింది. ఆమెస్థితిని ఈపద్యం చెప్పుతున్నది. ఈభూమి మూడులోకాలనూ వహించుతున్నది. ఆభూమిని ప్రతాపరుద్ర భుజము వహించుతున్నది. ఆప్రతాపరుద్రుని వక్షస్థలాన ధరించుతూ సాహసముచేసి దుర్బలాంగిని అయినాను. నేను తన్వంగినని తెలుసుకున్నప్పటికీ సమాగమ సంభ్రమము వలన ఆలోచించకుండా ప్రవర్తించాను. అందు వలన ఇంతగా దుర్బల అయినాను. దీనిలో ఆయువతి బలము తగ్గిపోవడము ఉన్నది. కాబట్టి గ్లాని.

౩ శంక

అనిష్టాభ్యాగమోత్ప్రేక్షా శంకా రోషాదికారణం

పరకార్యము వలనగాని తన దుర్నయము వలనగాని

అనర్థప్రాప్తిని అభ్యూహనము చేయడము శంక అవుతుంది. దీనివలన రోషాదులు కలుగుతవి. ఉదా:—

నజానా త్వన్య ఇతి మయా హృదయే ప్రియస్య పరిచయః కృతః
కిం ప్రకటాస్మి జనానాం సర్వాంగీణైః పులకైః?

ఇతరులు తెలుసుకోకుండా ఉండాలని నేను హృదయములో ప్రియుని పరిచయమును కలుగజేసికొన్నాను. ఈసర్వావయవ వ్యాప్తములయిన పులకముల ద్వారా నేను జనులకు ప్రకటమయినానా ఏమి? అయ్యో! నాగూఢానురాగము ప్రకటము కావడము అనర్థమేకదా! దీనిలో ఈప్రాకట్యము వలన ఏమిఅనర్థము కలుగుతుందో అని ఆముగ్ధ శంకించుతున్నది. సమన్వయము సులభము.

౪ అసూయ

పరోత్కర్షాసహిష్ణుత్వ మసూయా పరికీర్తితా.

ఇతరుల ప్రకర్షమును సహింపలేక పోవడము అసూయ అవుతుంది. గర్వము దౌర్జన్యము మొదలయినవాని వలన ఇది కలుగుతుంది. ఉదా:—

అభిజాత్యా గుణై రూపేణవ మత్తః కిమహో అధికా?
య త్తాం ప్రతాపరుద్రో బహుమన్యతే భాగధేయం తత్.

ప్రతాపరుద్రుని ప్రియురాలు తన చెలికత్తెతో ఈవిధముగా అంటున్నది. కులముచేగాని గుణములచేగాని రూపముచేగాని నాకన్న భూమి అధికురాలా ఏమి? ప్రతాపరుద్రుడు ఆమెనే బహుమానించుతున్నాడే. ఆమె నాకన్న ఎట్లా అధికురాలు? కాకపోయినా ఆయన ఆమెను అట్లా అభిమానించుతూ ఉన్నాడంటే అది ఆమె భాగధేయమె కావాలి. దీనిలో నాయకకు భూమిపై అసూయఉంది.

ప్రతాపరుద్రుడు ప్రేమించుట అనే ఆమె ఉత్కర్షను ఈమె సహించలేకుండా ఉన్నది.

౩౪ మదము

మదిరాది కృతో మోహహర్షవ్యతికరో మదః

మద్యపానాదికము వలన కలిగిన హర్షమోహ సంకరమును మదమని పేరు. మోహము అంటే విచిత్తత. మనస్సు సరిగా ఉండకపోవడము. ఉదా:—

భణతి చాసంగతార్థం హసతి వ్యామీలయతి చ రాగభరితాక్షీ
ప్రియచింతామదిరయా పరవశా పశ్యత శ్యామాంగీ.

ఈ శ్యామాంగి ప్రియచింత అనే మదిరచేత పరవశురాలు అయింది. సరిగా అర్థసంగతి లేకుండా పలుకుతున్నది. రాగభరిత నేత్రాలు కలదై అమందముగా నవ్వుతున్నది. చూడండి! మద్యము పుచ్చుకొన్నవారుకూడా ఎర్రనికన్నులు కలవారై నవ్వుతారు. అసంబద్ధంగా మాట్లాడుతారు.

ఈమె ప్రియ చింతవలన విక్లబురాలయింది. నేత్రాలతో అనురాగ భరమును సూచించుతున్నది. సమన్వయము సులభము.

౩౫ శ్రమము

శ్రమం ఖేదోఽధ్వరత్యాదేః జాతః స్వేదాతిఘాయుకృత్.

ప్రయాణము సురతము మొదలయిన వానివలన కలిగిన ఖేదానికి శ్రమము అని పేరు. దీనివలన స్వేదాతిశయము కలుగుతుంది. ఉదా:—

ఆగచ్ఛత్యేవ ప్రియే విస్మృతుత్కంఠవతీ గతాగతాయాసం,
తామ్యసి స్వేదజలైః సుందరి లులితాంగరాగాసి.

ప్రియుడు వస్తూనే ఉన్నాడుకదా! ఇంతట్లోనే ఇంత తొందరఎందుకు ? మాటి మాటికి గమాగమాయాసమును ఎందుకు పొందుతున్నావు ? నీకు చెమట పట్టింది. చాలా శ్రమపడు తున్నావు. సుందరీ! చూచావా ? నీ అంగరాగము అంతా చెమటవలన విలులితమయి పోయింది. ఎందుకు ఈ శ్రమ ? ఈ పద్యములో గతి నిమిత్తకమయిన శ్రమ ఉన్నది. సురతాభిలాషిణి అయిన నాయిక గతాగతాయాసమును పొందింది.

౭ ఆలస్యము

మందోద్యమత్వ మాలస్యం కర్తవ్యేషు ప్రకీర్త్యతే.

చేయదగిన పనులలో ఉద్యమము మందముగా ఉండడము ఆలస్యమవుతుంది. మనస్సు అన్యాసక్తమై ఉన్నందువలన కర్తవ్యములలో సరిగా ప్రసరించదు. ఆ మందత్వమే ఆలస్యము. ఉదా:—

ఆస్తాం మృగాక్ష్యాః గృహకృత్య వార్తా
స్వాంగోపచారేష్వపి యత్నమాంద్యం,
కర్తవ్యమగ్రే దయితస్య యత్ స్యాత్
నూనం బలాత్కారయతి స్మరస్తత్.

ఈ మృగాక్షికి గృహకృత్యవార్త అట్లా ఉండనివ్వండి. తన అంగ సముపచారములలో కూడా ఈమె పని మరీ మందగించి ఉన్నదే! ప్రియుడు వచ్చిన తరువాత ఆయన ఎదట దగ్గర చేయవలసిన పనులు చాలా ఉన్నవే! అవి అన్నీ ఎట్లా అవుతవో ? అవు నన్నను ! ! అప్పుడు ఆ కర్తవ్యమును అంతా మన్మథుడె చేయించుతాడు. పరవశురాలయి ఈ

పిల్ల వెల్ల మొగము వేసికొంటే ఆ మన్మథుడు బలవంతంగా నయినా చేయించి తీరుతాడు.

౮ దైన్యము

సత్త్వత్యాగా దనౌద్ధత్యం దైన్యం కార్పణ్య సంభవం.

సత్త్వము- అంటే మనస్సులోని దిటవుతనము. అది తగ్గిపోవడము వలన ఉద్ధతత్వము అంతా పోతుంది. అదె దైన్యము. దార్గత్యము వలన కూడా ఈ అనుద్ధతత్వము కలుగవచ్చు. అదీ దైన్యమె. దీనివలన కార్పణ్యము కలుగుతుంది. అంటే దీనదీనము లయిన మాటలు అన్నమాట. ఉదా:—

ఆనేతుం నరనాథం గతః ఖలు సఖీజనో విలంబతే,
మన్మథ! నమామి చంద్రం శిక్షయ! చిరయ! ఈషదితి.

నరనాథుని తీసికొని రావడమునకై సఖీ జనము వెళ్ళింది. ఇంకా రాలేదు. విలంబనము చేస్తున్నది. మన్మథా! నీకు నమస్కారము చేస్తానయ్యా! "తొందర పడకు. ఇంకా కొంత ఆలస్యము చేయవలసిన"దని చంద్రుణ్ణి నీవు శిక్షించు. ఆతడు వెన్నెల కాస్తూ నన్ను వ్యథపెట్టుతున్నాడు. నీవు ఆతణ్ణి ఆజ్ఞాపించక పోతే నేను బాధ పడవలసి వస్తున్నది. దీనిలో ప్రతిమాలు కొనడము, కృపణోక్తి ఉన్నందున దైన్యము అవుతుంది.

౯ చింత

ఇష్టానభిగమాద్ధ్యానం చింతా శూన్యత్వ తాపకృత్.

అపేక్షితమయిన వస్తువు కాని, ఇష్టుడయిన ప్రియుడుకాని సమయానికి లభ్యము కాకపోయినట్లయితే కొంత ఆలోచన ధ్యానమూ కలుగుతుంది. అదే చింత, దీనివలన శూన్యత్వము తాపము కలుగుతుంది. ఉదా:—

సన్నిహితమపి గురుజనం న చ ప్రేక్షతే పృష్టాపి నాలపతి,
ఏషాపి మూర్గతి గతిం హృదయస్య ప్రియానుబంధస్య.

దగ్గరలో ఉన్నా గురుజనమును చూడదు. పలకరించినా పలకదు. ప్రియానుబంధముతో ఉన్న హృదయము యొక్క గతి ఏమిటో? అని ఈమె వెదుకు తున్నది. ఇష్టుడయిన ప్రియుడు రాలేదే! ఏమి చేయనా? అని బెంగతో ఆ పిల్లది ఉన్నట్లు వర్ణితము. ఈ పద్యము పూర్వార్ధములో శూన్యత్వమున్నూ ద్వితీయార్థములో ప్రియానవాప్తిమూలకమయిన ధ్యానమున్నూ చెప్పబడింది.

౧౦ మోహము

మోహస్తు మూర్ఛనం భీతిదుఃఖావేశానుచింతనైః.

భయావేశము దుఃఖావేశము నిత్యమూ అనుచింతనముల వలన విచిత్తతా రూపమయిన మూర్ఛనము కలుగుతుంది. అదే మోహము ఉదా:—

కథమపి గమయిత్వా వాసరం దీర్ఘదీర్ఘం
విరచితనవవేషా ప్రేషయిత్వాథ దూతీః
చిరయతి హృదయేశే ప్రాంశుభి శ్చంద్రపాదైః
అభిహతసకలాంగీ మూర్ఛితా కోమలాంగీ.

అతికష్టముగా ఏదోవిధముగా దీర్ఘదీర్ఘమయిన పగటిని గడిపి సూర్యుడస్తమించి చీకటిపడగానే నవవేషమును రచించుకొని దూతికలను పంపింది. ప్రియుణ్ణి తీసికొని రావడానికై. 'ఇంకా రాలేదు. ఇంకా రాలేదన్న ఆవేగము వలన దూతి తరువాత దూతిని ఇట్లా అనేక దూతికలను పంపింది. అప్పటికీ ఆయన రాలేదు. ఇంకా ఆయన ఆలస్యముచేస్తూ ఉంటే ప్రాంశువులు (దీర్ఘములు) అయిన చంద్రకిరణాలు ఆమెను

బాధపెట్టినవి. శరీరావయవాలన్నీ వెన్నెల తాకుడువలన హూనం హూనం అయినవి. ఇక ఆ కోమలాంగి తాళ లేక మూర్ఛపోయింది.

౧౫ స్మృతి

పూర్వానుభూతవిషయం జ్ఞానం స్మృతి రుదాహృతా,

పూర్వము అనుభవించిన పదార్థములను సంబంధించి ఉన్న జ్ఞానము స్మృతి అవుతుంది. సదృశవస్తువును చూచి నప్పుడు పూర్వ విషయాలు జ్ఞాపకమునకు వస్తవి. అట్లాగే అనుచింతనము వలన సంస్కారము ఉద్బుద్ధము అవుతుంది. అప్పుడు వెనుకటి స్మృతి కలుగుతుంది. ఉదా:—

ప్రతాపరుద్రస్య భుజే వసంత్యా క్షోణ్యా తపః కీదృశమార్జితం స్యాత్,
స్పృష్టం సకృద్యేన మదీయమంగం ప్రాప్నోతి విష్వక్సుఖ వజ్రలేపం'

స్పర్శ వలన కలిగిన సుఖమును స్మరించడము ఈ పద్యములో ఉన్నది. ఒక నాయిక ఇట్లా అనుకుంటున్నది. ప్రతాపరుద్రుని భుజమందు నిత్యనివాసము చేస్తూ ఉన్న భూమి ఎటువంటి తపస్సును ఆర్జించిందో కదా! ప్రతాపరుద్రుడు ఒక పర్యాయమె స్పృశించినా నాశరీరము అంతటా సుఖ వజ్రలేపమును పొందుతున్నదే! భుజవాసిని అయిన భూమికి నిత్యస్పర్శ ఉంటున్నందువలన ఆమె ఇంకా ఎంతటి సుఖాన్ని అనుభవిస్తు తున్నదో? ఈ పద్యములో నాయిక పూర్వము కలిగిన స్పర్శ సుఖమును స్మరించుతూ ఉన్నందు వలన సమన్వయము విశదమె.

౧౬ ధృతి

ధృతి శ్చిత్తస్య నైస్పృహ్యం జ్ఞానాభీష్టాగమాదిభిః.

జ్ఞానము ఇష్టమయిన వస్తువు యొక్క ప్రాప్తి మొదలయిన

వాని వలన చిత్తమునకు నిస్పృహత్వము కలుగుతుంది. దానికి ధృతి అని పేరు. ఉత్తమ జ్ఞానము కలిగితే ఇతర వస్తువులపై వేరుగా స్పృహ ఉండదు. అదే ధృతి. ఉదా:—

వీరరుద్రనృపతౌ హృదయ ! త్వ ద్వల్లభే త్రిభువనైకధురీణే,
సాధు ! సాధు ! కృతకృత్యమసి త్వం మన్యసే ! జగ దశేషమసారం,

ఓ ! హృదయమా ! వీరరుద్ర నృపతి నీవల్లభుడు. మూడు లోకాలలోనూ ఏకైక ధురీణుడు. ఆతడు నీకు ఆ విధముగా వల్లభుడు కాగానే నీవు కృతకృత్య మయినావు. సర్వజగత్తు అసారముగా భావించుతున్నావు. దీనిలో అభీష్ట మయిన ప్రతాపరుద్రుని ప్రాప్తివలన ఆ నాయికకు నిస్పృహత్వము కలిగింది. అందువలన ధృతి.

౧౩ వ్రీడ

చేతస్సంకోచనం వ్రీడాఽనంగరాగస్తవాదిభిః

మనస్సుకు సంకోచము కలగడము అనగా వికాసము లేకుండా మనస్సు సంకుచితము కావడము వ్రీడ అవుతుంది. ఈ సమయములో మనస్సుకు ధార్ష్ట్యము ఉండదు. ఇది అనంగ రాగము వలన కాని అంటే మన్మథుడు నిమిత్తముగా కలిగిన అనురాగము వలన కాని, ఇతరులు చేసిన స్తోత్రాల వలన కాని తన సంప్రదాయ సిద్ధములయిన ఆచారాలు నశించి పోవడము వలన కాని కలుగుతుంది. ఉదా:—

తథా సమాలోకన కౌతుకానాం మనోరథై రంధ్రపురాంగనానాం,
విలోకితే రుద్రనృపే భవంతి పర్యస్త పక్ష్మాణి విలోచనాని.

ఆంధ్ర పురములోని స్త్రీలు ప్రతాపరుద్రుని అవలోకనము చేయాలని అత్యంతమూ కుతూహలముతో ఉన్నారు. అటువంటి వారి కోరికలు ప్రబలములు అయి ఉన్నవి. ఈ సమ

యంలో రుద్ర నృపుడు వీరిని చూడగానే వీరి నేత్రాలు పర్యస్త పక్ష్మములు అవుతున్నవి. రెప్పలు దిగజారుతున్నవి. రుద్ర దేవుని యందలి అనురాగము చేత ఆతడు కృపావలోకనము చేసినా స్త్రీలకు మనస్సంకోచము కలిగింది. కాబట్టి వ్రీడ.

౧౪ చపలత

చాపలం త్వనవస్థానం రాగద్వేషాది సంభవం.

రాగము ద్వేషము మాత్సర్యము మొదలయిన వాని వలన అనవస్థానము కలుగుతుంది. అంటే చిత్తము ఒక విధముగా నిలకడగా ఉండక చెదురుతూ ఉంటుంది. దీనినే చాపలము అంటారు. చాపలమే చపలత. ఉదా:—

దృష్ట్వా రుద్రనరేంద్రం తరళతరాక్షీ విలాస మృదుహాసా
కలయతి మౌక్తి కహారం స్పృశతి చ కర్ణోత్పలం బాలా.

అనురాగ మూలక మయిన చాపలము దీనిలో నిర్దేశింపబడుతున్నది. ఒక బాల రుద్రనరేంద్రుని చూచి తరళ తరళములయిన నేత్రాలు కలదయింది. విలాసముతో మృదువయిన హాసమును విశదము చేస్తున్నది. ఏమీ తోచక మెడలోని మౌక్తిక హారమును చేతితో పట్టుకొంటున్నది. చెవిలోని నీలోత్పలమును స్పృశించుతున్నది. దీనిలో నాలుగు చేష్టలు ఉన్నవి. క్షణకాలమయినా మనస్సు ఒక చోట ఉండడము లేదు. ఈ అనవస్థానము వలన చాపలము ను ఊహించాలి

౧౫. హర్షము

ప్రసత్తి రుత్సవాదిభ్యో హర్షః స్వేదాశ్రు రింపకృత్

ప్రియుని ఆగమనము పుత్రజననము మొదలయిన ఉత్సవాదుల వలన ప్రసత్తి అనగా మనఃప్రసాదము కలుగుతుంది.

దానికి హర్షము అని పేరు. స్వేదము అశ్రువు కంపములకు హేతువు. ఉదా:—

> యత్పూర్వం సరసీషు పద్మముకుల వ్యాజాత్తప స్సంచితం
> వక్షోజౌ! యువయో స్తదద్య ఫలితం జాతౌ కృతార్థౌ యువాం
> దత్తా కాకతివల్లభేన భవతో రేషా స్వవక్షస్థలీ
> కస్తూరీ ద్విగుణీభవ త్పరిమళా కల్హారమాలా యతః

ఒక యువతి తన కుచాలను సంబోధించుకొని వానికి ప్రియుడు స్వయంగా పద్మమాలను ఇచ్చినందు వలన ధన్యత్వము కలిగిందని అని చెప్పుతూ తన హర్షమును దీనిలో స్పష్టము చేస్తున్నది. ఓ! వక్షోజముల్లారా! మీరు పూర్వ జన్మలో సరస్సులలో నివసించి పద్మ కోరకములు అనే మిషతో తపస్సును సంపాదించారు. ఆ సంచితమయిన తపస్సంతా ఇప్పుడు ఫలించింది. మీరు ఈ నాడు కృతార్థులు అయినారు. ఏమంటే కాకతి వల్లభుడు తన వక్షస్థలములోని కల్హారమాలను ఇచ్చినాడు. ఆ మాల ఆతని వక్షస్సు పై ఉన్న కస్తూరి చేత తన పరిమళమును రెట్టింపు చేసుకొన్నది. ఆ పుష్పమాలను ఆయన మీకు ఇచ్చినాడు కదా! అనురాగముతో ప్రియుడు ఇచ్చినట్టి కల్హార మాల వలన ఆ కామినికి హర్షము కలిగింది,

౧౬. ఆవేగము

ఇష్టానిష్టాగమాజ్జాతః ఆవేగశ్చిత్తసంభ్రమః

ఇష్ట ప్రాప్తి వలన కాని అనిష్ట ప్రాప్తి వలన గాని చిత్తమునకు సంభ్రమము కలుగుతుంది. దానికి ఆవేగము అని పేరు. ఈ ఆవేగము దైవికముగా కలుగవచ్చు. రాజ్యవిప్లవాదుల వలన కలగవచ్చును. ఉదా:—

నిస్సాణధ్వని మాకలయ్య సహసా హేలా విహారోద్యతం
ప్రష్టుం కాకతి వీరరుద్రనృపతిం ప్రత్యగ్ర కౌతూహలాః
అర్ధాలంబిత మండనాః ప్రతిపదం వ్యత్యస్తభూషా జవా
దారోహన్తి సువర్ణసౌధ వలభీ శృంగాణి పౌరస్త్రియః

కాకతి వీరరుద్రనృపతి ఎక్కడికయినా బయలుదేరే టప్పుడు భేరీని ప్రమోగించుతారు. ఒకప్పుడు ఆయన విలాస వ్యవహారానికి ఉద్యమించి బయలుదేరగానే నిస్సాణధ్వని వెలువడింది. అదివినగానే వేగంగా ఆతనిచూడ వలెనని పౌరస్త్రీలునూ నూతన కౌతూహలము కలవారయినారు. అలంకరించు కొంటూ సగము సగము మాత్రమే అలంక రించుకొని వేగిరపడుతున్నారు. ప్రతిస్థానములోనూ అభర ణాలను వ్యత్యాసముగా ఉంచుకొంటున్నారు. ఇట్లా అయి వేగముతో సువర్ణ సౌధవలభీ శృంగాలను అధిరోహించు తున్నారు. ఇష్టుడయిన ప్రతాపరుద్రుడు వస్తూఉన్నందువలన చిత్తసంభ్రమము కలిగిన పౌరస్త్రీల ఆవేగము దీనిలో స్పష్ట ముగా ఉన్నది.

౧౭ జడత

జాడ్య మప్రతిపత్తిః స్యాదిష్టా నిష్టాగ మోద్భవా.

ఇష్టప్రాప్తి వలన అనిష్ట ప్రాప్తివలనా కర్తవ్య మూఢ త్వము కలుగుతుంది. దానికి జాడ్యము అని పేరు. హఠాత్తుగా అనుకోనని ఇష్టము సంప్రాప్తమయి నప్పుడు మనస్సు స్తబ్ధమై పోవచ్చును. అప్పటిస్థితిలో ఏమీ జ్ఞానము ఉండదు. ఏమిచేయవలెనో ఏమితోచదు. దీనికి అప్రతిపత్తి అనిపేరు. అప్రతిపత్తే జాడ్యము. అదేజడత. ఉదా:—

సమాయాతే నాథే ప్రమనసి గృహాన్ రుద్రనృపతౌ
వపుస్సౌందర్యశ్రీ విజిత మదనోదార యశసి
వధూ రంతస్తోష వ్యతికరవశా న్నోపచరితుం
పురస్తా దాలీనాం న చలతి తథానో విరమతి.

ఉదారమనస్సు కలిగిన ఆత్మనాథుడయిన రుద్రనృపతి ఇంటికి వచ్చినాడు. ఆతడు వపుస్సౌందర్య శోభచేత మన్మథుని ఉదారయశస్సును జయించినాడు. ఇటువంటి సుందరుడు రాగానే ఆవధువు చెలికత్తె లందరూ దగ్గర ఉండడముచేత సిగ్గుపడి తనకు కలిగే మనోభావాలను అదిమి పెట్టుకుంటున్నది. అప్పుడు ఆమెకు కలిగిన అంతస్తోష సంబంధము వలన ఆ చెలికత్తెల ఎదుట ఉపచారము చేయడాని కయినా కదలదు కదలకనూ పోదు. ఉపచరించడము మానీ వేయదు. అట్లా కాకనూపోదు. ఆమెకు ఉపచరించాలని ఉత్కంఠా కలుగుతున్నది' లజ్జకూడా ఉదయించుతున్నది. ప్రవృత్తి నివృత్తి రెండూ ఆవధువును అటూ ఇటూ లాగుతున్నవి. ఏవ్యాపారమూ ఆమెలో కలగడములేదు. ఇష్టప్రాప్తి వలన ఆమెలోని అప్రతిపత్తి ఇక్కడ నిదర్శితమయింది.

౧౮ గర్వము

అన్యధిక్కరణాదాత్మోత్కర్షో గర్వః బలాదిజః

బలము ఐశ్వర్యము గొప్పవంశము లావణ్యము విద్య మొదలయిన వానివలన ఆత్మోత్కర్షాభిమానం కలుగుతుంది. దీనివలన ఇతరులను ధిక్కరించడము అవమానపరచడము మొదలయినవి కలుగుతవి. దీనికి గర్వము అనిపేరు. ఉదా:—

కోవా శస్త్రగ్రహణ సమయో మాదృశా మీదృశానాం
కీదృగ్వైరం ప్రతిధరణిభృ త్కీటకీటే ష్వమీషు

ఇత్యావేశ ప్రతిభయ భుజాటోప దుర్వార గర్వాః
సంక్రీడంతే రణభువి భటాః కాకతీంద్రస్య జేతుః

బల మూలకమయిన గర్వము దీనిలో నిరూపితము అవుతున్నది. శస్త్రమును గ్రహించవలెనను నియమము మాకు ఎందుకు? ఇటువంటి మాకుకూడా ఆ నియమమా? క్షుద్రకీటములవంటి ఈరాజుల విషయమై మాకు వైరమేమిటి? మాఅంత గొప్పవారికి ఈక్షుద్రులతో వైరము ఉన్నదని అనడముకూడా లజ్జాకరముగా ఉంది, ఈవిధమయిన వచనాలతో గొప్పఆవేశముతో భయంకరమయిన భుజాటోపముతో వారింపరాని గర్వము కలవారై కాకతీంద్రుని భటులు రణభూమిలో క్రీడ చేసను స్తున్నారు. ఆయుద్ధము వారికి ఏమీ ప్రయాసకరముగా లేదు. దీనిలో భటుల వచనములందు గర్వము కన్పించుతూనే ఉంది.

౧౫ విషాదము

విషాద శ్చేతసోభంగః ఉపాయాభావ చింతనైః

ఆరంభించిన కార్యము చెడిపోయినందు వలన తన అపరాధము తెలిసినందువలనా విఘ్నములు కలిగినందువలనా ఆపదలు వచ్చినందు వలనా, వీటిని పోగొట్టు కొనడానికి ఉపాయములు ఏమీ కన్పడక వ్యాకులపాటు ఉండడము చేతనూ చేతోభంగము కలుగుతుంది. దీనికి విషాదము అని పేరు. ఉదా:—

ప్రేషయామి మన ఇతి ముధా తన్మాం ముక్త్వా వల్లభే లగ్నం
మాముజ్ఝిత్వా నో గచ్ఛతి మదనః సఖి! కిం ను కర్తవ్యం?

ఒకనాయిక సఖితో పలుకుతున్నది. ఓ! సఖీ! నామనస్సు ప్రియుని పంపించుతానని చెప్పి నన్ను విడిచి ప్రియుని దగ్గ

రకు వెళ్లి ఆతని యందే లగ్నమయింది. నా మనస్సు అక్కడి నుండి మరలదు కదా! మదనుడు కూడా నన్ను విడిచి పోడే! నేను ఏమిచేసేది? ఆతని యందు కల ఉత్కంఠాను రాగము నన్ను ఇంతగా వ్యాకుల పెట్టుతున్నది. ఆతని పైని అను రాగము కలతపెట్టు తున్నది. ఏమి చేయడానికీ తోచదు. అని భావము. సమన్వయము స్పష్టమె.

౨౦ ఔత్సుక్యము

కాలాక్షమత్వ మౌత్సుక్యం మనస్తాప త్వరాదికృత్

ఇష్ట విరహము వలన రమ్య వస్తువును చూడవలెనని కోరికవలనా కాలవిలంబనమును సహింపలేక పోవడము ఉంటుంది. దీనికి ఔత్సుక్యము అని పేరు. మనస్తాపము త్వర, నిశ్వాసము, నిద్ర మొదలయిన వానికి ఇది హేతువు అవుతుంది. ఉదా:—

ఆంధ్రపుర భామినీజనో౽ంగాని ప్రసాధ్య త్వరమాణః
రుద్రనరేంద్రాగమనే విలంబితం సహతే కృచ్ఛ్రేణ.

ఆంధ్ర పురములోని భామినీజనము శరీరాలను బాగా అలంకరించుకొని రుద్రనరేంద్రుని ఆగమనంలో ఆలస్యమును అతికష్టముగా సహించుతున్నది. దీనిలో 'కృచ్ఛ్రేణ సహతే' అనడము చేత కాల విలంబనమును సహించ లేకుండా ఉన్నారని భావము కలుగుతుంది. అందువలన ఔత్సుక్యము.

౨౧ నిద్ర

నిద్రా చిత్త నిమీలనం.

చిత్తమునకు నిమీలనము కలగడము నిద్ర అవుతుంది. మనస్సు బాహ్యేంద్రియ సంబంధముతో ఉండకపోవడమును ఇక్కడ గుర్తించాలి. ఉదా:—

స్వప్నే దృష్టం దయితం వధూ రాలింగితుం కృతోద్యోగా
పశ్యత ! దరమీలితాక్షీ గగనే కరౌ ప్రసారయతి.

ఆ వధువు స్వప్నములో కన్పడిన ప్రియుని ఆలింగనము చేసికొనవలెనని ప్రయత్నము చేసినదై కన్నులు మూతమూసి కొనియే ఆకాశములో చేతులు చాచుచున్నది. చూడుడు ! ఈ పద్యములో అలీక ప్రియుని ఆలింగనము చేసికోవలెనని ప్రయత్నము చేయడము వలన ఆ నాయికకు అనవరత చింత ఉన్నట్లు స్పష్టము అవుతున్నది.

౨౨ అపస్మారము

ఆవేశో మోహదుఃఖాద్యై రపస్మారోంగ తాపకృత్.

మోహము దుఃఖము మొదలయిన వానివలన ఆవేశము కలుగుతుంది. దీనికి అపస్మారము అని పేరు. అంగతాపమును ఇది కలుగచేస్తుంది. ఉదా:—

దృష్ట్వా స్వప్నే కుపితవదనం కాకతీయ క్షితీంద్రం
హా ! హా ! రక్షేత్యసకలగిర స్సంభ్రమోత్థాన భాజః
ధావంత్యంతర్వణభువి లుఠంత్యాహ్వయంత్యాత్మబంధూ
నారా ద్భూతానపి రిపుగణా వ్యస్త నామగ్రహేణ.

శత్రుగణములు స్వప్నములో కాకతీయ క్షితీంద్రుని కుపితవదనము కల వానినిగా చూచి భయపడి "హా ! హా !! రక్ష....! అంటున్నారు. 'రక్షత' అని అనవలసింది 'రక్ష' అని అనడము వలన ఆమాట సంపూర్ణముగా లేదు. ఇట్లా అసకల వాక్కు-కలవారై గాభరాపడి నిద్రనుండిలేచి పరుగెత్తుతున్నారు. వనాంతర్భూమిపై పడి పొర్లాడుతున్నారు. తమ బంధువులు దగ్గర ఉన్నప్పటికీ వ్యస్త నామగ్రహణము లతో ఎక్కడో దూరముగా ఉన్నవారిని పిలిచినట్లుగా పిలు

స్తున్నారు. ఈ పద్యములో శత్రువుల అపస్మారము భయ హేతుకముగా మోహమూలకముగా ఉన్నది.

౨౩ సుప్తి

సుప్తి ర్నిద్రాసముద్రేకః

నిద్రయొక్క అతిశయమునకు సుప్తి అని పేరు. ఉదా:—

విశ్వైకరక్షాజుషి కాకతీంద్రే
నిశ్చింతతాం ప్రాప్తవతో మురారేః
తత్కీర్తిచంద్రాతపవర్ధితోపి
దుగ్ధాంబుధిర్నైవ భినత్తి నిద్రాం.

ప్రపంచమును బాగా రక్షించడమును బాగుగా స్వీకరించిన వాడై ప్రతాపరుద్రుడు ఉంటూఉంటే మురారికి నిశ్చింతత కలిగింది. అటువంటి నిశ్చింతతతో అతడు ఉన్నప్పుడు ప్రతాపరుద్రుని కీర్తి చంద్రునియొక్క వెన్నెలచే వృద్ధిని పొందినప్పటికీ పాల సముద్రము విష్ణువు నిద్రను భంగ పరచడము లేదు. ఎంతగా సముద్రము వృద్ధిని పొందినా విష్ణు నిద్రకు ఏమీ భంగ పాటూ లేకుండా ఉన్నది.

౨౪ విబోధము

విబోధ శ్చేతనావాప్తిః జృంభాక్షి పరిమార్గకృత్

చైతన్య ప్రాప్తికి విబోధము అని పేరు. ఆవలింతలు కన్నులు నులుముకొనడము మొదలయిన వానిని ఇది కలుగ జేస్తుంది. చేతన కలగగానె మాంద్యము తొలిగి పోతుంది. అదే విబోధము. ఉదా:—

ప్రతాపరుద్రే నృపమౌలి రత్నే
విశ్వంభరాం రక్షతి శిక్షితారౌ

విజృంభమాణాః పరితః ప్రజానాం
భాగ్యశ్రియ స్తత్క్షణ మున్మిషంతి.

రాజులకు చూడామణి అయిన ప్రతాపరుద్రుడు దుష్ట శిక్షకుడై విశ్వంభరను రక్షించు చుండగా ప్రజల భాగ్య శ్రీలు అంతటా కూడా తత్క్షణంలోనే విజృంభించుతూ ఉన్మేషము పొందుతున్నవి. ఇదివరలో నిద్రాణముగా ఉన్న సంపదలు ఇప్పుడు వృద్ధిని పొందుతూ ఉన్నట్లు వర్ణిత మవుతున్నది. సూర్యుడు ఉదయించినప్పుడు అదివరలో ముకుళించుకొని ఉన్న పద్మాలు వికసించడమున్ను విస్ఫారితములు కావడమున్ను ప్రసిద్ధము. నిద్రించుతూ ఉన్న జనులు చేతన రాగానే మేల్కొని ఆవలించడము లోకసిద్ధమె. "విజృ భమాణాః ఉన్మిషంతి" ఈ పదాల వలన ఈ చెప్పిన అర్థాలకు అభేదా ధ్యవసానము గోచర మవుతున్నది. భాగ్యసంపదలకు ఉన్ని ద్రతా రూపమయిన విబోధము ఈ రూపముగా వర్ణిత మయింది.

౨౫ అమర్ష

అమర్షః సాపరాధేంషు చేతః ప్రజ్వలనం మతం.

అపరాధము చేసిన వారల విషయమై మనః ప్రజ్వలనము కలుగుతుంది. దానికి అమర్ష అని పేరు. తనను అధిక్షేపము చేసినా అవమానము చేసినా మళ్ళా ప్రతిక్రియ చేయాలన్న బుద్ధి కలుగుతుంది. ఇదే మనః ప్రజ్వలనము. ఉదా:—

అరే! భూపా శ్చాపా న్నమయత ! శిరాం స్యున్నమయత
ప్రవృత్తాః స్వస్త్రీణా మహమహమికా వీరవరణే
త్వపంతే నః ఖడ్గాః ప్రవిదలన కేల్యామితి భటా
రణాగ్రే గర్జంతి ప్రకటితరుషో రుద్రనృపతేః.

ఓరీ! రాజుల్లారా! ధనుస్సులను వంచండి. శిరస్సులను పైకివెత్తండి. మీరు ఇట్లా చేస్తే యుద్ధ హతులై వీరస్వర్గము పొందుతారు. నేను నేనని స్వర్గ స్త్రీలను వీరత్వముతో వరించడమునకే మీరు ప్రవర్తించి యుద్ధము చేయండి. ఖండన క్రీడలో మా ఖడ్గాలు త్వరపడుతున్నవి. అని ప్రతాపరుద్రుని భటులు రోషమును ప్రకటించుచుతూ యుద్ధాగ్ర భాగములో గర్జించుచున్నారు. భటులు శత్రువుల విషయమై ప్రతి చికీర్షతో ఉన్నట్లు వర్ణిత మయినందు వలన అమర్షము సమన్వయించుకోవాలి.

౨౯ అవహిత్థ

హర్షాద్యాకార సంగుప్తి రవహిత్థేతి కథ్యతే

హర్షాద్యాకారములను సంగోపనము చేసికొనడము అవహిత్థ అనబడుతున్నది. ఉదా:—

గోష్ఠ్యాం మహిళానాం శ్రుత్వా ప్రతాపరుద్ర చరితాని,
ఆలిఖ త్యవనతముఖీ ముగ్ధా చరణేన మహీపృష్ఠం.

ఒకముగ్ధస్త్రీ, స్త్రీలగోష్ఠిలో ప్రతాపరుద్ర చరితములను విని ముఖమును వంచుకొన్నదై పాదముతో భూమిపృష్ఠమును లిఖించుచున్నది. ఆ స్త్రీల ప్రసంగములో తన అనురాగమును వృద్ధిని పొందించునట్టి ప్రియు చరితములను విని చాలా సంతోష పడింది. సిగ్గు పడింది. తన హర్ష లజ్జలు ముఖ వికాసమూ ఇతరులను కన్పడుతవేమోనని తలవంచుకొని ఉన్నది. ఈ విధముగా ఆకార సంగోపనము స్పష్టమె.

౨౭ ఉగ్రత

దృష్టేఽపరాధే చండత్వ ముగ్రతా తర్జనాదికృత్.

అపరాధము కన్పడగా చండత్వము ఉండడము ఉగ్రత

అనబడుతుంది. పుత్రమిత్ర కళత్రాదులకు ఎవరయినా ద్రోహము ఒనరింపగా క్రౌర్యము కలుగుతుంది. ఇది తర్జనాదికమును కలుగ చేస్తుంది.

ప్రియ మానీయ మానిన్యా విరహార్తి ర్నివార్యతాం
యదేతస్యాః కటాక్షోల్కా-పాతై రిందు ర్మషీకృతః

ఒక విరహిణీ సఖి ప్రియుని గురించి దూతికను పంపుతున్నది. ఆమెతో అనే వచనము. ప్రియుని తీసికొని వచ్చి ఈ మానిని యొక్క విరహ బాధను నివారింప చేయండి ఎందువలనంటే; ఈమె కటాక్షోల్కా పాతము చేత చంద్రుడు మసి అవుతున్నాడు. ఈ విరహిణి ప్రియ ప్రాప్తి లేనందు వలన బాధపడుతూ విరహోద్దీపకుడయిన చంద్రుని యందు కోపము కలదై చంద్ర నిందనము చేస్తున్నది. అందువలన ఆమెలోని ఉగ్రత స్పష్టమే.

౨౮. మతి

తత్వమార్గానుసంధానా దర్థనిర్ధారణం మతిః

నానావిధ శాస్త్ర చింతనము ఊహాపోహాలు తత్వమార్గము మొదలయిన వాని యొక్క అనుసంధానము వలన కార్యమును నిశ్చయించుట మతి అవుతుంది. ఉదా:—

కస్సంశయో మహీతలే చంద్ర ఏవ వీరరుద్ర నరనాథః
యస్య కరస్పర్శా దంగాని మృగాంక రత్నంతి.

వీరరుద్ర నరనాథుడు భూమిలో చంద్రుడే. ఇంకా సంశయము ఏమి ఉంది? ఆతని కరస్పర్శ వలన అవయవాలు చంద్రకాంత మాణిక్యము లవుతున్నది. చంద్ర కిరణ స్పర్శ కలిగితే చంద్రకాంత శిలలు ద్రవీభూతములు అవుతవి, ఇక్కడ నాయకునీ కరస్పర్శ వలన అవయవములు ద్రవీభూతములై

పారవశ్యమును ఇస్తున్నవి. ఆతడు చంద్రుడే కాకపోయినట్లయితే అవయవాలు మృగాంకరత్నములు కావు. ఇవి ఇట్లా అయినందు వలన ఆతడు చంద్రుడే అని అర్థ నిర్ధారణము ఉన్నందు వలన మతి అవుతున్నది.

౨౯. వ్యాధి

మనస్తాపాద్యభిభవాత్ జ్వరాది ర్వ్యాధి రిష్యతే.

మనస్తాపము మొదలయిన వాని ఆఘాతము వలన జ్వరాదికము కలుగుతుంది. దానికి వ్యాధి అని పేరు ఉదా:—

ప్రతాపరుద్రస్య దిశాం జిగీషోః ప్రత్యర్థి నారీజన దేహ జన్మా
స్మరజ్వరోష్మా హిమవత్ప్రదేశాః స్మర్తవ్య నీహారకథాః కరోతి.

దిగ్విజేత అయిన ప్రతాపరుద్రుని యొక్క శత్రు స్త్రీ జన దేహమునందు ఉత్పన్నమయిన మన్మథ జ్వరము యొక్క ఊష్మ హిమవ త్ప్రదేశములో నీహార కథలను స్మరింప చేస్తున్నది. ఎంత చల్లని ప్రదేశాలలో ఉన్నప్పటికీ మన్మథ జ్వరము ఉష్ణాధిక్యముగా ఉన్నందువలన ఇంకా కామాపేక్ష కలుగుతుంది. అందువలన ఈ తాపజ్వరము చాలా గొప్పది అని భావము. వ్యాధి సమన్వయము స్పష్టమే.

౩౦. ఉన్మాదము

ఉన్మాదః తుల్యవర్తిత్వం చేతనాచేతనేష్వపి.

చేతనములందు అచేతనములందున్నూ సమానముగా ప్రవర్తించడము ఉన్మాదము అవుతుంది. భయము సన్నిపాత రోగము, ఇష్ట వియోగము ధన నాశము మొదలయిన వాని వలన చిత్త విభ్రాంతి కలిగితే అది ఉన్మాద మన్నమాట. ఉదా:—

ప్రతాపరుద్రస్య జయప్రయాణ
భేరీధ్వనౌ మూర్ఛతి దిఙ్ముఖేషు
త్రాసాకులా భ్రాంతిముపేత్య వృక్షాన్
పృచ్ఛంతి మార్గం రిపుభూమి పాలాః

ప్రతాపరుద్ర దేవుని యొక్క జయప్రయాణ భేరీ ధ్వని దిఙ్ముఖాలలో వ్యాపించుతూ ఉంటే, భయపడి వ్యాకులపడి విభ్రాంతి పొంది రిపుభూమీపాలకులు వృక్షముల దగ్గరకు వెళ్ళి 'మాకు మార్గము చెప్పండి. మాకు గతి ఏమిటి?' అని అడుగు తున్నారు. ఇక్కడ అచేతనములు అని అనబడు వృక్షాలదగ్గరకు వెళ్ళి చేతన వ్యక్తులను అడిగి నట్లుగా అడగడము ఉన్నందువలన ఉన్మాదము అవుతుంది.

౩౧ మరణము

మరణం మరణార్థస్తు ప్రయత్నః పరికీర్తితః

మరణము కొరకయిన ప్రయత్నమును మరణము అని అంటారు. చనిపోయే అవస్థలో ఉండే చేష్టలను ఇక్కడ వర్ణించ వచ్చునని కొందరి భావము. మరణములో ఏమీ అభినయము ఉండదు కాబట్టి కావ్యములో దీనిని చెప్ప నక్కరలేదు. అని కొందరు అభిప్రాయపడుతున్నారు. ఉదా:-

ప్రియవిరహ మసహమానా వధూ ర్నిజజీవిత ముపేక్షమాణా
సేవతే జ్యోత్స్నాం దక్షిణపవనస్య తనుం సమర్పయతి.

వధువు ప్రియ విరహమును సహించలేక తన జీవితమును ఉపేక్షించుచూ ఇక ప్రాణాలను విడిచి పుచ్చాలనే అభిప్రాయముతో వెన్నెలను సేవించుతుంది. మలయ మారుతమునకు శరీరమును సమర్పించుతుంది. విరహతాపము పడే వారు వెన్నెలను మలయానిలమును సహించలేరు. కాబట్టి

ఆ వధువు మరణార్థమై ప్రయత్నించు తున్నదని గ్రహించాలి. సాక్షాన్మరణము అనేది అమంగళ ప్రాయము కాబట్టి ఉదాహరణము ప్రదర్శించడము ఉచితము కాదు. కాబట్టి తదర్థ ప్రయత్నమె నిర్దిష్టము.

౩౨ త్రాసము

ఆకస్మిక భయాచ్చిత్త క్షోభస్త్రాసః ప్రకీర్త్యతే

ఆకస్మికముగా కలిగిన భయము వలన మనస్సునకు క్షోభము కలుగు తుంది. దానికి త్రాసము అని పేరు. ఉదా:-

ప్రణయకుపితా చిరేణాపి వధూః శ్రుత్వా ఘనఘన స్తనితం
దయితం సరభస వలితా ఆలింగతి వేపమానాంగీ-

ఆ వధువు అప్పటి కప్పుడే ప్రణయ కుపితురాలై కూడా అట్లాగే ఉండి ఉండి మేఘధ్వనిని విని భయపడింది. అప్పుడు సర భసముగా మెలి తిరిగి కంపించే శరీరము కలదై ప్రియుని ఆలింగనము చేసికొంటున్నది. దీనిలో గర్జిత మూలమయిన త్రాసము వధువునకు వర్ణిత మయింది.

౩౩ వితర్కము

సందేహాత్కల్పనానంత్యం వితర్కః పరికీర్తితః.

సందేహమువలన అనేకములయిన కల్పనలు కలగడము వితర్కము అవుతుంది. విమర్శ వలన కూడా అనేకథా సంభావన ఉండవచ్చును. అప్పుడూ వితర్కమె. ఉదా:—

గుణైస్తస్త్రాసక్తం మమ హృదయ మన్యన్న గణితం
సఖీభి ర్నాలోచి క్షితిపతిరసౌ దుర్లభ ఇతి
ఉపాయః కో వా స్యాత్తదభిగమనే ? ముహ్యతి మనః
కియాన్ కోయం ? కీదృక్ కియదవధి రంతర్వ్యతికరః.

మహా కులీనత్వము మొదలయిన గుణములను చూచి ఆ క్షితిపతి యందు నాహృదయము ఆసక్తమయింది. ఇతర మయినది ఏమీ కూడా నాహృదయము గణించలేదు. నాహృదయము కామాంధమయినందువలన ఈ క్షితిపతి దుర్లభుడు అవుతాడేమో ఆ నేవిషయమును వివేకవతులు అయిన చెలికత్తెలతో కూడా ఆలోచించలేదు. అయినదేమో అయింది. ఇక ప్రియప్రాప్త్యుపాయమును చూస్తాను అని అందామా? ఆతని అభిగమనములో ఉపాయము ఏది ఉంటుందో కదా! నామనస్సు మూర్ఛ పడుతున్నది. ఈ మోహానంతరము ఆలోచించు దాము అని అనుకొన్నప్పటికీ; ఏమో! ఈ మోహము ఎప్పుడు పోతుందో? ఈమోహము ఏమిటో? ఇది ఎంతవరకు ఉంటుందో? ఇది ఏవిధముగా ఉన్నదో? ఎన్నాళ్లు ఇట్లా వ్యధపెట్టుతుందో ఏమీ ఊహింపలేము. ఈలోని వ్యతికరము ఈవ్యసనము ఇట్లా వ్యధపెట్టుతున్నది. ఈపద్యములో మోహము విషయమై సందేహమువలన కల్పనా నంత్యము నిరూపిత మయింది. కావున వితర్కము. ఇట్లా వ్యభిచారి భావములు నిరూపిత ములు అయినవి.

సాత్త్విక భావములు వ్యభిచారిభావములూ అనేక రసాలకు సాధారణములు. అందువలన నియతంగా ఒకవిశేషాన్ని బట్టి ఉదాహరణము ప్రదర్శించలేను. విభావములను తత్తద్రస ప్రస్తావములో ఉదాహరించి నిరూపించినట్లుగా వీనిని అట్లా చేయడమునకు వీలు లేదు. కాబట్టి సామాన్యంగా ఈసంచారులు వేరుగా నిర్దేశించబడినవి. సాధారణముగా శృంగార రసములో ఈసంచారులకు అన్నిటికీ అనుప్రవేశము కలుగు

తుంది. హాస్యరసములో గ్లాని శ్రమ చపలత్వము హర్షము అవహిత్థములు మాత్రమె సంభవించుతవి కరుణములో మద ధృతి వ్రీడాహర్షగర్వా త్సుక్యోగ్రత్వములు అనేభావములు ఉండవు. ఇవికాక ఇతరభావాలు దానిలో సంభవించుతవి. రౌద్రరసములో గ్లాని శంకాలస్య దైన్యచింతావేగ జడతా విషాదసుప్తి నిద్రాపస్మారావహిత్థావ్యాధ్యున్మాద శ్రమత్రాసములు సంభవించవు. ఇతరములు అక్కడ ఉండవచ్చును. వీరరసములో నిర్వేదముకూడా ఉండదు. రౌద్రములో ఉండని భావాలు దీనిలోనూ ఉండవు, భయానక రసములో అసూయా మదధృతి వ్రీడాహర్ష గర్వ నిద్రాసుప్త్యవహిత్థో గ్రతా మతిభావాలు ఉండవు. ఇతరములు మాత్రమె ఉంటవి బీభత్సములోనూ అద్భుతములోనూ చింతాత్రాసాదుల యొక్క స్థితిని యథాసంభవముగా ఊహించాలి. శాంతరసములో నిర్వేదము ధృతి ఈరెండుమాత్రము సంభవించుతవి.

శృంగారచేష్టా నిరూపణము

ఇక శృంగార చేష్టలను నిరూపించుతాము. దీనిలో కొన్ని చిత్తారంభములయిన భావాలు కొన్ని గాత్రారంభ (శరీరము) భావాలు. ఈచేష్టలు అన్నీ అనుభావాలె అవుతవని అంటున్నారు. వీనిలో కొన్నిభావాలు యౌవన జన్యములై ఉంటవి. యువతులను ఆశ్రయించి చేష్టా రూపములుగాఉన్న ఆ భావాలు ఉద్దీపన విభావాలుగాకూడా కావచ్చునని కొందరకు సమ్మతము. సంకీర్ణముగా ఉండే వీటికి ఒకప్రకరణ నియమము అంటూ లేదు. కాబట్టి నానిస్వరూప నిరూపణానికి ఇదేతగిన అవసరము. ఇవన్నీ పద్ధెనిమిది విధాలుగా ఉంటున్నవి.

౧ భావము	౨ హావము	౩ హేల
౪ మాధుర్యము	౫ ధైర్యము	౬ లీల
౭ విలాసము	౮ విచ్ఛిత్తి	౯ విభ్రమము
౧౦ కిలకించితము	౧౧ మోట్టాయితము	౧౨ కుట్టమితము
౧౩ బిబ్బోకము	౧౪ లలితము	౧౫ కుతూహలము
౧౬ చకితము	౧౭ విహృతము	౧౮ హసితము

వీనిలో మొదటి అయిదు భావాలూ చిత్తారంభములయిన శృంగార చేష్టలు. అంటే మనస్సులో పుట్టే వికృతు లన్న మాట. తరువాతనున్న పదమూడున్నూ గాత్రారంభములయిన శృంగార చేష్టలు. ఇవి శరీర చేష్టలలో అనుగతములై కనుపడుతూ ఉంటవి. ఇక వీని స్వరూపోదాహరణములను నిరూపించుతాము.

౧ భావము

రసాభిజ్ఞాన యోగ్యత్వం భావ ఇత్యభిధీయతే

రసమును తెలుసుకొనే యోగ్యత కలిగి ఉండడమునకు భావము అని పేరు. బాల్యము యౌవనము ఈ రెండు వయస్సుల సంధిలో శృంగారము విషయముగా ఒక అంతఃకరణ వికారము కలుగుతుంది. ఆ అవస్థలో శృంగారము అంటే ఏమిటో కొంచెము తెలియడానికి వీలు ఉన్నది. దానికే భావము అని పేరు. ఉదా:—

రుద్రనరేంద్రస్య గుణాన్ గాయతి బాలత్వే విస్రబ్ధం
లజ్జతే దరపులకితో యువతిజనో యౌవనే గాతుం

యువతి జనము బాల్యములో రుద్రనరేంద్రుని గుణాలను స్వేచ్ఛగా గానము చేసింది. యౌవనము వచ్చేటప్పటికి ఆ

గుణాలనె గానము చేయడానికి కొంతగా పులకిత శరీరము కలదై లజ్జపడుతున్నది. యౌవనము రాగానే కొంత వికారము ఉద్భవించడము రాగాభిజ్ఞానము ఉండడమూ ఇందులో వర్ణితము అయినందువలన ఇది భావమవుతుంది.

౨ హావము

ఈష ద్దృష్టవికారః స్యాద్భావో హావః ప్రకీర్త్యతే.

భావములో కొంతగా వికారము కన్పడినట్లయితే అదే హావము అవుతుంది. భావములో వికారము స్పష్టముగా కనపడదు. ఈ హావానికి కూడా పై పద్యమె ఉదాహరణము. దానిలో "దర పులకితః" అనే దానివలన పులకములు కొంతగా కొంచెముగా గోచరములు అవుతూ ఉన్నట్లు వర్ణిత మయినందు వలన హావమును గ్రహించాలి.

౩ హేల

సువ్యక్త విక్రియో భావః హేలేతి ప్రతిపాద్యతే

భావము వ్యక్త విక్రియ కలదయినప్పుడు హేల అవుతుంది. హావము కంటె కూడా హేల సువ్యక్తము అన్నమాట.

ఉదా:—

మా భవతు కస్యాపి స్ఫుట మితి ముగ్ధే కరోషి వల్లభం హృదయే
ఘోష్యతే తవ భావః సర్వాంగీణైః పులకైః.

ఓ! ముగ్ధా! ఎవరికీ కూడా స్ఫుటము కాకుండా ఉండాలని వల్లభుని హృదయములో దాచుకొన్నావు. అంతమాత్రాన ఏమయింది? ఇది ఎవరికి తెలియడంలేదు? నీ సర్వశరీర వ్యాప్తములయిన పులకములచేత నీ ఈ భావము ఘోషింపబడుతున్నది. దీనిలో భావము సర్వాంగీణ పులకల ద్వారా సువ్యక్తమయింది కాబట్టి హేల.

౪. మాధుర్యము

అభూషణేపిరమ్యత్వం మాధుర్యం పరికీర్త్యతే

భూషణాలు లేకపోయినప్పటికీ రమ్యముగా ఉండడమునకు మాధుర్యము అని పేరు. స్వభావ సిద్ధమయిన రమ్యత సహజంగా ఉన్నప్పుడు భూషణాదుల వలన ఉపయోగము ఉండదు కదా! ఉదా:—

జిత త్రైలోక్య లావణ్యా ప్రకృత్యా హరిణేక్షణా
కింతు భూషయితుం ధత్తే భూషణానీతి మే మతిః

ఈ హరిణేక్షణ స్వభావము చేతనే మూడు లోకాల వారి లావణ్యమునూ జయించింది. ఆ జయనములో ఆమె ఏమీ ప్రయత్నపడలేదు. అయితే భూషణాలను భూషించడము కొరకు ధరించుతున్నదని నా అభిప్రాయము. స్వభావ సిద్ధముగా సౌందర్యము ఉంటే ఆభరణాలు అక్కర లేదు. ఆభరణాలు లేక పోయినా అందముగా ఉన్నట్లు దీనిలో వర్ణితము కాబట్టి మాధుర్యము.

౫. ధైర్యము

శీలాద్యలంఘనం నామ ధైర్య మిత్యభిధీయతే

శీలము మొదలయిన వానిని అతిక్రమించక పోవడము ధైర్యము అవుతుంది. తన సంప్రదాయము ధర్మము నీతి మొదలయిన వానిని అతిక్రమింప వలసిన క్లిష్ట సమయము వచ్చినప్పటికిన్నీ అతిక్రమించక పోవడము ధైర్యము. ఉదా:-

కులవధూనాం న యుజ్యతే మర్యాదాలంఘనం ఖలు విషమేపి
రుద్రనరేంద్రగుణాః పున ర్హృదయహరాః కిం ను కర్తవ్యం ?

కులస్త్రీలకు అత్యంతమూ విషమ మయిన పరిస్థితిలో కూడా మర్యాదను అతిక్రమించడము యుక్తము కాదు. కాని

రుద్రనరేంద్రుని గుణాలు హృదయమును హరించేవిగా ఉన్నవే! ఇపుడు నేను ఏమిచేయాలి? అని ఒక కులీన ఆలోచన. ఆతని గుణాలు హృదయమును హరింపుతున్నప్పటికీ శీలమును అతిక్రమించరాదు. అని ఆమె తలంచుచున్నందు వలన ఆమె యందు ధైర్యము ఉన్నది.

౬ లీల

ప్రియానుకరణం లీలా వాగ్భిర్గత్యాథ చేష్టితైః

వాక్కులచే గమనముచే చేష్టితములచే ప్రియుని అనుకరణము చేయడము లీల అవుతుంది ఉదా:—

పేక్షధ్వం సఖ్య ఏషా లక్ష్మీ రాజ్ఞః ప్రతాపరుద్రస్య
చరితా న్యనుకుర్వంతీ రాజ్ఞీషు పతివ్రతా జాతా.

ఓ! సఖులారా! చూడండి! రాజు అయిన ప్రతాపరుద్రుని చరితాలను అనుకరించుతూ ఈ లక్ష్మి రాణులలో పతివ్రత అయింది. రాజు దాన భోగాదులలో ప్రవర్తించగా లక్ష్మి కూడా ఆతనికి అనుకూలముగానే ఉండి అచంచలముగా ఉంటున్నది. దీనిలో ప్రియుని అచంచలత్వమును ఆ లక్ష్మి అనుకరించింది. అనే వర్ణనము ఉన్నందు వలన లీల.

౭. విలాసము

తాత్కాలికో వికారస్స్యాద్విలాసో దయితేక్షణే.

ప్రియుడు చూడగా తత్సమయములోని వికారమునకు విలాసము అని పేరు. ఆకస్మికముగా కలిగే వికార మన్న మాట. ఉదా:—

సహేలం పశ్యంత్యాః ప్రకృతిసుభగం రుద్రనృపతిం
తదాత్వ ప్రత్యుద్య ద్వివిధ లలితాటోప మధురం

రసప్రాదుర్భావా ద్యుగప దుదయ త్సాత్విక మహో
మృగాక్ష్యా స్తారుణ్యే కుసుమశరశిల్పం విజయతే.

కావ్య ప్రకరణములో శ్లాఘా ప్రస్తావములో ఈ పద్యము నిరూపిత మయింది. రుద్రనృపతి చూడగానే కలిగిన వికారము కుసుమశర శిల్పముగా దీనిలో ఉన్నందువలన విలాసము.

౮ విచ్ఛిత్తి

విచ్ఛిత్తి రతి రమ్యత్వం స్వల్పైరపి విభూషణైః

స్వల్పపు ఆభరణాలచే గూడా అత్యంతమూ రమ్యముగా ఉండడము విచ్ఛిత్తి అవుతుంది. ఆయా స్థానముల రమ్యతను బట్టి ఆయా భూషణాలు అటువంటి విచ్ఛిత్తిని సంపాదించుతవి. ఉదా.—

కస్యకృతే కేనకృతం కాకతిపుర స్త్రీణాం సౌందర్యం?
సాధారణ భూషయా యత్సఖి! త్రైలోక్యరమణీయం.

ఈకాకతి పురస్త్రీలయొక్క సౌందర్యము ఎవరికొరకై ఎవరు నిర్మించారో కదా! ఈస్త్రీలు సాధారణ భూషలు పెట్టుకున్నప్పటికి త్రైలోక్య రమణీయ సౌందర్యము కలవారై ఉన్నారు. సఖి! ఈసౌందర్యము ఎవరికి అనుభవయోగ్యమో కదా? స్రక్చందన తాంబూలాది సాధారణ భూషలు ఉన్నప్పటికీ విధాతృ శిల్పవైలక్షణ్యము ఉన్నట్లు వర్ణింప బడినందువలన విచ్ఛిత్తి అవుతుంది.

౯ విభ్రమము

విభ్రమ స్త్వరయా కాలే భూషాస్థాన విపర్యయః

ప్రియాగమన సమయములో త్వరచేత ఆభరణాలను స్థాన విపర్యయము కలిగితే విభ్రమము అవుతుంది. ఒకచోట ఉంచవలసిన ఆభరణమును వేరొకచోట ఉంచితే పై వస్త్ర

మును అధరీయముగానూ, అధరీయమును పై వస్త్రముగానూ ధరించితే ఈభావము ఉన్నట్లు అని తాత్పర్యము. ఉదా:—

శ్రుత్వా సఖీముఖా ద్దివసో విరత ఇతి సంభ్రమేణవధూః
హస్తయో ర్నూపురే చరణయోః కరోతి వలయాని.

'పగటివేళ అయిపోయింది. సాయంకాలము ఆసన్నమయింది.' అని సఖీముఖాన విన్న ఆవధువు, హస్తములందు నూపురములను చరణములందు వలయములనూ కూర్చుకొంటున్నది. ఇక్కడ ఉత్తరార్ధములో ఆభరణ విపర్యయమును ఊహించాలి.

౧౦ కిలికించితము

రోషాశ్రు హర్ష భీత్యాదేః సంకరః కిలికించితం

రోషము హర్షము అశ్రువు భీతి మొదలయిన వానియొక్క సంకరమునకు కిలకించితము అనిపేరు. ఈఅనేక భావాలు ఒకే పర్యాయము కూడిఉన్నట్లయితే కిలికించిత మవుతుంది. ఉదా:

గృహ్ణాతి కాకతినాథే విజనే పటాంచలం మృగాక్ష్యాః
వేపతే తనురపి నృత్యతి భ్రుకుట్యపి గద్గదా వాచః

నిర్జన ప్రదేశములో ఆమృగనయన యొక్క వస్త్రాంచలమును కాకతి నాథుడు గ్రహించగా ఆమె శరీరము కంపము పొందుతున్నది. కనుబొమ్మలు నర్తనము చేస్తున్నవి. వాక్కులు, గద్గదములు అవుతున్నవి. వీనిలో భయాది వికారములయిన కంపాదులకు మేళనము ఉన్నది కాబట్టి కిలికించితము.

౧౧ మోట్టాయితము

మోట్టాయితం స్యాదిష్టస్య కథాదౌ భావసూచనం

ఇష్టుడయిన వానియొక్క కథ మొదలయిన వానిలో తన అభిమానము భావమును సూచించడమునకు మోట్టాయితము

అనిపేరు. ప్రియుని గుణకధనము మొదలయిన వానియందు తన అభిలాష ప్రకటనము ఉండడమన్నమాట.

మధురాణి రుద్రనరపతి చరితాని వధ్వానను శృణ్వంత్యాః
తనుగోపనేన ప్రకటో యథా భావోన తథా పులకైః

మధురము లయిన రుద్ర నరపతి చరితములను వింటూ ఉన్న ఆ వధువునకు తను గోపనము చేత అనురాగ భావము ప్రకటన మయినట్లుగా పులకములచేత అంతగా ప్రకటము కావడము లేదు. తన ప్రియుని గురించి కథ రాగానే తనుగోపనము ద్వారా తన అనురాగ భావమును ఆ వధువు సూచించినందువలన మొట్టాయితము.

౧౨ కుట్టమితము

సమ్మర్దేఽపి సుఖాధిక్యం రతే కుట్టమితం మతం.

సురతమునందు కేశగ్రహణాధరగ్రహణ కుచగ్రహణాదుల వల్లన సమ్మర్దము అధికముగా ఉన్నప్పటికీ సుఖాధిక్యము ఉంటుంది. సురత సుఖము అధికము అయినందువలన ఇవేవీ బాధా జనకములుగా ఉండవు. ఆ సుఖాధిక్యమును కుట్టమితము అని అంటారు. దీనిలో బయటికి కోపము కన్పించినా లోపల ఆయా కార్యవిశేషముల వలన సాంద్రానందమె ఉంటుంది. ఉదా:—

నిర్మర్యాద మనోభవోత్సవ కథావిస్రంభ కర్ణేజపైః
అంగై ర్విస్మిత మానసాం ప్రియసఖీ మాలోక్య జాతత్రపా,
వైయాత్యం నిజ మాత్మవల్లభకృతాం రాగాన్ధతాం జానతీ
సద్యో నమ్రముఖేందు రిందువదనా క్షోణీం లిఖంతీ స్థితా.

ఒకనాడు మనోభవోత్సవము నిర్దయగా ప్రవృత్తమయింది. అప్పుడు కేశ గ్రహాధర గ్రహాది కామక్రీడ ఒక కథా

వాదము అయింది. నాయిక అవయవములు ఆసురతములోని ఉచ్ఛృంఖలత్వమును నఖ దంత పదాది ద్వారా సూచనము చేస్తున్నవి. ఇట్టి అంగాలతో ఉన్న నాయికను చూచి ప్రియ సఖీ మానసము విస్మయము పొందింది. ఇటువంటి విధానమును ఎప్పుడూ ఎక్కడా చూడలేదు. ఈ నాయిక కూడా ఎట్లా సహించ గలిగిందో! అని ఆ ప్రియసఖి అనుభవ చతుర అయినా ఆశ్చర్య పడింది. ప్రియ సఖి ఈ విధముగా విస్మిత అయిందని చూచి నాయిక సిగ్గు పడింది. నన్ను చూచికదా! సఖి ఇట్లా అయింది! అని. ఇక ఆ ఇందువదన తన ధార్ష్ట్యమును తన వల్లభుడు చేసిన రాగాంధత్వమును తెలుసుకుంటూ అప్పుడే నమ్రముఖ చంద్రుడు కలదై భూమిని లిఖించుతూ ఉన్నది. "అభూతపూర్వము లయిన సంభోగ చిహ్నములను చూసి సఖి విస్మిత అయింది" అనడము వలన ఆ సమయంలో నాయిక సమ్మర్దము ఉన్నా సుఖమును బాగా అనుభవించిందని తెలుస్తున్నది. అందువలన కుట్టమితము.

౧౩ బిబ్బోకము

మనాక్ ప్రియకథాలాపే బిబ్బోకోఽనాదరక్రియా

ప్రియుని కథల సల్లాపము రాగా గర్వాభిమానాదుల వలన కొంతగా అనాదర పద్ధతిని ప్రదర్శించడము బిబ్బోకము అవుతుంది. కేవలమూ ఆతని కథలను అనాదరము చేయడము కాక ప్రియుని అనాదర పరచడము కూడా బిబ్బోకమె అవుతుంది. ఉదా:—

లక్ష్మీః సద్మని నిర్భరం విహరతాం క్షోణీభుజాలంబన
క్రీడాం నైవ జహాతు కించ సతతం వాణీముఖే తిష్ఠతు

జ్ఞాతం రుద్రనరేశ్వరస్య బహుభి ర్విజ్ఞార పూర్వైః ప్రియ
వ్యాహారైః కృతమేవ దూతి మదన శ్చాపాయ సన్నహ్యతు.

ఓ! సఖి! నీవు ఇట్లా కోపముతో ఉంటే లక్ష్మి మొదల యిన వారె ప్రేయసులు అవుతున్నారు. నీకు ఆ భాగ్యం లేదు. నీ ప్రియుడు నీపై ప్రియముగానె ఉన్నాడు. అని ప్రియుడు పంపిన దూతి పలికినా సాభిమానంతో ఉన్న నాయిక చావు అన్నా లక్ష్యపెట్టకుండా ఇట్లా పలుకుతు న్నది. లక్ష్మి భవనములో నిర్భరముగా విహరించనీ! భూమి భుజాలను అవలంబించి ఉండే క్రీడను విడువక పోనీ! వాణి నిత్యమూ ఆయన ముఖము లోనే ఉండనీ! రుద్ర నరే శ్వరుని ప్రియ వ్యాహారములు అన్నీ ఇది వరకు తెలిసినవె! ఇటువంటివి చాలా ఎరుగుదును. తెలిసిందిలె! చాలులె! ఓ! దూతీ! మన్మథుడు తన ధనువునకు సన్నాహ పడు గాక. నేనుమటుకు నమ్మ లేను. ఇంతే! ఈ పద్యములో ప్రియ వార్తపై అనాదరము ఉన్నది.

౧౪ లలితము

సుకుమారాంగ విన్యాసో లలితం పరికీర్త్యతే

సుకుమారముగా సవిలాసముగా అంగములను విన్యసించడ మునకు లలితము అని పేరు. ఉదా:—

పదన్యాస క్రీడా రణిత మణిమంజీర రశనం
సహేలం వ్యావల్గ త్కరపలయ నిక్వాణ సుభగం
స్మితజ్యోత్స్నా వీచీతరళ వచనం రుద్రనృపతేః
పురంధ్రీణా మాసీ దనురహసి సేవావిలసితం.

రుద్ర నృపతి స్త్రీల యొక్క ఏకాంత సేవలో సేవా విలసనము ఈ విధముగా ఉంటుంది. పదన్యాస క్రీడ చేత,

మణిమయ మంజీరములూ, రశనా (మొలత్రాడు) రణనము చేస్తున్నవి సవిలాసముగా ధ్వనించు తున్న త్రిప్పబడుచున్న చేతుల కంకణ నిక్వాణములు మనోహరముగా ఉన్నవి. వెన్నెలవంటి స్మితలవతరళము లయిన వచనములు ఆ సేవా విలసనములో మనోహరముగా ఉంటున్నవి. దీనిలో పదన్యాసము కరవల్గనము మందహాసము తరళ వచనము అనే సుకుమారాంగవిన్యాసము ఉన్నందున లలితము అవుతుంది.

౧౫ కుతూహలము

కుతూహలం రమ్యదృష్టౌ చాపలం పరికీర్త్యతే.

మనోహరుని చూచి నప్పుడు తత్సమయములో కలిగిన చాపలమునకు కుతూహలము అని పేరు. ఉదా:—

వీరరుద్ర మధిరూఢ సింధురం ద్రష్టు మంధ్రనగరీ పురంధ్రయః
కుర్వతే రచిత సంక్రమత్వరా స్తుంగసద్మశిఖరాధిరోహణం.

ఆంధ్ర నగరీ యువతులు గజమును ఎక్కిన వీర రుద్రుని చూడడానికి త్వరా సంక్రమము కలవారై ఉన్నత సౌధ శిఖరములను అధిరోహించు తున్నారు. దీనిలో ప్రతాప రుద్రుని చూడడమునకు స్త్రీల కుతూహలము వర్ణిత మయింది.

౧౬ చకితము

చకితం భయసంభ్రమః.

భయము వలన కలిగే తొందర పాటునకు చకితము అని పేరు. ఇక్కడ భయము కూడా శృంగారాంగము గానే ఉంటుంది. ఉదా:—

అవిజ్ఞాతాయాతం స్వపుకధితమాల్యాపి హసితుం
హఠా దుత్పశ్యంత్యా శ్చకిత చకితోదంచిత దృశః

విలాసా నుద్వేలా నుదిత మదనా స్వీక్ష్య సుతనోః
తథైవ ప్రత్యేతుం పున రవనిపాలః స్పృహయతి.

అవని పాలుడు ఒకనాడు మెల్లగా పదములు వేస్తూ వెన కగా తెలియకుండగా వచ్చినాడు. ఆతడు రావడము నాయి కకు తెలియదు. అక్కడ ఉన్న సఖి కనిపెట్టుతూనే ఉంది. ఈ విధముగా ఆతడు వచ్చినప్పుడు నాయిక ఎంత సంభ్ర మము పడుతుందో చూడాలని చూచి హసించాలని చెలికత్తె ఆతని రాకను చెప్పలేదు. ఆతడు రాగానే నాయిక హఠాత్తుగా చూచింది. ఆమె దృక్కులు చకిత చకితోదంచితములు అయినవి. లజ్జోత్కంఠలు కలిగినందు వలన మాటి మాటికీ దృక్కులు ఆవృత్తము కావడము నిమీల నోన్మీలనములు కలవి కావడమూ సంభవించింది. ఊర్ధ్వ ప్రసారితాపాంగము కూడా అయింది. ఈ విధముగా ఉన్న ఆసుతనువు యొక్క మాన్మథ భావముతో కూడుకొన్నట్టి, ఉద్వేలములు అయిన విలాసములను చూచి ఆలింగనాది సత్కారము లేకుండగానే మళ్ళా ఆ విధముగానే రావడానికి అవని పాలుడు ఇష్ట పడుతున్నాడు, మదన మహోత్సవము ఎంతటి దయినా చకిత సుఖము యొక్క పదునారవ వంతె యినా పొందదు. సమన్వయము సులభమే.

౧౭. విహృతము

విహృతం ప్రాప్తకాలస్య వాక్యస్య అకథనం హ్రియా.

అవసరములో తగిన వాక్యమును పలుక వలసిన • వాక్య మును సిగ్గు చేత పలుకక పోవడము విహృతము అవుతుంది. ఆ వాక్యమును ఆ సమయములో పలుక వలసిన అవసరము

ఉన్నప్పటికి సిగ్గు వలన పలుక లేక పోయి నట్లయితే విహృ
తము అవుతుంది అన్నమాట. ఉదా:—

ప్రతాపరుద్రస్య భుజాంతరస్థాం
కహ్లారమాలా మమునా స్పృశేతి
స్తనద్వయే పత్రలిపిం లిఖంతీం
సఖీం వధూః పశ్యతి సాభిమానం.

ప్రతాపరుద్రుని యొక్క భుజాంతరములో ఉన్న కహ్లార మాలను ఈ స్తనముతో స్పృశించు ఆలింగన సమయములో ఆతని వక్షస్సునకు నీ కుచస్పర్శ కలిగేటట్లుగా చేయి! అని అంటూ చెలికత్తె, స్తనద్వయము నందు మకరికా పత్రలిపిని లిఖించుతూ ఉంటే ఆ వధువు ఏమీ అన లేక, సఖివచనము తనకు ఇష్టమె కాబట్టి కృత్రిమ కోపము తెచ్చుకొని సిగ్గుతో సాభిమానముగా చూస్తున్నదే కాని ఏమీ అనడము లేదు. ఆ విధముగా పలికిన చెలికత్తెను ఆ సమయంలో ఏమయినా అనవలసిందే కాని ఏమీ అన లేదు. అందువలన విహృతము.

౧౮. హసితము

అకస్మికం తు హసితం యౌవనాది వికారజం,

యౌవనము మొదలయిన వికారము వలన హసితము ఆకస్మికంగా ఉత్పన్నము అవుతుంది. యౌవన విక్రియ వలన అది అహేతుకంగా కలుగుతుందే కాని హాస్యములో మాదిరిగా వేషభాషాది వికార జన్యము కాదు. ఉదా:—

యథాయథా హసతి మృగాక్షీ యౌవనలక్ష్మ్యా శిక్షితా మధురం
తథాతథా కుసుమేషు శరా వికసంతి ప్రియస్యాశా చ

యౌవన లక్ష్మిచేత శిక్షింబడి ఆ మృగాక్షి ఎట్లా ఎట్లా మధురముగా నవ్వుతున్నదో ఆ యా విధముగా మన్మ

భావాలు వికసించు తున్నవి. ప్రియ మనోరథము కూడా వికాసము పొందుతున్నవి. మృగాక్షి హసితము మదనోద్దీపకంగా ఉన్నది. ఆకస్మికమయిన యౌవనహాసము ఆ యువతిలో ఉన్నది. కాబట్టి హసితము. ఇట్లా ఈ విధంగా శృంగార భావాలు నిరూపితములు అయినవి. ఇప్పటికి రస సామగ్రి కూడా ప్రతి పాదింప బడినట్లే గ్రహించాలి.

మన్మథావస్థలు

శృంగార బీజము పాదు కొల్పినప్పుడు ప్రధానముగా నాలుగు అవస్థలను భావించవచ్చును. ఒకటి అంకురితత్వావస్థ. వేరొకటి పల్లవితత్వావస్థ మరి ఒకటి కుసుమితత్వావస్థ ఫలితత్వావస్థ నాల్గవది. అంకురించిన మొక్క చిగిర్చి పుష్పించి ఫలించడము ప్రసిద్ధము. అట్లాగే శృంగారము కూడా ఆశ్రయముగా ఉన్న వానిలో క్రమికములు అయిన అవస్థా భేదములను పొందుతుంది. ఈ అవస్థలు హేతువుగా ద్వాదశావస్థలు. కలవు. వానిని ఇక నిరూపించుతాము.

౧. చక్షుఃప్రీతి ౨. మనస్సంగము ౩. సంకల్పము
౪. ప్రలాపము ౫. జాగరము ౬. కృశత్వము
౭. అరతి ౮. లజ్జాత్యాగము ౯. జ్వరము
౧౦. ఉన్మాదము ౧౧. మూర్ఛనము ౧౨. మరణము

అని ఇవి పన్రెండు అవస్థలు. కామశాస్త్రానుసారముగా వీనిని ఇట్లా చెప్పవలసి వచ్చింది. అలంకార శాస్త్రములో వీని సంఖ్యలో కొంత భేదము ఉన్నది. మన్మథావస్థలు పది అని కొందరంటున్నారు. వీని స్వరూపోదాహరణములను ఈ విధముగా గ్రహించాలి.

౧. చక్షుః ప్రీతి

ఆదరా ద్దర్శనం చక్షుః ప్రీతి రిత్యభిధీయతే

ప్రత్యక్షముగా గాని చిత్రములో కాని స్వప్నములో కా సాదరముగా చూడడమునకు చక్షుః ప్రీతి అని పేరు. ఉదా:-

సఖి! ఏష రుద్రనృపో నయనయో రతర్కితోత్సవో జాతః
మదన ఇవ మూర్తిమాన్ చంద్ర ఇవ ముక్తలాంఛనః పూర్ణః.

ఓ ! సఖీ ! ఈ రుద్రనృపుడు నేత్రాలకు అతర్కితోత వము అయినాడు. శరీరమును ధరించిన మన్మధుడు వ కళంకమును విడిచిన పూర్ణచంద్రుని వలె నేత్రోత్సవ దా కుడై ఉన్నాడు. దీనిలో రాజ దర్శనమునందు ఆదరము క పడు తున్నది.

౨ మనస్సంగము

మనస్సంగః ప్రియతమే నిత్యం చిత్తస్య విశ్రమః.

నిత్యమూ కూడా ప్రియుని యందు చిత్తమునకు విశ్రాంతి ఉండడమునకు మనస్సంగము అని పేరు. ఉదా:-

సదా మమ మనో విలగతి రుద్రనరేంద్రే కస్మా త్కుపితాః
తేనాహ మపి విముక్తా సఖ్యః! యుష్మాసు కా వార్తా?

నా మనస్సు ఎప్పుడూ కూడా రుద్రనరేంద్రుని యంద లగ్నము అవుతున్నది. నేను కూడా ఆ మనస్సుచేత విడువ బడినాను. మీరు ఎందుకు కోపపడుతారు ? సన్నిహితురా నయిన నాసంగతే ఇట్లా ఉంటే వ్యవహితముగా ఉన్న మీ విషయమై ఇంకా ఏమి చెప్పవలెను. అందువలన మీరు నన్ను ఏమీ అనవద్దు.

౩. సంకల్పము

సంకల్పో నాథవిషయో మనోరథ ఉదాహృతః.

ప్రియుడు విషయముగా ఉన్న కోరికకు సంకల్పము అని పేరు. మనస్సులో ఏ యే కోరిక పుట్టినా దానికి అంతకూ ప్రియుడే విషయముగా ఉండాలి. ఉదా:—

దరహసిత గర్భితాని స్నేహ స్నిగ్ధాని రాగభరితాని
రుద్రన్నపవిలోకితాని కదాను మయి నిపతంతి?

మధుర మందస్మితము గర్భితముగా ఉన్నట్టిన్ని, సంభోగౌత్సుక్యము సూచనము చేయునట్టిన్ని, ఆర్ద్రాంతః కరణము కలిగి ఉండడము వలన స్నిగ్ధములుగా ఉన్నట్టిన్ని స్నేహ ప్రకర్ష రూపమయిన రాగముతో భరితములైనట్టి రుద్రనృపుని విలోకితములు నాపై ఎప్పుడు ప్రసరించుతవో కదా! దీనిలో ప్రియ విలోకితముల కాంక్ష అధికముగా ఉన్నందువలన సంకల్పము.

౮ ప్రలాపము

ప్రలాపః ప్రియసంశ్లిష్ట గుణాలాపఉదాహృతః

ప్రియునియందు కూడుకొన్న గుణాలను గురించి సంలాపము చేయడము ప్రలాపము అవుతుంది. ప్రియుని గుణస్తవమె దీని రూపము అన్నమాట. ఉదా:—

తథా నిపుణ స్తథా మధుర స్తథా సుభగ స్తథాచ సౌమ్యస్వభావః
ఏకో రుద్రనృప ఏవేతి గోష్ఠీ ప్రౌఢమహిళానాం.

అట్లా నిపుణుడు అట్లా మధురుడు ఆవిధముగా సుభగుడూ అట్టిసౌమ్య స్వభావుడూ అయినవాడు ఒకరుద్రనృపుడె అని ప్రౌఢ మహిళల గోష్ఠి. దీనిలో నిపుణత్వాది గుణములు ఉన్నందువలన ప్రతాపరుద్రుడె మనలకు అభిగమ్యుడు అని ప్రౌఢాంగనలు ప్రసంగము చేస్తున్నారు. అందువలన ప్రలాపము

౧. చక్షుః ప్రీతి

ఆదరా ద్దర్శనం చక్షుః ప్రీతి రిత్యభిధీయతే

ప్రత్యక్షముగా గాని చిత్రములో కాని స్వప్నములో కాని సాదరముగా చూడడమునకు చక్షుః ప్రీతి అని పేరు. ఉదా:—

సఖి! ఏష రుద్రనృపో నయనయో ఽతర్కితోత్సవో జాతః
మదన ఇవ మూర్తిమాన్ చంద్ర ఇవ ముక్తలాంఛనః పూర్ణః.

ఓ ! సఖీ! ఈ రుద్రనృపుడు నేత్రాలకు అతర్కితోత్సవము అయినాడు. శరీరమును ధరించిన మన్మథుడు వలె కళంకమును విడిచిన పూర్ణచంద్రుని వలె నేత్రోత్సవ దాయకుడై ఉన్నాడు. దీనిలో రాజ దర్శనమునందు ఆదరము కన పడుతున్నది.

౨. మనస్సంగము

మనస్సంగః ప్రియతమే నిత్యం చిత్తస్య విశ్రమః.

నిత్యమూ కూడా ప్రియుని యందు చిత్తమునకు విశ్రాంతి ఉండడమునకు మనస్సంగము అని పేరు. ఉదా:—

సదా మమ మనో విలగతి రుద్రనరేంద్రే కస్మా త్కుపితాః
తేనాహ మపి విముక్తా సఖ్యః! యుష్మాసు కా వార్తా?

నా మనస్సు ఎప్పుడూ కూడా రుద్రనరేంద్రుని యందు లగ్నము అవుతున్నది. నేను కూడా ఆ మనస్సుచేత విడువ బడినాను. మీరు ఎందుకు కోపపడుతారు ? సన్నిహితురాల నయిన నాసంగతే ఇట్లా ఉంటే వ్యవహితముగా ఉన్న మీ విషయమై ఇంకా ఏమి చెప్పవలెను. అందువలన మీరు నన్ను ఏమీ అనవద్దు.

౩. సంకల్పము

సంకల్పో నాథవిషయో మనోరథ ఉదాహృతః.

ప్రియుడు విషయముగా ఉన్న కోరికకు సంకల్పము అని పేరు. మనస్సులో ఏ యే కోరిక పుట్టినా దానికి అంతకూ ప్రియుడే విషయముగా ఉండాలి. ఉదా:—

దరహసిత గర్భితాని స్నేహ స్నిగ్ధాని రాగభరితాని
రుద్రన్నృపవిలోకితాని కదాను మయి నిపతంతి?

మధుర మందస్మితము గర్భితముగా ఉన్నట్టిన్ని, సంభోగౌత్సుక్యము సూచనము చేయునట్టిన్ని, ఆర్ద్రాంతః కరణము కలిగి ఉండడము వలన స్నిగ్ధములుగా ఉన్నట్టిన్ని స్నేహ ప్రకర్ష రూపమయిన రాగముతో భరితములైనట్టి రుద్రనృపుని విలోకితములు నాపై ఎప్పుడు ప్రసరించుతవో కదా! దీనిలో ప్రియ విలోకితముల కాంక్ష అధికముగా ఉన్నందువలన సంకల్పము.

౮ ప్రలాపము

ప్రలాపః ప్రియసంశ్లిష్ట గుణాలాపఉదాహృతః

ప్రియునియందు కూడుకొన్న గుణాలను గురించి సంలాపము చేయడము ప్రలాపము అవుతుంది. ప్రియుని గుణ స్తవము దీని రూపము అన్నమాట. ఉదా:—

తథా నిపుణ స్తథా మధుర స్తథా సుభగ స్తథాచ సౌమ్యస్వభావః
ఏకో రుద్రనృప ఏవేతి గోష్ఠీ ప్రౌఢమహిళానాం.

అట్లా నిపుణుడు అట్లా మధురుడు ఆవిధముగా సుభగుడూ అట్టి సౌమ్య స్వభావుడూ అయినవాడు ఒకరుద్రనృపుడే అని ప్రౌఢ మహిళల గోష్ఠి. దీనిలో నిపుణత్వాది గుణములు ఉన్నందువలన ప్రతాపరుద్రుడే మనలకు అభిగమ్యుడు అని ప్రౌఢాంగనలు ప్రసంగము చేస్తున్నారు. అందువలన ప్రలాపము

౫, జాగరము

జాగరస్తు వినిద్రత్వం ......

నిద్రలేక పోవడమునకు జాగరము అనిపేరు. రాగ కృతముగా కలిగిన చింతావ్యాకులత్వము వల: పట్టదు. దానికే జాగరము అనిపేరు ఉదా:—

గమితం కథంకథమపి దినం చంద్రాతప దుస్సహా నిశా దీర్ఘ
మదనోపి పుంఖితశరో నిద్రాపి నృపోపి నోపైతి.

· పగటి సమయమును ఏదో విధముగా గడిపాను. చ పము చేత నిశ దీర్ఘము ఉన్నది. రాత్రి గడపుటకు ' కాకుండాఉంది. మన్మధుడు కూడా బాణాలను ఎక్కు ఉన్నాడు. నిద్రకూడా రాదు. రాజున్నూ రాడు. స్వప్న ' గమానికి పరిపంధిగా ఉన్న జాగర హాతకుడే జాగి తున్నాడు. దీనిలో వినిద్రత స్పష్టము.

౬, కార్శ్యము

...............కార్శ్య మంగస్య తానవం

శరీరము కృశించి పోవడమనకు కార్శ్యము అని పేరు.

చంద్రాస్యే కథ మంగుళీయక మిదం కేయూరితం తే సఖి
ప్రేష్ఠాం ప్రేయసి వైభవైః స ఖలు కః! భూమే స్సపర్ణ
జ్ఞాతం మానిని కాకతీయనృపతౌ సక్తాసి సత్యం శు భే!
శ్యామాంగీం స ఖలు స్థిరాం రమయతే త్వాం తాం చ ...

ఈపద్యములో ఇద్దరి సంభాషణము ఉన్నది. ... అంటున్నది. ఓ! చంద్రాస్యా! ఈఉంగరము నీకు ... ముగా అయిందేమి? ఇంతగా నీవు ఎందువలన చిక్కి... నావు అనిభావము. నాయిక అంటున్నది సఖీ! ప్రియు... యమైప్రేమవైభవములచేత ఇట్లా కావలసి వచ్చింది

పలుకుతున్నది. ఆతడు ఎవడగునో? నాయిక : ఎట్లా ఆయితే భూమినికి సవతిని కాగలుగుతానో ఆతడు. సఖి! మానినీ! తెలిసినది లే! కాకతీయ నృపతియందు అనురక్తురాలవు అయినావు. ఓ! శుభాంగీ! నాయీ ఊహ సత్యము ఆతడు శ్యామాంగి స్థిర శైల స్తని అయిన నిన్ను ఆభూమినిన్నీ రమించునులె భూ సదృశురాలవైన నిన్నుకూడా ఆతడు అదేవిధముగా ఉపభోగములచేత లాలించుతాడు. భూమినల్లగా ఉండి స్థిరమైనదై స్తనాయమాన శైలములు కలదై ఉంటుంది. ఈనాయిక శ్యామ యౌవన మధ్యస్థ స్థిరానురాగ శైల సదృశ స్తని అనే ఈ అర్థము దీనిలో స్పష్టము అవుతున్నది. అంగుళీయకము కేయూరము కావడము దీనిలో నిరూపితమయింది కాబట్టి కార్శ్యమును ఊహించాలి.

౭. అ ర తి

అన్యత్రాప్రీతి రరతిః

ప్రియుని కంటె అతిరిక్తము లయిన విషయములందు ప్రీతి లేక పోవడము అనగా వైరాగ్యము ఉండడము అరతి అవుతుంది. ఉదా:—

దూషయతి చంద్రసృష్టిం నిందతి మలయానిలస్య మాహాత్మ్యం
ఉత్సవ పరాఙ్ముఖీ సా సుభగ త్వం కిం ను మంత్రయసే?

ఓ! సుభగా! ఆమె ఉత్సవ పరాఙ్ముఖి అయింది. చంద్రసృష్టిని దూ[illegible] తున్నది మలయానిల మాహాత్మ్యమును నిందించు[illegible] ఇంకా ఏమి ఆలోచిస్తున్నావో? ఇతరములందు ఆ[illegible] కూడా ఆసక్తి లేదు. నిన్నే నమ్మి నీపొందు లేనందువలన విరహార్త అయి ఈ విధంగా చేస్తున్నది. దీనిలో అరతి సమన్వయము స్పష్టము.

శృంగార నిరూపణము

శృంగారము రెండు విధాలు. సంభోగ శృంగారము విప్రలంభ శృంగారము అని. సంయుక్తయోస్తు సంభోగో విప్రలంభో వియుక్తయోః" అని శృంగార తిలకములో రుద్రభట్టు చెప్పుతున్నాడు. నాయికా నాయకులు సంయుక్తులు అయి ఉన్నట్లయితే వారి అనురాగము సంభోగ శృంగారము అవుతుంది. వారు వియోగము పొంది ఉన్నట్లయితే విప్రలంభ శృంగారము అవుతుంది అని దాని భావము. సంభోగములో అవాంతర విభాగాలు చాలా ఉన్నవి. నాయికా నాయకుల యొక్క పరస్పరావలోకనము అన్యోన్య సంభాషణముల ఒకరొకరి ఆలింగనములు వారి వీరి చుంబనాదులూ ఇట్లా అనేక వ్యాపారములు సంభోగములో ఉన్నవి. పురుషుల స్త్రీల విశేషాలను అనుసరించి దేశ స్వభావ కాలాది విశేషాలను బట్టిన్నీ ఈ వ్యాపారములు అనంత భేదములను పొందుతున్నవి. ఇందులో కూడా సమరతములు నీచరతములు ఉచ్చరతములు వీని పరిస్థితి అన్నిటినీ గణనము చేయడము శక్యము కాదు. ఇట్లా సంభోగము అనంతము అవుతున్నది. అందువలన అది ఒకే విధమని గణనము చేయడము ఉచితమే

సంభోగ శృంగారము

రహః ప్రత్యాసన్నే హృదయదయితే రుద్రనృపతౌ
నివృత్తా మానాజ్ఞా విరళమపి లజ్జావిలసితం
కిమన్యత్తే గోప్యం బహిరబహిరానంద మసృణః
స్మరావేశః కోపి ప్రియసఖి! నృపేషైకయతి మాం.

హృదయ దయితుడు అయిన రుద్రనృపతి రహః ప్రదేశమునకు రాగా కోప కృతముగా కలిగిన ఆజ్ఞ అంతా పోయింది.

లజ్జావిలసితము కూడా విరళము అయింది. సురత సమయములో స్త్రీలకు ప్రాగల్భ్యమె భూషణము అప్పుడు సిగ్గు. చమత్కారకము కాదు. ఓ! ప్రియసఖి! నీకు ఇంకా దాచదగినది ఏమి ఉంది ? లోపల వెలుపలా అంతటా ఆనంద మసృణము అయిన ఏదో స్మరావేశము నన్ను ఆ నృపునితో ఏకము చేస్తున్నది. ఈ పద్యములో లజ్జామానములు పోవడము వలన మర్యాదను దాటిన విమర్దము కలిగి ఉంటుంది. అని గోచరము అవుతున్నది. ఈ పద్యములో దయితుడు ఆలంబన విభావము రహః ప్రదేశము ఉద్దీపనము. హర్షాదులు వ్యభిచారులు స్తంభాదులు అనుభావములు. వీనిచే సముల్లాసము పొందిన రతిస్థాయి శృంగార రసత్వమును పొందుతున్నది. నాయికా నాయకుల యొక్క సంభోగాంగములయిన ఆలింగనాది వ్యాపారములు "బహిరబహిరానంద మసృణః స్మరావేశః కోపి'' అనే పద్యాంశము వలన వ్యంగ్యము లవుతూ ఉన్నవి.

విప్రలంభ శృంగారము

విప్రలంభ శృంగారము అభిలాష హేతుకము, ఈర్ష్యా హేతుకము, విరహ హేతుకము, ప్రవాస హేతుకము అని నాలుగు విధాలు అవుతున్నది.

అభిలాషము

వానిలో అభిలాషము అనగా; నాయికా నాయకులకు సంభోగము కలుగక పూర్వము ఉన్న అనురాగము. దీనికే అయోగము అని పూర్వానురాగము అని పేరు. సంభోగానుభవానికి పూర్వము నానా విధము లయిన అభిలాషలు ఉప్పొంగుతూ ఉంటవి. ఆ అభిలాషము హేతువుగా కలిగిన విప్రలంభము అభిలాష విప్రలంభము అవుతున్నది. ఉదా:—

అన్యోన్యభాషణ మనంగ విలాసగోష్ఠీ
శయ్యా చ సార్థ మపదాని మనోరథానాం
ప్రేమానుబంధ ముదయ ద్బహులానురాగం
లభ్యేత రుద్రనృపతే రవలోకితం వా.

అనురాగము కల ఒక కన్య ఈ విధముగా భావించుచున్నది: ఇష్టాలాప రూపమయిన అన్యోన్య భాషణము కాని నర్మకథా ప్రసంగము కాని సహశయ్య కాని నామనోరథాలకు స్థానము కావు కదా! మనస్సులో నయినా అవి కలుగుతవని ఊహించడానికి అవకాశము లేదు కదా! ప్రేమానుబద్ధ మయిన ఉత్పన్న మవుతూ అభివృద్ధి పొందుతూ ఉన్న అనురాగము కలిగిన ఆ రుద్రనృపతి విలోకనమయినా లభించునా? దీనిలో ప్రాగనురాగము స్పష్టమె.

ఈర్ష్య

నాయకుడు ఇతర నాయికయందు ఆసక్తుడు కావడమును దర్శన శ్రవణానుమానముల చేత తెలిసికొని అది కారణముగా కోప రూపమయిన చిత్త విక్రియ కలిగి ఉండడము ఈర్ష్య అవుతుంది. ఈ ఈర్ష్య స్త్రీలకే కలుగుతుంది గాని పురుషులకు కలుగదు. ఇటువంటి ఈర్ష్యా హేతుకముగా విప్రలంభము ఉదయించుతుంది. ఉదా:—

లక్ష్మీ రస్య విలోచనాబ్జవసతిః సేర్ష్యా త్వదాలోకనే
వక్త్రస్థా చ సరస్వతీ న సహతే సాకం త్వయా భాషణం
లీలాకర్షణ విఘ్నకృత్ త్వయి మహీ వాహుస్థితా కాకతి
క్షోణీంద్రే న హి కైతవాని సుభగే మానేన కిం తామ్యసి.

ఈతని నేత్ర పద్మ నివాసము కలిగిన లక్ష్మీదేవి నిన్ను చూడడములో ఈర్ష్య కలిగి ఉన్నది. ముఖమందున్న సరస్వతి

కూడా నీతో పాటు భాషణమును సహించడము లేదు. బాహువునందున్న మహి (భూమి) నీ విషయమై లీలాకర్షణములో విఘ్నము కలుగ చేస్తున్నది. ఇంతే కాని ఓ! సుభగా! కాకతివల్లభుని యందు కైతవాలు లేవు. నీవు కోపము చేత ఏల బాధపడుతావు? దీనిలో నాయకుడు లక్ష్మి మొదలుగా గల స్త్రీలయందు ఆసక్తి కలిగి ఉన్నాడని నాయికకు ఈర్ష్య ఉన్నది. ఈ ఈర్ష్య కారణముగా ఆమె విప్రలంభము అనుభవించుతున్నది.

విరహము

సమాగమము పొందిన నాయికా నాయకులకు మళ్ళీ సమాగమానికి కాలాతిక్షేపము ఉండేటట్లయితే విరహము అవుతుంది. కాలాతి క్షేపములో ఇతర నాయికా సంగమము కారణము కాదు. ఇది నిర్నిమిత్తంగానే కలిగే విప్రయోగము ఇది స్త్రీ పురుషులకు ఇద్దరకూ కలుగవచ్చు. స్త్రీ విరహానికి ఉదా:—

అంగేషు జీర్ణేషు విభూషణానాం
వ్యత్యాస మార్గోపి మహూర్తశోభీ
సఖ్య స్తదాస్తాం పరికర్మరీతిః
ఆనీయతాం రుద్రనృపః కిమన్యత్.

అవయవాలు కృశించేపోతే వానియందు విభూషణాల వ్యత్యాస మార్గముకూడా క్షణకాలము శోభించేది గానే ఉంటుంది. ఓ! చెలియలారా! ఈఅలంకార పద్ధతిని ఇకఆపి పెట్టండి.మానివెయ్యండి. ఇతర కార్యాలు ప్రయోజనకారులు కావు. అవన్నీ విలంబన హేతువులు. కాబట్టి రుద్రనృపుణ్ణే తీసికొని రండి. సమన్వయము స్పష్టము.

ప్రవాసము

నాయికా నాయకులు దేశాంతరమందు ఉండడము ప్రవాసము అవుతుంది. నాయిక ఒకచోట నాయకుడు వేరొక చోటా ఉండడము అయినట్లయితే ప్రవాసము అని భావము ఆప్రవాసము హేతువుగా కలిగే విప్రలంభో దాహరణము!

సేవ్యోఽస్తు రుద్రనృపతిః నిఖిలై ర్న్నృపాలైః
అభ్యుత్సవేషు సులభా న హి వల్లభా నః
ఇత్థం కలింగసుదృశాం విరహా_ర్తితాపా
దంగాని యాంతి తనుతాం దివసా యుగంతి,

సర్వనరపాలురకూ రుద్రనృపతి సేవ్యుడు అవుగావుత. ఉత్సవదినాలలో కూడా మావల్లభులు మాకు సులభులు కా లేదే! అకించనులు కూడా ఉత్సవ దినాలలో ప్రియులను ఆదరించు కొంటారు. మాకు ఆభాగ్యము లేదే! ఈవిధంగా కళింగ దేశ స్త్రీలకు విరహబాధా పరితాపముల వలన అంగములు కృశించిపోతున్నవి. దినములు యుగములు అవుతున్నవి దీనిలో దేశాంతర వృత్తిత స్పష్టమె.

రసాభాస

రసాభాస మూడు విధాలని ఇదివరలోనే చెప్పబడింది. తిర్యగ్గతమయిన రసాభాసకు ఇది. ఉదా:—

ప్రాసాదగర్భ వలభీషు కపోతపాల్యాం
పారావతీం రమణచుంబిత చంచుకోటిం
ఆవిర్భవ త్సురతకూజిత రక్తకంఠీం
ఆలోక్య కాకతివిభుః స్మిత మాతనోతి,

సౌధ మధ్యభాగములోని చూరులలో కపోతపాళియందు ఒకమగ పావురము తన పారావతీ చంచుకోటిని చుంబనము

చేసికొన్నది. అప్పుడు ఆఆడుపావురము సురత కూజితము ఉదయించగా మధురస్వనము కలదైనది. దానిని చూచి కాకతి ప్రభుపుస్మితముచేస్తున్నాడు. దీనిలో పారావతముల ప్రణయము రసాభాసము అయింది. పారావతాలకు కళా కౌశలము లేదు. అందువలన వాని శృంగారానికి విభావాది పరిపూర్తి ఉండదు. కాబట్టి ఇది ఆభాస అవుతుంది. కొందరు ఇదికూడా రసమె కాని ఆభాస కాదంటారు. విభావాదులు ఉండడమె రసత్వ ప్రయోజకము కాని విభావాది జ్ఞానము రసత్వ ప్రయోజకము కాదు ఇది విభావము ఇదిఅనుభావము అనేజ్ఞానము వానికి ఉండనక్కర లేదు. కాబట్టి తిర్యక్కులకు కూడా రసము ఉండనేఉంది. అంటున్నారు

భావోదయము

భావము ఉదయమయినట్లు వర్ణించి నట్లయితే భావోదయము అవుతుంది. భావోదయాదుల లక్షణములు ఇదివరలో నిరూపింప బడినవి. ఉదా:—

ముగ్ధే! కస్తవ వర్తతే హృది మనోజన్మైవ నాన్యశ్శపే
సఖ్యైతస్య కిమత్ర కార్యమపరం కిం జన్మ సద్మాదరః
కోన్యస్తత్ప్రతిబింబ ఏవ నిపుణే! జానాసి కామాధికః
ప్రేమార్ద్రస్మ్రపస్తవేతికధితానమ్రాననాభూద్వధూః.

ఇది సంభాషణాత్మకమయిన పద్యము నాయికా సఖుల భాషణము.

సఖి:—ముగ్ధా ! నీ హృదయములో ఎవరు ఉన్నారు ?

సుందరి:—మనోజన్ముడే నే! ఇతరుడు ఎవరూ కాదు. ఒట్టు వేసికొని చెప్పుతున్నాను నమ్ము.

సఖి:—సఖీ ! ఆతనికి నీహృదయములో ఏమిపనిఉన్నదమ్మా?

ఆతడు ఇక్కడ ఉండి చేయవలసిన పని ఏమిటి?

సుందరి:— అయ్యో! ఇంకా ఏమి పని ఉంటుందే? అది అంతా జన్మ సద్మ పుట్టినిల్లు పై ఆదరము అందు వలననే ఆతడు ఇక్కడ ఉన్నాడు.

సఖి:— సరే! కాని, వేరొకరు ఎవరో ఉన్నట్లున్నారే! ఆ ఇతరుడు ఎవరు?

సుందరి:— ఆఁ ఎవరో కాదు. ఆతని ఆ మన్మథుని ప్రతిబింబమె

సఖి:— ఓసి! గడుసూ! నిపుణురాలవె! మమ్మల్ని అందరినీ వంచనము చేయడము ఎరుగుదువే! మన్మథుని కంటె నీకు అధికుడయిన ప్రియుడయిన రుద్రనృపుడు కాదా? ఆ రెండవ యాతడు?

అని సఖి పలికింది. ఇట్లా ఆమె పలికే టప్పటికి ఆ వధువు నమ్రానన అయింది. దీనిలో నాయిక నమ్రానన కావడము వలన ఆమెకు లజ్జ ఉదయించిందన్నమాట అందువలన భావోదయము.

భావశమము

భావము శమించుట భావశమమె. ఒక భావము శమించినపుడు వేరొకటి తప్పకుండా ఉదయించుతుంది. ఇట్లాగే భావోదయములోకూడా తదితర భావము శమించుతుంది, ఒక్కొక్క స్థలములో రెండు రెండు భావాలు తప్పవు. అయినా ఉదయ దవస్థతో కూడుకొన్న భావము చమత్కారకము అయినప్పుడు భావోదయ మని పేరు. శామ్యదవస్థతో కూడుకొన్న భావము చమత్కారక మయినప్పుడు భావశాంతి అని వ్యపదేశము. ఉదా:—

లక్ష్మీ స్త్వం పురుషోత్తమ స్త్వప పతిః శ్రీవీరరుద్రో నృపః
సృష్ట్వా సంబుజసమ్భవస్య కద్భుతో హ్యాగ శ్చిరా త్సంభృతః
తస్మా త్కృత్రిమ మస్యసాంప్రత మిదం వాం వైమనస్యం మనా
గిత్యాలిం ప్రణతాం విలోక్య వికస ద్వక్త్రాంబుజా మానినీ

నీవు మహాలక్ష్మివి నీ పతి అయిన వీరరుద్ర నృపుడు పురుషోత్తముడు. బ్రహ్మ సృష్టిలో చాలా కాలానికి సదృశులయిన మీకు సంబంధము సంపాదితమయింది. అందువలన కొంచెమయినా కృత్రిమంగా నయినా మీకు ఏ మాత్రమూ వైమనస్యము తగదు. అని పలికి చెలికత్తె నమస్కరించింది. ప్రణతురాలయిన ఆమెను చూచి మానిని అయిన ఆ నాయిక వికసించిన వక్త్రాంబుజ అయింది. దీనిలో నాయికకు కోపము శమించిందని ముఖ ప్రసన్నత వలన తెలుస్తున్నది. ఇక్కడ ప్రసన్నత అనే భావము పుట్టినట్లున్నా కోపశాంతియే చమత్కారకము.

భావసంధి

ప్రతాపరుద్రస్య దిగంత జైత్ర
యాత్రా ప్రభూతైః పటహ ప్రణాదైః
ప్రియానులాపైశ్చ తథా భటానాం
రోమాంచవర్మావృత మంగ మాసీత్.

ప్రతాపరుద్రునకు సంబంధించిన దిగంత జైత్రయాత్రలో ఉత్పన్నములు అయిన పటహ ప్రణాదముల చేతను, ప్రియురాండ్ర యొక్క అనురాగ తరంగిత మయిన అనులాపముల చేతనూ యుద్ధభటుల అంగములు రోమాంచమనే కవచముచే సమావృతములు అయినవి. పటహనాదం వింటూ ఉంటే వీరోత్సాహం అతిశయించి యుద్ధము చేయాలన్న

సంకల్పమూ ప్రియాను లాపములను వినేటప్పటికి రతి భావ మయిన హర్షము ఉదయించగా ప్రియాలింగ నాభిలాష కలగ డమూ సంభవించింది. ఈ పద్యములో వీరశృంగారములకు సంబంధించిన రెండువిధములయిన హర్షములు పరస్పరము విరుద్ధములై స్పర్థతో, (అంటే, దానిని అణచ వలెనని ఇదీ దీనిని అణచవలెనని అదీ స్పర్థకలిగి ఉండడము అన్నమాట.) సంబంధము కలిగి ఉన్నట్లుగా వర్ణింపబడి నందువలన భావసంధి ఆస్వాద్యము అవుతున్నది.

భావ శబలత

నిందం త్వద్య కులస్త్రియః ప్రియతమో లభ్యః సుఖం కేన వా
భాగ్యేనానుమతం న కిం గురుజనైః కా వా సఖీ ప్రేష్యతే?
కిం లోకస్య భవే త్ప్రసిద్ధిః మచిరా త్స్వచ్ఛంద మంకం కదా
రోక్ష్యామిః స్థిరతా కదా హృది భవేః ద్యాతవ్య ఏవ ప్రియః.

నేను ఇప్పుడు ప్రియుని గురించి బయలు దేరాలని అను కుంటున్నాను. ఈ సమయములో నేను చేసే పని ఉచిత మయినది కాదని కులస్త్రీలు నిందచేస్తారు కాబోలు! ఈ వాక్యమువలన లజ్జ వ్యజ్యమానము అవుతున్నది. ప్రియ తముడు ఏ భాగ్యము చేత సులభముగా లభ్యమవుతాడో ? ప్రియ సౌలభ్యములో ఏ భాగ్యము నిమిత్తము అవుతుందో ? ఈ వాక్యమువలన విమర్శ మూలకమయిన వితర్కము గోచ రము అవుతున్నది. ఈ వితర్క-భావము పూర్వపు లజ్జాఖ్య భావమును ఉపమర్దనము చేస్తున్నది. ఈ వితర్కమునకు ఉప మర్దకంగా వేరొక భావము నిర్దిష్టము అవుతున్నది. నేను ఇప్పుడు ఆచరింప దలచిన పని గురుజనులచేత అంగీకృతము కాదల్లె ఉంది. దీన్ని వాళ్ళు అంగీకరింప వలసిందేనే! ఎందు

వలన అంగీకరించలేదో? ఈ వచనములో కార్పణ్యము కన పడుతున్నందు వలన దైన్యము ధ్వన్యమానము అవుతున్నది. ప్రియుని తీసికొని రావడమునకు ఏ సఖిని పంపించేది? ఈ వాక్యము "గురు జనులకు ఇష్టము కాదే! నేను ఈ పని చేయరాదు కాబోలు" అనే పూర్వ భావానికి ఉపమర్దకంగా ఉన్నది. దీనివలన ప్రారంభించిన కార్యమును నిర్వహించక పోవడము అనే విషాదము వ్యంగ్య మవుతున్నది. దీనికి ఉప మర్దకంగా ఈ శంకాభావము గోచర మవుతున్నది. నేను ఇప్పుడు ఆచరించే ఈ దుర్నీతి వైభవము అంతా లోకానికి ప్రసిద్ధము అవుతున్నదేమో?" దీని తరువాత "అబ్బా! ఎప్పుడెప్పుడు స్వేచ్ఛగా ఆయన అంకమును అధి రోహించుతానో కదా!" అనే దీనిలో కాలాక్షమ స్వరూప మయిన నిజౌత్సుక్యము గోచర మవుతున్నది. "అబ్బే! ఈ ఊహ అంతా అసముచితంగా ఉన్నది. ఇటువంటి భావాలు కలుగ కుండా నాహృదయములో స్థిరత ఎప్పుడు కలుగుతుందో కదా!" ఈ వాక్యములో ధృతి. దీనికి ఉప మర్దకంగా "ఇక నేను ఆగ లేను. ప్రియుణ్ణి గురించి తప్పకుండా అభి సరించాలిసిందే" అనే వాక్యములో మతి వ్యజ్యమాన మవుతున్నది. ఇట్లా ఈ స్థలములో ఈ ఎనిమిది భావాలూ అన్యోన్యోపమర్దకంగా సమావేశము పొంది ఉండడము వలన భావ శబలత అవు తుంది. తుట్ట తుదకు మతి ప్రధానముగా చర్వ్యమాణము అవుతున్నప్పటికీ మధ్యలో ఉపమర్దకము లయిన భావాల వలన కలిగే చమత్కారము కూడా వ్యామిశ్రితమై ఉన్నది. ఈ పద్యములో ఔత్సుక్యాదులకు శబలత్వము ఉన్నదని విద్యానాథుడు మూలములో వ్రాస్తున్నాడు. పద్యములో లజ్జ

మొదట నిరూపింప బడింది. ఔత్సుక్యము మొదట నిరూపితము కాలేదు. అయినప్పటికీ లజ్జాది భావములు ఔత్సుక్యమును ముఖ్యముగా చేసికొని సూచించడమునకు నాథుడు ఆ విధముగా చెప్పి ఉంటాడని ఊహించాలి.

రస సంకరము

ఇప్పటికి భావముల మేళనము వలన కలిగే చమత్కారము ప్రదర్శిత మయింది. ఇట్లాగే రస మేళనము కూడా ప్రదర్శించడము ఉచితము కాబట్టి రససంకరమును ఉదాహరించాలి. అందు శృంగార కరుణములకు సంకరము ఉన్న. ఉదా:—

ఆసన్నేపి మహోత్సవే కథ మిత స్త్యక్త్వా ప్రవాసం వ్రజేః
ధిక్ 'ధిక్' సాహస మావయో ర్విఘటనం కోవా విధిః కాంక్షతి
ఇత్థం స్వప్ననివారిత ప్రియతమ ప్రస్థాన బుద్ధి స్తతో
బుద్ధ్వా మూర్ఛతి కాకతీయనృపతే! త్వద్వైరినారీజనః.

కావ్యప్రకరణములో దీని భావము నిరూపిత మయినది. ఈ పద్యములో శృంగార సంకీర్ణమయిన కరుణము ప్రతిపాదితము. రౌద్రబీభత్సములకు సంకరోదాహరణము.

పీత్వా మాంసోపదంశం ద్విరద గలగలద్రక్త మైరేయధారాం
మత్తో మస్తిష్కలగ్న స్ఖలిత నృపవపుఃకీకసైః స్పష్టదంష్ట్రః
బిభ్రద్రౌద్రాంత్రమాలాం జనిత జనభయో వైరివారాంఘోరః
సంగ్రామోర్వ్యాః కలింగై ర్బలివిధి మకరో వీరరుద్రస్య ఖడ్గః.

వీర రుద్రఖడ్గము సంగ్రామ భూమికి కలింగుల చేత బలి విధిని ఏర్పాటు చేసింది. కలింగ దేశీయులను బలిగా పెట్టింది. ఇక ఈ పద్యములో ఆ ఖడ్గవర్ణనము ఉన్నది. ఆ ఖడ్గము ఏనుగుల గళమునుండి ప్రవహించుతూ ఉన్న రక్తమనే మద్యధారను మాంసములో నంజుకొంటూ పానము చేసింది. బాగా

మదించింది. శత్రురాజ శరీరములను దళనము చేయుగా మస్తి
ష్కములో కూడు కొన్న సన్నని ఎముకలు ఖడ్గాగ్రములో
కలుసుకొన్నవి. అప్పుడు ఆ ఖడ్గము కోరలను సృజించు కొన్న
ట్లుగా ఉన్నది. రౌద్రమయిన ఆంత్ర మాలను (ప్రేవులు)
ధరించుతున్నది. ఇట్లా ఉన్న ఆ ఖడ్గము కాలభైరవాకారము
కలదై మహా ఘోరముగా జనుల కందరకూ భయము కలుగ
జేస్తున్నది.

ఈ చెప్పిన రెండు ఉదాహరణములలో మొదటి శ్లోక
ములో కరుణము రెండవ దానిలో రౌద్రమూ చరమ విశ్రాంతి
ధామముగా చర్వణా గోచరము అవుతున్నది. ఆస్వాదనములో
అవే ముఖ్యముగా భాసించుతున్నవి శృంగార బీభత్సములు
రెండూ ఆ రసాలకు ఆ ఉదాహరణములలో ఉపస్కారములై
అంగిభూతములు గానున్నవి. ఈ అంగ భూతముగా ఉన్న రస
ములు పరిపోషము పొంది ఉన్నవా? పరిపుష్టములు కాలేదా?
పరిపుష్టము అయినట్లయితే ఉపస్కార్యములు కావాలి కాని
అంగములు కావు కదా! పరిపోషము పొందక పోయిన
ట్లయితే రసత్వమె సిద్ధము కాదే? కాగా రసాలకు సంక
రము ఉన్నదని అనడము ఎట్లా కుదురుతుంది? అని సందే
హము కలుగవచ్చును. కాని పరిపోషము ఉన్నప్పటికీ
ఒక్కొక్క రసము, ఒక్కొక్క దానికి ఒక్కొక్కప్పుడు
ఉపస్కారకముగా ఉండవచ్చును. అంగము కావచ్చును.
ఒక రసము తన విభావాదుల వలన పరిపోషము పొంది
చమత్కారక మయినా దాని చమత్కారము • అంత
లోనే విశ్రాంతి పొందదు. వేరొక చమత్కారమును అది
అను ధావనము చేస్తుంది. ఈ రెండు చమత్కారముల

సమ్మేళనంలో అంగాంగి భావత అవిరుద్ధముగా ఉండవచ్చును అని ప్రాచీనాచార్యు లంగీకరించు తున్నారు.

ఈ రసముల అంగిత్వము ఒక్కొక చోట స్వాభావిక మవుతుంది. వేరొకచోట ఆరోపిత మవుతుంది. ఈవిశేషము లను ఇతర స్థలములలో గ్రహించేది. ఈ విధముగానే యథా సంభవముగా ఉదాహరించి గ్రహింప వలెను.

లౌకిక రసము

ఈ రసము లౌకిక మని అలౌకిక మని రెండు విధాలు. వానిలో లౌకిక రసము కదలీరసాలాది ఫలములను ఆస్వాదించే టప్పుడు కలిగే ఆనందముతో సదృశ ముగా ఉంటుంది. ఇది కార్యమున్నూ అవుతుంది. రెండవది అయిన అలౌకిక రసము బ్రహ్మానంద సబ్రహ్మచారి నిత్యమూను. లౌకికరసమునకు అనుకార్యులు అయిన రామాది నాయకులు ఆశ్రయముగా ఉంటారు. ఇది వారినే ఆశ్ర యించి ఉంటుంది. కాని ఇతరులను ఆశ్రయించి ఉండదు. ఆ రామాది నాయకుల యొక్క ధీరోదాత్త త్వాదికము లయిన అవస్థలను నటుడు తనయందు ఆరోపించుకొని అభ్యాస పాటవము వలన నిపుణము లయిన అభినయముల ద్వారా ప్రదర్శించు తాడు. అప్పుడు సామాజికులు రామాదుల తన్మయీ భావమును పొందడానికి యోగ్యమయిన మనస్సు కలవారై నటాభినయము ద్వారా గోచరము అవుతూ ఉన్న రామాది నాయకుల రస భావములను సాక్షాత్తుగా భావించు తారు. కేవలమూ తమకు సంబంధించినట్లుగా అనుసంధా నము చేస్తారు. ఆ దేవిధముగా గుణాలంకారములచేత పరి ష్కృత మయిన రసోల్లసితములయిన శబ్దార్థముల సంఘటన

రూపమయిన కావ్యమును చక్కగా వినినందువలన తద్బల మును బట్టి సామాజికులు రామాదుల రసభావములను సాక్షా త్తుగా భావింతురు. ఇట్లా ఈ రెండు విధములుగా కూడా సామాజికుల భావనకు రామాదుల రసము అందుబాటులో ఉంటుంది. ఆ రసము రామాదులదే అయినప్పటికీ సామాజికు లలో సమ్యగ్భావన ఉన్నందువలన నిరతిశయానందము కలుగ వచ్చును ఇది ఏమాత్రమూ విరుద్ధము కాదు. భావనా విశే షము వలన ఆనంద విశేషము కలుగుట అయుక్తము కాదు. ఈ లౌకిక రసమునకు రామాదులె ఆశ్రయమయినా సామాజి కులలో ఆనందము కలగడముకూడా ఉపపన్నము అవుతుందని ఇంతవరకు నిరూపించిన ప్రఘట్ట సారము.

రసమునకు ఆశ్రయము వేరుగా ఉండి వేరొక స్థలములో ఆనందము కలగడము అనేది అంతఉచితముగా కనపడడం లేదు. ఆనందము ఎక్కడ కలుగుతున్నదో అక్కడనే రసా శ్రయత్వము కూడా ఉండాలి. కాబట్టి ఆరసము సామాజికా శ్రయముకూడా కావచ్చును. అనే అర్థమును నిరూపించడము కొరకై వేరొకరీతి అనుసరింప బడుతున్నది.

అలౌకికరసము

ఈచెప్పిన రసము సామాజికాశ్రయముగా ఉండడము కూడా విరుద్ధము కాదు. ఈఅంశములో ఈవిషయమును భావించాలి! నటుడు మాలతి సీత శకుంతల మొదలయిన శబ్దాలను ఉచ్చరించి నప్పుడు అతని అభినయ సమయంలో ఆశబ్దాలను సామాజికులు వినగానే అపూర్వమయిన భావన కలవారవుతారు. మాలత్యాది స్త్రీలు మాధవాదులకు సంబం ధించి ఉన్నారు. అయినప్పటికీ సామాజికుల భావనలో వారు

ములో వారిలోని సంస్కార బీజములు ఉద్బుద్ధములు అవుత సామాన్య రూపముగా భావింపబడిన రామాదులు ప్రత్యక్ష ముగా భాసించుతారు. శబ్దసముపారూఢ రూపము కలిగి రామాదులు ప్రత్యక్షముగా కనపడడమువింతకాదు. అయి ప్పటికీ వారు సామాన్య రూపముగా గోచరించుతారు అనే విషయమును గుర్తు పెట్టుకోవాలి. కనుకనే సీతారామాద లను స్వనాయికగా స్వనాయకునిగా భావించినప్పటికీ ఏ అనౌ చిత్యమూ లేదు వాస్తవముగా వారు లోకములోని స్త్రీ పురు షులే. అయినప్పటికీ కావ్యముఖమున అభినయ ముఖముగ భావింప బడగానే సామాజికాంతః కరణ ప్రతిబింబితులై సామాజిక నిష్ఠుల వుతున్నారు.

రసాశ్రయము

లౌకిక రసమునకు రామాది నాయకులు ఆశ్రయము ఆ రామాదులను ఆశ్రయముగా చేసికొని లౌకిక రసము గోచర మవుతున్నట్లు ప్రతీత మవుతున్నది గదా! అలౌకిక రసానికి సామాజికులు ఆశ్రయము. రత్యాదులై శృంగారాది వ్యపదేశము పొందుతున్నవి. రత్యాదులు లౌకికములై అయినప్పటికీ స్థాయి భావ సామ్రాజ్యములో మూర్ధాభి షిక్తము లవుతున్నవి కదా! ఈ విభావము మొదలగునవి అన్నీ కూడా సామాజికుల చేత విలక్షణంగా ఆస్వాదింప బడుతూ ఉంటవి. అట్లా కాగానే అలౌకిక ప్రతీతిలో విషయ ములై అలౌకికములై అవుతున్నవి. ఇటువంటి విభావాదుల వలన • నిష్పన్నమయిన రసముకూడా అలౌకికము కాక తప్పదు కదా! ఇదన్నీ సామాజికుల నిర్మలాంతః కరణములో ప్రతి బింబిత మయిన స్థాయి స్వభావకము. ఇది సామాజికు

లందే ఉంటుంది. అందువలన ఈ అలౌకికరసానికి సహృదయ సామాజికులు ఆశ్రయము అనడము సంగత మయినమాట. అలౌకిక మయిన రసానికి వేరొక ఆశ్రయము లేదు, సామాజికేతరాశ్రయము ఉంటుందని అనడము కూడా అసంగతము. కావ్యనాట్యములలో సామాజికేతరులు ఇద్దరు కనపడుతున్నారు. రామాది నాయకుడు తదభినయము చేసే సమర్థ నటుడు. వీరిద్దరిలో అలౌకిక రసానికి రామాది నాయకులు ఎప్పుడూ ఆశ్రయము కాజాలరు. వారు గతించి పోయినారు కదా! రసమేమో ప్రకృతానుభవప్రతిభాసము. అది, అతీతాశ్రయము అని అనడము కుదురుతుందా? ఆ రామాదులను ఉద్దేశించి ఈ కావ్యనాట్యములున్నూ ప్రవృత్తములు కావడము లేదు. కాబట్టి అలౌకికము రామాద్యాశ్రయము కాదు. రామాదుల అవస్థానుకర్త అయిన నటుడు ఎపుడూ రసాశ్రయుడు కాడు. ఆతడు అనుకరణ మాత్ర తత్పరుడు అందువలన ఆతనికి రసాశ్రయ యోగ్యత లేదు. "అభినయము ఏవిధముగా చేయాలా?" అనే ఆతడు అనవరతమూ ఆలోచిస్తూ ఉంటాడు. ఈ విధంగా అభినయించితే బాగుంటుందేమో? ఇట్లా చేస్తే రుచిరంగా ఉంటుందేమో? అని ఆతడు అభినివిష్ట చిత్తుడై ఉంటాడు. అయినా ఆ నటుడు కూడా ఒకప్పుడు భావకుడు కావచ్చు. అప్పుడు ఆతనికి సామాజికత్వమె కాని నటత్వము లేదు. సామాజికునకు శ్రవ్యతాకృతముగా దృశ్యతాకృతముగా ఉభయాస్వాదము కలుగుతున్నది. నటునకు దృశ్యతాకృతమయిన ఆస్వాదము కుదరదు. కేవల శ్రవ్యతాకృతమయిన ఆస్వాదము కలగవచ్చును. అప్పుడు అట్లు ఆతడు భావించు వాడు అయినట్లు

యితే ఆతని యందు భావకత్వము మాత్రమె ఉంటుంది. నటుడు ఆనంద పరాధీనుడయినప్పటికి శిక్షాభ్యాస పాటవం వలన అనుభవాదులను ప్రకాశింప చేయగలడు. అంతేకాని ఆతడు ఏ రసానికీ ఆశ్రయుడు కాడు. నటుడు కేవలమూ సుధాపాత్ర. సుధాపాత్రకు సుధాస్వాదము ఉంటుందా ? కాబట్టి నటుడు రసాశ్రయుడు కాడు.

రసముల పరస్పరవిరోధము

విరోధము లేని రసాలను ఒక చోట సమావేశింప చేసి వర్ణనము చేయడము విరుద్ధము కాదు. ఒకప్పుడు కొన్ని రసాలకు పరస్పరమూ విరోధము ఉన్నప్పటికి కవి ప్రౌఢోక్తి సమాశ్రయణము చేత ఒకచోట సమావేశము ఉండడము విరుద్ధము కాదు. అట్లా కూర్చబడిన రసాలలో ఒకటి అంగిగా వేరొకటి అంగముగా ఉంటుంది. కాబట్టే విరోధము ఉండదు. అటువంటి వర్ణనము ఉన్న స్థలములో సహృదయులకు ప్రహ్లాదాతిశయమె కలుగుతుంది. శృంగార తిలకము అనే గ్రంథములో రుద్రభట్టు రసముల విరోధ క్రమమును ఈ విధముగా చెప్పుతున్నాడు. శృంగార బీభత్సములు, వీరభయానకములు, రౌద్రాద్భుతములు; హాస్య కరుణములూ పరస్పరమూ వైరి రసములు. ఒక రసమును వేరొక రసము విరోధము కలది కావడము వలన బాధించేది అవుతుంది. అప్పుడు పరసము యొక్క ప్రతీతిన్నీ సరిగా ఉండదు. ఒక స్థలములో ఏకవిషయాలలో ఈ విరుద్ధ రసములను వర్ణించనే వర్ణించరాదు. ఒక వేళ వర్ణింప వలసి వస్తే వాని విరోధమును పరిహరించి వర్ణించాలి. ఈ విరోధ పరిహార రీతిని గ్రంథాంతరములందు దర్శించాలి.

ఒక రసము వలన వేరొక రసము ఉత్పన్నము కావడము కూడా సమ్మతమే. ఈ విషయము కూడా శృంగార తిలక ములో చెప్పబడింది. శృంగారమువలన హాస్యము రౌద్రము వలన కరుణము వీరము వలన అద్భుతము బీభత్సము వలన భయానకమూ ఉత్పన్న మవుతుంది. సాధారణంగా ఈ రసా దులకు సంబంధించిన విభావాది సామగ్రి ఏకవిధంగా ఉం టుంది. సత్వ రజ స్తమోగుణ సహితమయిన మనస్సుకు బయటి ప్రపంచంలోని పదార్థాలతో సంబంధము ఉన్నప్పుడు ఒక్కొక విధమయిన వికారము కలుగుతుంది. అటువంటి మనోవికార విశేషములె శృంగారాది రసములు. ఈ మనో వికృతులలోని భేదాలను బట్టి హాస్యాదులు కలుగుతవి.

వ్యభిచారి భావ వ్యవస్థ

కొన్ని కొన్ని వ్యభిచారి భావాలు కొన్ని కొన్ని రసాలలో ఆనుగుణ్యము వహించి ఉంటవి. ఏ భావాలకు ఏ రసాల అను గుణత్వము ఉంటుందో శృంగార తిలకములో ఈ విధముగా ప్రతిపాదిత మయింది. శంక అసూయ భయము గ్లాని వ్యాధి చింత స్మృతి ధృతి ఔత్సుక్యము విస్మయము ఆవేగము వ్రీడ ఉన్మాదము మదము విషాదమూ జడత నిద్ర అవహిత్థ చాప లము మృతి అనే భావములను శృంగార రసములో ప్రయో గించాలి. శ్రమ చపలత నిద్ర స్వప్నము గ్లాని శంక అసూయ అవహిత్థ అనే భావాలు హాస్యములో ఉంటవి. త్రాసము మరణము దైన్యము గ్లాని భయానక రసములో ఉంటవి. అప స్మారము విషాదము భయము రోగము మృతి మదము ఉత్సా హము అనే భావాలు బీభత్స సంభవములు. అద్భుత రస ములో ' ఆవేగము జడత మోహము' హర్షము విస్మయము

స్మృతి అనే భావములను నిబంధించాలి. కరుణ రసములో దైన్యము చింత గ్లాని నిర్వేదము, జడత స్మృతి వ్యాధి అనే వానిని భావ విశారదులు నిరూపించాలి. రౌద్రములో హర్షము అసూయ గర్వము ఉత్సాహము మదము చాపల్యము ఉగ్రతఅనే వానిని నిరూపించాలి. అమర్షము విబోధము వితర్కము మతిధృతి క్రోధము అసూయ సమ్మోహము ఆవేగము హర్షము గర్వము, మదము ఉగ్రత అనేభావములను వీరమునందు ప్రతిపాదించాలి. ఏరసమయినా సంపూర్ణము అయినట్లయితే రసాంతరమును తిరోధానించుతుంది. భరతుడు చెప్పిన ప్రక్రియాను సారముగా చూచినట్లయితే కావ్యములో రసము ఒక్కటే అనేక రసాలు ఉండవు. ఆ రసాలకుసంకరమున్నూ ఉండదు. అయినప్పటికీ మహాకవి ప్రసిద్ధిని అనుసరించి రససంకరమును స్వీకరించుతున్నారు.

రసవదాద్యలంకారము

రస భావాదులు అప్రధానములు అయినట్లయితే రసవదాద్యలంకారములు సిద్ధములు అవుతున్నవి. రసాదులు ప్రధానము లయినప్పుడు రసభావములు ఇదివరలో నిర్దిష్టములయినవి. ఇతరములకు అంగముగా రసమును నిబంధించినప్పుడు రసవద లంకారము అవుతుంది. భావమును అన్యాంగముగా విధించినప్పుడు ప్రేయోలంకారము అవుతుంది. రసాభాస భావాభాసములను అన్యాంగముగా నిబంధించితే ఊర్జస్వి అలంకారము అవుతుంది, భావశాంతిని అన్యాంగముగా నిబంధించగా సమాహితాలంకారము అవుతున్నది. ఈవిధముగానే భావోదయ భావసంధి భావశబలతలను అన్యాంగముగా నిరూపించి నప్పుడు ఆయా నామములు కల అలంకారములు

అవుతున్నవి. ఈవిషయము అలంకార సర్వస్వములో విపులముగా నిరూపించ బడింది.

రసభావతదాభాస తత్ప్రశమన నిబంధనే
రసవత్ప్రేయ ఊర్జస్వి సమాహితాని
భావోదయ భావశాంతి భావసంధి
భావశబలతాశ్చ పృథగలంకారాః

అని ఇది సర్వస్వకార వచనము దీనిఅర్థము పై వచనములో గతార్థమే. అలంకార ప్రకరణమునందు వీని ఉదాహరణము ఉంటుందని విద్యానాథుడు మూలములో చెప్పతున్నాడు కాని అలంకార ప్రకరణములో వీనికిఉదాహరణము లేనే లేదు. కర్తమరచి ఉండవచ్చును. అయినప్పటికీ ప్రతిపత్తి సౌకర్యమునకై గ్రంథాంతరములనుండి ఉదాహరణములు ప్రదర్శింప బడుతున్నవి.

రస వదలంకారము

అయం స రశనోత్కర్షీ పీనస్తన విమర్దనః
నాభ్యూరు జఘన స్పర్శీ నీవీవిస్రంసనః కరః

భారత యుద్ధములో అర్జునుడు భూరిశ్రవసుని భుజమును నరికితే ఆ భుజమును చూచి భూరిశ్రవసుని భార్య ఈ విధముగా విలపించుతున్నది. ఆ హస్తము సూరశనను (మొలనూలు) రతి సమయములో కర్షణము చేసింది. మా పీనస్తనవిమర్దనము చేసింది. నాభి ఊరువు జఘనములను స్పృశించింది. ఇంకా నీవీ విస్రంసనము చేసింది. దీనిలో భావ్యమాన విశేషములను అనుబంధించి ఉన్న శృంగార రసము ప్రక్రాంతము ప్రబంధ ప్రవృత్తిమూ అయిన కరుణ రసమునకు అంగముగా ఉన్నది. అంగ భూత మయినప్పటికీ చమత్కారిక

ముగా ఉన్నందు వలన రసవదలంకార మని గ్రహించాలి. రసము వేరొక రసమునకు అంగమయి నప్పుడు రసవదలంకార మయినట్లే వేరొక భావమునకు అంగ మయినా రసవద లంకారమే.

ప్రేయోలంకారము

త్వం ముగ్ధాక్షి! వినైవ కంచులికయా ధత్సే మనోహారిణీం
లక్ష్మీ మిత్యభిధాయిని ప్రియతమే తద్వీటికా సంస్పృశి
శయ్యోపాంత నివిష్ట సస్మిత వధూనేత్రోత్సవానందితః
నిర్యాతః శనకై రలీకవచనోపన్యాస మాలీజనః

ఓ! సుందరాక్షీ! నీవు రవిక లేకుండా ఉంటేనే మనోహర శోభను ధరించుతున్నావు. అని అంటూ ప్రియతముడు ఆనాయిక రవికముడిని స్పృశించగానే శయ్యాదగ్గరగా కూర్చొని ఉన్న ఆ వధువు చిన్న స్మితము కలదై సంతోష పడింది. కళ్ళు ఇంతగా చేసికొంది అప్పుడు ఇక నేం తక్కువ? అని ఆనంద పడిన చెలికత్తెలు ఏదో వంక వంక మాటలు చెప్పి నెమ్మదిగా వెళ్ళి పోయినారు. దీనిలో చెలికత్తెలకు నాయికా విషయంలో ఉన్న అనురాగము నాయికా నాయకుల శృంగారరసములో అంగమయింది. ఇట్లాగే భావము వేరొక భావానికి అంగమయినా ప్రేయోలంకారమె అవుతుంది

ఊర్జస్విఅలంకారము

ఖందీకృత్య నృప! ద్విషాం మృగదృశః తాః పశ్యతాంప్రేయసాం
శ్లిష్యంతి ప్రణమంతి లాంతి పరితశ్చుంబంతి తే సైనికాః
అస్మాకం సుకృతైః దృశోర్నిపతితో స్యౌచిత్య వారాంనిధే!
విధ్వస్తా విపదోఖిలాస్తదితి తైః ప్రత్యర్థిభిస్తూయసే.

ఓ ! రాజా ! నీ సేనాభటులు శత్రువుల స్త్రీలను బందీలనుగా చేసి వాళ్ళ ప్రియులు చూస్తూ ఉండగానే ఏమీ లక్ష్య పెట్టకుండగా ఆ స్త్రీలను ఆలింగనము చేసికొంటున్నారు. వాళ్ళు తిరస్కరించితే ప్రణమిల్లుతున్నారు. వాళ్ళు పక్క పక్కకు వెళ్ళుతూ ఉంటే బ్రతిమాలుకొంటున్నారు. వాళ్ళు ఏమీ ఇష్ట పడక పోయినా బలాత్కారంగా చుంబిస్తున్నారు. ఇట్లా ఉండగా ప్రత్యర్థులయిన ఆ స్త్రీల భర్తలు నిన్ను ఈ విధముగా స్తవము చేస్తున్నారు. ఓ ! సౌచిత్య సాగరా ? మా పుణ్యము మంచిది. నిన్ను కనపడినావు. మా స్త్రీ పరిభవాది రూపములయిన ఆపదలన్నీ పోయినవి ప్రభూ! అని దీనిలో అంగీకారము లేని స్త్రీల విషయముగా ఉన్న శృంగారము ఆభాస. ఆ శృంగారాభాస ఉత్తరార్ధములో ప్రభు విషయిక రతిభావములో అంగమయినది. ఉత్తరార్ధములో రాజును శత్రువులు స్తవము చేయడమనేది భావాభాస. ఇది కూడా రాజ విషయక రతిభావాంగమయినది. ఇట్లా రసాభాస భావాభాసలు అంగములయినప్పుడు ఊర్జస్వి అలంకారము.

సమాహితాలంకారము

అవిరళ కరవాల కంపనై ర్భ్రుకుటీ తర్జన గర్జనై ర్ముహుః
దదృశే తవ వైరిణాం మదః స గతః క్వాపి తవేక్షణే క్షణాత్

ఎప్పుడూ ఖడ్గ కంపనములతోనూ భ్రూక్షేపము భయము పుట్టించే గర్జనములతోనూ మాటిమాటికి కనిపించిన నీ శత్రువుల మదము బాగానే కనపడింది గాని నిన్ను కనపడిన క్షణంలో ఇది ఎక్కడికో పోయింది. దీనిలో మదము అనే

భావము శమించడమూ అది ప్రభు విషయకరతి భావములో అంగము కావడమూ విశదముగానే ఉన్నది.

భావోదయాలంకారము

సాకం కురంగకదృశా మధుపానలీలాం
కర్తుం సుహృద్భిరపి వైరిణి తే ప్రవృత్తే
అన్యాభిధాయి తవ నామ విభో గృహీతం
కేనాపి తత్ర విషమా మకరో దవస్థాం.

తన ప్రియురాలి తోటి స్నేహితుల తోటీ కూడుకొని నీ శత్రువు మధుపాన ప్రవృత్తుడు కాగా ఎవరినో పిలుస్తూ ఎవరో నీ పేరు పలికారు. అప్పుడు అక్కడ చాలా విషమా వస్థ కలిగింది. దీనిలో ఆ శత్రువుకు ఉదయించిన త్రాసము అనే భావము రాజ విషయ రతిలో అంగ మయింది.

భావసంధి అలంకారము

అసోఢా తత్కాలోల్లస దసహభావస్య తపసః
కథానాం విస్రంభే ష్వథచ రసికః శైలదుహితుః
ప్రమోదం వో దిశ్యా త్కపటవటు వేషాపనయన
త్వరా శైథిల్యాభ్యాంయుగపదభియుక్తః స్మరహరః.

పార్వతీదేవి యొక్క ఆసమయంలో అతిశయించుతున్న తపస్సును సహింపలేని వాడున్నూ ఆదేవి కథల విస్రంభము లలో రసికుడున్నూ అయి కపట వటువేషమును తీసివేయడ ములో త్వరా శైథిల్యములతో ఒకేసారి కూడుకొన్న శివుడు మీకు ప్రమోదమును ప్రసాదించు గావుత. ఆ దేవి ఆ విధ ముగా, శరీరమును కూడా లక్ష్యము చేయకుండా ఉగ్ర తపస్సు చేస్తూ ఉంటే మాయా వటు వేషములో ఉన్న శివుడు క్షణ మయినా ఉపేక్షింప లేక ఆ వేషమును తొల

గించుకొని స్వరూపముతో ఎదటికి రావాలను కుంటున్నాడు శివప్రేమతో ఉన్న పార్వతి ఇట్లా చేసింది. ఇటా చేసింది అని ఆయా కథా విశేషాలను చెప్పుతూఉంటే ఆ మాయా వేష ములోనే ఉండి ఇప్పుడప్పుడే వేషమును తీసి వేయకుండా ఇంకా విందాము. ఇంకావిందా మన్న అభిలాషతోనూ శివుడు ఉన్నాడు అని భావము. దీనిలో త్వర వలన ఆవేగము శైథి ల్యము వలనధైర్యము అనేరెండూ భావాలు వ్యంగ్యము లవు తున్నవి. అవి రెండూ శివవిషయకరతి భావములో అంగ ములయినందున భావ సంధి అలంకారము.

భావశబలత

పశ్యేత్కశ్చి చ్చల ! చపల ! రే ! కా త్వరాహం కుమారీ
హస్తాలంబం వితర ! హ ! హ ! హా ! వ్యుత్క్రమః క్వాసియాసి
ఇత్థం పృథ్వీపరివృఢ! భవద్ద్వేషిణోఽరణ్యవృత్తేః
కన్యా కంచి త్ఫలకిసలయా న్యాదదానా భిధత్తే.

ఓ ! రాజా అరణ్య నివాసము చేస్తూ ఉన్న నీ శత్రువు కన్య ఫలములను కిసలయములను తీసికొంటూ ఒకని ఈవిధ ముగా అంటున్నది. "నాతోరమించుతూఉంటే నిన్నుఎవరయినా చూస్తారు" అని భయపెట్టడానికి కాముకుడు అంటే కన్య ఇట్లా అంటున్నది. "ఓయి! చపలా ! అయితే పద! రహస్య ప్రదేశానికి నడు. నేను అక్కడికే వస్తాను. కాముకుడు ! ఆఁ అంత తొందరేమిటి ? ఏమిటా భయం ! అబ్బా ! కన్య : నేను చిన్నదాన్ని కాదూ ! నవ్వడంఎందుకు ?" కాముకుడు: అయితే ఏదీ నీ చేయి ? హస్తాలంబము ఇవ్వు. వివిక్తప్రదేశ మునకు వెళ్లవలసే ఉంటే ఒంటరిగా వెళ్లడమె ! హస్తా లంబం వితర" అన్నాడు. కన్య ఓహో! హూ!! అంతా

వ్యగ్రత్వముంగా ఉందే! అడదాన్ని నేనా? ఎక్కడికీ? వెళ్ళు తున్నావు! దీనిలో శంక అసూయ స్మృతి శ్రమము దైన్యము ఔత్సుక్యము అనే భావాలకు శబలత్వము ఉన్నది. ఈ భావ శబలత రాజ విషయక రతి భావాంగము. అందువలన అలంకారము. విద్యానాథుడు రసభావాదులకు ఉదాహరించిన పద్యాలు అన్నిటిలోనూ ఆ యా రసభావాదులు ప్రతాప రుద్ర విషయక రతి భావములో అంగములవుతూ ఉన్నవి కాబట్టి ఆ దృష్టిలో ప్రతదుదాహరణత్వమును అభ్యూహించవచ్చు. అయినా స్పష్టతకు గ్రంథాంతర దర్శనము.

రసనిష్కర్ష

రసప్రకరణ ప్రారంభములో కొంతగా రసస్వరూపము నిరూపించ బడింది. ఇంతకు పూర్వ భాగములో కూడా లౌకికా లౌకిక భేదమును అనుసరించి రస స్వరూపము కొంత చర్చితము అయింది. ప్రతిపత్తి సౌకర్యము కొరకై రస స్వరూపమును విశదముగా నిరూపించాలని విద్యానాథుడు ఈ శ్లోకములను నిరూపించుతున్నాడు.

గుణాలంకారశ్రీ కృత పరికరో భావవిభవః
స్ఫురత్ప్రాదుర్భావః క్రమగలిత వేద్యాంతరమతిః
సుఖం వా దుఃఖం వా నిబిడయతు యూనోః సహృదయే
త్వపుంవానందాత్మా పరిణమతి పూర్ణో ఎ సభరః

రత్యాది స్థాయిభావ వర్గము గుణాలంకార శోభల చేత బాగా అభివ్యక్తము అయినదై రసోన్ముఖత్వమును సంపాదించి క్రమ క్రమముగా ఇతర పదార్థముల విజ్ఞానమును విగలితము చేస్తుంది. అదే నాయికా నాయకులయిన సీతారాము లకు సుఖమును గాని దుఃఖమును గాని సంధానించేది కావ

చ్చును. కాని సహృదయ సామాజికుడయితే అమందానందాత్మకముగ పూర్ణ రసభరమై పరిణమించుచున్నది. కావ్యములో సీతారామాదులకు సంబంధించిన భావచక్రము వర్ణింపబడుతుంది. అది గుణాలంకార వృత్తి రీత్యాదులచేత అభివ్యక్తము అవుతుంది. అట్లా కాగానే రసప్రవణము అవుతూ కేవలము తదేక విజ్ఞానమునే సంపాదించుతుంది. ఇటువంటి ఈ రసము శృంగారాదికమయితే సుఖమును కరుణాదికమయితే దుఃఖమును నాయికా నాయకులకు కూర్చవచ్చును. సహృదయునియందయితే అది శృంగారమయినా కరుణమయినా అఖండాహ్లాదాకరమై రసీభావము పొందుతుంది. అని పై శ్లోకమునకు సామాన్యాకారముగా భావము.

> రసో వాక్యార్థః సన్విలసతి పదార్థాః పునరమీ
> విభావాద్యాః యస్మిన్నిల దధతి విశ్రాంతి ముచితాం
> అతో భావా ఏవ క్రమసముదితాన్యోన్యవిభవా
> రసీభావం బిభ్రత్యథ చ పటతాం తంతవ ఇవ.

రసము వాక్యార్థమై విలసించుచున్నది. ఈ విభావాదులు అన్నీ పదార్థములై ఉంటున్నవి. పదార్థములు వాక్యార్థములో ఉచిత విశ్రాంతిని ధరించుచున్నవి కదా! అట్లాగే విభావాదులు రసములో సముచిత విశ్రాంతిని పొందుతూ ఉంటవి. కాగా రసము వాక్యార్థస్థానీయము అని విభావాదులు పదార్థస్థానీయములని గ్రహించవచ్చును. కాబట్టి ఈ భావములే క్రమ క్రమముగా అన్యోన్య విభవమును సముల్లసింపచేసి కొన్నవై తంతువులు పటత్వమును పొందినట్లుగా రసీభావమును పొందుచున్నవి. రసము వాక్యార్థము పటము కూడా తుల్యాకృత్యగా ఎన్నదగి ఉన్నవి. భావములు

పదార్థములు తంతువులూ పై మూడింటికీ సంబంధించి సమాన కక్ష్యతో ఉన్నవి. పదార్థములు కలిసి పరస్పరా న్వయాన్వయి భావముతో కూడుకొన్నవై వాక్యార్థీ భావమును పొందుతున్నవి. తంతువులు పరస్పర సంయోజనము పొంది పటీభావము పొందుతున్నవి. భావములు అన్యోన్య విభవము కలవై రసీభావము పొందుతున్నవి. అని తాత్పర్యము

భావే స్థాయిని వర్ధమానవిభవే రత్యాదికే సింధువత్
కల్లోలా ఇవ సంభవంతి విలయంచాయాంతి భావాముహుః
నిర్వేదాద్యుపభోగ భావిత నిజాస్వాదాతి రేకోరసో
లోకే స్యాదనుకార్య ఏవ కథితో నాట్యేతు సామాజికే

రత్యాది స్థాయి భావము విభావాదుల వలన వైభవము కలది అవుతూ ఉన్నప్పుడు నిర్వేదాది వ్యభిచారి భావాలు సముద్రములో తరంగముల మాదిరిగా పుట్టుతూ ఉంటవి. విలయమును కూడా పొందుతూ ఉంటవి. మాటి మాటికీ ఇక్కడి పరిస్థితి ఇట్లాగే ఉంటుంది. ఈ నిర్వేదాది భావాలయొక్క అనుభవమువలన తనయొక్క ఆస్వాదాతిశయమె భావితము అవుతూ ఉంటుంది. ఇట్లా భావ్యమానస్వీయాస్వాదమె రసము. ఈరసము లోకపరిస్థితిలో చూచేటట్లయితే అనుకార్యుడు అయిన రామాది నాయకుని యందే ఉంటుంది. నాట్యదృష్టితో చూచేటట్లయితే సామాజికుడయిన సహృదయుని యందె ఉంటుంది. రామాది నాయకులందు రత్యాది భావము కలిగినప్పుడు శోక భావాలు ఎన్నెన్నివచ్చినా పుట్టిపోతూఉంటవి. అన్నిటికీ స్థాయి భావసమ్మిశ్రితమయిన వాని అనుభూతి తనలో సూక్ష్మ రూపముగా ఉన్న స్వకీయాస్వాదమును అతిశయింప

చేస్తుంది. ఇదే రసము. ఇది లౌకిక మయినప్పుడు రామాదులున్నూ అలౌకిక మయినప్పుడు సామాజికులున్నూ ఆశ్రయము అవుతూ ఉంటారు. అని సామాన్యంగా భావము.

ఈమూడు శ్లోకాల భావము జటిలముగా ఉంది. వీని అర్థము సవిశేషముగా తెలియదగినది. వ్యాఖ్యాత వీనిని భంగీ చిత్రతతో నిరూపించినాడు. తత్సారాంశమును ఈక్రింది విధముగా గ్రహించాలి.

గుణాలంకార వృత్తి రీత్యాదుల యొక్క సంపత్తి చేత కావ్యము పరిష్కృతము అవుతుంది, అటువంటి విశిష్ట కావ్యములో భావాలు చక్కగా ప్రతిపాదింపబడుతవి. రత్యాది స్థాయి భావవర్గము వానిద్వారా అభివ్యక్త మవుతుంది అప్పుడు అది బాగా స్ఫురించుతూ చక్కని ప్రాదుర్భావము పొందుతుంది. మొదటగా సామాజికుడు కావ్యాభినయములలో అభినివేశము కలవాడు కాగానే రసప్రాదుర్భావ సమయములో నటునియందు రామాది ప్రతీతిని దృఢముగా సంపాదించుకొంటాడు. అప్పుడు సామాజిక హృదయము అనుకార్యుడయిన రామాది హృదయమూ అభిన్నముగా అవభాసించుతుంది, తరువాత సామాజికుని హృదయము నృత్యము గీతము మొదలయిన నానావిధ ధర్మాలలో నిమగ్నము ఉవుతుంది ఆసమయంలో ఇతరపదార్థాలు ఏవీ కూడా తెలియదగినవి అంటూ ఉండవు. తత్సమయములో అలౌకికమయిన రసము యోగి వేద్యమయిన బ్రహ్మానంద సదృశమై స్వయముగా చర్వణాస్పదము అవుతుంది. కావ్యము వలనకాని ధ్రువాగానము వలనకాని రసము సంపూరితము వుతూ ఉన్నప్పుడు సహృదయుడు రసాస్వాదన భక్తి కాగ్రహ్యాలై

క్షణము అంతర్ముఖుడై హర్షము పొందుతాడు. నిర్విషయ స్థితిని అందుకొంటాడు. ఆసమయములో అతనికి స్వకీయమయిన స్వరూపావస్థితమయిన హ్లాద నిష్యందము అవభాసించుతుంది. బ్రహ్మానందమునకు రసాస్వాదమునకూ కొంచెము తేడా ఉన్నది. బ్రహ్మానందానుభవములో వేద్యాంతరము ఏమీకూడా స్ఫురించదు రసాస్వాదములో నయితే విభావాదుల కంటె అతిరిక్తముగా వేద్యపదార్థము ఏమీ ఉండదు. విభావాదికము మాత్రము రససమ్మిశ్రితమై గోచరించుతుంది విభావాది ప్రతీతి ఉన్నప్పటికీ అఖండానుభవానికి ఏమీ వ్యాఘాతము లేదు. నానా రసాలయొక్క సమ్మేళనము ఉన్నప్పటికీ అఖండ పానకరస స్వభావానికి ఏమీ వ్యాఘాతము లేనట్లు ప్రకృతంలో కూడా ఏమీ ఇబ్బంది లేదు.

శృంగారాదికము ఆనంద మూలము. దానిలో సుఖాస్వాదము ఉండవచ్చును. కరుణము శోకమూలము కదా! దానిలో సుఖాస్వాదము ఏ విధముగా సంబంధించుతుంది? అనే సందేహము అక్కరలేదు. ఈ రత్యాది భావములు స్త్రీపురుషులకు శృంగారములో లౌకిక సుఖమును కరుణములో లౌకిక దుఃఖమును సంపాదించితే సంపాదించుగాక! సహృదయుల మనోముకురము కావ్యానుశీలనాభ్యాసవశము వలన విశదమై వర్ణనీయ తన్మయీభవన యోగ్యత కలది అవుతుంది. ఆ విధముగా హృదయసంవాదము పొందిన సహృదయులలో ఆ రత్యాదికము విభావాద సముల్లాసితమై పూర్ణము అవుతుంది. అమందానందాత్మకమై బ్రహ్మానందమువలె నిరతిశయ సుఖస్వరూపమై పరిణమించుతుంది.


దీనిలో ఆనందాత్మక మయిన అశ్రుధార ఆవిర్భవించడము
అయుక్తము కాదు. ఇది దుఃఖాత్మకమె అయినట్లయితే
దానిలో ఎవడూ ప్రవర్తించడు. సకల సహృదయ ప్రవృత్తిని
బట్టి ఇది ఆనందాత్మకమె అని నిశ్చయించాలి. బ్రహ్మానందము
అఖండమె అయినప్పటికీ, చంద్రకాంత సోపాన పంక్తిలో
ప్రతి బింబించిన చంద్ర బింబము మాదిరిగా, ఉపాధి భేద
మును బట్టి అనేకధా గోచరము అవుతూ ఉంటుంది. ఆ విధ
ముగానే కావ్య రసాస్వాదమున్నూ విశేషము లేని అఖండ
రూపమే అయినా వ్యంజకము లయిన విభావాదుల భేదమును
బట్టి నానా విధముగా కన్పడుతూ ఉంటుంది.

కావ్యసముపాత్తమయినవిభావాది భావవర్గము కేవలమూ
స్వరూప ప్రతిష్ఠానము పొందదు, తన రూపములో ప్రతిష్ఠి
తము కాదు. మహా వాక్యార్థముగా చెప్పదగిన రసము
నందే పర్యవసానము పొందుతుంది. పదార్థాలకు వాక్యార్థ
భావము రానిదే స్వరూప విశ్రాంతి లేనట్లుగా రసీభావము
రాకపోతే విభావాదులకు కూడా స్వస్వరూప విశ్రాంతి
ఉండదు. మొత్తానికి కావ్యములోని ఏ చిన్న భావమయినప్ప
టికి మహారసములో పర్యవసానము పొంది స్వవిశ్రాంతిని
పొందినట్లవుతుంది. కావ్యోపాత్తమయిన ఈ భావచక్రము
సహృదయులకు అవశ్యముగా హృదయ సంవాదమును సంపా
దించుతుంది. భావనా బలము వలన ఆస్వాద పథములోనికి
తీసికొని రాబడిన కావ్య భావములు హృదయస్పందనమును
కలుగ చేస్తూ ఆత్మ చైతన్యమునకు ఆవరణముగా ఉన్న
వానిని భంజిప చేస్తున్నవి, ఇట్లా ఆవరణ భంగమే కలుగ
గానే ఆత్మశ్రీ విలాసాను భూతి కలుగుతుంది. నిరావరణ

మయిన నిజాస్వాదాతిరేకము సహృదయునకు కలుగుతుంది. కావ్యదృష్టిలో చూడగా ఇటువంటి స్వసంవిదుపలబ్ధి సామాజికునకే ఉన్నది. అని రూఢము చేయవచ్చును. ఈ పరమ సిద్ధాంతమె సహృదయ సాహిత్య దర్శన రహస్య తత్త్వవేత్తలకు సమ్మతము.

రస ప్రకరణము

Printed at Kalyani Press, Tenali, P. I. C. G. 79 A
For Navya Sahitya Parishat, Guntur Q. H. No. G 80
Cat. D., 500 copies.



మూడు రూపాయలు